పొగాకు సమస్యలు



సంపాదకుడు:

దరువూరి వీరయ్య

ప్రచురణ:

ఫోరం ఫర్ ఫారం ప్రొటెక్షన్

రంగాభవన్........................ఒంగోలు

1978

Blank Page

పొగాకు సమస్యలు

సంపాదకుడు

దరుపూరి వీరయ్య



Forum For Farm Protection

Ranga Bhavan . ONGOLE.

1978

POGAKU SAMASYALU

ప్ర చు ర ణ	Published
ఫోరమ్ ఫర్ ఫారం ప్రొటెక్షన్	Forum for Farm Protection
రంగాభవన్ – ఒంగోలు	Ranga Bhavan - ONGOLE
7 నవంబరు 1978	7 th Nov. 1978.
ప్ర తు లు 2000	Copies 2000

వెల : పదిరూపాయలు



ము ద్ర ణ :

ఉషశ్రీ ప్రింటర్స్ - విజయవాడ. ఫోన్ : 76606

విషయసూచిక

సంపాదకీయం

రైతులే రాజులు - పద్యాలు
——బండ్లమూడి శివరామకృష్ణ 6

రైతు కూలీ ప్రజారాజ్య సిద్ధాంతకర్త
శ్రీమన్నారాయణ 14

నిష్కళంక దేశభక్తుడు
యం. చలపతిరావు 21

వేలం విక్రయ విధానం
——ఆచార్యరంగా 25

పొగాకు రైతుల రక్షణ——చర్యలు ,, 41

జాతీయాదాయానికి అత్యధిక మొత్తంలో-ఆదాయాన్ని
సమకూర్చుచున్న పొగాకు- పొగాకుపుట్టుపూర్వోత్తరాలు
——దరువూరి వీరయ్య 45

ఐ. టి సి. దోపిడీని అరికట్టాలి
——జ్యోతిర్మయిబాసు 100

పొగాకుబోర్డులో రైతుల ప్రాతినిధ్యం
——ఆచార్య రంగా 106

బోర్డు ప్రవేశపెట్టిన ఓచరు రైతులకు వెన్నుపోటు
——రావి కమలాకరరావు 118

సామ్రాజ్యవాదుల నిలువుదోపిడి-ప్రభుత్వదళారి స్వభావం
——జనశక్తినుండి 124

మన సిగరెట్ పొగాకు - సిద్ధాంతాలు - సమస్యలు
——ఆర్. వి. ఎస్. రావు 135

పొగాకుబోర్డు తలక్రిందుల నడక
——బండ్లమూడి వెంకటేశ్వర్లు 148

పొగాకుబోర్డు చట్టం - అక్కరకురాని చుట్టము
—పి. బుచ్చయ్య 151

బోర్డు చట్టము మార్చాలి
—పి. రాజగోపాలనాయుడు (యం. పి.) 157

సరుకు విడుదలయినా - డబ్బు చేతికిరాని రైతులు
—వి. సి. కేశవరావు (యం. పి.) 164

పెట్టుబడిదారుల దయాదాక్షిణ్యాలకు వదలివేయబడిన రైతాంగం
—ఎన్. చంద్రశేఖరరెడ్డి 169

పొగాకుబోర్డు చట్టము 175

వేలం విక్రయం ఆచరణ సాధ్యంగా ఉండాలి
—జాగర్లమూడి చంద్రమౌళి 180

పొగాకు రైతుల సమస్యలు
—ఎన్. విజయరాజ్ కుమార్ 185

భాతర పొగాకు పరిశ్రమ
—డి. బాపయ్య 192


రైతుల రక్షణ సహకార సంఘాలే శరణ్యం
—కోమటినేని గోవిందరాజులు 198

అమెరికాలో పొగాకు మార్కెటింగ్ విధానం
—గోగినేని నాగేశ్వరరావు 205

ఓచరు విధానం వలన నష్టపడిన రైతులకు నష్టపరిహారం
—సార్దార్ గౌతు లచ్చన్న 213

ఉత్పత్తి పెంచితే ధరలు పడిపోవడమా!
—డాక్టర్ కె. సదాశివరావు 218

మిశ్రమ గ్రేడులవలన నష్టపడేది రైతులే!
—కందిమళ్ళ బుచ్చయ్య 225



శ్రీమతి భారతీదేవి,

ఆచార్యరంగా

పూజ్య దంపతులకు

సమర్పణ

ప్రపంచ రైతు ఉద్యమ నిర్మాతలలో ప్రముఖులు, రైతుకూలి, బుద్ధిజీవుల, ప్రజారాజ్య సిద్ధాంత ప్రవక్త. అయిదు దశాబ్దాలుగా రైతు, కూలి, చేతివృత్తుల శ్రామిక ప్రజలకు నిరంతరం నిర్వి రామంగా తన సేవలనందించుచూ వారిని చైతన్యవంతులుగా మార్చిన కర్మయోగి, రాజకీయాలలో సైతం నైతిక విలువలకు అధికతర ప్రాధాన్యమిచ్చిన సచ్చరిత్రులు శ్రీమతి భారతీదేవి ఆచార్యరంగా దంపతులకు 79వ జన్మదిన మహోత్సవ పవిత్ర దినమున ఈ మాచిన్ని కానుక చంద్రునకొక నూలుపోగుచందంగా "పొగాకు సమస్యల" ను సమర్పించుకొనుట మా అదృష్టంగా భావించుచున్నాము.

— సంపాదకుడు

రైతు రాజులు

కన్నది భారతాంబ నిను కర్షకజాతి సముద్ధరింపఁ జే
కొన్నది మాత భారతి గురూత్తమ! నిన్ సహధర్మమూర్తిగా
అన్నది భారతావని అనన్యపు రైతులనేతవంచు నే
డన్నది యెల్లలోకమును హాలికకోటికి రక్షవంచునున్

సృష్టియొనర్చితి విశిష్టపువర్గము రైతులంచు నీ
పట్టును వీడలేదు నిజప్రాజ్ఞత నెందరు గేలిసేసినన్
"దిట్టలు రాజ్యమేలదగు ధీరులు రైతు"లటంచు చాటినా
పట్టి సహాయహీనుల కనన్య చరిత్ర రచించినాడవే!

"భారత రాజధాని కొలువందు కృషీవలు డీవయుండగా
భారత రైతులన్ మరువ భావము లేరికి సెల్లు"నంచు ఆ
సాంద్ర యశోవిశాలుడల జహ్వారుపండితు డన్నమాట ని
న్నారసి గాడటయ్య కరుణారస మానస రంగనాయకా!

మార్క్సు మహాశయుండపుడు మానవలోకమునన్జనించి "ఓ
కార్మికులార! యేకముగ గండు ప్రపంచము నేలగా"ననన్
"కర్షకులార! లెండు, మిముగాదన నెవ్వరు నోపరీభువిన్
మీరలు రాజ్యమేలదగు మేటు"లటంచును రంగబాబనెన్

ఇంతియెగాదు తెదగల దింకను వీరల బోల్చిచూడగన్
ఆతడు గోరినాడు భువి నచ్చగ కార్మికరాజ్య మొక్కటే
ఈతడు గోరినా డవని నెల్లరు మెచ్చగ రైకూలి ధీ
మంతులరాజ్య మీపుడమి మానుగ శాంతి యహింసలేర్పడన్.

— శ్రీ బండ్లమూడి శివరామకృష్ణ

మా మాటి

వర్జీనియా పొగాకు ప్రప్రథమంగా గుంటూరుజిల్లాలో ఉత్పత్తి ప్రారంభించి 60 సంవత్సరాలు పూర్తికాబోతున్నది. 1920 లో ఇంపీరియల్ టుబాకో కంపెనీ వర్జీనియా పొగాకు విత్తనాలు సరఫరాచేసి, నారుపోయడం, పైరువేయడం, ఆకు కోయడం, తాడు కూర్చడం, ఎండబెట్టడం బేళ్ళు కట్టడం, మొదలయిన విషయాలలో రైతుకు శిక్షణ యిచ్చారు.

అంతేకాదు ఇతర పంటలకంటె నాలుగు డబ్బులు అధనంగా సంపాదించేందుకు కూడా తోడ్పడేటట్లు చేశారు. అవిచ్ఛింగా పొగాకు ఉత్పత్తిలో రైతులకు ఆసక్తి కలిగించారు. ఆర్థికంగా డబ్బు రూపంలో చేతికొచ్చే ఆనాటి వాణిజ్య పంటలలో ఆముదాలు, నూవులు, వేరుశనగలాంటి నూనె విత్తులు ప్రత్తిమాత్రమే. మిగతావి ఆహార పంటలు, అపరాలు. అప్పట్లో అమలులోవున్న వాణిజ్యపంటల కంటె వర్జీనియా పొగాకుద్వారా పెచ్చు ఆదాయం కల్పించి ఆశలు రేకెత్తించారు.

ఆ తరువాత వరుసగా పొగాకునుకోసి, కూర్చి ఎండబెట్టడానికి బదులు బ్యారన్ల నిర్మాణంద్వారా కట్టెలు, బొగ్గుల మంటలద్వారా వేడిని కలిగించి ఆ ఆవిరి ద్వారా పొగాకు (Flue) పదును చేయుటకు శిక్షణ గరపడం జరిగింది. ఇంకొంచెం ఆదాయం పెరిగింది. క్రమంగా పొగాకు ఉత్పత్తిలో శాస్త్రీయ, సాంకేతిక మెలకువలు ప్రవేశపెట్టారు. విస్తీర్ణం పెరుగుతూవచ్చింది. 1. V, 2. V. 3. V, 4. V. మొదలయిన గ్రేడులనుగా విడదీసి మేలు రకాలను యూరప్‌కు తరలించుకపోయారు. ఎగుమతులు అభివృద్ధి చెందాయి. ఉత్పత్తి పెరిగింది. ఆదాయం పెరిగింది.

వర్జీనియా పొగాకు ఉత్పత్తి, క్యూరింగ్, గ్రేడింగ్‌లలో సాంకేతిక పరిజ్ఞానం కలిగించేందుకు ప్రత్యేకంగా ఇండియన్ లీఫ్ టుబాకో డెవలప్‌మెంట్ కార్పొరేషన్, (I. L. T. D) పేరుతో వ్యాపార సంస్థను స్థాపించారు. పొగాకు వాణిజ్యంలో క్రమంగా బ్రిటిష్ ఇండియా టుబాకో కంపెనీ (B. I. T.), నేషనల్ టుబాకో కంపెనీలు రంగంలో ప్రవేశించాయి.

గుంటూరుజిల్లా నాలుగు మూలలకు వర్జీనియా పొగాకు ఉత్పత్తి విస్తరించింది. పై మూడు కంపెనీలు వందలాదిగా బ్రాంచీలను తెరచాయి. గ్రేడింగ్ కేంద్రాలు

వెలశాయి. ఆడ, మగ కార్మికులకు, గ్రామాలలో ఆదాయంకంటె రెట్టింపు మజూరి దొరకడం వలన, పొగాకు కంపెనిలలో పనికొరకు ఎగబడ్డారు. ఎంతోగొప్ప రికమెండేషను ఉంటే తప్ప ఐ. ఎల్. టి. డి. లో పని దొరకడం దుర్లభం. వర్జీనియా పొగాకును దొర పొగాకుగా పిలవడం అలవాటయి పోయింది. వర్జీనియా పొగాకు ఉత్పత్తి చేయు రైతులు కూడా కొందరు తామూ దొరలమనుకొని, దొరల పోకడలు పోయారు. బ్యారన్లు కట్టారు. మట్టిమిద్దెలు పూరిండ్లకు బదులు చిన్నబిల్డింగులు లేచాయి. ఇది ఇతరులకు మరింత ఆశలు రేకెత్తించాయి.

ఇందులో కొందరు నోరుగల వాళ్ళను దగ్గరకు తీసి, బ్రోకర్లుగా, డీలర్లుగా నియమించారు. ఇంగ్లీషు కంపెనిలవద్ద పనిచేయుచున్న బ్రోకర్లు కూడా రైతులను లాలించి, బుజ్జగించి, ఆశలు రేకెత్తించి నాలుగు డబ్బులు చూపించి, వారికికావలసిన పొగాకుకు మించి ఉత్పత్తి చేయగల విస్తీర్ణం పెంచుతూ పోయారు. సిగరెట్ పరిశ్రమలు వెలశాయి. అయితే సిగరేట్ పరిశ్రమలు మాత్రం, పొగాకు ఉత్పత్తి చేయు ప్రాంతంలోగాక వేలమైళ్ళ దూరంలోగల గుజరాత్, యు. పి.లలో స్థాపించారు. ఇందుకు కారణము పొగాకును ఉత్పతిచేయు రైతులకు తమ ముడిసరుకుతో అంతులేని లాభాలు పొందడం గమనించకుండా చేయడమే.

భారత దేశములో పొగాకు ఉత్పత్తిని ఇంతగా ప్రోత్సహించడానికి ఒక రహస్యం వున్నది. ఆదేమంటే యూరప్‌లోని తమ సిగరేట్ పరిశ్రమకు పొగాకు అమెరికానుండి దిగుమతి చేసుకొంటూ వుండేవారు. అమెరికా యూరప్‌కు చాల దూరమైంది. రవాణా చార్జీలు తలకుమించి పోయాయి. అంతేగాదు అమెరికా రైతులు తమ సరుకుకు గిట్టుబాటు, లాభదాయకమూనైన ధరలు నిర్ణయించి. అమేరకు డిమాండ్ చేశారు. అమెరికా ప్రభుత్వం పొగాకుపై ఎగుమతి సుకం విధించింది. అకారణంగా తమకుగల వలస దేశాలలో పొగాకు పంటకు అనువైన దేశమేదో అన్వేషణ ప్రారంభించారు. చివరకు భారతదేశము - అందునా ఆంధ్రను అందులో గుంటూరుజిల్లాను ఎంపిక చేసుకొన్నారు. ఇదే భారత దేశంలో వర్జీనియా పొగాకు కాలూనడానికి కారణం.

1945 - 1950

1945 వ సంవత్సరం నాటికి ఐ. ఎల్. టి. డి, బి. ఐ. టి., నేషనల్ టుబాకో కంపెనిలు, వాటికితోడు యూరప్ దేశాల సిగరెట్ పరిశ్రమల యజమానులు తమ ప్రతినిధులను పంపారు. వారు ఇచట పొగాకు వ్యాపారంలో అనుగిడిన స్థానిక వ్యాపారస్తులను ఏజంట్లుగా నియమించుకొని పొగాకు కొనుగోలు చేయడం ప్రారంభించారు.

ఎక్సయిజు చట్టం

పొగాకు ఉత్పత్తి విస్తీర్ణం బాగా పెరిగింది. విదేశీ గుత్త వ్యాపారస్తులతో పాటు, స్థానికులు కొందరు యల్. 5 లైసన్సు కట్టి వ్యాపారంలో ప్రవేసించారు. పొగాకు నాణ్యం పెరిగింది. ఉత్పత్తి కూ్యరింగ్, గ్రేడింగ్, ప్యాకింగ్‌లలో లక్ష లాది కార్మికులకు ఉపాధి సౌకర్యం కలిగించబడింది. గుంటూరు చుట్టుకొని యాభై మైళ్ల వైశాల్యంలో కంపెసీలు తమ బ్రాంచీలను వందల సంఖ్యలో ప్రారంభించారు, పొగాకు పెద్ద పరిశ్రమగా రూపొందింది. కేంద్ర ప్రభుత్వం కళ్లు పొగాకుపైబడింది. పొగాకుపై యేదో ఒక విధమైన సుంకం విధించాలని నిర్ణయించుకొని 1945 లో పార్లమెంటులో సెంట్రల్ ఎక్సయిజు సుంకం విధించేందుకు బిల్లు పవేశపెట్ట బడింది. అప్పటివరకు ఒక యేడాది ధర లభించినా మరసటేడు నష్టమొచ్చినా తట్టుతూ పూడ్చుకొంటూ స్వతంత్రంగా కాలం గడుపుతున్న తెలాంగానికి ఎక్సయిజు అధికారుల బెడద ప్రారంభమైంది. పొగాకు రైతుల కష్టాలకు నాంది పలికింది, ఎక్సయిజు చట్టం.

పొగాకు ఉత్పత్తిదారుల సంఘం

పార్లమెంటు సభ్యులుగావున్న ఆచార్యరంగాగారు రంగంలో ప్రవేసించారు. గుంటూరులో శ్రీ ఏకా ఆంజనేయులు పంతులుగారి అధ్యక్షతను ఎక్సయిజు చట్టముపై సదస్సు జరిగింది. చదువు సంధ్యలులేని సామాన్య రైతాంగానికి చట్టమువలన బాధలు లేకుండా, రిజిష్టర్లు తయారు చేయునలసిన అవసరము లేకుండా డిపార్టుమెంటువారే రైతులవద్ద సమాచారము తెలుసుకొని వివరములు తయారు చేయాలని, తీర్మానములు చేయడం జరిగింది. ఆందోళనలు లేకుండా ఏపని జరుగచుగదా! వెంటనే ఫిర్కా, తాలూకా, జిల్లాస్థాయిలో పెద్ద యెత్తున సభలు జరిపి, తీర్మానములు మెమొరాండములు సమర్పించి, రాయబారములు నడిపాము. ఇందులో ప్రధానంగా శ్రీ బాచిన సుబ్బారావు, శ్రీ పుల్లెల రత్తయ్య, శ్రీ కొసరాజు అమ్మయ్య, శ్రీ వాసిరెడ్డి వెంకయ్య శ్రీ దండు రామకృష్ణారెడ్డి, నేను పాల్గొన్నాము. శ్రీ ఆచార్యరంగాగారి నిరంతర, నిర్విరామ కృషితో రైతులకు కంటక ప్రాయంగావున్న క్లాజులను తొలగించి, చట్టం ఆమోదంపొందడం ద్వారా విజయం సాధించాము.

ఎక్సయిజు చట్టం ప్రవేశపెట్టడంతో, ప్రభుత్వానికి పొగాకుపంట, బంగారు పంటగా పెంపొందింది, రైతులకు మాత్రం కష్టాలు ప్రారంభమైనాయి. ప్రతియేటా రు. 50 కోట్లకు పెంచుకొంటూ నేటికది రు 500 కోట్లకు మించిపోయింది. స్థానికు లనేకమంది ఎల్. 5 లైసెన్సులుకట్టి వ్యాపారంలో దిగారు. బొంబాయినుండి గోల్డెన్ టుబాకో కంపెనీ అనే గుజరాతీసంస్థ రంగంలో దిగింది. వాణిజ్యంలో పోటీ పెరుగు

తుందను కొన్నాము. కాని గుత్తసంస్థలు, మరింత దోపిడీ సాగించడం ప్రారంభించాయి, పొగాకు వాణిజ్యంలో ప్రవేసించిన అయిదారు వందలమందిని ఒకటి రెండేళ్ళలోనే దివాలాతీయించి బోర్డులు ఎత్తివేయించారు. విదేశి, స్వదేశి గుత్తసంస్థల ధాటికి, దోపిడీకి తట్టుకొని యాభై ఆరవై కంపెనీలు మాత్రమే ఆటుపోటులకు తట్టుకొంటూ చావు బ్రతుకులమధ్య దినగండం నూరేళ్ళ ఆయుష్షులాగా బ్రతుకులు సాగించాయి.

1950-55-60 సంవత్సరాలు

1950-55 మధ్యకాలంలో ఉత్పత్తి తగ్గుతూ హెచ్చుతూ పొగాకు రైతులు వేడిసిళ్ళకు చలిసిళ్ళ చందంగా కాలంగడిచింది. అయితే 1954-55 సంవత్సరం పంట ఉత్పత్తి స్థాయిపెరిగింది. మార్కెట్లో మాంద్యం యేర్పడింది. ఈ యేటిలాగా ముప్పయి మిలియన్ల కె. జీ.ల పొగాకు మిగిలిపోయింది. ఎంతకయినా కొనేనాథుడు లేకుండా పోయారు. సంక్షోభం తలెత్తింది. రైతాంగం గగ్గోలు పెట్టింది. గుంటూరులో పొగాకు ఉత్పత్తి దారుల మహాసభను కేంద్ర ఉప మంత్రి శ్రీ కొత్త రాఘురామయ్యగారి ఆధ్యక్షతను బ్రహ్మాండమైన సభ జరిగింది. ఆందోళన ఉధృత రూపందరించింది. శ్రీ జి. నరహరి, శ్రీ జాగర్లమూడి చంద్రమౌళి, శ్రీ బాబిన సుబ్బారావు, నేను ఆ ఉద్యామాలలో పాల్గొన్నాము. మా ఆందోళన ఫలించింది. శ్రీ రఘురామయ్య నాయకత్వాన చైనా, తూర్పు యూరప్ దేశాలకు వాణిజ్య రాయబారవర్గం వెళ్ళింది. వాణిజ్య వప్పదం సాధించారు. రెండు నెలల్లో మొత్తం సరకు విడుదలైంది. ఆయితే ఆలశ్యం కారణంగా రైతులకు బదులు వాణిజ్యవర్గాలు లభించాయి. ఏది యేమైనా పొగాకువిడుదలయింది. రాబోయే సంవత్సరం పొగాకు ఉత్పత్తికి దోహదం చేసింది. ఇక్కడ ఒక విషయాన్ని మరువరాదు.

ఢిల్లీవెళ్ళిన ప్రతి రాయబారవర్గమునకు కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖలో సహాయ కార్యదర్శిగా, కేంద్ర వాణిజ్య మంత్రి కార్యదర్శిగా ఉన్న తెలగు రైతుబిడ్డ శ్రీ ఎన్. ఆర్. రెడ్డి ఐ.ఎస్.గారు ప్రత్యక్షంగా, పరోక్షంగా రైతులకు ఎంతో సహాయ పడుతుండేవారు. ఇలా ఉద్యమాల తర్వాత ఉద్యమాలు పోరాటాల తర్వాత పోరాటాలు, రాయబారాల తరువాత రాయబారాలు ప్రతి యేటా సాగుతూనే వున్నాయి. ఎన్ని ఉద్యమాలు నడిచినా, మరెన్ని పోరాటాలు సాగించినా ఫలితము మాత్రం రైతుకు దక్కలేదనేది జగమెరిగిన రహస్యమే.

కారణమేమి : భారత ప్రభుత్వ పొగాకు మార్కెటింగ్, ఎగుమతి విధానము కేవలం వ్యాపారస్తుల ప్రయోజనాలను మాత్రమే కాపాడేది కావడమేననుటలో సందేహం లేదు. ఇది మారాలి. దీనిని మార్చాలి. కేవలం మాటలతో, తీర్మానాలతో

రాయబారాలతో మాత్రమే మారదు. సంఘటితశక్తితో, దీక్షతో పట్టుదలతో పోరాటం సాగించడమొక్కటే మార్గం.

పొగాకుకు, జూట్, రబ్బరులకులాలె చట్టబద్ధమైన స్వతంత్ర ప్రతిపత్తికల బోర్డు కావాలని ఇరవయ్యేండ్ల పర్యంతం ఏకబిగిన సాగిన మహోద్యమాల తర్వాత 1975 లో పొగాకు బోర్డు యేర్పడింది. పొగాకు బోర్డులో వ్యాపారస్తుల గుత్త సంస్థల, సిగరెట్ పరిశ్రమల పెత్తనమే అధికమైంది. రైతులకు సముచితమైన ప్రాతినిధ్యములేదు. పైగా బోర్డు చైర్మెన్‌గా, ఐ. సి. ఎస్ ఉద్యోగినే నియమించాలన్నారు. పొగాకు రైతుల ప్రయోజనాలు కాపాడబడాలంటే ఐ. సి. ఎస్. చైర్మెన్‌తో జరిగే పనిగాదని తేలిపోయింది. ఆచరణ సాధ్యంగాని, ఆచరణయోగ్యంగాని, బురాక్రటిక్ ఓచరు విధానం ఆచరణలో విఫలమైపోయింది. కనీస ధరలు నిర్ణయించారు. అమలు చేయలేని నిస్సహాయస్థితిలో బోర్డు పడిపోయి, రైతులను గాలికి వదలారు. పొగాకు ఉత్పత్తిని క్రమబద్ధం చేయుటకు ప్రవేశపెట్టిన భూమి పరిమితి రిజిష్టరు పద్ధతి హైకోర్టు రద్దు చేసింది.

పొగాకు ఉత్పత్తిదారులు గత అర్ధ శతాబ్దంగా ఎన్నడూ కని విని ఎరుగ నంతటి దోపిడీకి గురయినారు. ఇదంతా బోర్డు అసమర్థ, అవివేక, ఆచరణరాహిత్య, విధానాలే కారణమని రుజువై పోయాయి.

ఉత్పత్తి స్థాయిలోనే కనీసధర నిర్ణయం

పొగాకు ఎగుమతి కనీసధరలు నిర్ణయించి, కట్టుదిట్టంగా అమలు జరుపుతున్న కేంద్రప్రభుత్వం. ఎంతగా ఆందోళన సాగించినా, మరింతగా పోరాటము సాగించినా ఉత్పత్తి స్థాయిలోనే కనీసధర నిర్ణయించకపోవడం ఆక్రమం, అన్యాయమూనని ఈ గ్రంథంలో పలువురు రచయితల రచనలు స్పష్టంగా రుజువు చేస్తున్నాయి. ఇంకొక ప్రముఖమూ, ప్రధానమూనైన ప్రత్యక్ష తాత్కాలం గమనించవలసి యున్నది. ఆదేమంటే రైతుస్థాయిలోనే పొగాకుకు కనీసధరలు నిర్ణయించి, ఆ నిర్ణయించిన ధరలురాబట్టి పెట్టేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలద్వారా అమెరికా ప్రభుత్వము రైతులకు రక్షణ కల్పించుచుండడం గమనించిన తరువాత నయినా, భారతీయ రైతులు అందుకవసరమైన ఆందోళనలు సాగించి, విజయం సాధించ వలసియున్నది.

గ్రేడింగ్ విధానం

యాభై సంవత్సరాల పొగాకు ఉత్పత్తి. కొయ్యరింగ్ గ్రేడింగులలో అనుభవం తరువాత నయినా రైతుస్థాయిలోనే ఫారమ్ గ్రేడులను క్రమబద్ధంచేసి, ఆ ప్రాంతి పదికపైననే ఎగుమతులు సాగించవలసిందిపోయి, ఎగుమతి గ్రేడులు వేరుగాను, ఉత్పత్తిస్థాయి గ్రేడింగు విధానం వేరుగాను ద్వంద్వ గ్రేడింగు విధానం అమలులో యింకా కొనసాగించడం దురదృష్టకరం.

పొగాకు బోర్డు ఈ ద్వంద్వ గ్రేడింగ్ పద్ధతిని వెంటనే రద్దుచేసి, ఉత్పత్తి స్థాయిలో ఏర్పాటుచేసి ఫారమ్ గ్రేడులనే ఎగుమతి గ్రేడులను నిర్ణయించవలసిన అవసరాన్ని పలువురు ప్రముఖ రచయితలేమి, 25 సంవత్సరాల గ్రేడింగ్‌లో అనుభవంగల సీనియర్ మార్కెటింగ్ ఆఫీసరు వివరించియున్నారు. ఆరచనను గమనించవలసియున్నది.

గిడ్డంగుల సౌకర్యం

పొగాకు మార్కెట్లో ఉత్పత్తిదారులు నష్టపడకుండా చేయాలంటే, వేలం విక్రయం అమలు చేయాలి, అందుకు చట్టం కూడా ఆమోదించబడింది పొగాకు వేలం విక్రయం న్యాయంగా, సక్రమంగా, సమర్థవంతంగా అమలు జరిగి రైతుకు లాభదాయకంగా వుండాలంటే అన్నింటికంటే ముందు ప్రతి వేలము విక్రయ కేంద్రము లోను వేయిటన్నుల నిల్వ చేయగల గిడ్డంగులు నిర్మాణం జరగాలి అట్టి నిర్మాణం కొరకు పొగాకు రైతులు ఇప్పటినుండే పెద్ద యెత్తున ఆందోళన చేయవలసి వుంటుంది.

అందుకే యీ మా ప్రయత్నం. పొగాకు రైతుల ప్రయోజనాలు కాపాడగల గుత్త వాణిజ్య, పారిశ్రామికుల కబంధ హస్తాలనుండి రక్షించేందుకు పలయు సూచనలతోకూడి సమగ్ర చర్చ యీ గ్రంథంలో వివరించడం జరిగింది.

పొగాకు రైతుకు దర్పణం వంటిదీగ్రంథం. ప్రతి రైతు చదివి, అర్థం చేసుకొని ఆచరణలో పెట్టేందుకు ప్రయత్నించిననాడు, అమెరికాలోవలె, రొడీషియాలోవలె, అభివృద్ధి చెందిన దేశాలలోవలె పొగాకు రైతులకు రక్షణ, భద్రత, కలుగగలదని ఆశించుచున్నాము.

పొగాకు రైతులకు, పొగాకు రైతులకేమిటి, ప్రపంచ రైతాంగ రక్షణకు, భద్రతకు మనుగడకే అయిదు దశాబ్దాలుగా నిరంతరం నిర్విరామంగా తమసేవల

నంచించుచున్న ।పపంచ రైతాంగ ఉద్యమ నిర్మాత, రైతుకూలి, బుద్ధిజీవుల ప్రజా రాజ్య సిద్ధాంత ప్రవక్త, రాజకీయాలలో నైతిక విలువలకు ప్రాధాన్యతనిచ్చిన మహామనిషి ఆచార్య రంగా 79వ జన్మదినోత్సవ సందర్భములో వారి సేవలకు చంద్రునకొక నూలు పోగన్న చందంగా ఈ గ్రంధాన్ని అందించగలగడం ఆదృష్టంగా భావిస్తున్నాము.

ఇందులో తమ రచనలు ప్రచురించే అవకాశము కలిగించిన రచయితలకు, తక్కువ వ్యవధిలో ముచ్చటగా ముద్రించి ఇచ్చిన ఉషఃశ్రీ ప్రింటర్సు వారికి మా హృదయపూర్వక అభినందనలు.

దరువూరి వీరయ్య



రైతుకూలీ ప్రజారాజ్య సిద్ధాంత ప్రవక్త

ఆచార్యరంగా

శ్రీ పావులూరి శ్రీమన్నారాయణ

రైతు సమస్యలు అనగానే ఆచార్యరంగా మనసుకు రావడం సహజం. కష్టజీవుల శ్రమఫలితాన్ని దోస్తున్న పెట్టుబడిదారులపై ధ్వజమెత్తిన యుగపురుషుడు శ్రీ కారల్‌మార్క్స్. రైతు, కూలీ, గ్రామీణ అభాగ్యుల రక్షణకు కంకణం కట్టుకొన్న మహాపురుషుడు ఆచార్యరంగా. ఎందరో రైతుబిడ్డలు రాజకీయ క్షేత్రంలో వెలసి, అధికార పీఠాలు సంపాదించారు; కాని రైతునాయకులు కాలేక పోయినారు. రైతుబాంధవుడుగా జగమెరిగిన బ్రాహ్మణుడు రంగాగారు ఆక్స్‌ఫర్డ్ చదువులనాడు, పచ్చయప్ప కళాశాల ఆర్థిక శాఖయొక్క ప్రధాన ఆచార్య పీఠము నుండి, పార్లమెంటు లోపల, వెలుపలా—ఈనాటి వరకు, 78 సంవత్సరాలు నిండి మీదబడిన వృద్ధాప్యమును గూడా గమనించకుండా, రైతు, కూలీ జనాల సమస్యలతో తపన చెందుతూ, గ్రామీణాభ్యుదయం కొరకు తపస్సు చేస్తున్న నిష్కామయోగి రంగాగారు. పొగాకు రైతుల రక్షణకు కూడా ఎంతో కాలముగా ఆలోచన,

కృషి చేస్తూన్నారు రంగాగారు. సమయం వచ్చినప్పుడల్లా లేచి కేకలువేస్తూనే యున్నారు. ఎప్పటి కప్పుడు ప్రభుత్వాన్ని కదిలిస్తూనేయున్నారు. ఇటువంటి రంగా గారి జీవితాన్ని యీ వ్యవసాయ రక్షణ సదస్సులో సింహావలోకనం చేయడం కనీస ధర్మం.

ప్రపంచములో లెక్కించదగిన జాతీయనాయకులలో ఆచార్యరంగా ఒకరు. భారత దేశములో రైతు ఉద్యమ పితామహుడు రంగాగారు. రైతు నాయకుడుగా లోక మంతటా గుర్తింపబడినవారుకూడా. రాజకీయార్థిక శాస్త్రముల నెరిగినమేధావి. వ్యవ సాయార్థిక శాస్త్రములోదిట్ట. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో, వ్యక్తి స్వేచ్ఛలో రంగాగారికి పూర్ణవిశ్వాసం. ఏరూపములోనున్న నియంతృత్వాన్నయినా రంగాగారు సహించరు. ముందు చూపుగల రాజకీయ ప్రజ్ఞావంతుడు రంగాగారు. మచ్చలేని ప్రజాసేవకుడు. నిరాడంబరమయిన, సిసలయిన గాంధేయుడు. స్వాతంత్ర్య పోరాటములో మునిగి తేలిన యోధుడు. స్వప్రయోజనము నెరుగని స్వార్థ త్యాగి రంగాగారు.

అంతటి ఉత్తమ మానవుడు లోకనిందకు గురిఅయినారు. అపార్థము చేసు కొనబడినారు. రంగాగారు పార్టీలు మారుస్తారని తేలికగా మాట్లాడతారు. తలకాయలు మార్చి, అధికార పదవులను చీలదీసి, నీతినియమాలను గాలికి వదలి, జీవితాన్ని జయప్రదంగా దొర్లిస్తున్న సంప్రదోహులకు, రాజకీయ తుచ్ఛులు సమాజంలో పీరపూజలు అందుకుంటున్నారు: ఎన్ని పార్టీలు మార్చినా రంగాగారి రాజకీయ భావాల (Convietions) లో మార్పులేదు. అన్యాయాలను, అక్రమ పంథాలను భరించలేకనే రంగాగారు ఆటు యిటు తిరుగవలసి రావడము. కాంగ్రెసునుండి బయటకువచ్చినా, లోపలకు పోయినా కారణం రంగాగారి స్వార్థ ప్రయోజనాలుకాదు. దగ్గరకు వచ్చిన ప్రభుత్వ పదవులను రంగాగారు కాలదన్నారు. అందుకు లోకజ్ఞానం లేనివాడని పామరులు భావించినారు. కాని రంగాగారి ఆత్మగౌరవాన్ని మదింపు చేయగల వారికి ఇది ఆశ్చర్యకరముగాదు. తగిన సమాధానము చెప్పలేక "రంగాగారు పార్టీలు మారుస్తారని అందరికి తెలుసునని" ప్రధాని శ్రీ జవహర్‌లాల్ నిండు పార్లమెంటులో తప్పించుకొన చూచినాడు. 'అవును. నాకు ధైర్యం ఉన్నది. పార్టీలు మార్చడానికి, సృష్టించడానికి" అని రంగాగారు ఎదురు దెబ్బతీయడంతో శ్రీ నెహ్రూ చతికిలబడినాడు. అందుచేత రంగాగారు ఎన్నిపార్టీలు మార్చినా, అల్పుల విమర్శలు ఏమైనా. రంగాగారి గొప్పదనం మొక్కపోదు.

దేశంలో శ్రమలను, వ్యవసాయ కూలీలను, చేనేత కార్మికులను సంఘటిత పరచి స్వాతంత్ర పోరాటములో రంగాగారు కాంగ్రెసుకు చేయూత నిచ్చారు. జమీందారీ విధానం రద్దుగావాలని ఆందోళన చేశారు. హరిజనోద్ధరణకు పాటు

బడినారు. ఈ ఎపొ'ద్యమాలన్నింటిలో కాకతీదేవిగారు రంగాగాకికి అండగా నిలబడినారు. కాంగ్రెసుపార్టీ నియమించిన కుమారప్ప భూసంస్కరణలు కమిటీలో అన్నిరకాల ఆదాయాలకు, ఐస్టీలలోని ఆస్తులకు, పెట్టుబడిదారులకు స్వేచ్ఛయిచ్చి, ఒక్క రైతుల భూములకే పరిమితులు విధించే ఆలోచన అన్యాయమని రంగగారి భిన్నాభిప్రాయం (Dissent) వ్యక్తం చేశారు. పెట్టుబడిదారి వ్యవస్థలో రైతులకు భద్రతలేదన్నారు. రంగాగారు గత ముప్పది సంవత్సరాలనుండి రైతులకు కావలసిన వస్తువులు ఎంత ధరలున్నదీ, పంటలకు ఎటువంటి ధరలు ఉన్నది. తెలిసినదే. ఉత్తరాది వారి గోధుమలకు పెద్ద ధరలు, దక్షిణాదివారి ధాన్యానికి తక్కువ ధరలు అన్యాయమని రంగాగారు గత నలభయి సంవత్సరాలనుండి ఖండిస్తున్నారు. పంటల ధరల నిర్ణయంలో బస్తీల జనం, పెట్టుబడిదారులు అడ్డు వస్తున్నది రంగాగారు చెప్పినారు. రైతులు, చేనేత కార్మికులు, వ్యవసాయ కూలీలు బస్తీల దోపిడీకి బలికాకుండా రక్షణ కావాలన్నారు. రంగాగారు ప్రపంచ రైతాంగ ధ్యేయం Credo of World Peasantry అను సిద్ధాంత గ్రంధాన్ని రంగాగారు నలభయి సంవత్సరాలనాడు వ్రాసి, రైతుల విముక్తి కొరకు దారిచుపినారు. రంగాగారు. చైనాలో శ్రీ మాసేటుంగ్, ఇండియాలో రంగాగారు గ్రామాల రక్షణకు ఒకే విధమయిన ఆలోచనలు చేసినారు అయితే శ్రీ మావోవలె రంగాగారు రైతులకు రాజ్యాధికారం సంపాదించలేక పోయినారు. దీనికి రైతుల అనైక్యత, రైతుబిడ్డల ద్రోహపాత్ర కారణము. కమ్యూనిస్టు దేశాలలో రైతునాయకులు రంగాగారి రచనలు మననం చేశారని, చైనాలో శ్రీ మావో కూడా రంగాగారి భావాలను గమనించి, గౌరవించారని విన్నప్పుడు, ఏ రైతుబిడ్డ గర్వింపడు

స్వాతంత్ర్యం వచ్చినాక, కేంద్రంలోను రాష్ట్రాలలోను కాంగ్రెసు ప్రభుత్వాలు ప్రజలకు త్వరిత్వి తెలకెత్తుతాయని ఆశించారు. కాని నెహ్రూ ప్రభుత్వం, అసహధోరణిలో, ఆచరణ సాధ్యంకాని పథకాలతో వ్యవహరించింది. నెహ్రూ అనుసరించిన ఆహార, వ్యవసాయ, పరిశ్రమల, విదేశీ విధానాలు అవాస్తవికమైనవి, అభివృద్ధి నిరోధక మయినవి. వ్యవసాయ ప్రధానమైన మన దేశంలో, వ్యవసాయం గ్రామీణ రంగాలు నిర్లక్ష్యం చేయబడ్డాయి. ఆర్థిక వ్యవస్థ సవ్యంగా, బలంగా ఉండాలంటే వ్యవసాయం, కుటీర పరిశ్రమలు ముందు అభివృద్ధి చేయబడాలి. కాని తలక్రిందులుగా నెహ్రూ భారీపరిశ్రమలపై కేంద్రీకరించారు. దీనికితోడు యుద్ధకాలంలో ఇంగ్లీషువారు ప్రవేశ పెట్టిన కంట్రోళ్లు రేషనింగ్‌లను నెహ్రూ కొనసాగించారు. గాంధీగారి మార్గములను కూడా నిరసించారు. నెహ్రూగారి అనుచిత విధానాలను రంగాగారు అంగీకరించలేక పోయినారు. సిద్ధాంత రాద్ధాంతాలను వదలి ప్రజల నిత్య జీవితావసర వస్తువులు అయిన తిండి, బట్ట సమృద్ధిగా ఉత్పత్తి అయేందుకు, ప్రజలకు ఆరోగ్యం విద్య మొదలయిన యితర వసతులుకూడా అందునట్లుగా ప్రభుత్వ

విధానాలు ఉండాలని రంగాగారు భావించారు. కాం గెసు పార్టీలోను, పార్లమెంటు లోను ఈ సంధర్భములో గట్టిపట్టు పట్టినారు. నెహ్రూగారి అవాస్తవిక విధానాలను ఎప్పటికప్పుడు నిరసిస్తూ, నిర్మాణాత్మకమైన సూచనలు చేస్తూ వచ్చారు రంగాగారు.

నెహ్రూ నాయకత్వాన జాతి దుర్బలమైనది. ఆర్థికవ్యవస్థ తారుమారయినది. తిండిగింజలకు ఎరువులకు ఇతరదేశాలపై ఆధారపడవలసిన దుస్థితి తొలగలేదు. నెహ్రూ విధానాలు నిష్ఫల మయినాయి. ఆకలిబాధతో పాటకజనం అలమటిస్తుంటే నెహ్రూ తన అంతర్జాతీయ విధానం మాట్లాడేవారు. ఆగున విదేశీ విధానంలోని లోపాలను వేలెత్తిచూపితే దేశీయ సమస్యలు ఏకరువు పెట్టినారు. ఈ విధంగా ప్రజలదృష్టిని పెనుదారినిబెట్టి నెహ్రూ సిద్ధాంతాలు, నీతులు వల్లించేవాడు. ప్రభుత్వ యంత్రాంగం సడలి పోయింది. ఆశ్రిత పక్షపాతం, అవినీతి, లంచగొండి తనం, అసమర్థత పెరిగిపోయినాయి కాంగ్రెసు ప్రభుత్వాలు ప్రజాకంటకంగా తయారయినాయి ప్రజలలో నిరాశ, నిస్పృహలు అలుముకొన్నాయి. ఇక నెహ్రూ నాయకత్వం తగదను నిర్ణయానికి కొందరు జాతీయ నాయకులువచ్చి, ధైర్యంతో కాం గెసును వదలిపెట్టినారు. "కాంగ్రెసుదే జాతీయ సోషలిస్టుపంథా" అని భ్రమించిన ఆచార్య రంగా నిరాశతో కాంగ్రెసునుండి బయటకు రావలసి వచ్చినది. రైతుకూలీ ప్రజా రాజ్యధేయాలతో రంగాగారు కృషికార్ లోక్‌పార్టీ నిర్మించి, జయప్రదంగా నడిపించారు.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో రంగాగారికి పూర్ణవిశ్వాసం. ఇంగ్లండులో వలె ప్రజాస్వామ్య వ్యవస్థ స్థిరపడి, వర్ధిల్లాలని రంగాగారి కోరిక. 1952 లో మద్రాసు రాష్ట్రంలో కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడగల ప్రమాదం వచ్చింది. రాజాజీ నాయకత్వాన కాంగ్రెసు ప్రభుత్వం ఏర్పాటు గావడానికి కృషికార్ లోక్ పార్టీయొక్క సహకారము [Responsive Co-operation] రంగాగారు యిచ్చారు. కాని ప్రతిఫలంగా ఏ పదవినీ అంగీకరించలేదు. దక్షిణ భారతంలో కమ్యూనిస్టు ప్రాబల్యమును అరికట్టుటలో రంగాగారి కృషి జయప్రదమయినది. తరువాత ఆంధ్రలో ప్రజాస్వామ్య వ్యతిరేకులు విజృంభించనీయకుండా, 1955లో కాం గెసుతో చేయికలిపి ఎన్నికలలో కాంగ్రెసుకు సాయం చేసినారు. ప్రజాస్వామ్యంపట్ల రంగాగారికున్న బలహీనతను గమనించి, నాటి కాంగ్రెసు అధిష్టానవర్గం రంగాగారిని కాంగ్రెసులోకి తిరిగి ఆహ్వానించుకున్నారు. దానితో కృషికార్ లోక్‌పార్టీ రద్దయింది.

సోషలిస్టు సిద్ధాంతాలు పల్లించే నెహ్రూ కడకు మిశ్రమ ఆర్థిక వ్యవస్థ (mixed economy)కు అంగీకరించక తప్పలేదు. ప్రయివేటు రంగంలో సాధ్యం

గాని భారీపరిశ్రమలనే ప్రభుత్వ రంగంలో చేపట్టాలని నిర్ణయించ బడినది. దీనికి తోడు వ్యవసాయం కుటీర పరిశ్రమలలో స్వయం ఉద్యోగులుగా ఉన్న రంగాన్ని (self-employments sector) అభివృద్ధి చేయాలని మొట్టమొదటగా రంగాగారు సూచించారు. కాని వ్యవసాయ రంగంలో తీవ్రమయిన మార్పులు తెచ్చి, రైతాంగాన్ని తుదమట్టించడానికి నెహ్రూ తలపడ్డాడు భూమి కమతాలకు పరిమితులు (ceilings on land holdings) పెట్టనిదే సాంఘిక న్యాయం సిద్ధించదని నెహ్రూ నిర్ణయించుకొని, కాంగ్రెసుచేత ఆవడి సభలో ఆమోదముద్ర వేయించుకొన్నాడు. ఇందుకు పెట్టుబడిదారులు వారి పత్రికలు నెహ్రూను అభినందించినాయి. అయితే పట్టణ ఆస్తులకు వ్యవసాయేతర ఆస్తులకు పరిమితులు పెట్టాలను ఆలోచన చేయడానికి నెహ్రూకు కాంగ్రెసుకు ధైర్యం లేకపోయింది. ఇంకా రైతులకు స్వంత ఆస్తులు ఆటూ లేకుండా చేయడానికి సహకార వ్యవసాయాన్ని (Co-operative farming) ప్రవేశపెట్టడానికి నెహ్రూ కాంగ్రెసులో పథకాలు వేశారు. ధైర్యం గల రైతు బిడ్డయిన ఆచార్యరంగా, చౌదరీ చరణ్‌సింగ్, రాజాజీ మున్నగు నాయకులు నెహ్రూ తప్పుడు ఆలోచనను వ్యతిరేకించారు. నాగ్‌పూర్ కాంగ్రెసు సభలో చౌదరీ చరణసింగ్ నెహ్రూను బాహాటంగా ఎదుర్కొని సహకార వ్యవసాయాన్ని తీవ్రంగా ప్రతిఘటించారు.

రైతుస్వామ్యం, ప్రజాస్వామ్యమునకు పునాది అని రంగాగారి నమ్మిక. భూమిలేని వ్యవసాయకూలీలకు హరిజనులకు కూడా క్రమంగా భూవసతి కల్పించి, సాంఘిక భద్రతను కల్పించాలని రంగాగారి భావం. అన్ని రకాల ఆదాయాలను పన్నుల Taxation) ద్వారా పరిమిత పరచవచ్చునని రంగాగారన్నారు. పెట్టుబడిదారులు, వాణిజ్యవర్గాలు బస్తీలలోని ధనికవర్గాల జోలికి పోకుండా ఒక్క రైతాంగమును బలహీనపరచు యత్నం వ్యర్థమవుతుందని రంగాగారు హెచ్చరించారు. నెహ్రూ యొక్క తప్పుడు విధానాలను, నాయకత్వాన్ని ధిక్కరించారు రంగాగారు. నెహ్రూకు మద్దతుగా సర్వోదయ సంఘము వినోభాభావే నాయకత్వాన 'ఎల్‌వాల్' అను గ్రామంలో సమావేశమయి, స్వంతఆస్థి ఏ రైతుకు ఉండకూడదు, పొలములపై హక్కు పంచాయితీల పరము గావాలని తీర్మానించారు. సర్వోదయ సంఘంవారి కొత్తరకం పంచాయితీ భూస్వామ్య విధానాన్ని తీవ్రంగా తెగనాడారు రంగాగారు. నెహ్రూ, వినోభాల ఆలోచనలు ఒకటేనని, పదజాలంలో తేడేకాని మోసపోరాదని రంగాగారు రైతులను హెచ్చరించారు.

నెహ్రూ - కాంగ్రెసు సర్వోదయ సంఘాల రైతువ్యతిరేక కుట్రలను భగ్నం చేయడానికి ఆచార్యరంగా నడుంగట్టినారు. రంగాగారి ఆలోచనలను రాజాజీ ఆమోదించి హర్షించారు కాంగ్రెసువారి రైతాంగ విధ్వంస కాండకు రంగాగారు భాగస్వామి కావడానికి యిష్టపడలేదు. రైతులను రక్షించడానికి నెహ్రూని కాదని

కాంగ్రెసు నుండి బయటకు రావడానికి సంకల్పించినారు. ఇందుకు రాజాజీ యొక్క ప్రోత్సాహము, సహకారము రంగాగారికి లభించింది. రంగాగారి నాయకత్వాన అఖిలభారత స్వతంత్రపార్టీ నిర్మాణం జరిగింది. స్వతంత్రపార్టీ నాయకుడుగా, రైతురక్షణకు, ప్రజాస్వామ్య రక్షణకు పార్లమెంటులోను, బయట రంగాగారు సాగించిన పోరాటాలు తెలిసినవే. సౌష్టవమైన ఆర్థిక వ్యవస్థ, సిసలయిన ప్రజాస్వామ్యము. ప్రజాశ్రేయము సాధించడానికి సమాజంలో వ్యవసాయ, పారిశ్రామిక, వాణిజ్య రంగాలలో అనవసర అడ్డంకులు లేకుండా, అంతటా పోటీభావమును ప్రవేశపెట్టాలని రాజాజీ, రంగాగారలు అభిప్రాయపడ్డారు. పశ్చిమజర్మనీ, జపాన్ మున్నగు ప్రజాస్వామ్య దేశాలలో ఈ పద్ధతి (Prosperity through Competition) ద్వారా సంపదను బహుధా పెంచి ప్రజా జీవన ప్రమాణాలను ఉన్నతస్థాయికి తీసుకు వెళ్ళినారని ఉదాహరణలు చూపించారు.


స్వతంత్రపార్టీ ధనికులపార్టీ అని నెహ్రూ దుష్ప్రచారం చేశారు ఆంధ్ర, మైసూరు, మద్రాసు ముఖ్యమంత్రులు ఆర్థిక, అంగబలంతో, కమ్యూనిస్టుల పొత్తుతో చిత్తూరు బై ఎలక్షనులో రంగాగారిని ఓడించడానికి ప్రహ్మ ప్రయత్నం చేసినా, రైతు కూలీలు రంగాగారిని గెలిపించి, చరిత్ర సృష్టించారు. పార్లమెంటులో రంగాగారు ప్రతిపక్షనాయకులుగా గొప్ప పాత్ర వహించారు. అయినా స్వతంత్రపార్టీ క్రమంగా క్షీణించసాగింది. కాంగ్రెసువారి డబ్బు, అధికారంకు యెదురుగా స్వతంత్రపార్టీ నిలబడలేక పోయినది. చివరుసగా అన్ని ఎన్నికలలో స్వతంత్రపార్టీ దెబ్బమీద దెబ్బ తిన్నది. పెట్టుబడిదారులు, కమ్యూనిస్టులు, భూస్వాములు ఏకమై రంగాగారినికూడా ఓడించారు.

శ్రీమతి ఇందిరాగాంధి నాయకత్వాన కాంగ్రెసు రైతు వ్యతిరేకవిధానాలకు స్వస్తిచెప్పింది. సహకార వ్యవసాయ పథకాన్ని వదలివేసింది. పట్టణ ఆస్థులకు కూడా పరిమితాలు విధించడానికి అంగీకరించింది. కార్మికులను కమ్యూనిస్టుపార్టీ నుండి వేరుచేసింది ఈపరిణామాలతో కాంగ్రెసుపట్ల రంగాగారి ధోరణి మారింది. ఇందిరాగాంధి సోషలిస్టు నినాదాలు ప్రజాబాహుళ్యంపై పిడుగులాగాపనిచేశాయి. ప్రతిపక్షాలన్నీ చిన్నా భిన్నమయి పోయినాయి. దేశానికి ఇందిరాగాంధియే ఆశాజ్యోతి, కాంగ్రెసే శరణ్యం అనే పరిస్థితులు పరిణమిల్లినాయి. రంగాగారి మనసు మారింది. కాంగ్రెసులో చేరినారు. ఎందరో ఆశ్చర్యపడినారు. కాని రంగాగారు హృదయపూర్వక పరివర్తన చెందారు.

ఎమర్జన్సీ కాలంలో జరిగిన అత్యాచారాలతో ఉత్తర భారతంలో కాంగ్రెసు తుడిచిపెట్టుకు పోయింది. 1977 ఎన్నికలలో ప్రజలు జనతాపార్టీకి పట్టంకట్టినారు.

కాని నెహ్రూ నాటినుండి అధికారం అనుభవించిన కాంగ్రెసువారే జనతాలో కూడా అధికారం కైవశం చేసుకున్నారు! ఇరువది సంవత్సరాలు కాంగ్రెసుతో పోరాడిన రంగాగారు, కాంగ్రెసులో చిక్కుకొనిపోయారు. ప్రతిపక్షముదప్ప రంగాగారికి అధికారపక్ష ప్రాప్తము లేదేమోనని అభిమానుల ఆవేదన. కౌరవపక్షంలోని పాండవ పక్షపాతి అయిన భీష్మ పితామహునితో రంగాగారిని అభిమానులు పోల్చుకున్నారు కాని రంగాగారికిమాత్రం జనతా నాయకత్వంపట్ల విశ్వాసంకనబడలేదు. జనతా ప్రభుత్వంలో రైతులు సుఖపడరని రంగాగారు ఆదిలోనే పసిగట్టినారు. రంగాగారి సందేహము నిజమయినది. రైతుల ఓట్లతో అందలమెక్కిన జనతానాయకులు రైతులను వెన్నుపోటు పొడిచారు. రైతుల ఆర్థికస్థితి తలక్రిందులయినది. గత రెండేళ్ళ అనుభవము ఇందుకు నిదర్శనము. రైతుల శ్రేయమును కాంక్షించే రంగాగారు జనతాకు దూరంగా ఉన్నందుకు విచారపడనవసరము లేదు. ప్రజాస్వామిక రైతు కూలీ ప్రజారాజ్య సంస్థాపనయే రంగాగారి ధ్యేయము. ఎక్కడున్నా రైతుకూలీల శుభాకాంక్షలు ఈశ్వరుని ఆశీర్వాదాలు రంగాగారికి సర్వదా లభిస్తాయి.

★



నిష్కాపట్య హృదయుడు -
నిష్కలంక దేశభక్తుడు

— శ్రీ యం. చలపతిరావు

సుప్రసిద్ధ పత్రికా రచయిత, ప్రముఖ గ్రంధకర్త, దేశభక్తుడు, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ స్థాపించిన నేషనల్ హెరాల్డ్ ఆంగ్ల దినపత్రికకు మూడు దశాబ్దాలపాటు సంపాదకులుగానున్న మహామనీషి శ్రీ యం. చలపతిరావుగారు ఆచార్యరంగారిని గురించి రచించిన ఆంగ్ల రచనకు ఇది అనువాదం.

(సంపాదకుడు)

శ్రీరంగా నాకు సామ్యవాద సిద్ధాంత ప్రథమాచార్యుడు. రాయపేటలో ఉన్న భారత సేవా సమాజ భవనం ఆవరణలో ఒక చెట్టునీడలో విదేశీయమైన దుస్తుల్లో ముచ్చటగా ముస్తాబై, పుస్తకాల పుటలు చకచకా త్రిప్పుతూ, లండను ఆర్థిక కళాశాలా మేధావుల దృక్పథాన్ని ప్రతిబింబించే సామ్యవాద సిద్ధాంతాన్ని

ఉపన్యసిస్తున్న ఆయన వాగ్ధోరణిని, నేనూ, మరికొంతమంది నా సహచరులూ కలిసి వినడం తటస్థించింది. ప్రధమంగా, ఆయనకు నేనంటే ఎవరో తెలియదు. నేనంటూ ఒకవ్యక్తిని అక్కడ వినేశ్రోతల్లో ఒకడిని ఉన్నానని గూడా గమనించి నట్టులేదు. ఐనా, వ్యక్తిత్వ పరిశీలనా కుతూహల వ్యసనంగల నేను మాత్రం ఆయన్ను చాలా సన్నిహితంగా ఆధ్యయనం చేశాను. ఆయనలో ఉన్న నిశితో త్సాహ సుహృల్లక్షణాలు నన్నుబాగా ఆకట్టుకున్నవి. ఇది దాదాపు అర్ధశతాబ్దినాటి ముచ్చట. మంచి సమర్థులైన అధ్యాపక బృందంతో సరస్వతీ నృత్య విలాస నిత్యోత్సవాలు నిరంతరాయంగా సాగిపోయే పచ్చయప్ప కళాశాలలో రంగాగారు ఉపన్యాసకులుగా పనిచేస్తున్న రోజులవి.

ఇంకొకసారి రంగాగారు Y. M. C. A. కళాశాలలో ఆర్కాట్ శ్రీ రామ స్వామి మొదలియార్ అధ్యక్షతన, 'పౌరసమస్యలు' అనే విషయంమీద చేసిన మహోపన్యాసం ఇప్పటికీ స్మృతిపథంలో చెరగని ముద్రవేసిన సంఘటన. ఆనాటి వారి వాగ్ధోరణి నిరర్గళంగా మహా గంగా ప్రవాహంలా సాగింది. పౌర పరిపాలనా విషయంలో అంతకుముందు మేయరు పదవి నిర్వహించిన వ్యక్తి చేసిన అవక తవకలను గురించి, ఆయన అసమర్థతను గూర్చి, ఆ ఉపన్యాసంలో చీల్చి చెండాడారు. ఆనాటి ఉపన్యాసం నిర్మాణాత్మకమైన విమర్శతో అడుగడుగునా శ్రోతల్ని ముగ్ధులొనర్చింది. ఆనాటి సభలో శ్రోతలు చేసిన హర్షధ్వానాలు ఇప్పటికీ నా చెవుల్లో మారుమ్రోగుతున్నవి. రంగా వంటి నిష్కళంక నైతిక సంపన్నయోధుల వలన మద్రాసునగరం ఆనతి కాలంలోనే ఆపురూపమైన ఆరోగ్య సంపదతో తులతూగే మహానగరంగా రూపొందుతుందని ఆనాడు గాఢంగా విశ్వసించాను. ఆయన మీద ఎన్నో గొప్ప ఆశలు పెట్టుకున్నాను. అనేక గ్రంధ విజ్ఞానాన్ని సంపాదించి ఆ విజ్ఞానాన్నంతా ఆచరణ సాధ్యం చేయడానికి ప్రజల నిత్యజీవిత సమస్యా పరిష్కార మార్గాన్వేషణకు నడుము కట్టి నిలిచిన మహానైతిక యోధునిగా ఆయన్ను నాహృదయంలో చిత్రించుకున్నాను.

ఆ తర్వాత, రంగాగారు గాంధీమహాత్ముని అహింసా స్వాతంత్రోద్యమ శంఖా రావాకర్షితుడై, ప్రజ్ఞానిక రంగంలో అందుకుంటానికి అవకాశమున్న నిత్యోద్యోగ స్థానాలన్నింటినీ చేజేతులా జారవిడుచుకొని, కాంగ్రెస్ సంస్థలో చేరి, రాజకీయ వాదిగా మారిన తర్వాత కీ. శే మహా ప్రతిభా సంపన్నులు, సర్వసమర్థులు, ఆమలిన సారస్వతీయులునైన శ్రీ కోలవెన్ను రామకోటేశ్వరరావుగారిచే నడప బడుతున్న 'త్రివేణి' పత్రికా కార్యాలయంలో, శ్రీ రామకోటేశ్వరరావుగారి సమ్ముఖంలో రంగాగారిని కలుసుకోవడం తటస్థించింది. ఆనాడు శ్రీ రామకోటేశ్వరరావుగారు రంగాగారికి రాజకీయవాదిగా, రూపొందటానికి కావలసిన ఉత్సాహాన్ని అందిస్తున్నారు. ఆనాటినుంచి శ్రీరంగా రాజకీయాలల్లో దినదినాభివృద్ధి సాధిస్తూ, ఆంధ్ర

దేశంలో రెండవ ప్రకాశంగా ప్రసిద్ధి పొందారు. నేను ఆతర్వాత కారణాంతరాల వల్ల ఉత్తర భారతానికి వెళ్ళిపోవలసి వచ్చింది. అక్కడున్నా ఆంధ్రదేశంలో శ్రీ రంగా ఏవిధంగా పజా హృదయాలను చూడగొనగల మహా రాజకీయ నాయకుడుగా దినదినాభివృద్ధి చెందుతున్నాడో గమనిస్తూనే ఉన్నాను. బహుగ్రంధ పఠన వ్యసనం గలిగి, నిజాయితీతో, లక్ష్యసిద్ధికై నిరతరోత్సాహంతో ప్రయోజన పూర్వక కృషి వలుగైన కొద్దిమంది రాజకీయ నాయకులలో శ్రీ రంగా ఒకడు. భారతీయ ప్రజలు జీవిత సమస్యలలో ఆయన పట్టించుకోనివీ, అంటుబట్టనివంటూ ఏమీలేవు. అయన అభ్యుదయానికి ఆనాడు చాలా అవకాశాలున్నవి. ఆనాటి కేంద్ర శాసన సభలో ఆయన ప్రముఖుడుగా ప్రసిద్ధి చెందాడు.

ఈనాటి క్లిష్ట పరిస్థితుల్లో ఆనాటి ఆయనతో సన్నిహిత సాహచర్యం కలవాళ్ళల్లో ఎవరో ఒక వ్యక్తి ఆయన స్వరూప, స్వభావ చిత్రణాంశను సవివరంగా చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. నేను ఢిల్లీలో పనిచేసిన కొద్ది సంవత్సరాల కాలంలో ఆయన్ను తరచు కలుస్తుండేవాణ్ణి. మనకు స్వాతంత్ర్యం లభించిన ఆ శుభ తరుణంలో గూడి కలుసుకోవడం తటస్థించింది. ఆ తర్వాత నేను లక్నోలో చాలా సంవత్సరాలు పని చేశాను. అప్పుడు గూడ ఆక్కడ ఒకటి రెండుసార్లు కలుసుకున్నాను. శ్రీ రంగా, అటు శ్రీ నెహ్రూకు ఇటు పటేల్‌కు గూడ గౌరవ స్థానంలోనే ఉండేవాడు అంతేగాకుండా శ్రీ నెహ్రూ పక్షాన్ని వహించి అనేక రాజకీయపు పోరాటాల్లో వీకోచితంగా పోరాడాడు గూడ. ఆ తర్వాత చరిత్ర మరో మలుపుకు తిరిగింది. అంతటితో శ్రీ నెహ్రూకు స్వస్తి చెప్పారు. రంగాగారొక సుదీర్ఘమైన నిందారోపణలతో కూడిన ఒక లేఖ తనకు వ్రాశారని, ఆ నిందారోపణలయొక్క సర్వ సారాంశంగా తాను కాంగ్రెసు సంస్థలంచి విడిపోతున్నానని అందులో ఉద్ఘాటించారని, అప్పుడు శ్రీ నెహ్రూ నాతో చెప్పారు, అట్లా కాంగ్రెసు నుండి విడిపోవడానికి కారణం ఆనాడు శ్రీ నీలం సంజీవరెడ్డిగారి జోక్యంవల్ల, తనకు ఆంధ్ర కాంగ్రెసు సంస్థానేతృత్వం దక్కకుండా పోవడమే కారణంకావచ్చు కాని శ్రీ రంగాగారు కాంగ్రెసు సంస్థను వదలి పెట్టకుండా కాంగ్రెసు వాదిగానే ఉండిపోరు. ఉన్నట్లైతే, ఇప్పటికన్నా ఆయన వ్యక్తిత్వం భారతదేశపు రాజకీయాలలో ఇంకా ఎంతగానో పెరిగి ఉండేవనని అభిప్రాయం ఆయనతో అనేక విషయాల్లో నేను విభేదిస్తూ, తరచుగా విమర్శిస్తుండేవాణ్ణి గూడా కాని ఇదేదీ మా మైత్రి సత్సంబంధాలకు ఈషణ్మాత్రం గూడా ఆటంకంగా పరిణమించలేదు.

ఇంతకాలం నుంచీ నన్ను బాగా ఆకట్టుకున్న గుణం ఆయనలోని నిష్కాపట్య లక్షణం. మనసులో ఒకటి, మాటమరొకటిగా ప్రవర్తించే మనిషి మనిషి కాడు. ఆయన ఆయనలోని ఈ నిష్కాపట్య లక్షణమే ఆయన రాజకీయాభివృద్ధికి ఒక రకంగా ఆటంకమైందని గూడ అనవచ్చు. ఆయనలో ఉన్న మహా బలహీనతా

లక్షణమే అది అని అందరికీ తేటతెల్లమైన విషయమే. కానీ మనమందరం మహా బలహీనతా లక్షణంగా భావించే ఆ నిష్కాపట్య హృదయ లక్షణం వాస్తవానికి, ఎక్కువ మందిలో వేయి కంచు కాగడాలు వేసి వెతికినా కనబడని అపూర్వ మహా దాత్త సుగుణ లక్షణం, ఆయనే గనక కొంచెం కపట నాటకం ఆడగల లక్షణానే అలవరచుకొని ఉండి ఉంటే ప్రభుత్వంలో ఏదో ఒక హోదా సంపాదించుకొని, తక్కిన వాళ్ళకు మాదిరిగానే ఆర్థికంగా గూడా పై మెట్టులో ఉండగలిగే వారే. కానీ రంగాగారు రాజకీయంగా ఏదో ఒక హోదాను సంపాదించు కోవడమో, లేక సన్మానాలు మొదలైనవి ఘనంగా చేయించుకోవడం మూలాన ప్రఖ్యాతి పొందుదామని ఏనాడు ఏకోశానా గూడ భావించలేదు. ఆయన ఎప్పుడూ, రాజకీయార్థిక సమస్యల విషయంలోనే ఆలోచన సాగిస్తూ కృషి చేస్తుంటారు. తన కున్న నిశ్చితాభిప్రాయాలతో ఏనాడు ఎవరితోను రాజీపడలేదు. పడరు. ఆయనకు గల ఈ అచంచల సిద్ధాంత దృఢ, విశ్వాస లక్షణమే నన్ను బాగా ఆకట్టుకున్న మరొక విశిష్ట లక్షణం. తాను నమ్మిన ధ్యేయ సాధన కోసం, ధనాన్ని దర్పాన్ని, అడంబరాన్ని కాలదన్నారు. ఈ విశిష్ట లక్షణం మరి స్వాతంత్ర్యానంతరం కాలంలో మన రాజకీయ నాయకుల్లో చాల అరుదు. ఆయన ఎన్నడు తన ప్రత్యర్థులపట్ల పరుషంగా ప్రవర్తించలేదు. వారిని తన శత్రువులుగా గూడా భావించలేదు.

ఈ మునుపటితరం సామ్యవాది, స్వతంత్ర పార్టీ నిర్మాతగా వ్యవహరించినపుడు గూడా, తన మౌలిక సిద్ధాంతాలకే కట్టుబడి ఉన్నారు. ఆయన ధనిక స్వామ్యంతో చేతులు కలపలేదు. ఆయన నిరంతరం శ్రేయోదాయకమైన రైతు రాజ్యం కోసమే పాటు పడ్డారు. అయన ప్రస్థాన మార్గం వంటిదికాదు. గుత్త పెట్టుబడిదారి విధానం వంటి దుర్లక్షణాలకు ఆయన చుక్కెదురు. కాంగ్రెసులో ఆయన పునఃప్రవేశం ప్రజల ప్రగాఢ వాంఛ ఫలసిద్ధి.

రంగా గారు ఈనాడు ప్రభుత్వంలో ఏదో ఒక రకమైన అధికారంలో లేక పోయినప్పటికీ, పార్లమెంటు సభ్యుడుగా నైనా ఉండవచ్చు. ఆయనకు రాజ్యసభ సభ్యత్వం సులభంగానే కల్పించవచ్చు ఆక్కడ ఉండి స్వార్థ రహితమైన సలహాలిస్తూ ప్రజాసేవ చేయవచ్చు. అటువంటి తల నెరసిన రాజకీయవాది ప్రజ్ఞా పాటవాలు దేశంకోసం ప్రజల శ్రేయస్సు కోసం చేసిన అపూర్వ త్యాగాలు, భారతదేశాభ్యుదయం కోసం వినియోగ పడకుండా ఉండడం భావ్యం కాదు. శ్రీ రంగా ఎప్పుడూ ఏకాకిగానే రాజకీయపు పోరాటాలు సాగించారు. ఇక ముందు గూడా ఆసహాయ శూరుడుగానే సర్వ ప్రజల జీవిత సమస్యా రణరంగంలో, అందులోనూ ప్రత్యేకంగా రైతుల సమస్యల విషయంలో, పరిశ్రమిస్తాడు. ఈ అసహాయశూరతా లక్షణం ఆయనకు రాజకీయాక్షరభ్యాస కాలంనుంచి ఉన్నదే.

★



ఆచార్య రంగా

Blank Page

పొగాకులోకం

రైతులకు కనీస ధరలు పేలవముద్వారా విక్రయం

బీరను పొగాకు ఉత్పత్తిలో ప్రపంచంలో మనదేశమునకు నూడవ స్థానం. ఇందులో 95 శాతము ఆంధ్రలోను, మిగతా కర్ణాటక, గుజరాతులలోను పండుతుంది. మనదేశంనుండి ఏటా 75వేల టన్నులు దాదాపు 50 దేశాలకు ఎగుమతి చేయబడుచున్నది. కేంద్రప్రభుత్వమునకు నూరుకోట్ల రూపాయలు

రచన

ఆచార్య రంగా

విదేశి మారకద్రవ్యము, నాలుగువందల కోట్ల రూపాయలు ఎక్సైజు సుంకము పొగాకుద్వారా ఆదాయము లభిస్తున్నది. లక్షలాది వ్యవసాయ కార్మికులకు, డెబ్బదివేల రైతుకుటుంబములకు పొగాకు వ్యవసాయం ద్వారా జీవనోపాధి లభిస్తున్నది.

మనదేశంలో మినహా తక్కిన దేశాలన్నింటిలోను పొగాకు రైతుకు సంపూర్ణమయిన రక్షణ కల్పించబడుచున్నది. మనదేశములో కూడా రైతుకు రక్షణ, వ్యవసాయ కార్మికునకు భద్రత కల్పించి, పొగాకు పరిశ్రమను చక్కదిద్దడానికి పొగాకుబోర్డు ఏర్పాటు చేయబడినది. రైతుకు గిట్టుబాటు ధర ఇపించాలనే సంకల్పముతో, వేలము పద్ధతిద్వారా పొగాకు అమ్మకమును ప్రవేశపెట్టుటకు అనువుగా పొగాకు బోర్డు చట్టమును సవరించుటకు ఈమధ్య పార్లమెంటులో కేంద్రప్రభుత్వము ఒకబిల్లును ప్రవేశపెట్టినది.

రైతు శ్రేయస్సు దృష్ట్యా పరిశీలించిన ఈ బిల్లు లోపభూయిష్టముగాను, అసంపూర్ణముగా ఉన్నదని రైతునాయకులు అభిప్రాయ పడుచున్నారు. రైతు స్థాయిలోని ఎనిమిది గ్రేడులను ఎగుమతి గ్రేడులుగా గుర్తించడము, గ్రామాలలోనే పొగాకు గ్రేడింగ్ సరిగా చేయించడము, ఆ ఎనిమిది గ్రేడులకు చట్టబద్ధమయిన కనీస ధరలు నిర్ణయించడం, వేలము ద్వారా పొగాకు విక్రయం జరుపడము మొదలగు ప్రాథమిక చర్యలద్వారా పొగాకు మార్కెటింగ్‌ను క్రమబద్ధము చేయుటకు సమగ్రమయిన పథకమును సూచిస్తూ మేనెల 8వ తేదీన ఆచార్యరంగా కేంద్ర వాణిజ్య శాఖామంత్రి శ్రీ మోహన్ ధారియాకు వ్రాశారు. ఆ లేఖాంశములను వ్యాసరూపకంగా ప్రచురిస్తున్నాము.

— సంపాదకుడు

వేలము పద్ధతి ద్వారా పొగాకు విక్రయములో ఎదుర్కొన్న వలసిన సమస్యల గూర్చి ఆమధ్య మనము చర్చించిన విషయమును జ్ఞాపకము చేస్తున్నాను.

అభివృద్ధి చెందిన అన్ని దేశాలలోను అనేక దశాబ్దములుగా పొగాకు విక్రయము వేలముద్వారా జరుగుచున్నది. ఆయా దేశాలలో— ముఖ్యంగా అమెరికా, కెనడా, రొడేషియా మున్నగు దేశాలలో— అమలులో నున్న విక్రయ విధానాలు మనము కూలంకషంగా పరిశీలించవలసి యున్నది. తగిన శాస్త్రజ్ఞానము, అనుభవముగల నిపుణులను ఆయాదేశాలకు పంపి, అక్కడ అభివృద్ధి చేయబడిన పద్ధతులను క్షుణ్ణంగా అవగాహన చేసుకొని, మనము అనుసరించవలసి యున్నది. మన దేశములోకూడా అటువంటి వేలము పద్ధతి విక్రయ సదుపాయములు కల్పించుటకు

ముందు ఆవసరమయిన పరిస్థితులను కల్పించడము, గిడ్డంగులు, సాంకేతిక నిపుణులతో వసతులు ఏర్పరచుకొనడం, అధునాతన, సాంకేతిక పరిజ్ఞానముతో కూడిన నూతన విధానాలు ప్రవేశపెట్టి, మన రైతులకు ఆవసరమయిన రక్షణ కల్పించవలసి యున్నది.

I- ఈ సందర్భములో వేలము పద్ధతిద్వారా పొగాకు విక్రయమునకు తగు ప్రణాళిక తయారుచేయునప్పుడు గమనించ వలసిన ముఖ్యాంశములను సంక్షిప్తముగా సూచిస్తున్నాను.

1. పొగాకు అవసరములు - నమోదు

ప్రపంచమంతటా విస్తరిల్లిన గుత్త సిగరెట్టు కంపెనీలకు పెద్ద దిగుమతిదారులకు అన్ని దేశాలలోని ఎగుమతి దారులతోను బలమయిన వర్తక సంబంధాలున్నాయి. మన పొగాకు పరిశ్రమను సరిదిద్దుకొని, మన రైతాంగమును రక్షించుకొనవలెనంటే, ముందుగా ఈ విదేశి వర్తకులను ఒక పద్ధతిలో అదుపులో పెట్టవలసి యున్నది. మన పొగాకును దిగుమతి చేసుకొనే విదేశి వర్తక సంస్థలు, తమకు ఏయే గ్రేడులలో ఎంత పొగాకు కావలసినదీ ప్రతి ఆక్టోబరు మాసములో అనగా మనపంట మార్కెటులోకి రాకముందే – స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్‌కు కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖకు, పొగాకు బోర్డుకు తెలియజేసి తమ అవసరములను రిజిష్టరు చేసుకొనునట్లు చేయాలి. అదే విధముగా మనదేశంలోని సిగరెట్టు కంపెనీలు కూడా పొగాకు అవసరములను ముందుగా నమోదు చేయించుకోవాలి. ఇట్లు జరిగినట్లయిన ఎంత పొగాకు ఎగుమతికి అవసరము, ఎంత దేశీయ కంపెనీలకు అవసరము అనునది సీజనుకు ముందుగా – అనగా ఆక్టోబరులో – తెలిసినట్లయితే మిగులుపంట విక్రయము విషయంలో ప్రభుత్వము ముందుగా జాగ్రత్తపడి, తగుచర్యలు సకాలంలో తీసుకొనుట సాధ్యము కాగలదు.

2. పొగాకు వ్యవసాయాన్ని పరిమిత పరచాలి.

అయిన భూములలోను కాని భూములలోను విచక్షణలేకుండా రైతులు పొగాకు పండిస్తున్నారు. చవిటి పొలాలు, పల్లపు నేలలలో పొగాకు వ్యవసాయం నిషేధించి, అనువయిన భూములలోనే పొగాకు పండించాలి. పొగాకుబోర్డు ఈపని చేయించాలి. ఈ సందర్భములలో వివాదములకు అస్కారము లేకుండా నేలలను శాస్త్రీయంగా పరిశీలించి, ఆయా సర్వే నంబర్లలో గల భూములు పనికిరావని నిర్ధారణ చేసి, ఆభూములలో పొగాకు వ్యవసాయమును పొగాకుబోర్డు నిషేధించాలి.

రైతుల రిజిస్ట్రేషన్ ఆప్రకారంగానే జరగాలి. నేలలను శాస్త్రీయంగా పరిశీలించుటకు ఒక పథకము తయారుచేసి, సాధ్యమయినంత త్వరగా పూర్తి చేయించుటకు పొగాకు బోర్డు ప్రయత్నించాలి.

3. ఎగుమతిదారులు వ్యవసాయం చేయరాదు

ఎగుమతి దారులు, వర్తకులు భారీఎత్తున స్వంత పొలాలలోను, కౌలు భూములలోగాని చేస్తున్న పొగాకు వ్యవసాయము తక్షణం నిషేధించబడాలి. సన్న కారు రైతాంగము స్వంత భూములలో చేసుకొనే వ్యవసాయమునకు సాధనసంపత్తి కల్పించి, తగిన ప్రోత్సాహం ఈయడం ధర్మము. ఏఒక్క రైతుకుటుంబం కూడా యాభయి (50) ఎకరాలకు మించి పొగాకు వ్యవసాయము చేయనీయరాదు. ఇంకా కుటుంబమునకు ఉన్న మొత్తం భూవసతిలో కొంతమాత్రమే పొగాకు వ్యవసాయ మునకు వినియోగించాలి. ఉదాహరణకు ఒక కుటుంబానికి పొగాకు వ్యవసాయము నకు తగిన మొత్తం భూవసతి 25 (ఇరువది అయిదు) ఎకరాలు ఉన్నట్లయిన! ఆ కుటుంబమునకు పది (10) ఎకరాలలో మాత్రమే పొగాకు పండించుటకు అనుమతి ఈయాలి. ఆరైతు మిగతా 15 ఎకరాలలో ఇతర పైరులు వేసుకోవాలి. ఇంకా ఈ రైతు ఆ 15 ఎకరాలలోని ఒకే పొలంలో పొగాకు పండించకుండా, ప్రతి సంవత్సరము మార్చాలి. ఒక సంవత్సరం పొగాకు వ్యవసాయమునకు వినియో గించిన భూమిని, మరొక సంవత్సరము పొగాకు ఉపయోగించరాదు. ఒకే భూమిలో ప్రతి సంవత్సరము పొగాకు వేయరాదు. కనీసము మధ్యలో ఒకసంవత్సరము వేరొక పైరు వేసుకొనాలి. దీనివలన భూసారము సన్న గిల్లదు. నాణ్యతగల పొగాకు దిగుబడి కాగలదు. ప్రకృతి వైపరీత్యాలుగాని. మార్కెట్ ఇబ్బందులు వచ్చినా రైతుల ఆర్థికస్థితి తలక్రిందులు కాకుండా, ఏదో ఒక పంటద్వారా కనీస భద్రత లభించగలదు.

4. అమెరికాలో పొగాకు వ్యవసాయం

పొగాకు పండించుటకు ఉన్నటువంటి మొత్తం అనువయిన భూములలో, రైతు ఎన్ని ఎకరములలో పొగాకు పండించ వలసినదీ, నాట్లకుముందే అమెరికా ప్రభుత్వము ప్రతి రైతుకు తెలియ చేస్తుంది. అట్లు ప్రభుత్వ నిర్ణయం ప్రకారం పండించిన పొగాకుకు విక్రయ సదుపాయములు కల్పించటానికి, గిట్టుబాటు అయిన న్యాయసమ్మత మయిన ధరలను రైతులకు ఇప్పించడానికి అమెరికా ప్రభుత్వము పూర్తి బాధ్యత తీసుకొంటుంది. అటువంటి పద్ధతినే మన దేశములో కూడా ప్రవేశ పెట్టి పొగాకు వ్యవసాయమును పరిమిత పరచుటకు, రైతుల పంటకు సహేతుక

మయిన, గిట్టుబాటు అయిన ధరలు రాబట్టుటకు, రైతుల పట్టును వికయింపు బాధ్యతలు తీసుకొనుటకు పొగాకుబోర్డు క్రమేపి తగు ప్రయత్నం చేయాలి.

5. అమ్మకోగలిగినంత పొగాకు మాత్రమే పండించాలి

దేశములోని సిగరెట్టు కంపెనీల అవసరములు, విదేశాలకు ఎగుమతి కొరకు అవసరము అయిన పొగాకును ముందుగా మదింపుచేసి, అవసర మయినంత పొగాకును మాత్రమే పండించుటకు వీలుగా పొగాకు వ్యవసాయమును పరిమిత పరచాలి. ఈ విధంగా ఆ మార్కెట్టు అవసరముల వరకే ఉత్పత్తిని పరిమిత పరచిన, రైతులవద్దగాని, వర్తకులవద్దగాని సరుకు మిగులు నిలువ ఉండకుండా, ప్రభుత్వానికి సమస్యలేకుండా పోతుంది. కొనేనాధుడు లేక, సరుకు నిల్వల పేరుకొనిపోయి, తద్వారా ఉత్పన్న మవుతున్న బాధలు తొలగిపోగలవు. ఈ విషయంలో తగు యోచనచేసి, పొగాకుబోర్డు కమంగా తగు కట్టుదిట్టములు చేయవలసి యున్నది.

6. గ్రేడింగ్ విధానంలో సంస్కరణ

అమెరికా, కెనడా, ఇటలీ మున్నగు దేశాలలో రైతుల శ్రేయస్సు దృష్ట్యా గ్రేడింగ్ విధానాలు రూపొందించ బడినవి. కాని మన దేశములో మాత్రము విదేశీ దిగుమతి దారుల ప్రయోజనము కొరకు గ్రేడింగు విధానము రూపొందించ బడినది. రైతులవద్ద ఎనిమిది గ్రేడులు చేయబడుచున్నది. ఆ ఎనిమిది గ్రేడులనుండి తిరిగి వర్తకులు పదిహేను (15) గ్రేడులుగా చేయించి, ఎగుమతి చేయవలసి వస్తున్నది. రైతుల గ్రేడులకు కనీసధరలు లేవు. ఎగుమతి గ్రేడులకు కనీసధరలు ప్రభుత్వం నిర్ణయిస్తున్నది. ఇటువంటి ద్వంద్వ గ్రేడింగు విధానము మన దేశములో మినహా ప్రపంచంలో మరే దేశములోనూ లేదు ఈద్వంద్వ గ్రేడింగు విధానం మూలముననే రైతులు దోపిడికి గురి అగుచున్నారు. ఈ విధానం వలన విదేశివర్తకులు, దేశీయ సిగరెట్టు కంపెనీలు అధిక ప్రయోజనమును పొందుచున్నారు. అటు రైతులకు, ఇటు విదేశివర్తకులకు మధ్యనున్న మన ఎగుమతి దారులకు కూడా ఈ ద్వంద్వ విధానం వినియోగ పడుచున్నది. రైతులకు, దేశానికి నష్టదాయకమయిన ఈ ద్వంద్వ గ్రేడింగు విధానము తక్షణము సంస్కరించ బడాలి. అమెరికాలోవలె మన దేశంలో కూడా రైతుల స్థాయిలోనే నిర్బంధ గ్రేడింగు చేయించడము, ఆ గ్రేడులకు చట్ట బద్ధమయిన కనీసధరలు నిర్ణయించి అమలు జరుపబడాలి.

రైతుల స్థాయిలోని గ్రేడింగు విధానమును ప్రామీణీకరించుటకు **(standardisation)**, పొగాకు బోర్డువారు ఈ సంవత్సరం ఎనిమిది గ్రేడులను –

F-1 నుండి F-8 వరకు- నిర్ణయించారు. కాని గత నలభై సంవత్సరముల నుండి ఎగుమతి కొరకు సాంప్రదాయకంగా జరుగుతూఉన్న ఎగుమతి గ్రేడింగు విధానం ఇంకా కొనసాగించ బడుచున్నది. అందుచేత రైతులస్థాయిలో పొగాకుబోర్డు నిర్ణయించిన ఎనిమిది గ్రేడులు ఎగుమతికి గుర్తించబడలేదు. ప్రస్తుతపు ఎగుమతి గ్రేడులను రద్దుచేసి, రైతుస్థాయిలోని ఎనిమిది గ్రేడులను ఎగుమతి గ్రేడులుగా చేసుకోవాలి. రైతుల ఎనిమిది గ్రేడులకు చట్టబద్ధమయిన కనీసధరలు నిర్ణయించి, నిర్బంధంగా అమలు పరచాలి. రైతుల అనర్ధకమునకు మూలహేతువయిన ఈ ద్వంద్వ గ్రేడింగ్ విధానమును తొలగించి, దాని స్థానంలో రైతుల స్థాయిలో, ఎగుమతి కొరకు ఒకే గ్రేడింగ్ విధానంను ప్రవేశ పెట్టడం పొగాకు రైతురక్షణకు ప్రధమచర్య.

7. గ్రామాలలోనే గ్రేడింగు కేంద్రాలు

ప్రతి గ్రామంలోగాని, లేదా కొన్ని చిన్న గ్రామాలకు ఒకటిగాగాని పొగాకు గ్రేడింగ్ కేంద్రమును నెలకొల్పాలి. ఈ కేంద్రం పొగాకు బోర్డువారి రైసెన్సుతో బోర్డుయొక్క పర్యవేక్షణ క్రింద నిర్వహించబడాలి. ఇది సహకారసంస్థ యాజమాన్యమున నిర్వహించ బడడం మంచిది. ఈ కేంద్రములను నడుపు బాధ్యతను ప్రభుత్వం స్వీకరించ వలసిన అవసరంలేదు. ఆ గ్రామాల రైతులు పండించిన పొగాకును ఈ కేంద్రములలో ఎనిమిది గ్రేడులుగా చేయించాలి. గ్రామాలలోని వ్యవసాయ కార్మికులకు, చిన్నరైతు కుటుంబాల మహిళలకు ఈ కేంద్రాలలో పని లభిస్తుంది. ఇక్కడ గ్రేడు చేయబడిన పొగాకును నూరుకిలోల తూకంగల బేళ్ళుగా గట్టి, ప్రామాణిక తూకములు (Standard weights) ఏర్పరచాలి. దీని ద్వారా తూకములలోకూడా రైతులు మోసపోకుండా జాగ్రత్త పడవచ్చును. ప్రతిరైతు తాను పండించిన పొగాకులో ఏయే గ్రేడు ఎంత తూకం దిగుబడి వచ్చినది గ్రామంలోనే తెలుసు కొనగలడు. గ్రేడు చేయకుండా పొగాకు అమ్మకంను నిషేధించాలి.

8. రైతుల పొగాకుకు నాణ్యత సర్టిఫికేట్లు

ఈ విధంగా గ్రేడింగ్ చేయబడిన పొగాకును సమీపంలోని వేలం కేంద్రములకు రైతులు తీసుకొని పోవాలి. వేలం కేంద్రములో పొగాకుబోర్డుయొక్క క్వాలిటి ఇన్స్పెక్టరు ప్రతి బేలుకు గ్రేడును సూచించు లేబులు ఈయాలి. ఈ లేబులుతో ఆయా పొగాకుబేళ్ళ గ్రేడులు ఖరారు కాగలవు. ఈ లేబుళ్ళను కాదనడానికి, ప్రశ్నించడానికి కొనుగోలుదార్లకు అధికారం ఉండరాదు. ఈ విధంగా వేలం కేంద్రమునకు వచ్చిన పొగాకుతూకం గ్రేడు, నాణ్యత - మూడు తేలిపోవాలి.

9 వేలము కేంద్రాలు

పొగాకు పండించే ప్రతి గ్రామమునకు అందుబాటులో వేలము కేంద్రములు నెలకొల్పబడాలి. ఈ కేంద్రములు పొగాకు బోర్డు యాజమాన్యమున నిర్వహించ బడాలి. కనీసము ప్రతి 150 (నూట యాభయ్) చదరపు కిలోమీటర్లకు ఒక కేంద్రం ఉండాలి. ఏ రైతు తన గ్రామమునుండి పదిహేను (15) కిలోమీటర్లు మించి పొగాకు తీసుకొని వెళ్లవలసిన అవసరము ఉండకూడదు. సాధ్యమయినంత చేరువలో పంటను విక్రయించుకొనుటకు రైతుకు సదుపాయం ఉండాలి. గ్రేడు చేసిన పొగాకు మాత్రమే వేలము కేంద్రములకు వచ్చుటకు అనుమతించాలి. గ్రేడు చేయబడని పొగాకును వేలము కేంద్రమునకు రాకుండా నిషేధించబడాలి.

10 వేలము కేంద్రములలో గోడౌన్లు

ప్రతి వేలము కేంద్రములోను తగిన గోడవును వసతులుండాలి. రైతులు అమ్మకమునకు తీసుకొనివచ్చే పొగాకు భద్రతకు, వేలములో విక్రయంగాక ప్రభుత్వ సంస్థ కొనుగోలు చేయు పొగాకును కొంత కాలము నిలువ చేయుటకు కావలసిన గోడవునులు కేంద్రములో ఉండాలి. రాష్ట్ర ప్రభుత్వమునకు చెందిన వేర్ హౌసింగ్ కార్పొరేషన్ (State Warehousing Corporation) గాని, లేదా కేంద్ర ప్రభుత్వమునకు చెందిన సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ (Central Warehousing Corporation) గాని వేలము కేంద్రములలో గోడవునులు నిర్మించి, తగు ఏర్పాట్లు చేయాలి. కేంద్రములోని పొగాకుకు తగు ఇన్సూరెన్సు చేసి, రైతులకుగాని, వర్తకులకుగాని భయాందోళనలు లేకుండా చేయాలి.

11 వేలము కేంద్రములలో బ్యాంకులు

రైతులు విక్రయించిన పొగాకుకు రాగల డబ్బును, వర్తకులనుండి, ప్రభుత్వ వాణిజ్య సంస్థనుండి పొందుటకు ప్రతి వేలము కేంద్రములోను ఒక బ్యాంకు తప్పనిసరిగా ఉండాలి. వేలములో వాళ్లకును వర్తకులకు, ప్రభుత్వ వాణిజ్య సంస్థకు ఆ కేంద్రములోని బ్యాంకులో విధిగా ఎకౌంటు కలిగి యుండాలి. పొగాకు విక్రయము జరిగిన వెంటనే, కేంద్రములోనే రైతుకు చెక్కు ఈయబడాలి. అప్పటికి అప్పుడే ఈ చెక్కును రైతు బ్యాంకులో యిచ్చి, నగదును పొందుటకు సౌకర్యము ఉండాలి. లేదా వేలము కేంద్రములోని బ్యాంకులో ఎకౌంటు ఉన్న రైతులకు పొగాకు అమ్మగా వచ్చిన సొమ్ము అతని ఎకౌంటుకు జమపడాలి.

12 రైతుల 8 గ్రేడులకు కనీస ధరలు

రైతుల స్థాయిలో చేయబడు ఎనిమిది గ్రేడులకు కనీస ధరలు పంట మార్కెటుకు రాకముందే నిర్ణయించబడాలి. వేలము కేంద్రములలోనే ఈ ధరలు రైతులకు అందునట్లు ఏర్పాట్లు జరుగాలి. వ్యవసాయ ఖర్చులు, రైతు కుటుంబ సభ్యులు చేయు సేవలకు ప్రతిఫలము, సహేతుకమయిన లాభము రైతుకు గిట్టు బాటు అగునట్లుగా ఈ కనీస ధరలు నిర్ణయించబడాలి. ఎగుమతి ధరలకు, రైతులకు యిచ్చే ధరలకు సంబంధముండాలి.

13. వేలములో విక్రయంగాని పొగాకును ప్రభుత్వమే కనీస ధరలకు కొనాలి

రైతులు గ్రేడుచేసిన పొగాకును అమ్మకము కొరకు వేలము కేంద్రమునకు తీసుకొని రావాలి. ప్రభుత్వము నిర్ణయించిన కనీస ధరతో వేలము ప్రారంభమయి, అంతకంటె హెచ్చుధరకు వర్తకులు కొనుగోలు చేయుటకు ముందుకు రావచ్చును. అనువయిన భూములలో పండించి, నెర్పుగా క్యూరింగ్‌చేసి, జాగ్రత్తగా గ్రేడింగు చేయించిన రైతుల పొగాకుకు కనీస ధరలకంటె హెచ్చుధరట్లు రావచ్చును. అట్లు కాకుండా, సాధారణమయిన పొగాకును కనీస ధరలకు కూడా వర్తకులు కొనుగోలు చేయుటకు ముందుకు రాకపోవచ్చును. కాని అటువంటి సందర్భములలో కూడా రైతు కనీస ధరలకు పొగాకును అమ్మకొనగలగాలి. వేలములో చెల్లని పొగాకును కొనుగోలు చేయుటకు ఒక ప్రభుత్వసంస్థ - యస్‌టిసి/పొగాకు బోర్డు - సిద్ధముగా ఉండి, పొగాకును కొని, రైతులకు డబ్బు చెల్లించు ఏర్పాట్లు ఉండాలి. అనగా వేలము కేంద్రమునకు రైతు తెచ్చిన పొగాకును వర్తకులుగాని ప్రభుత్వముగాని కనీస ధరలకు తగ్గకుండా కొనుగోలు చేసి, డబ్బు చెల్లించుటకు తగు కట్టుబాట్లము లుండాలి.

14 వేలములోపోని పొగాకు కొనుగోలుకు ప్రభుత్వ వాణిజ్య సంస్థకు వసతులు

ఏకారణము చేతనయినాగాని వర్తకులు వేలములో కొనుగోలు చేయకుండా వదలివేసిన పొగాకును ప్రభుత్వ వాణిజ్యసంస్థ కొనవలసియున్నదని ముందుగా చెప్పుకున్నాము. అట్లు కొనుగోలు చేసిన పొగాకును ప్యాకింగ్ చేయుటకు అవసరమయిన వసతులు సాధన సంపత్తి - అనగా గిడ్డంగులు, గ్రేడింగ్ పందిళ్లు,

రీడయింగు మెషినలు, సిబ్బంది – ఈ సంస్థకుండాలి. ప్రయివేటు ఎగుమతి దారులవలెనే ఈ ప్రభుత్వసంస్థ కూడా ఆ పొగాకును ఎగుమతి చేయుటకు కావలసిన వీర్హాట్లు అర్డర్లు ఉండాలి.

15. పొగాకు నిల్వలకు శీతల గోడౌన్లు

పొగాకును సక్రమ పద్ధతులలో నిలువచేసి, భద్రం చేయడానికి శీతల గోడౌన్లు (air-conditioned godowns) ఎంతో అవసరము. సిగరెట్టు తయారు చేయుటకు పొగాకును సుమారు మూడు సంవత్సరములు నిలువజేయవలసి యున్నది. ప్రభుత్వ వాణిజ్య సంస్థ, సహకారసంస్థలు, వర్తకులు విక్రయంగాని పొగాకును ఒకటి రెండు సంవత్సరాలు నిలువ జేయవలసి యున్నది. అటువంటి సందర్భములలో పొగాకు పుయుగుబట్టి చెడకుండా సరిఅగు పరిస్థితులలో నిలువజేయడానికి ఈ శీతలగోడౌన్లు అవసరము. ఈ శీతలగోడౌన్లు గుంటూరు, చిలకలూరిపేట, మేదర మెట్ల ఒంగోలు, గుంటూరు, సింగరాయకొండ కేంద్రములలో ఉండవలసి అవసరము. రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్‌గాని, సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్‌గాని ఈ గోడౌన్లు నిర్మించి వసతులు కల్పించడం పరిశ్రమాభివృద్ధికి అవసరము. అమెరికా లాంటి దేశములలో అమ్మకము గాని పొగాకును ఆరు, ఏడు సంవత్సరములు కూడా ఇటువంటి శీతల గోడవునులలో నిలువజేసి, భద్రపరచి, విక్రయించుచున్న విషయము తెలిసినదే !

16. ప్రభుత్వ సంస్థకు కొనుగోలుకై నిధులు

వేలము కేంద్రములలో రైతుల పొగాకు కొనుగోలు చేయకుండా, వేలమి విధానమును విఫలము చేయుటకు గుత్తప్రయివేటు వర్తకులు ప్రయత్నించవచ్చు. అటువంటి సందర్భములలో వర్తకులు కొనుగోలు చేయకుండా మిగిలిన మొత్తం సరుకును కొనుగోలు చేయుటకు ప్రభుత్వ వాణిజ్య సంస్థ సర్వసన్నద్ధముగా ఉండాలి. ఇందుకు కనీసం రు. 50 కోట్లకు తక్కువగాకుండా నిధులను సమకూర్చుకొని ప్రభుత్వ సంస్థ తయారుగా ఉండాలి. ఈ కొనుగోళ్ళ విషయంలో ప్రభుత్వ సంస్థ తటపటాయించకుండా దృఢనిర్ణయముతో నిలువబడాలి.

17. వేలములో కొనుగోలుచేసిన పొగాకును ప్రభుత్వ సంస్థ ఎగుమతి చేయాలి

వేలములో కొనుగోలుచేసిన పొగాకును ప్రభుత్వ వాణిజ్య సంస్థ ఎగుమతి చేయడానికే ప్రయత్నించాలి. ఇందుకు వలసిన సహకారమును కేంద్ర ప్రభుత్వము అందించాలి. ఏ పరిస్థితులలోను, స్థానిక ఎగుమతిదారులకుగాని, లేదా దేశీయ సిగరెట్టు ఉత్పత్తి కంపెనీలకుగాని ఈ పొగాకును ప్రభుత్వ సంస్థ విక్రయించరాదు.

18. దశలవారీగా వేలం పద్ధతి ప్రవేశము

మొత్తము పొగాకు ప్రాంతమంతటికి ఒకేసారి వేలము పద్ధతి ప్రవేశపెట్టి తలంచడం వాంఛనీయము కాదు. సాధ్యము కూడాకాదు. పొగాకు పండించే ప్రాంతమును భూములను బట్టి అయిదు భాగములుగా విభజించి, ఒక్కొక్క సంవత్సరము ఒక ప్రాంతములో వేలము ప్రవేశపెట్టి, అయిదు సంవత్సరములలో మొత్తము పంటను క్రమముగా వేలము క్రిందకు తీసుకొనిరావాలి. ముందుగా దక్షణ, ఉత్తర ప్రాంతములలోని ఎర్ర భూములలోను తెలిక నేలలలోను పండించబడు పొగాకుతో వేలము ప్రారంభించాలి. కర్ణాటక రాష్ట్రములో కూడా అదే పద్ధతి ప్రవేశపెట్టాలి. వేలము విక్రయమును ఏర్పాటు చేసిన ప్రాంతములో పండిన పొగాకును ఆ ప్రాంతమునుండి బయటకు పోసీయకుండా తగు కట్టుదిట్టములు చేయాలి. ఈ విధముగా పంచవర్ష ప్రణాళికలో వేలము పద్ధతిని అమలు చేయవలసి యున్నది.

19. ప్రభుత్వ రంగములో సిగరెట్టు ఫ్యాక్టరీలు

వేలములో ప్రభుత్వ సంస్థ కొనుగోలుచేసిన పొగాకును కొంత ఎగుమతి చేసి మిగతా సిగరెట్టు తయారు చేయుటకు అవసరమయిన ఫ్యాక్టరీలను ప్రభుత్వ రంగములో ఏర్పాటు చేయబడాలి. ఈ ఫ్యాక్టరీలు కేంద్రప్రభుత్వ ఆధ్వర్యమునగాని, లేదా రాష్ట్రప్రభుత్వ ఆధ్వర్యమునగాని ఏర్పాటు చేయనగును. ఎగుమతి చేయగా మిగిలిన పొగాకును ఈ విధంగా సిగరెట్లు తయారుచేసి ఆసిగరెట్లను దేశంలో వినియోగ పరచడం లేదా ఎగుమతి చేయడం వలన ప్రయివేటు రంగంలోని సిగరెట్టు ఫ్యాక్టరీలతో పోటి ఏర్పడి, పొగాకు రైతులకు, సిగరెట్టు వాడకం దారులకు ఎంతో ప్రయోజనం కల్పించగలదు.

II వేలములో సాధక బాధకాలు

వేలముద్వారా పొగాకు విక్రయమును ఏర్పాటు చేసిన ఎడల అచరణలో అనేక సాధకబాధకములు రాగలవని ఊహించవలసి యున్నది. ముఖ్యంగా ఈ దిగువ పేర్కొనబడిన అవరోధాలను అధిగమించవలసి యున్నది.

20. గ్రేడింగు చేయుటలో రైతుల కర్తవ్యము

వేలము పద్ధతి జయప్రదమగుటకు రైతులు తమ పొగాకును పొగాకుబోర్డు నిర్దేశించిన రీతిగా శుద్ధముగా గ్రేడుచేసి, తగిన సహకారము ఈయాలి. సక్రమముగా గ్రేడు చేయకుండా పొగాకును రైతులు వేలము కేంద్రమునకు తెచ్చినట్లయిన వేలము జయప్రదము కానేరదు. అందుచేత రైతులు తమ కర్తవ్యమును చిత్తశుద్ధితో నిర్వహించి, పొగాకు బోర్డుతో సహకరించాలి.

21. రైతుకు నగదు చెల్లింపు

వేలము ద్వారా విక్రయము పూర్తికాగానే రైతులు డబ్బుకొరకు ఎదురు చూడడం సహజమే. వెంటనే పూర్తిగా డబ్బు చెల్లించలేకని వర్తకులు వేలంలో పాల్గొనుటకు వెనుకాడవచ్చు. ఈ విధంగా వేలంలో పాల్గొను వర్తకుల సంఖ్య తగ్గిన వర్తకులమధ్య తగినంత పోటి ఉండకపోవచ్చు. పోటి లేనప్పుడు గరిష్ఠధరలు రైతులకు రాబట్టడం సాధ్యంకాదు. అటువంటి సందర్భములలో ప్రభుత్వం నిర్ణయించిన కనీసధరలకే రైతులు పొగాకును ప్రభుత్వ సంస్థకు విక్రయించవలసి వస్తుంది. తత్ఫలితంగా ప్రభుత్వ సంస్థ మించిన బరువును మీదవేసుకొనవలసిన పరిస్థితులు సంభవించవచ్చు. ఇది అతి ముఖ్యమయిన, కానరాని అవరోధము.

22 గుత్తవర్తకుల దుష్ప్రభావము

ఐయల్‌టిడి కంపెనీకి అనేక దేశాలలోని గుతవర్తక సంస్థలతో అనుబంధాలు ఉన్నవి. ఇంగ్లండులోని సిగరెట్టు ఉత్పత్తి కంపెనీలు అయిన ఇంపీరియల్స్, గల్లహర్స్, కెరెరాస్, బిబిఏ, అమెరికన్ టుబాకోలతో ఐయల్‌టిడి కి సంబంధాలున్నాయి. ఈ కంపెనీలకు, యూరప్‌లోని ఇతర కంపెనీలకు ఎగుమతి చేస్తున్న మన పొగాకు ఎగుమతి దారులపై ఒత్తిడి తీసుకొనిరాగల శక్తి, అవకాశం ఐయల్‌టిడికి ఉన్నది. వేలములో ఐయల్‌టిడితో పోటి పడుటకు స్థానిక ఎగుమతి దారులు ప్రయత్నించిన యెడల, వారిని ఇంగ్లండులోని సిగరెట్టు కంపెనీలద్వారా

అదుపులో పెట్టుటకు ఐయల్‌టిడి, వెనుకాడదు. స్థానిక వర్తకుల ఎగుమతి ఆర్డర్లను తగ్గించడానికిగాని, లేదా రద్దు చేయించడానికిగాని ఐయల్‌టిడి యత్నించగలదు. ఈ కారణంచేత ఐయల్‌టిడితో స్థానిక ఎగుమతిదారులు ఎంతవరకు వేలములో పోటిచేయగలరను విషయం సందేహాస్పదం. కావున ఐయల్‌టిడి లాంటి గుత్త సంస్థల దుష్ప్రభావమును అరికట్టుటకు తగు కట్టుదిట్టములు ముందుగానే చేయవలసి యున్నది.

23 గిరాకిలేని గ్రేడుల భారము

పొగాకుబోర్డు నిర్దేశించిన ప్రకారం ఎనిమిది గ్రేడులలోనే రైతులు పొగాకును వేలం కేంద్రమునకు తీసికొని రాగలరు. కాని వర్తకులు తమ ఎగుమతి ఆర్డర్లకు అవసరమయిన గ్రేడుల సరుకు మాత్రమే కొనుగోలు చేయగలరు. ప్రస్తుతం అన్ని గ్రేడుల సరుకును అవసరమయిన వానికంటె హెచ్చుగా కొనుగోలు చేస్తున్నట్లు, వేలం పద్ధతిలో వర్తకులు కొలుగోలు చేయరు. ఆకారణంగా కొన్ని గ్రేడులలో సరుకు వేలం విక్రయం కాకుండా నిలబడి పోగలదు. అట్లు మిగిలిపోయిన సరుకును కొనుగోలు చేయు బరుపు, బాధ్యతలను ప్రభుత్వ సంస్థ మీద వేసుకొనవలసి వస్తున్నది. అందుకు ప్రభుత్వ సంస్థ సర్వసన్నద్ధంగా ఉండాలి. లేనిచో వేలం విధానం విఫలమయి రైతులు నష్టపడగలరు.

24 వివాదాల తీర్పునకు వసతులు

రైతులు చేయించినఎనిమిది గ్రేడులను, ప్రభుత్వసాంకేతిక నిపుణులుపరిశీలించి ఆమోదించి, తగిన సర్టిఫికేట్లు ఈయవలసియున్నది. ప్రతి బేలుకు ఒక లేబులును ఈయవలెను. ఈ విషయంలో రైతులకు ప్రభుత్వ నిపుణులకు అభిప్రాయభేదములు కలిగి, వివాదములకు దారితీయవచ్చు. అటువంటి సందర్భములలో ఇరువురి మధ్య వివాదం చెలరేగకుండా, న్యాయసమ్మతమయిన పరిష్కారములు చేయుటకు ఒక సంస్థ ఉండాలి. ఈ సంస్థయొక్క నిర్ణయములు అందరకు శిరోధార్యములుకావాలి. ఈ సందర్భములో అక్రమవర్తన, లంచములు కూడా ప్రబలుటకు సావకాశమున్నది. అటువంటి దుష్పరిణామములకు దారితీయని విధముగా, జాగ్రత్తగా తగు కట్టు దిట్టములు చేయవలసియున్నది.

25 శాస్త్రిజ్ఞానము, అనుభవముగల ప్రభుత్వోద్యోగులు

పొగాకు గ్రేడింగ్, నాణ్యతను పరిశీలించి, సర్టిఫికెట్లు ఈయడానికి శాస్త్ర పరిజ్ఞానముతోబాటు అనుభవం, శీలంగల ప్రభుత్వ ఉద్యోగులుకావాలి. సమర్థులయిన

ఉద్యోగులు తగిన సంఖ్యలో లేనట్లయిన వేలం విధానం రైతులకు ప్రయోజనకారి కాజాలదు. కావున అవసరమయిన సాంకేతిక సిబ్బందిని ఏర్పాటుచేసి, ముందుగా తగిన శిక్షణ యిచ్చి సిద్ధముగా నుంచవలసి యున్నది.

26. వేలము కేంద్రములు నిర్వహణ

వేలం కేంద్రముల నిర్వహణకు దక్షత, శీలముతో కూడిన యాజమాన్యం అవసరం. సాధారణ ప్రభుత్వోద్యోగులకంటె, వేలం కేంద్ర నిర్వహణోద్యోగులు సమర్థత, నేర్పు, ఓర్పుకలిగి యుండాలి. రైతులపట్ల సానుభూతి, వర్తకులపట్ల మెలకువ చూపగల వ్యక్తులు ఉండడం అత్యవసరం.

27 ఇప్పటి ఎగుమతి గ్రేడులు వాటి కనీస ధరలు రద్దు చేయబడాలి

ఇంతకుముందు వివరంచబడినట్లుగా, పొగాకు బోర్డు నిర్దేశించిన ప్రకారం రైతులు నిర్బంధముగా పొగాకును ఎనిమిది గ్రేడులుగా శ్రమముగా చేయించడం ఈ గ్రేడుల నాణ్యతకు తగు సర్టిఫికేట్లు గ్రామాలలోనే ఈయడం, రైతుల స్థాయిలోనే ఈ ఎనిమిది గ్రేడులకు చట్టబద్ధమయిన కనీస ధరలు నిర్ణయించడం, వేలం కేంద్రములలోనే పొగాకు విక్రయం చేయడం - ఈ నాలుగు ముఖ్యాంశములను సక్రమముగా అమలు చేసినయెడలనే రైతుకు సంపూర్ణమయిన రక్షణలభించగలదు.

ఈ చర్యలు తీసుకొని అమలు పరచిన తరువాత ఎగుమతిదారులపై ప్రభుత్వం యొక్క కంట్రోలు అవసరం లేదు. ఇంకా ఎగుమతి కొరకు తిరిగి గ్రేడు చేయించడం, ఎగుమతులకు కనీస ధరలు నిర్ణయించడం కూడా అవసరం కాదు. ఒకసారి వేలం కేంద్రములో ప్రభుత్వం నిర్ణయించిన కనీస ధరలకు రైతుల వద్ద వర్తకులు పొగాకు కొనుగోలు చేసిన తరువాత, వర్తకుడు తగు జాగ్రత్తపడి, నష్టమునకు అమ్మకుండా తనను తాను రక్షించుకొనగలడు. దీని ప్రభావముగా వర్తకుల మధ్య ఇప్పుడున్న చెడుమార్గములు, తప్పుడు వ్యవహారములు, ఒకరి కంటె మరొకరు విదేశవర్తకుల అభిమానం చూరగొనుటకు చేయు యత్నములు ఆగిపోగలవు. మన వర్తకులు విదేశివర్తకుల చెప్పుచేతలలోనుంచి విముక్తిపొంది, ఆత్మాభిమానంతో వ్యవహరించగల గౌరవ పరిస్థితులు నెలకొనగలవు, మన రైతులను మన వర్తకులు దోపిడీ చేయటం, మన వర్తకులను విదేశి దిగుమతిదారులు

దోపిడీ చేయడం, అంతం గాగిలదు. అందుచేత ఎగుమతి స్థాయిలో అనవసరంగా జోక్యం చేసుకొని, ప్రభుత్వం తన శక్తిని వృధా చేసుకొనరాదు.

ఇప్పటి ఎగుమతి గ్రేడులు రైతుల ప్రయోజనములకు తీవ్ర అవరోధమును కల్పించుచున్నాయి. ప్రస్తుతమున్న ఎగుమతి గ్రేడులు, విధానాలు విదేశి వర్తకులు దోపిడీ చేయడానికి వినియోగపడుచున్నవి. రైతుల, వర్తకుల ఆనైక్యతను, సంఘటనా శక్తి లేమిని, బలహీనతగా తీసుకొని మన పొగాకును ఒకటి, రెండు గ్రేడులు తక్కువగా విదేశివర్తకులు కాజేస్తున్నారు. మన ప్రభుత్వ విధానం కూడా కందుకు ఆసరాగా తోడ్పడడం దురదృష్టకరం. దీనితో విదేశి వర్తకుల మాట మన వర్తకులకు వేదమవుతున్నది. విదేశ వర్తకులు, మన ఎగుమతిదారుల పాలిట దేవుళ్లు అయి కూర్చొని, రైతుల రొమ్ములపై కుంపటిగా తయారయినారు. ఈ దౌర్భాగ్య దశనుండి బయట పడుటకు, ప్రస్తుతమున్న ఎగుమతి గ్రేడులు తక్షణము రద్దు చేయబడాలి. రైతుల ఎనిమిది గ్రేడులే, ఎగుమతి గ్రేడులుగా గుర్తించ బడాలి.

28. వేలము పద్ధతిలో జాగ్రత్తలు

వేలము ద్వారా పొగాకు అమ్మకమునకు పథకము ఏర్పరచునప్పుడు, పైన వివరించిన అంశములను జాగ్రత్తగా పరిశీలించాలి. త్వరపడి ఏమాత్రము తప్పటడుగు వేసినా, రైతులకు మేలు జరగకపోగా, కీడు వాటిల్లగలదు. వర్తకులు ఏకమై వోచరు విధానమును అధిక లాభములు పొందుటకు వినియోగించుకొన్నట్లుగా, వేలము విధానమునకొని లోపములను ఆడ్డము పెట్టుకొని, రైతులను నిలువ దోపిడి చేయడానికి, వేలము పద్ధతిని భగ్నపరచి, అనుకూల పరిస్థితులను కల్పించు కొనుటకు వర్తకులు సర్వప్రయత్నములు చేయగలరు. అందుచేత ప్రభుత్వము తగు జాగరూకతతో, దూరదృష్టితో యోచనచేసి, నేర్పుతో, పట్టుదలగా రైతురక్షణనె ప్రయత్నించాలి.

29. పొగాకు బోర్డు విస్తృతము గావాలి

ఉత్పత్తిని క్రమబద్ధంచేసి, రైతులకు రక్షణ కిల్పించుటకు పొగాకు బోర్డు కృషిచేయాలి. అందుకు పొగాకు బోర్డు సంస్థ ఎంతో విస్తృతం కావాలి. బాగా పెరగాలి. అన్ని ప్రాంతాల రైతులకు అందుబాటులో ఉండుటకు వీలుగా, బోర్డు బ్రాంచీలు సంఖ్య ఎదకాలి. ప్రతి ఇరువదివేల ఎకరాలకు ఒక ఫీల్డు ఆఫీసు ఉండాలి. రైతులకు శాస్త్రజ్ఞానం, ఋణసదుపాయములు, నారు, ఎరువులు, పురుగు

మందులు వగైరా అందించడానికి, వ్యవసాయజ్ఞానం, సేవాభావంగలిగిన సాంకేతిక సిబ్బందితో ఈ ఫీల్డు ఆఫీసులు రూపొందాలి. బోర్డుకు రైతుకు మధ్య మంచి సంబంధములు పెరిగి, రైతుల పాలిట కల్పతరువుగా పొగాకుబోర్డు రూపొందించబడాలి.

30. పొగాకు ఉత్పత్తికి చెందిన అన్ని ప్రభుత్వ సంస్థలు పొగాకు బోర్డులో లీనం గావాలి

పొగాకు వ్యవసాయ విస్తరణకు టొబాకో డెవలప్‌మెంటు కౌన్సిల్ మద్రాసులో ఉన్నది. పొగాకు వ్యవసాయంలో పరిశోధనలు కల్పించడానికి రాజమండ్రిలో పరిశోధనాసంస్థ పనిచేస్తున్నది. పొగాకు నాణ్యత. ప్రమాణాలు నెలకొల్పడానికి 'అగ్‌మార్' డిపార్ట్‌మెంటు ఉన్నది. ఇవన్నీ కేంద్ర సంస్థలే. కాని పొగాకు బోర్డుతో నిమిత్తం లేకుండా ఉన్నవి. ఈ సంస్థల మధ్య సయోధ్య నెలకొల్పడం కష్టం. పొగాకు వ్యవసాయం, వాణిజ్యం అభివృద్ధికి ఇవన్నీ కలసి పని చేయడం అత్యవసరం. అంచేత ఈ సంస్థ లన్నింటిని పొగాకు బోర్డులో లీనం చేయడం తక్షణావసరం.

పొగాకు రైతుల రక్షణకు తీసుకోవలసిన తక్షణ చర్యలు

— ఆచార్య రంగా

పొగాకుబోర్డు ప్రవేశపెట్టిన కొన్ని నిబంధనల మూలకంగా గుత్త వర్తకులు రైతులనుంచి పొగాకు కొనకుండా గత మూడు మాసాలుగా జాప్యంచేస్తున్న విషయాన్ని వాణిజ్యశాఖ మంత్రి దృష్టికి నేను తీసుకురాదలచాను. పొగాకు వర్తకులు గుత్త ఎగుమతిదారులు పొగాకు బోర్డుకు, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా అవలంబిస్తున్న పోకడలకు బెదరి, లొంగిపోయినట్టుగా అర్థంచేసుకోవలసి వస్తున్నది.

పొగాకు ఎగుమతి వ్యాపారం ఐ. ఎల్. టి. డి; ఎన్. టి. సి. గోల్డెన్ కంపెనీ, నవభారత్ మొదలగు కొలది గుత్తవర్తక సంస్థల అధీనంలోవుంది. గౌరవ నీయుడైన మిత్రుడు వాణిజ్యమంత్రి అంగీకరించినట్టుగా అభాగ్యులైన రైతాంగం గుత్తవర్తకుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి బ్రతకవలసిన దుస్థితిలో వున్నారు. రైతాంగానికి వ్యతిరేకంగా, ఈ గుత్త వర్తకులు పొగాకు కొనుగోలు చేయకుండా కట్టుబాటు చేశారు. ఫ్యాక్టరీలు మూసి, కార్మికులకు భృతి కలుగకుండాచేసి పెట్టు బడిదారుల వలెనే ఈ గుత్త పొగాకు వర్తకులు వ్యవహరిస్తున్నారు. ఇది అసా ధారణమయిన పరిస్థితి.

చెరకు రైతులు మిల్లులకు చెరకు తోలడానికి నిరాకరించారని, ఇతర పంట లను వర్తకులకు అమ్మడానికి అంగీకరించలేదనే వార్తలు వింటూ వుంటాము కార్మికులకు వ్యతిరేకంగా పెట్టుబడిదారులు ఫ్యాక్టరీలు మూస్తూ వుంటారని వార్తలు చదువుతూ వుంటాము, కాని రైతుల వద్దనుంచి పొగాకు కొనడానికి గుత్త ఎగుమతి దారులు, పెద్ద వర్తకులు వ్యతిరేకించారని ఇదివరకు ఎన్నడూ వినలేదు. ఇటువంటి పరిస్థితులలో రైతాంగం తీవ్రమైన అయోమయ చెందింది. వర్తకుల సహాయ నిరాకర ణతో పొగాకుబోర్డు, కేంద్ర ప్రభుత్వం తమ విధానాలను సవరించుకొని వర్తకులతో రాజీ పడవలసిన శోచనీయస్థితి ఏర్పడింది.

గుత్త ఎగుమతి దారులు, పెద్దవర్తకులు పెట్టిన షరతులను పొగాకుబోర్డు, కేంద్ర ప్రభుత్వం శిరసావహించ వలసి వచ్చింది.

కేంద్ర ప్రభుత్వం యోచనచేసి, పొగాకు రైతాంగానికి గుత్త ఎగుమతి దారుల, పెద్ద వర్తకుల భారినుంచి విమోచన కల్పించాలి. అందుకు వెంటనే చేయ వలసింది ఒక్కటే. స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్ చేత భారీ ఎత్తున పొగాకు కొను గోలు చేయించడమే. ఇది జరుగకపోతే గుత్త వర్తకులకు అదుపులో పెట్టడం రైతులను రక్షించడం అసాధ్యమైన పని. అందుచేత కేంద్రప్రభుత్వం స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్‌ను రంగంలోదించి, భారీ ఎత్తున పొగాకు కొనుగోలు చేయించాలి.

ఈ పని చేయాలని చాల కాలంగా నేను ఘోషిస్తున్నాను. కాని దురదృష్ట వశాత్తు ఇది జరగడంలేదు. గత సంవత్సరం స్టేట్ ట్రేడింగు కార్పొరేషన్ సకా లంలో మార్కెట్‌లో ప్రవేశించి, పొగాకు కొనుగోలుచేసి, మార్కెట్‌లో మంచి పోటీని కల్పించి, రైతులకు గిట్టుబాటైన రేటు రాబట్టడానికి దోహదం చేసింది.

కాని, పొగాకుబోర్డుకు, స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్‌కు మధ్య ఆపోహలు వున్నాయి. కేంద్ర ప్రభుత్వం స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్‌ను మార్కెట్‌లోకి

దెంవలేకపోయింది. దాని ఫలితంగా గుత్తవర్తకులు యథావిధిగా, స్వేచ్ఛగా పొగాకు రైతాంగాన్ని దోపిడీ చేస్తున్నారు..ఒకవంక రైతులను కొల్లగొట్టడం మరొక వంక పొగాకు బోర్డును, కేంద్ర ప్రభుత్వాన్ని లొంగదీయడం- ఈ రెండూ చేయ గలిగారు గుత్తవర్తకులు.

ఓచర్ పద్ధతి ప్రకారం, రెండవ వాయిదా మూడుమాసాల లోపల చెల్లించ డానికి బదులు, అయిదు మాసాలలోగా ఇవ్వడానికి నాకేమి అభ్యంతరం లేదు కాని సరుకు ఇచ్చిన వెంటనే రైతుకు సగం విలువ బ్యాంకు చెక్కు ద్వారా ఇవ్వాలనే నిబంధనను సడలించరాదు. రొక్కం చెల్లించే పద్ధతికి బదులు, చెక్కు అలవాటు మంచిది. మొదట రొక్కం అంటే వర్తకులు సగం ఇవ్వవచ్చు. ఇంకా తగ్గించవచ్చు, చాలప్రమాదం వుంది. రైతులు మోసానికి గురవుతారు. అందు చేత మొదటి సగం చెక్కుల ద్వారా ఇవ్వవలసిందే.

ప్రభుత్వం పొగాకు రైతుల సమస్యలను వెంటనే పరిశీలించాలి ప్రత్యేక శ్రద్ధతో, పొగాకుబోర్డు స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్ల మధ్య తగు సమన్వయ, సదవగాహన కల్పించాలి. ఈ రెండు సంస్థలను పటిష్ఠంచేయాలి. ఈ రెండింటి మధ్య అవినాభావ సంబంధం పరస్పర సహకారం వుండేటట్టు ప్రభుత్వం తగు కృషిచేయాలి. ఈ రెండు సంస్థలు పొగాకు పరిశ్రమలో నిలబడి, బలపడి జోడెద్దుల వలె కలసి లాగినప్పుడే గుత్తఎగుమతిదారులను అదుపులో పెట్టడం సాధ్యం కాగలదు.

తక్షణం స్టేటు ట్రేడింగ్ కార్పొరేషన్‌ను రంగంలో ప్రవేశపెట్టాలి. ప్రయివేటు ఎగుమతి దారులతో పోటీకి నిలచి, స్టేటుట్రేడింగ్ కార్పొరేషన్ పొగాకు ఎగుమతి వ్యాపారంలో ప్రధానపాత్ర వహించాలి. లేనిచో గుత్త ఎగుమతి దారుల ఆటలు కట్టవు.

ఆంధ్రజ్యోతి నుండి 24-3-78

జాతీయాదాయానికి అత్యధిక మొత్తం సమకూర్చుతున్న పొగాకు రైతు దుస్థితి

రు. 150 కోట్లు ఎక్సయిజు సుంకం రూపంలోను, రు. 35 కోట్లు విదేశమారక ద్రవ్యరూపంలోనూ, మరి నాలుగైదుకోట్లు స్థానిక పన్నుల రూపంలోనూ, మరో కొన్ని కోట్లు సెస్సులరూపంలోనూ, మొత్తం 200 కోట్లదాకా ఆదాయాన్నిచ్చే బంగారుపంట పొగాకును పండించి కేంద్ర ప్రభుత్వ బొక్కసాన్ని నింపి, జాతీయార్థిక సంపదకు పుష్టిని, తుష్టిని కలిగించే, రైతు స్థితి ఏమిటి? అయిదు దశాబ్దాలుగా యీ సమస్య ప్రశ్నరూపంలోనే మిగిలి పోయిందిగదా? ఇందుకు పరిష్కారమార్గం లేదా? ఇది 1980 నాటిమాట. నేడు అదే పొగాకుపై ఆదాయం రు 500 కోట్లు. విదేశమారక ద్రవ్యం రు 100 కోట్లు.

సిగరెట్ పొగాకును పండించడంలో అమెరికా, చైనాల తరువాత ప్రపంచంలో మనదేశం గణనీయమయిన స్థానం పొందింది. ఇండియాలో ఉత్పత్తి అవు

దరంపూరి వీరయ్య

తున్న సిగరెట్ పొగాకులో 99శాతం ఆంధ్రప్రదేశ్‌లోనే పండడం గర్వకారణం. ఉభయ గోదావరి, కృష్ణ, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, ఖమ్మం, కరీంనగర్ జిల్లాలో పొగాకు వ్యవసాయం జరుగుచున్నది. ప్రధానంగా గుంటూరు జిల్లాలలో కేంద్రీకృతమై యున్నది. ప్రతి సంవత్సరం దాదాపు సగటున 3,00,000 (మూడు లక్షల) ఎకరాలలో పొగ తోటలు పండింపబడుచున్నాయి. ఇందు సాలుకు



శ్రీ దరువూరి వీరయ్య

సగటున 100 మిలియనుల కిలోగ్రాములు (ఒకలక్ష టన్నులు) పొతావరణం అనుకూలంగా వుంటే పండించబడుచున్నది.

పొగాకు ప్రాధాన్యత

దేశంలో ఆవసరమైన సిగరెట్లు తయారు చేయుటకు పోగా మిగిలినది విదేశాలకు ఎగుమతి యగుచున్నది. సాలుకు 30 నుంచి 35 కోట్ల రూపాయల వరకు విదేశ

మారకద్రవ్యం లభ్యమగుచున్నది. చుట్టలు, బీడీలు, నోట్లో వేసుకొను రకాల నాటు పొగాకు, సిగరెట్ల తయారీ పొగాకులపై ప్రతియేటా కేంద్ర ప్రభుత్వమునకు 150 కోట్లకుపైగా ఎక్సయిజుడ్యూటీ ద్వారా ఆదాయం లభించుచున్నది. దేశ ఆర్థిక వ్యవస్థలో ఆంధ్రలో పండించబడే ఈ పొగాకుకు ఎంతటి ప్రాముఖ్యం గలదో పై అంకెలు రుజువు చేయగలవు. ఇంతేగాకుండా గుంటూరు నగరం కేంద్రంగా ప్రపంచ ప్రసిద్ధిచెందిన వర్జినియా పొగాకు పరిశ్రమలో లక్షలాది రైతాంగంతోపాటు అశేష శ్రామిక జనాలకు ఉపాధి కల్పించుచున్నది.

ప్రభుత్వ నిర్లక్ష్యం

ఇంతటి ప్రపంచ విఖ్యాతి కలిగి, జాతీయ ఆదాయమునకు వివిధరూపాలలో గణనీయమైన పెద్ద మొత్తంను సంపాదించిపెట్టు ఈ పొగాకు వ్యవసాయంవలన దీనిని ఉత్పత్తి చేస్తున్న రైతాంగం మాత్రం న్యాయము, ధర్మమునైన ప్రయోజనాన్ని పొందజాలకున్నారు. ధైర్యంతో చొరవతో, నేర్పుగా అనేక వ్యయప్రయాసలు, కష్టనష్టాల కోర్చి పండించిన వాణిజ్య పంటలకు గిట్టుబాటుగాగల ప్రతిఫలం రైతుకు దక్కక పోవుట ఎంత దురదృష్టం.

నిరాశ, నిస్పృహలే ప్రతిఫలమా!

గత నాలుగు దశాబ్దాలకు పైగా పొగాకు వ్యవసాయంచేస్తున్నా ఆనాటి పరాయి పాలకులలోగాని, తరువాయి వచ్చిన ప్రజా ప్రభుత్వంగాని వ్యవసాయోత్పత్తులకు అవసరమైన క్రమమైన మార్కెటింగు సౌకర్యాలు కలిగించకపోవుట విచారకరం. ఈ అన్ని కారణాలచేత రైతు క్షేమంతో నిమిత్తం లేకుండా వ్యాపారస్తుల సహకారంతో, లాభదృష్టితో వ్యాపారసంస్థలు, మన రైతుల శ్రమను మన జాతీయ సంపదను చౌకధరలకు కాజేయుచున్నారు. తత్ఫలితంగా పొగాకు వర్తకులను, ఎగుమతి దారులను మినహాయిస్తే రైతాంగం మాత్రం ఆర్థికంగా అభివృద్ధి చెందక అణగారి పోయినారు. ప్రకృతి వైపరీత్యాలను అనుకూల వాతావరణ స్థితిగతులను ఎదుర్కొంటూ పొగాకు వ్యవసాయంలో రైతులు నానా అగచాట్లకు లోనవుతుంటారు. ఇన్ని ఇడుములు పడి, వ్యయప్రయాసలకు గురై ఎలాగో పండించిన పొగాకును స్థిమితంగా గిట్టుబాటు ధరలకు అమ్ముకొనడానికి వసతిలేక రైతాంగం మరింత కృంగిపోతున్నారు. అభివృద్ధి చెందిన దేశాలలోవలె వ్యవసాయోత్పత్తులకు సక్రమమైన మార్కెట్ వసతులు ప్రభుత్వం ఇంతవరకు కలగించలేక పోయినది. అందుచేత రైతాంగానికి నష్టం కష్టం, నిస్పృహ, నిరాశ నిరుత్సాహాలు మాత్రమే చివరకు ప్రతిఫలంగా లభిస్తున్నాయి.

ఉత్పత్తి ఖర్చులు

ప్రపంచ మార్కెట్లలో లభించు పొగాకు ధరలతో పోల్చితే మన పొగాకు ధరలు సరసంగా ఉన్ననాడే విదేశాలనుంచి గిరాకీ వుంటుంది. జనాభా ఎక్కువగా కలిగి, మనదేశంలో మానవ శ్రమ విలువ తక్కువగావడం మూలంగా తక్కువ ఖర్చు అయినా తక్కువ ధరలకు గిట్టుబాటుగాదు. కారణమా ? అమెరికా, రొడీషియా మున్నగు దేశాలలో వందలు, వేల ఎకరాల భూకమతాలుంటాయి. మన దేశంలో 90 శాతం 5 ఎకరాలు అంతకు తక్కువ కమతాలు మాత్రమే. ఎరువులు క్రిమి సంహారక మందులు, సాంకేతిక పరిజ్ఞానం, ప్రభుత్వ సహకారం పుష్కలంగా లభించడం, ట్రాక్టర్లు మున్నగు వ్యవసాయ యంత్రాలు విరివిగా ఉపయోగించడం, గ్రామీణ ప్రాంతాలు మంచి రహదారి సౌకర్యాలు కలిగివుండడం మొదలయిన వ్యవసాయానికి సౌకర్యాలు కలిగివుండడం మూలంగా ఆదేశాలలో హెచ్చుపంట పండించబడి సగటు ఉత్పత్తి ఖర్చులు తగ్గుతాయి. దానికి తోడు సిసలైన, క్రమబద్ధమైన మార్కెట్టు ఉన్నందున రైతుకు ఇబ్బడి ముబ్బడిగా లాభాలు వస్తున్నాయి. ఇందుకు కేవలం భిన్నంగా వున్నవి మనదేశ పరిస్థితులు. రైతుకు లాభంలేకపోగా, గిట్టుబాటయిన ధరలు కూడా రావడంలేదు అభివృద్ధిచెందిన దేశాలలో వ్యవసాయంనకు వ్యవసాయోత్పత్తులకు ప్రభుత్వ ఆదరణ రక్షణ లభిస్తున్నది. అటువంటి ఆదరణ రక్షణ మనకు లేకపోగా మనదేశంలో వ్యాపారస్తుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడవలసిన దుర్గతి కల్పించబడింది.

ఎగుమతి పొగాకుకు గిట్టుబాటు ధరలు

కేంద్ర ప్రభుత్వం బారన్ పొగాకుకు కనీస ఎగుమతి ధరలను నిర్ణయించుట సంతోషించదగినది. దీనితో మనదేశంలోని వర్తకులను అడ్డం పెట్టుకొని, దిగుమతిదారులు, మన పొగాకు తక్కువ ధరలకు కాజేయడానికి వీలులేకుండా పోయినది. ఈ కనీసధరలు ప్రతి సంవత్సరం అవసరాన్ని బట్టి పెంచడానికి తగ్గించడానికి తగిన అవకాశం కూడా వున్నది. అయితే : ఈ కనీస ధర ఎగుమతి ధరలకు వ్యవసాయోత్పత్తుల ఖర్చులకు సంబంధం లేదనుట నిర్వివాదాంశము. ఉత్పత్తి ఖర్చును ఆధారంగా చేసుకొని మన ఎగుమతి ధరలను నిర్ణయించుకొనుట సహేతుకము, శాస్త్రీయం, దేశహితకరమునై యున్నది. దురదృష్టవశాత్తు ఈ కనిసధరల నిర్ణయం నిరంకుశంగా ఉత్పత్తి ఖర్చులను పరిశీలించకుండా రైతాంగ శ్రేయస్సుతో నిమిత్తంలేకుండా జరుగుతున్నది. ఈ రకమైన తల్లక్రిందుల, అవాస్తవిక విధానాన్ని తక్షణం పునఃపరిశీలన చేయవలసిన ధర్మం కేంద్ర ప్రభుత్వంపై గలదు.

ఉత్పత్తిస్థాయిలో కనీస ధరల నిర్ణయం

రైతాంగం ప్రయోజనం ప్రాతిపదికగా పొగాకు కనీస ధరలు నిర్ణయించ బడడం అత్యంత ఆవశ్యమైవున్నది. భూమి కౌలు వ్యవసాయ ఖర్చులు, ఎరువులు, మందులు పెట్టుబడిపై వడ్డీ రైతుశ్రమ, అమ్మకం చేయుటకయ్యే ఖర్చును మొదలు పొగాకు ఉత్పత్తి ఖర్చులు గణనలోనికి తీసికొని ఉత్పత్తి ఖర్చులను నిర్ణయించి దానిపై ఇతర పరిశ్రమలవలె ఉత్పత్తిదారుకు న్యాయము, ధర్మమూనైన శాతం ఆదాయం చూపించి రైతు స్థాయిలో కనీస అమ్మకం ధర నిర్ణయించబడాలి. ఈ విధంగా నిర్ణయించబడిన ధరలకు తక్కువగాకుండా వర్తకులు రైతులవద్ద పొగాకు క్రయము చేయునట్టుగాను, తరువాత క్రయధనమును రైతుకు ఖాయంగా అందునట్లు చూడవలసిన బాధ్యత ప్రభుత్వం వహించాలి. రైతులవద్ద నిర్ణయమైన కనీస అమ్మకం ధరను ఆధారంగా చేసుకొని వర్తకునికి కూడా గిట్టుబాటు అగునట్లుగా కనీస ఎగుమతి ధరలు నిర్ణయించబడాలి. ఇది తక్షణం జరగవలసిన కనీస కార్యక్రమం.

ప్రభుత్వ వాణిజ్య సంస్థ

కేంద్ర ప్రభుత్వంలో వాణిజ్యశాఖ ఆధ్వర్యమున ప్రభుత్వ వ్యాపారసంస్థ 1958 లో ఏర్పాటు చేయబడింది. ఎగుమతి వాణిజ్యం జరుపుట. ప్రత్యేకించి గుత్త వ్యాపారం చేయు దేశాలతో వాణిజ్యం సాగించి, జాతీయ ఆర్థిక వ్యవస్థను బలీయ మొనర్చుటకు ప్రజల శ్రేయస్సాధనకు అనువయిన వర్తకం సాగించుట యీ సంస్థ ప్రధానోద్దేశం. అంతే కాకుండా వాణిజ్య పంటల ధరలను స్థిరీకరించుటకు సాయ పడుట దాని ఆశయాలలో ప్రధానం.

అధునాతన పద్ధతులలో వ్యవసాయం. రసాయనికపు బురువులు, క్రిమి సంహారక మందుల వాడకం మొదలగు శాస్త్రీయ సాంకేతిక విధానాలద్వారా లభించగల అదనపు వ్యవసాయోత్పత్తులకు న్యాయము, ధర్మము గిట్టుబాటు కాగల కనీసధరలను రైతులకు గ్యారంటీ చేయడం కూడా తమ సంస్థ ఆశయాలలో ఒకటని ప్రభుత్వ వాణిజ్యసంస్థ ఛైర్మన్ ప్రకటించడం భవిష్యత్ రైతాంగానికి ఆశాజనకంగా వుండబోతుందనే విశ్వాసం కలిగిస్తున్నది.

ఈ సంస్థ 1957 నుంచి గుంటూరులో తమ కార్యాలయమును ఏర్పరచు కొని ప్రతి సంవత్సరం తక్కువ వ్యాపారస్థులవలె విదేశాలకు పొగాకు ఎగుమతి చేయుచున్నది. ఇంతేకాకుండా 1964 లో మిగిలిపోయిన పొగాకుకు ఒక కోటి

రూపాయలు పెట్టి 1965 లో కొన్ని వర్తకులకు, వ్యవసాయదారులకు పొగాకు పరిశ్రమకు కొంత సాయపడినారు. అలాగే కేరళలో నిమ్మగడ్డినూనె, బీహార్, బెంగాల్, ఒరిస్సా, అస్సాంలలో జనపనార, మహారాష్ట్రలో ప్రత్తి, మధ్యప్రదేశ్‌లో లక్క కూడా కొనుగోలుచేసి ఉత్పత్తిదారులకు గిట్టుబాటు ధరలు రాబట్టి పెట్టడంలో గణనీయమైన పాత్ర నెరిపింది.

ఈ సందర్భంలో చెప్పుకొనదగిన, చెప్పుకొనవలసిన ఆసక్తి దాయకమైన విషయమేమంటే ప్రభుత్వ వాణిజ్య సంస్థ దాని పుట్టుకనుంచి నేటివరకు సాగించిన వాణిజ్యములలో ఒక్క పొగాకుకు మాత్రమే నష్టం రాకుండా బయట పడింది. మిగతా సరకుల కొనుగోలులో అంతో యింతో చేతులు కాల్చుకొనడం జరిగింది. ఉత్పత్తిదారుల శ్రేయస్సే ప్రధానంగా నియమించబడిన ఈ సంస్థ పొగాకు విషయంలో, లోగడ నష్టాలు రాకపోగా కాస్తోకూస్తో లాభాలు కూడా అందించినప్పుడు పొగాకు రైతాంగాన్ని, వ్యాపారస్తులను, మొత్తంగా పొగాకు పరిశ్రమను ఆదుకొనడం ధర్మం కాదా?

ధరల సిరీకరణ

ఉత్పత్తిదారుకు నష్టం రాకుండా కనీస ధర కంటే పడిపోకుండా ధరలను స్థిరీకరించుటకు ప్రభుత్వ వాణిజ్య సంస్థ తక్షణమే మార్కెట్లో ప్రవేశించాలి. జనపనార, ప్రత్తి, లక్క, నిమ్మగడ్డినూనె మున్నగు పంటలవలె పొగాకు విషయంలో కూడా తక్షణచర్య తీసికొని, ధరలు నిలబెట్టి, రైతాంగాన్ని ఆదుకొని దేశ ఆర్థిక వ్యవస్థకు పదిలం చేకూర్చవలసిన గురుతర బాధ్యత వాణిజ్య సంస్థపై వున్నది. దేశావసరాలు, ఎగుమతులు పోగా మిగిలియుండగల అదనపు కొత్తపొగాకు కొనుగోలు చేయుటలో యేమాత్రం ఆలస్యంచేసినా ప్రయోజనం కలుగకపోగా అనేక విపరిణామాలకు దారి తీయగలదు.

ఈ సంస్థ తమ ప్రాంతీయ కార్యాలయాన్ని హైదరాబాద్‌లో నెలకొల్పుకొని, కొనుగోలుకు కావలసిన చర్యలు గైకొనవలసివుంది. పొగాకుతోబాటు ఆంధ్రలో లభించు మిర్చి, తాటినార, చేరుకుమడ్డి, ఎర్రచందనపు కొయ్య పెద్ద ఉల్లి, మానవ శిరోజాలు, పసుపు, పంది వెంట్రుకలు, తవుడు, ఎంతుచేపలు మున్నగునవి అపారంగా విదేశమారక ద్రవ్యమును సమకూర్చి పెట్టగల సరకుల ఎగుమతికి కృషి చేయుట అత్యంత అవసరం. హైదరాబాదులో ప్రభుత్వ వాణిజ్యసంస్థ ప్రాంతీయ కార్యాలయం నెలకొల్పుటవలన, రాష్ట్రప్రభుత్వం సహాయము సహకారము, ప్రోత్సా

హము, మద్దతుజాగులేకుండా లభించగలవు. ఈవిధంగా పొగాకు పరిశ్రమకు తరచు సంభవించే సంక్షోభాలు, కష్టములు, నష్టములు శాశ్వతంగా రూపుమాపుకోవాలంటే ప్రభుత్వ వాణిజ్యసంస్థ రంగంలో ప్రవేశించడ మొక్కటే తరుణోపాయం.

కాకినాడ రేవు అభివృద్ధి

మన పొగాకులో హెచ్చు మొత్తం మద్రాసు రేవుగుండా ఎగుమతి యగుచున్నది. కాకినాడ నుంచి చాలా తక్కువ మొత్తం మాత్రమే ఎగుమతి జరుగుతున్నది. ఇన్నాళ్ళు గోదావరిపై వంతెన లేకపోవడమొక ఆవరోధంగా వుండేది. ఇప్పుడు గోదావరిపై వంతెన పూర్తికాబడినేరుగా సరుకు కాకినాడ చేరవేయవచ్చును. కాకినాడకంటె మద్రాసు గుంటూరుకు దగ్గర కూలిరేట్లు, గోడౌను అద్దె ఇతర ఎగుమతి ఖర్చులు, మద్రాసుకంటె చాలా తక్కువ. దక్షిణ మధ్య రైల్వేవారి కాకినాడ రేవు ప్రక్కనేవున్న తమ పెద్దగోడౌను ఒకేసారిగా మూడువేల టన్నుల పొగాకు నిల్వచేయుటకు వీలయినది. దాని ప్రక్కనేగల పెద్దఖాళీ స్థలమును ఇచ్చుటకు సిద్ధంగా నున్నట్లు తెలుస్తున్నది.

దక్షిణ మధ్య రైల్వేవారు కాకినాడ రేవును ప్రోత్సహించుటకు రవాణా చార్జీలను తగ్గించి ప్రత్యేక సౌకర్యాలను కలిగించుటకు సిద్ధంగా వున్నట్లు కూడా తెలుస్తుంది. మద్రాసుకంటె టన్నుకు కనీసం రు. 50 లు ఖర్చు తగ్గగలదు. దాదాపు ఏటా 60 వేల టన్నులు ఎగుమతులు జరుగుతున్నాయి. కాకినాడ రేవుగుండా ఎగుమతి చేయడంవలన వ్యాపారస్తులకు రు. 30 లక్షలు ఆదా కాగలదు. ఈ మేరకు ఎగుమతి పొగాకు కనీసధరలలో తగ్గిస్తే ప్రపంచ మార్కెట్లో మనపొగాకుకు మంచి గిరాకి లభించగలదు. ఈ విధంగా విదేశ మార్కెట్లను ఆకర్షించవచ్చు. అంతే కాకుండా మద్రాసులో రేవు వత్తిడి తగ్గుతుంది. కాకినాడనుంచి ఎగుమతులు త్వరగా సాగించడంవలన అమ్మిన పొగాకుకు వర్తకులకు త్వరగా డబ్బుచేతికి వస్తుంది. అందుచేత కేంద్ర ప్రభుత్వ రవాణా నౌకాయానశాఖ జాతీయ ప్రయోజనమును గుర్తించి ఈ సౌకర్యమును కలిగించాలంటే కాకినాడ ఓడరేవును అభివృద్ధి పరచవలయును. అంతే కాకుండా కాకినాడ నుంచి మాత్రమే పొగాకు ఎగుమతులు జరుగుటకు వీలుగా ఓడలు కాకినాడలో నిలుచుటకు ఎగుమతి ఒడంబడికలలో తగు నిబంధనలను రూపొందించి కట్టుదిట్టములు చేయవలసి వున్నది. ఇందుకు మార్గదర్శకంగా తమకు సంబంధించిన పొగాకు ఎగుమతులు మొత్తంగా మద్రాసునుంచి కాక, కాకినాడనుంచి మాత్రమే జరుపుట ప్రభుత్వవాణిజ్యసంస్థ కనీస ధర్మంగా ఎంచుకొనవలసియున్నది.

పొగాకు ఉత్పత్తిదారుల-వ్యాపారస్తుల సభ

26-5-72 వ తేది గుంటూరు

దరువూరి వీరయ్య,

ఆధ్యక్షులు, పొగాకు ఉత్పత్తిదారుల సంఘం.

సోదరులారా !

వర్జీనియా పొగాకు మార్కెట్లో గత రెండు దశాబ్దాలుగా ప్రతి రెండు మూడు ఏళ్ళకు ఒక మారు ధరలు పడిపోయి, ఒక్కొక్కప్పుడు ఏధరకైనా అసలు కొనే నాధుడేలేక, పెద్ద సంక్షోభం తలెత్తడం ఆనవాయితి అయింది. ఉత్పత్తి దెబ్బతినో, గాలిపాటు సరిలేకనో నాణ్యమైన రంగు రాకనో ఆయేడు ధరలు బాగా పలకడం, సరుకు నిముషాలమీది మంచి గిరాకిగా వ్యాపారస్తులు పోటీపడి ఎగనత్తుక పోవడం జరుగుతుంది. మంచి ధరలు పలకడం, వెంటనే విడుదలై ఖర్చులుపోయి, నాలుగు డబ్బులు చేతికందడంతో ఆ మరుసటేడు పొగాకు విస్తీర్ణం పెరుగుతుంది. దానికితోడు గాలిపాటు కూడా కలిసివచ్చి ఉత్పత్తి

పెరుగుతుంది. దానితో ధరలు పడిపోతాయి. ఆసలు ఎంతకయినా విడుదలకాక సంక్షోభం వస్తుంది.

ఇలా ఒక చక్రంలాగా వుంటుంది. పొగాకు ఉత్పత్తిదారులకు కష్టాలు, నష్టాలు, సంక్షోభంలో పడడంతో పొగాకు ఉత్పత్తిదారుల సంఘం, చిన్న, పెద్ద వ్యాపారస్తులు, సభలు, సమావేశాలు, రాయబారములు జరిపి ఆందోళన సాగించడం జరుగతూ వుంటుంది. ఈ లోగానే రైతు తనవద్దగల పొగాకును అయినకాడికి అలవలు సులవలకు అమ్ముకొనడంకూడా జరుగుతూవుంటుంది.

రైతులవద్ద పొగాకు, మిగత సరకులకువలె పెచ్చుకాలం ఆండే మంచిధర వచ్చేంతవరకు నిల్వచేయుటకు శక్తివుండదు. ఒక వేళ శక్తివున్నవారికైనా వీలు లేదు. వర్జీనియా పొగాకు బ్యారన్‌నుండి దించిన తరువాత వారం వారం పైబడే కొలది దాని రంగు మారుతుంది, నాణ్యం తరుగుతుంది. ఫక్కా గ్రేడ్‌చేసి, రీడ్రై చేసి బేళ్ళు కట్టివుంచేతప్ప నిలవచేయుటకు వీలుపడదు. అందువలన రైతు విధిగా ఎంతకో ఒకంతకు పొగాకు గుత్త సంస్థల దయా ధర్మములపై ఆధారపడ వలసినదే.

ఉత్పత్తి దారుల సంఘాలు, చిన్న పెద్ద వ్యాపారస్తులు జరిపిన ఆందోళన కొంతవరకు ఫలించి కేంద్రప్రభుత్వ దృష్టిలోపడి విదేశాలలో కొత్త మార్కెట్లు సంపాదించో, సిగరెట్ పరిశ్రమల యజమానులచేత పెచ్చుమొత్తము సరకును ప్రభుత్వము వత్తిడిచేసి కొనిపించో తాత్కాలికంగా ఎప్పటికప్పుడు ఆనాటి సంక్షోభంనుండి బయట పడటం మాత్రమే జరుగుతుంది.

ఎందుకీకష్టాలు ?

అర్ధశతాబ్దం క్రితం, ఏదుర్మహూర్తాన వర్జీనియా పొగాకు ఉత్పత్తి తెలుగు నాట ప్రారంభమయిందోగాని అన్ని కష్టాలే, అన్నినష్టాలే, అన్ని బాధలే.

ఇన్ని సంవత్సరాలుగా ఇన్నికష్టాలు, ఇన్ననష్టాలు, ఇన్నిబాధలు అనుభవిస్తూకూడ ఎందుకు ఈపంటను ఉత్పత్తి చేస్తున్నారనే బుద్ధిమంతులున్నారని మరువరాదు.

అందుకు ఒక పెద్దమనిషి ఇలా సమాధానం చెప్పారు. వెనీరియల్ డిసీజ్ (సుఖరోగం) వున్నదంటే తెలిసిగాని, తెలియకగాని తప్పుచేస్తే దాని దుష్పలితము

అనుభవించవలసిందేగదా? అలాగని సుఖరోగం తగిలినవ్యక్తి అనేక వ్యయప్రయాసలు అనుభవించి దానిని మందుమాకులు సేవించి, నయం చేయించుకొని, అయ్యో ఒకమాట తప్పుచేసి, దాని దుష్ఫలితం అనుభవించాంగాదా? తిరిగి ఆతప్పు నేచేయరాదని బుద్ధి తెచ్చుకొని చెంపలు వేసుకొని ఇక జన్మజన్మాలకు ఆతప్పుచేయరాదని అనుకుంటూనే తిరిగి ఆతప్పును చేయడం మానవనైజం.

సరిగ్గా పొగాకు ఉత్పత్తి విషయములో కూడా పైసూత్రం ప్రకారమే రైతు ఎన్నికష్టనష్టాలు మరెన్ని వ్యయప్రయాసలు అనుభవిస్తున్నా ఈ పొగాకు పంటను గత అర్ధశతాబ్దంగా ఉత్పత్తిచేయుచునేయున్నారు.

సుఖరోగ కారకమైన ఆతప్పులో ఎంతటి ఆకర్షణ ఉందో, సుఖరహిందో సరిగ్గా పొగాకు, ముఖ్యంగా వర్జీనియా పొగాకు ఉత్పత్తిలోకూడా అంతటి ఆకర్షణ ఉన్నదనే విషయం మనం మరువరాదు. ఇది యదార్థము. ఇది సత్యము, ఇది నగ్నసత్యము.

పరుల లాభం కొరకు స్వంతలాభం మరచిన పొగాకు రైతు:

వ్యవసాయ ఉత్పత్తులలో ఆహారపంటలను మినహాయించితే వాణిజ్యపంటలలో ప్రభుత్వఖజానాకు హెచ్చుమొత్తం ధనాన్ని ఆర్జించి పెట్టేది పొగాకు. ప్రభుత్వ ఖజానాకు హెచ్చుమొత్తం ఆర్జించిపెట్టడంలోనేకాక అత్యంత విలువైన విదేశమారక ద్రవ్యంకూడా మిగతా పంటలకన్న పొగాకుదే పైచేయి.

110 కోట్లనుండి 350 కోట్లరూపాయలదాకా వివిధరూపాల్లో పన్నులద్వారా కేంద్రప్రభుత్వ ఖజానాకు అభిస్తుంది. మరి 35 కోట్లదాకా విదేశమారక ద్రవ్యాన్ని ఆర్జించిపెడతుది. అయినా పొగాకు ఉత్పత్తిచేయు రైతాంగమును అటు కేంద్ర ప్రభుత్వము ఇటు రాష్ట్రప్రభుత్వము కూడా గాలికి వదలడం శోచనీయము. పొగాకుపైవచ్చే ఆదాయంలో సగంకూడా రాని జూట్‌కు, మూడోవంతుకూడా రాని రబ్బరుకు పదిశాతంకూడ ఆదాయము లభించని సుగంధ ద్రవ్యములకు, చట్టబద్ధ మయిన బోర్డులున్నాయి. ఉత్పత్తిదారుకు ఉత్పత్తిస్థాయిలో న్యాయమైన గిట్టుబాటు ధరలు నిర్ణయించి ఆమేరకు అవసరమైన రక్షణలున్నాయి.

అయినప్పుడు పొగాకుపట్ల ఇంతటి నిర్లక్ష్యం నిరాదరణ, ఎందుకు? బహుశా ఈ పంటకు, ఈ పంటను ఉత్పత్తిచేయు రైతాంగముపట్ల అదరణ,

లక్ష్యం లేకపోవడానికి ప్రధానకారణం యిది ఆంధ్రప్రదేశ్ కావడమేనని ఘంటాపదంగా చెప్పవచ్చును. ఇకమ్మందైనా మారిన పరిస్థితులదృష్ట్యా ప్రస్తుత ప్రభుత్వ పాలకులైనా ఈ ఉత్పత్తిపట్ల శ్రద్ధ, ఆసక్తి ప్రదర్శిస్తారని ఆసిద్దాం.

గత ఇరవై ముప్పది సంవత్సరాలుగా ఇలాంటి సంక్షోభం సంభవించి నప్పుడల్లా ఇలానే ఏవేవో తాత్కాలిక ఉపశమన మార్గాలు కనుగొనడం, అప్పటికా సంక్షోభంనుండి బయటపడడం తప్ప శాశ్వతంగా ప్రయోజనం పొందగల మార్గం కనుగొనడం జరగలేదు.

ఈ తాత్కాలిక ఉపశమనమైనా రైతుచేతినుండి మొత్తం పొగాకు విడుదలైన తరువాతనే జరిగి, రైతులకు ఆకొద్దిపాటి ప్రయోజనమైనా కలుగుటలేదు.

నేటి దుస్థితి - ప్రస్తుత చరిత్ర

ప్రస్తుతం జరుగుతున్న సంవత్సరం (1971-72) పొగాకు చరిత్రలో ఇంతవరకు ఎన్నడూ జరగనంత పెద్ద సంక్షోభం తలెత్తింది. గత సంవత్సరం మంచి ధర ఉండడం, కిలో మిగలకుండా పొగాకు వ్యాపారస్థులు తమంతటతాముగా బ్యారన్‌వద్దకు వచ్చి పోటిపడి ఎగనెత్తుకపోవడం జరిగింది. దాంతో జరుగుతున్న సంవత్సరం ఏరియా పెరిగింది. దానికి తోడు గాలిపాటు, వాతావరణం బాగుండి ఉత్పత్తి రెట్టింపుగా పెరిగింది. ఇంకేముంది? పొగాకు బ్యారన్ దిగిన ఒకవారానికే ధరపడిపోయింది. క్వింటాలు ధర రు. 550/- నుండి రు. 300/-లకు పడిపోయింది. దానికైనా సరకు విడుదలయ్యే మార్గము కనుపించలేదు. రైతాంగం సహనము కోల్పోయింది. అసంతృప్తి పెరిగింది. నిరాశ జనించింది. ఆవేశంతో దిక్కుదరి గానక కొనగోలు దారుల గోడౌనులపై, కార్లపై, వ్యాపారస్తులపై దాడిచేశారు. ఆదాడిచేయడంలోకూడ శృతిమించి పోయినది. చరిత్రలో రైతుఏనాడూ ఎన్నికష్టాలు. మరెన్ని నష్టాలు సంభవించినా తనకష్టాలకు. తన నష్టాలకు తన కర్మఫలమను కోని మిన్నకున్న రైతాంగం అపూర్వ చైతన్యంతో, క్రమ శిక్షణతో సంఘటితశక్తిని పూరించుకొని వివిధ రూపాలలో ఆందోళనలు సాగించగా కేంద్ర ప్రభుత్వం కదలక తప్పలేదు.

కేంద్రం కదిలింది

పొగాకు ఉత్పత్తిదారుల సంఘటితశక్తి నిర్మాణాత్మకపోరాటం ఫలితంగానూ ప్రజాప్రతినిధుల కృషిఫలితంగా కేంద్రం కదిలింది.

కేంద్రప్రభుత్వ విశేషవాణిజ్య మంత్రిత్వశాఖ ఉన్నతోద్యోగి శ్రీమతి లక్ష్మి గుంటూరువచ్చి వ్యాపారస్తులను, రైతు ప్రతినిధులను సమావేశపరచి, సమాలోచనలు జరిపి పొగాకుకు కనీసధరలు రాబట్టేందుకు ప్రభుత్వ వాణిజ్య సంస్థను మార్కెట్లో ప్రవేశపెట్టి ధరలు మరీ దిగజారకుండ నిలబెట్టుటకు తాత్కాలికంగా ప్రయత్నం జరిగింది.

ప్రభుత్వ వాణిజ్యసంస్థ మార్కెట్లో ప్రవేశము

ప్రభుత్వ వాణిజ్యసంస్థ మొత్తం 86 మందిని తమ కొనుగోలు ఏజంట్లుగా నిర్ణయించి మార్కెట్లో ప్రవేశించడంతో పడిపోయిన ధరలు కొంతవరకు పెరిగాయి. ప్రభుత్వ వాణిజ్యసంస్థ ఏజంట్లుగా నియమించిన 86 మంది చిన్న పెద్ద వ్యాపారస్థులతోపాటు, మిగతా చిన్న, పెద్ద వ్యాపారస్థులు కూడా మార్కెట్లో ప్రవేసించి ఉత్పత్తిదారులవద్దగల మొత్తం పొగాకును కిలోకూడా మిగలకుండా కొనుగోలు చేసివేశారు. ప్రభుత్వ వాణిజ్యసంస్థ మార్కెట్లో ప్రవేసించడం వలననూ, కేంద్ర ప్రభుత్వ విశేష వాణిజ్య మంత్రిత్వశాఖ ఉన్నతాధికారిణి శ్రీమతి లక్ష్మి ఈ క్రింది విధముగ హామీ యివ్వడమువలన వ్యాపారస్తులంతా మార్కెట్లో ప్రవేసించి రైతుల వద్దగల యావత్ పొగాకును కొనుగోలు చేశారు. "శ్రీమతి లక్ష్మి ఇలా చెప్పారు. ప్రస్తుత సంక్షోభంనుండి బయటపడేందుకు ముందు రైతువద్దగల సరుకును వదిలిస్తే ఆ తరువాత మిగతా విషయాలు తాపీగా ఆలోచించి విదేశాలలో మార్కెట్లు అన్వేషించి విడుదలయ్యే మార్గాలను కనుకొనవచ్చును" ఈ హామీతో వ్యాపారస్తులందరూ పొగాకును కొన్నారు.

రైతులనుండి పొగాకు విడుదలైంది
కాని రైతులచేతికి డబ్బు అందలేదు

ఈ ప్రత్యేక పరిస్థితులలో ప్రభుత్వ వాణిజ్యసంస్థచే నియమింపబడిన ఏజెంట్లతోపాటు మిగతా వ్యాపారస్తులు కూడ మార్కెట్లో ప్రవేశించి రైతులవద్దనుండి పొగాకును ఐతే కొన్నారుగాని దాని డబ్బు రైతులకు మట్టలేదు కొద్దిగానో గొప్పగానో యిచ్చిన కంపెనీలచుట్టూ తిరిగిన ఖర్చులకే సరిపోయినది. రైతులవద్దనుండి పొగాకునుకొని మూడు మాసములు దాటినది. రైతులు కంపెనీలచుట్టూ కాలు కాలిన పిల్లిలాగా తిరుగుతూనే ఉన్నారు. ఐనా డబ్బు చేతికి అందక అసలే అప్పులతో కుంగిపోతున్న అశేష అమాయక రైతాంగం నిరాశ నిస్పృహలతో కృంగిపోతున్నారు,

పొగాకు వ్యవసాయం నారునుండి నాటు, యిరుపు, బొగ్గు, పురి, ఎరువులు, తెగ్గుళ్ళమందులు, కూలీలవరకు అంతా అరువుతో జరుగుతుంది. పొగాకును అమ్మడమైతే జరిగిందిగాని డబ్బుచేతికి అందకపోవడంతో రైతు ఋణవిముక్తికాకి అవమానముతో కృంగిపోతున్నాడు. ఈపరిస్థితి ఎంతదాకా వచ్చింది అంటే చివరకు గ్రామానికి పోయి అప్పులవారిని చూచి సమాధానము చెప్పలేక ముఖము చాటుచేసుకొనుటకు ఊరువిడిచి పోవలసిన దుర్గతికి కూడ కొందరు లోనైనారంటే ఆశ్చర్యములేదు.

రైతులకు 20 కోట్లదాకా రావలసిఉంటుందని అంచనా

రైతులకు ఇంకా పొగాకు వ్యాపారస్తులనుండి రావలసిన మొత్తం 20 కోట్లకు కూడ మించవచ్చునని కొన్ని నికరమైన అంచనాలు ఉన్నవి. వ్యాపారస్తులు తాము కొన్న పొగాకు గ్రేడ్‌చేసి రీడ్రై చేసి ఆగ్‌మార్క్ చేయించి అమ్మకమునకు తయారుగా గిడ్డంగులలో నిలవచేశామని ఆ పొగాకు విడుదలై తేతప్ప రైతులకు యివ్వవలసిన డబ్బు చెల్లించలేమని కాళ్ళుబారజాపి కూర్చున్నారు. ఇలాంటి విషమ విపత్కర పరిస్థితులలో రైతుగతి ఏమిటి? ఊళ్ళోకి వెళితే అప్పులబాధ, కొత్త సంవత్సరం వ్యవసాయ తరుణం వచ్చింది. వ్యవసాయం సాగాలి. ఎరువులు కొనాలి, సిస్తులు, దస్తులు, చిల్లరమల్లర అక్కరలు, తక్కువి ఋణాలు, సహకార సంఘాల వద్ద తెచ్చిన ఋణాలు భూమితనఖా బ్యాంకునుండితెచ్చిన బాకీలకు వాయిదాలు ఒక టేమిటి రైతుకినాడు సవాలక్ష దిగ్భందాలు. దారితెన్ను తెలియక దిక్కుతోచని దైన్యస్థితిలో ఉన్న రైతాంగాన్ని ఎవ్వరు ఆదుకుంటారోనని భగవంతుని ప్రార్థించుచున్నాడు.

ఇక జరగవలసినది ఏమి? పై చరిత్రంతా గమనించిన తరువాత ఇక జరగవలసినదేమి? వ్యాపారస్తులు మావద్దగల నిల్వలకు మార్కెట్టు లభించి సరకు విడుదలైతే తప్ప మేమేమి చేయలేము అంటున్నారు. ముందు మీరు రైతుల వద్దగల నిలువలు కాని వారికి వెసులుబాటు కలిగించండి మార్కెట్లు సంగతి మేము చూస్తామని హామీ యిచ్చిన ప్రభుత్వమేమో నిమ్మకి నీరెత్తినట్లు మీనమేషాలు లెక్కిస్తుంది. ఇప్పుడు జరగవలసింది ఏమిటి అని ప్రజా ప్రతినిధులు, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు వెంటనే, వెనువెంటనే యుద్ధకాలపు చర్యగా దీనిని పరిగణించి ప్రభుత్వ వాణిజ్య సంస్థచే కొనిపించిగాని లేదా జాతీయం చేసిన బ్యాంకులచేత నిల్వ పొగాకును తాకట్టు పెట్టుకొని దాని ఖరీదులో నూటికి 75 శాతము అడ్వాన్సు యిప్పించుటద్వారా తాత్కాలికంగానైనా నిరాశా నిస్పృహలతో ముందు గతి గానక బాధామయ హృదయాలతో కొట్టుమిట్టాడుతున్న అశేష రైతాంగానికి

సానుభూతితో సహాయపడాలని ప్రార్థిద్దాము. రైతాంగానికి సకాలములో వ్యవసాయ ఋణమునకు తక్షణం డబ్బు అందించకపోతే వ్యవసాయమే కుంటుపడుతుంది. ఉత్పత్తి తరుగుతుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ విచ్ఛిన్నమై పోతుంది.

కాబట్టి ఆంధ్రప్రభుత్వం తమ పలుకుబడిని ప్రతిష్ఠను ఒడి అవసరమైతే మన ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీని స్వయముగా కలుసుకొని పరిస్థితులను సహృదయము గల ఆమెకు వివరించి తక్షణం రైతాంగాన్ని ఆదుకొనుటలో జాగులేని కృషిచేయాలని మరిమరి వేడుకొందాము.

దరువూరి వీరయ్య.

పెద్ద వడ్డీలొడ్డి పీల్చె నీ రక్తంబు
చట్టు బా గుండియ సాహుకారు
బన్నం బెటింగి నీపంట నల్పక్రయం
బిచ్చి బండ్లకు నెత్తె చచ్చు కటిక
లంచంబు నాసించి కించిత్తు నీతిలే
కధికారి నీ కూటి కడ్డు దగిలె
చారుణం బగు పన్ను దయమాలి విధియించి
కటకటా ! నృపతి నీకడుపు మాడ్చె

ఇన్ని రీతుల నీ సొమ్ము తిన్నవారె
చూచుచున్నారు నిను గడ్డిపోచ వోలె
లేదొకో ధర్మ ముర్విపై లేశమేని
సారగుణరత్న హార ! కర్షకకుమార !

తెలుగులెంక — తుమ్మల సీతారామమూర్తి

రైలు-విమాన సర్వీసులు- ఆధునిక సౌకర్యాలు లేవని పొగాకు బోర్డుకార్యాలయం గుంటూరు నుండి మార్చరాదు

రచనః దరువూరి వీరయ్య

పొగాకు బోర్డు ప్రధాన కార్యాలయాన్ని గుంటూరునుండి సకలమైన ఆధునిక సౌకర్యాలుగల మరొక ప్రాంతానికి మార్చేందుకై ఉద్దేశించబడిన 79 నంబరుగల 1976"టుబాకోబోర్డుయాక్టు ఎమెండ్ మెంట్ బిల్లు"నుతలపని తలంపుగా, అదరా బాదరాగా ప్లార్లమెంటులో ప్రవేశపెట్టడం ఆశ్చర్యం కలిగించడమేగాక, ఆందోళన కలిగించుతున్నది.

భారతదేశంలోని పొగాకు పండే ప్రధాన కేంద్రాలకు, రాష్ట్ర రాజధానులకు, కేంద్ర రాజధానికి రైలు, విమాన సౌకర్యములు నాలుగైదు "స్టార్సు" పోష్

హోటల్స్ గుంటూరులో లేవు కాబట్టి, ఆ కారణంగా ఆ బోర్డు కార్యాలయాన్ని మార్చవలసి వచ్చిందనేది హాస్యాస్పదంగా వున్నది.

బోర్డు కార్యాలయం గుంటూరులో నెలకొల్పడానికి "టుబాకోబోర్డు యాక్టు 75"లో ఆనాటి ప్రభుత్వపు బిల్లులో ఇల్లా వివరించబడింది. మేలురకం ఎగుమతి వర్జీనియా పొగాకు పండించే ఆంధ్రప్రదేశ్ ప్రాంతంలో గుంటూరు కేంద్రస్థానం. భారతదేశపు వర్జీనియా పొగాకు దిగుమతి చేసుకొంటున్న ఇంగ్లాండ్, జపా,న్ రష్యా. హంగరీ, బల్గేరియా, జి డి. ఆర్, జపాన్, ఇరాన్, ఇరాక్ మొదలగు విదేశాలతో గుంటూరుకు సన్నిహిత సంబంధాలున్నాయి. కాబట్టి గుంటూరులో బోర్డు ప్రధాన కార్యాలయం నెలకొల్పబడవలసి యున్నది. వర్జీనియా పొగాకును విదేశాలకు ఎగుమతిచేయు వందలాది వాణిజ్య సంస్థలకు గుంటూరు ప్రముఖ కేంద్రము కాబట్టి గుంటూరుబోర్డు ప్రధాన కార్యాలయంగా నెలకొల్పేందుకు అనువైనది. యీ విధంగా అనేకములయిన అర్హతలున్నాయి కాబటి పొగాకు బోర్డు ప్రధాన కార్యాలయం గుంటూరులో నెలకొల్పవలసివుంటుందని స్పష్టంగా నిర్ద్వందంగా పేర్కొనబడింది.

అంతగొప్పగా ప్రశంసించి, బోర్డు ప్రధానకార్యాలయంగా నెలకొల్పబడిన గుంటూరునండి 2 సంవత్సరాలకే మార్చవలసిన కారణమేమిటి ?

గుంటూరునండి ఢిల్లీకి నెరుగా విమాన సర్వీస్ లేదనేది యదార్థమా? గుంటూరుకు 45 కిలో మీటర్లదూరంలో గన్నవరం విమానాశ్రయంనుండి హైద్రాబాదుద్వారా ప్రతిరోజూ ఢిల్లీ ప్రయాణానికి వీలున్నదనే విషయం తెలియదా? అంతేకాదు బోర్డు ఉన్నతాధికారులు విమానంలో తప్ప ప్రయాణం చేయరాదా? విమానంలో ప్రయాణించి రాత్రి ఢిల్లీ చేరి పోష్ హోటల్సులో శయనించే బదులు 24 గంటల కాలంలో గుంటూరునుండి కొత్తఢిల్లీ చేరగల తమిళనాడు, కె. కె. జయంతి జనతా లాంటి ఎక్స్‌ప్రెస్ రైళ్లు ప్రతిదినం వుండగా ఒక్కొక్కరికి వేలఖర్చుతో విమానాలెందుకో అర్థం కావడంలేదు. అంతేకాదు 8 గంటలలో మదాసు, 6 గంటలలో హైదరాబాద్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లు గుంటూరునుండి అనేకంవుండగా 50 కిలోమీటర్లు కారు ప్రయాణంచేసి గన్నవరం విమానాశ్రయం నుండి హైదరాబాదుపోయి రాత్రి మకాంచేయవలసిన అవసరం ఏమిటి ?

పొగాకు పండించే రాష్ట్రి రాజధానులకు కేంద్రరాజధానికి రైలు, విమాన సంబంధాలు లేవనడం విడ్డూరం కాదా ?

కాగా పొగాకు వాణిజ్యంలో ప్రపంచంలోనే గుంటూరుకు ప్రముఖ స్థానం గలదు. పొగాకు ఎగుమతి చేసుకొంటున్న దేశాలన్నింట గుంటూరుతో వాణిజ్య లావాదేవీలున్నాయి. పొగాకు ప్రవీణులు, కొనుగోలు దారులు అయిన విదేశీవాణిజ్య సంస్థలకు గుంటూరులో నిత్య సంబంధములున్నాయి. ప్రైవారంతా వందలసంఖ్యలో ప్రతి సంవత్సరం సీజనులో గుంటూరులోనే వుండటం జరుగుతుంది.

అన్నిటికంటే ప్రధానమయిన విషయం : ఎగుమతికి ఉపయోగించే మేలు రకం వర్జీనియా పొగాకులో 80 శాతం గుంటూరు, దాని చుట్టూ వంద, నూటయాభై కిలోమీటర్ల దూరంలో ఉత్పత్తిచేయబడుతుంది. వందలాది రీడ్రయింగ్ ప్లాంటులు గోడవునులు, గ్రేడింగ్ కేంద్రాలు గుంటూరును చుట్టుకొనేవున్నాయి.

పొగాకు వాణిజ్యంలో, ఉత్పత్తిలో గుంటూరుకు గల ప్రాముఖ్యాన్ని గమనించే ఇటీవల సెంట్రల్ ఎక్సయిజు కలెక్టరు కార్యాలయాన్ని గుంటూరులో నెలకొల్పడం జరిగింది.

పూజ్య గాంధీజీ విధానాల కనుగుణంగా పరిపాలన, వాణిజ్యం, పరిశ్రమలు ఒకచోట కేంద్రీకరించేబదులు దేశమంతటా వికేంద్రీకరణ జరగాలన్న జనతా పాలనలోనేనా ఇలాంటి అప్రస్తుత విధానాలు ?

మిగతా రాష్ట్రాలలోఉత్పత్తి అయ్యే వర్జీనియా పొగాకుగాని, ఇతరరకాల పొగాకులుగాని విలువకట్టవలసివస్తే నామమాత్రమనే చెప్పాలి గుంటూరును పోల్చితే.

రబ్బరుబోర్డు ప్రధాన కార్యాలయం కేరళరాష్ట్రంలో "కొట్టాయం" అనే కేంద్రానికి 6 కిలోమీటర్లదూరంలోగల ఒక పల్లెటూరులో నెలకొల్పబడిందనే విషయం మరచిపోయారా ? రబ్బరు తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లోకూడా ఉత్పత్తి జరుగుతుందనే విషయం తెలియదా ? రబ్బరు పరిశ్రమ భారతదేశమంతటా

లేదా? అయినప్పుడు రబ్బరుబోర్డు దేశానికి ఒకమూలనగల ఒక జిల్లా కేంద్రంలో స్థాపించినప్పుడు, పొగాకు బోర్డు కార్యాలయం గుంటూరులో ఉండతగదా?

చెపల పరిశ్రమ తమిళనాడు, కర్ణాటక, ఆంధ్ర, ఉత్కళ, బెంగాలు రాష్ట్రాలు వేలాది కిలోమీటర్ల తీరప్రాంతమంతటా విస్తృతంగా వ్యాపించి వుండగా "మెరైన్ ప్రోడక్ట్స్ అథారిటి" కార్యాలయం కేరళలోని కొచ్చిన్‌లో జయప్రదంగా సాగడంలేదా? అలానే అనేకములయిన ప్రభుత్వ రంగస్థల ప్రధాన కార్యాలయాలు దేశంలోని వివిధకేంద్రాలలో జయప్రదంగా నిర్వహించ బడుచుండగా, గుంటూరులో బోర్డు కార్యాలయంగా ఉండడం యోగ్యం కాదనడం విద్దూరంగా వున్నది.

జాతీయ సంపద, పరిశ్రమలు, వాణిజ్యం దేశంలోని అన్ని ప్రాంతముల యొక్క అభివృద్ధి వికాశాలకు తొడ్పడేదిగా ఉండాలనే జనతా విధానాలకు బోర్డు కార్యాలయం గుంటూరునుండి మార్చాలనే నిర్ణయం గొడ్డలిపెట్టు కాగలదు.

పొగాకు బోర్డు కార్యాలయం 70 వేల పొగాకు ఉత్పత్తిదారులకు, లక్షలాది కార్మికులకు, వేలాది వాణిజ్యవర్గాలకు అందుబాటులో వుంచేందుకుగాక, కొద్దిమంది భోగభాగ్యములయిన బురాక్రటిక్ ఉద్యోగుల సౌకర్యముల కయితే మాకేమీ అభ్యంతరంలేదు.

పరిపూర్ణమైన విస్తృతమైన పొగాకుబోర్డు నిర్మాణం జరిగిననాడు అధికారులు టెక్నికల్ నాన్‌టెక్నికల్ ఉద్యోగాలు వేల సంఖ్యలో ఏర్పడగలవు. ఇలాంటి ఉద్యోగాలన్నింటిని, పొగాకు ఉత్పత్తిచేయుప్రాంతంలోని ఉత్పత్తిదారుల కార్మికుల బిడ్డలకు దక్కకుండాచేయాలనే దుర్బుద్ధితోనే బోర్డు కార్యాలయం తొలగించాలనే నిర్ణయానికి రావడానికి కారణమా? అనే సందేహం కలుగుతుంది.

జనతా పాలకులు, బోర్డు కార్యాలయాన్ని గుంటూరు నుండి మార్చాలనే స్వార్థసంకుచిత నిర్ణయాన్ని వెంటనే విరమించవలసిందిగా విజ్ఞప్తి చేయుచున్నాను.

ఒకవేళ నిరంకుశంగా ప్రజల అభిప్రాయాన్ని పెడచెవినిపెట్టి బోర్డు కార్యాలయాన్ని మార్చడమే జరిగితే, రాజకీయాలతో, పార్టీ ముఖాలతో నిమిత్తం లేకుండా తెలుగు ప్రజలంతా ఒకే కేకవేస్తారు. ఒకేబాటన నడుస్తారు. సంఘటిత శక్తితో, ఒకప్రజా ఉద్యమం సాగిస్తారు. అవసరమైతే రక్తం చిందిస్తారు.

వివేకంతో స్వార్థ చింతన, సంకుచిత తత్వాన్ని విడనాడి' బోర్డు కార్యాలయాన్ని గుంటూరునుండి తరలించే బిల్లును పార్లమెంటులోఉపసంహరించుకొనవలసిందిగా మరొకమారు విజ్ఞప్తి.

సౌజన్య వారపత్రికనుండి 1978 జనవరి.

★

ఓ చరు పద్ధతి ఆచరణ సాధ్యమా ? పొగాకు రైతుల తక్షణ సమస్యలు

వర్జీనియా పొగాకు పంట సంక్రాంతినుండి మార్కెట్‌కు రానున్నది. జనవరి 1976 నుండి గుంటూరు కేంద్రంగా కేంద్ర ప్రభుత్వ వాణిజ్యశాఖ ఆధ్వర్యాన పొగాకు బోర్డు పనిచేస్తున్నది. గిట్టుబాటు ధర రైతుకు రాబట్టడం, వర్తకుల నుండి సకాలంలో రైతులకు డబ్బు రాబట్టి పెట్టడం మొదలయినవి పొగాకుబోర్డు కర్తవ్యాలు. రైతుస్థాయిలో అమ్మోచయోగ్యమైన 8 గ్రేడులు (అనగా 1-ఏ నుండి 8 ఎ వరకు) నిర్బంధంగా అమలు పరచటం, ఆ గ్రేడులకు గిట్టుబాటుకాగల కనీస ధరలను నిర్ణయించి చట్టరీత్యా అమలు పరచటం బోర్డు ప్రథమ కర్తవ్యం.

ఈ పనిచేయకుండానే రైతులకు న్యాయం చేకూర్చటం అసంభవం. కాని ప్రస్తుత చట్టంప్రకారం రైతుస్థాయిలో పొగాకుకుధర నిర్ణయించడం బోర్డు పరిధిలో

లేదు. ఈ కారణంగా ప్రస్తుత చట్టం రైతుకు రక్షణ కల్పించలేదు. రైతుకు రక్షణ కలగాలంటే ప్రస్తుత చట్టాన్ని సవరించటం అవసరం.

ఈలోగా చట్టంలోని సల్ప అవకాశాలను వినియోగించుకొని రైతుకు రక్షణ కలిగించడం అవసరం. ఇందుకు ప్రథమ చర్యగా రైతు స్థాయిలో గ్రేడులకు 'సూచిక ధరలు' (ఇండికేటివ్ ధరలు) ప్రకటించడానికి బోర్డు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తున్నది. అయితే ఈధరలను ఎవరు నిర్ణయించ బోతున్నారు? బోర్డు చేయాలా? లేక 'ఎ. సి. సి.' (వ్యవసాయ ధరల కమిషన్) చేయాలా? అనేది కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ తేల్చవలసి యున్నది. లోగా వివిధ పంటలకు ఏ. సి. సి. నిర్ణయిస్తున్న ధరలు ఉత్పత్తి ఖర్చులకంటే తక్కువగా ఉన్నాయి. మార్కెట్ ధరలకంటే ఎ. సి. సి నిర్ణయించిన ధరలు చాలా తక్కువగా ఉన్నందువల్ల ఇప్పటికే రైతులు ఆందోళన పడుతున్నారు. మిగతా పంటలకు పొగాకు పంటకు పెద్ది తేడా ఉన్నందున పొగాకు ధరలను ఎ సి. సి. నిర్ణయించడం రైతుకెంతమాత్రం క్షేమం కాదు. కాబట్టి పొగాకు సూచిక ధరలు ఎ. సి. సి. వారి సపోర్టు ధరలవలెగాక, సహేతుకమైన, న్యాయమైన గిట్టుబాటు ధరలుగా ఉండాలి.

సంతోషించ వలసిన నిర్ణయమే

బోర్డు తయారుచేసి సరఫరాచేస్తున్న ఓచరును ఉపయోగించి వర్తకులు పొగాకు కొన్నవెంటనే సగం డబ్బును రైతులకు అక్కడికక్కడే చెల్లించి మిగతా డబ్బును మూడు మాసాలలోగా చెల్లించవలసి యున్నది. ఇంతకాలంగా సాగుతున్న అనిశ్చిత వాతావరణం దృష్ట్యా బోర్డు తలపెట్టిన ఈ చర్యను రైతులు హర్షించ గలరు. బోర్డు సంకల్పం శ్లాఘనీయం. అయితే ఆచరణలో ఎదురయ్యే అడ్డంకులను కూడా గమనించవలసి ఉన్నది.

ఆచరణ సాధ్యమా?

ఓచరు విధానం విషయంలో ఎదురయ్యే ప్రతిబంధకాలను బోర్డు గాని, బ్యాంకులుగాని తొలగించవని భావించటం గాలిలో మేడలు కట్టడం వంటిది కాగల దేమో పరిశీలించటం అవసరం. ఇందు మొదటి విఘ్నము బ్యాంకులనుండి వర్తకులకు అందే ఋణం. ఆంధ్రలో సగటు పొగాకు వార్షికపంట లక్షటన్నులు, ఐతే రానున్న సీజనులో పంట లక్షన్నర టన్నులు దాకా వుంటుందని అంచనా. లక్ష టన్నుల పంటనే ప్రామాణికంగా తీసుకున్నాం అంత సరుకు కొనటానికి నూరుకోట్ల ధనం కావాలి. పొగాకు కంపెనీల ఋణవసతులు నలభై కోట్ల రూపాయలు

మించవు. మిగతా రూ. 60 కోట్ల రైతుల సరకును వర్తకులు పెట్టుబడిగా వినియోగించుకొని వ్యాపారం సాగిస్తున్నారు. రైతులకు పూర్తి ధరలు చెల్లించాలంటే బ్యాంకులు నూరుకోట్ల రూపాయల వరకు వర్తకులకు ఋణాలు కల్పించవలసి ఉన్నది. లేదా బోర్డు మరేదైనా ప్రత్యామ్నాయ మార్గం కనుగొనాలి. కాని ఈ అరవై కోట్ల అవసరపు ఋణాన్ని బ్యాంకులు వర్తకులకు యిచ్చేటట్లుగా రిజర్వ్ బ్యాంకు ఏర్పాటు చేస్తున్నదని బోర్డు వర్గాల వారి ద్వారా తెలుస్తున్నది. ఇలా జరిగితే మంచిదే. కాని అది అసంభవమని బ్యాంకు, వాణిజ్య వర్గాలు భావిస్తున్నాయి. మార్కెట్‌కు పొగాకు కొద్ది రోజులలో రాబోతుంది. ఈ అవసరపు ఋణం గురించి యింతవరకు బ్యాంకులకు వర్తమానం లేదు.

పొగాకు కొనుగోలుకు పెట్టుబడికి తోడు గ్రేడింగు, ఈనె తీయడం, రీడ్రయింగ్, ప్యాకింగ్, ఎగుమతి ఖర్చులు, ఎగుమతి పన్ను మొదలైన ఇంకా అనేక ఖర్చులు వ్యాపారస్తులకు చాలా భారంగా వుంటాయి. ఈ ఖర్చులన్నిటికీ వర్తకులు రొక్కం చెల్లించాలి. ఇలాంటి అంశాలను బోర్డు గణనలోనికి తీసుకోవాలి మరి.

మొత్తం నూరు కోట్లు ఒకేసారి అవసరం కాదని, ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ లలో మాత్రమే చెల్లించవలసి వస్తుందని, కాగా ముందుగా కొన్న పొగాకు ముందుగా ఎగుమతి కాగానే విదేశాలనుండి రాగల డబ్బు రైతులనుండి పొగాకు కొనటానికి తిరిగి ఉపయోగ పడుతుంపని కొందరి విచిత్రవాదన. ఫిబ్రవరి, మార్చి నెలలలో ముప్పాతిక భాగం పొగాకు కొనుగోళ్లు పూర్తవుతాయి. గ్రేడింగ్, ప్యాకింగ్ అయిన తరువాత ఎగుమతులు మార్చి నుండి ఆగస్టు వరకు ముమ్మరంగా సాగుతాయి. ఒక్కోసారి ఓడలు ఆలస్యమై సరుకు రేవులలో నెలల తరబడి నిలబడి పోవటము, వూహించినట్లు ఎగుమతులు సకాలంలో జరుగక పోవటం తటస్థించవచ్చు. ఈ సాధక బాధకాలు తెలిసినవారు పైన చెప్పిన వాదం ఎంత హాస్యాస్పదమో గుర్తించగలరు.

రైతులకు డబ్బుచెల్లించి పొగాకు కొనుగోలు చేయగల శక్తి మార్కెట్‌లో ఐదారు కంపెనీలకు మాత్రమే ఉన్నది. మిగతా రెండువందల కంపెనీలు హెచ్చుగా రైతుల పెట్టుబడితోనే వ్యాపారం చేయవలసి ఉంటుంది బోర్డు ప్రవేశపెట్టనున్న వోచరు విధానాన్ని డబ్బుగల ఐదారు కంపెనీలు మాత్రమే అమలు పరచగలవు. ఈ కంపెనీలు తమ కవసరమయిన పొగాకు కొనుగోలు పూర్తిచేసుకునే వరకు మిగతా కంపెనీలు మార్కెట్‌లో అడుగుపెట్టవు. దానితో మార్కెట్‌లో పోటీ బహుపరిమితమవుతున్నది. ఈ పరిస్థితిని ఆసరాగా తీసుకొని డబ్బుగల కంపెనీలు పొగాకును అలవల సులవలకు రైతులనుండి కొనగలవు. గత్యంతరంలేక పొగాకు నిల్వచేయగల సరుకు కానందున రైతులు భయపడి

అయినకాడికి అమ్మవలసిన దుస్థితి దాపురిస్తుంది. ఇలాంటి క్లిష్ట పరిస్థితులలో రైతులదగ్గర వేరుగా పొగాకు కొని అదకొనగల శక్తి లేదా అధికారం పొగాకుబోర్డు గాని, యస్. టి. సి.కి గాని ఉన్నదా? ఈ రెండు సంస్థలకు రైతులవద్ద పొగాకు కొని గ్రేడింగు, ప్యాకింగు, రీడ్రయింగు చేసే వసతులు అంతగా లేవు. అంతేకాదు ఈ రెండు కేంద్ర సంస్థల తరపున రైతులనుండి పొగాకు కొనే ప్రాథమిక రైతు సహకారసంస్థలుకూడా విరివిగాలేవు. వర్తకులలో ఐక్యతను బ్రద్దలు చేయగల శక్తి బోర్డుకు లేదు. అటువంటి పరిస్థితులలో రైతులు విధిగా నష్టపడతారు. ఆశయమెంత ఉదాత్తమైనదైనా ఆచరణలో యిలాంటి దుష్పలితాలు, దుష్పరిణామాలు తప్పవు. అందువలన ప్రస్తుత పరిస్థితులను గమనించి ఆచరణ సాధ్యమైన, రైతుల ప్రయోజనాలను రక్షించగల పద్ధతులను ప్రవేశపెట్టడానికి కృషి జరగాలి.

వ్యాపార శక్తి ఋణసౌకర్యం ఇత్యాదివాటిని ఆధారం చేసుకుని వర్తకులను వర్గీకరించి అంచెలంచెలుగా వోచరు విధానం ప్రవేశపెట్టడం మంచిదేమో?

— దరువూరి వీరయ్య

ఆంధ్రప్రభ

ఇంతకు నా పరాత్పరునకే దయగల్గిన రైతురాజ్యమ
త్యంత విభూతిఁ బెంపెసఁగదా? మనకర్షక సార్వభౌముఁడే
అంతములేని యీ భువనమంతకు శాసనకర్తయై నిర
భ్యంతర పాలనం బొనరుపంగల భాగ్యము గల్గుచెన్నఁడో!

— ఏటుకూరి వేంకట నరసయ్య

పొగాకు రైతుల కష్టాలు తీరే మార్గాలు

రచన : దరువూరి వీరయ్య

పొగాకు రైతులు సరకు విడుదలకాక, సరైన ధర రాక నానా అగచాట్లు పడుతున్నారు. ఈ పరిస్థితి కొన్నాళ్ళు కొనసాగితే వారి సర్వనాశనం తప్పదు.

అయితే ఈ పరిస్థితికి దారితీసిన కారణాలేమిటి? అధికోత్పత్తి ఒక్కటే కారణం అందామా? కాదు. ఈ నాటి ఈ విపత్కర పరిస్థితికి పొగాకు బోర్డు ప్రవేశపెట్టిన "వోచరు పద్ధతి" కారణం అయింది. దక్షణాదిని తేలిక భూములలో పండే పొగాకు అమ్మకాలు సాధారణంగా డిసెంబర్ మొదటి వారంలో ప్రారంభమై జనవరి మధ్యకు పూర్తి అయ్యేవి. ఆ తరువాత నల్లరేగడి భూముల్లో పండే పొగాకు అమ్మకాలు జనవరి ఆఖరు వారంలో కాని, ఫిబ్రవరి మొదట్లోగాని ప్రారంభం అయ్యేవి. కాని, ఈ సంవత్సరం ఫిబ్రవరి మధ్యవరకు అసలు కొనుగోళ్లు ప్రారంభం కాలేదు. ఇందుకు కారణం లేకపోలేదు. పొగాకు బోర్డు ప్రభుత్వం ఈకొత్త

వోచరు పద్ధతిని మారుస్తారని వర్తకులు ఆశించారు. కొనుగోళ్ళు మందకొడిగా సాగాయి. ఏరికోరి సరకు కొనడం ప్రారంభించారు. దీని ఫలితంగా రైతులవద్ద విపరీతంగా పేరుకుపోయి పొగాకు రంగు మారడం, దుర్వాసన రావడం ప్రారంభించింది.

ఆశించిన ధరలు ఇవ్వకుండా వర్తకులు దెబ్బకొట్టారని రైతులు తలచారు. సుమారు రెండు మాసాలు గడిచాక వర్తకులు, రైతులు కోర్టుకెక్కాక, బోర్డు వర్తకులతో మంతనాలు జరిపి వోచరు పద్ధతికి కొన్ని సవరణలు చేశారు. ఇందులో రైతులకు చెల్లించే మూల్యం చెక్కు-ద్వారానే కాకుండా నగదుగా కూడా ఇవ్వవచ్చునని, రెండవ వాయిదా సొమ్ము సరకు కొన్న తేదీ నుంచి 90 రోజులకు బదులు 15౦ రోజులలోగా చెల్లించవచ్చునని, దీని తరువాత కొనుగోళ్ళు చక చకా నడిచినా ఏరికోరి కొనడం మాత్రం కొనసాగింది.

ప్రస్తుతం గ్రేడింగు రెండు ధపాలు జరుగుతుంది. ఒకటి రైతు దగ్గర, రెండవది వ్యాపారుల దగ్గర. ఈ పద్ధతికి బదులు రైతుల దగ్గరే ఈ గ్రేడింగు జరగాలి. ప్రతి గ్రేడు పొగాకుకు కనిస ధర నిర్ణయించాలి. అంతేకాకుండా రైతు దగ్గర పొగాకు నాణ్యత గురించి సర్టిఫైచెయ్యడం - వేలం ద్వారా అమ్మకం ప్రవేశ పెట్టవలసివుంది. ఈ రెండు పద్ధతులు ప్రవేశ పెడితే రైతుల సమస్యలు ఒక రకంగా పరిష్కారమైనట్టే. ఈ ఏర్పాట్లు చేయడంలో కెనడా, అమెరికా వంటి దేశాలలో అవలంబించిన విధానాలు ఆకళింపు చేసుకొని అమలు జరపడం ఉత్తమం. బోర్డు పొగాకుకు 8 గ్రేడులు నిర్ణయించింది కాని, అందులో మూడు గ్రేడ్లకు మాత్రమే సూచన ప్రాయంగా ధరలు నిర్ణయించింది. ఏ రైతు ఎనిమిది గ్రేడులు సరిగా ఎంపిక చెయ్యడంలేదు. ఈ గ్రేడులు రైతు దగ్గర వాటి కనీస ధరలు నిర్ణయించనంతకాలం, స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్ కాని, ఏ యితర ప్రభుత్వ ఏజన్సీ కాని నేరుగా రైతుల దగ్గర నుంచి సరకు కొనడం జరగదు.

రైతుల మేలుకే ఈ కొత్త పద్ధతి ప్రవేశ పెట్టారనడంలో సందేహం లేదు. బోర్డు ఈ క్రింది చర్యలు కూడా తీసుకొనివుంటే, మార్కెట్టులో ఈ గందరగోళం, రైతుల యిబ్బందులు తప్పివుండేవి.

1. పొగాకు వర్తకులకు, ఎగుమతిదార్లకు సరైన పరపతి సౌకర్యం కలిగించడం. ఇందులో బోర్డు ప్రయత్నాలు ఫలించలేదు. బ్యాంకులు బోర్డుసలహా పాటించలేదు. వారి మామూలు పద్ధతులు, రూల్సు మారలేదు అంచేత వర్తకులకు ఎగుమతిదార్లకు ఆశించినట్లు అధికంగా పరపతి సౌకర్యం కలుగలేదు. తత్ఫలితంగా "వోచరు పద్ధతి ప్రవేశ పెట్టడం" ఒకటి. రెండు పెద్ద కంపెనీలకు తప్ప ఇతరులకు సాధ్యం కాలేదు.

2. పొగాకుబోర్డు చట్టం ప్రకారం బోర్డువారు పొగాకు కొనుగోలుకు ప్రత్యామ్నాయమైన ఏర్పాటుచేసి వుండవలసింది. అలా చేయకుండా ఎస్. టి. సి. పొగాకు కొనమని ప్రోత్సహించింది. ఎస్. టి. సి. తన అసమర్థతను ప్రకటించింది. అందుకు కారణం—

ఎ. రైతులు బోగ నిర్ణయించినట్లు పొగాకు 8 గ్రేడులుగా విభజించలేదు.

బి. నిర్ణయించిన ఎనిమిది గ్రేడులకు కనీస ధరలు నిర్ణయించలేదు మూడు గ్రేడులకు మాత్రం ధరలు సూచించడం జరిగింది.

సి. గ్రేడును సర్టిఫై చెయ్యడానికిగాని, గ్రేడు గురించి, ధర గురించి రైతుకు, ఎస్. టి. సి. కి తగాదావస్తే మధ్యవర్తిగా నిర్ణయాలు తీసుకోడానికి సరైన ఏజన్సీ లేదు.

డి. ఎస్. టి. సి. రైతు దగ్గరనుంచి నేరుగా సరుకు కొనడానికి దానిని నిర్వహించడానికి కావలసిన సదుపాయాలు లేవు.

రైతుల దగ్గరనుంచే నేరుగా కొనుగోలు చెయ్యాని గాలి, వర్తకుల దగ్గరనుంచి కొనుగోలు చెయ్యకూడదనే ఆచరణ సాధ్యంకాని సూత్రం మూలంగా కార్పొరేషన్‌కు వున్న పరిమిత వనరులలో ఏమీ చెయ్యలేని స్థితిలో పడింది. ఫిబవరి 16న బోర్డు నిర్ణయం మార్చి వర్తకుల దగ్గర నుంచి కూడా కొనుగోలు చెయ్యవచ్చునన్న తరువాత కార్పొరేషన్ మార్కెట్టులో ప్రవేశించడం జరిగింది. ఈ నిర్ణయం మొదట్లోనే వుంటే, ఇంకా ముందుగా కార్పొరేషన్ పని ప్రారంభించేది.

చాలాకాలం పొగాకు నిల్వవున్న మూలంగా దాని నాణ్యత తగ్గి, సుమారు 25 కోట్ల రూపాయలు రైతులు నష్టపోయారు. రైతులకు వచ్చిన నష్టాన్ని ఏదో రకంగా భర్తీచెయ్యడం గురించి కేంద్రం ఆలోచించవలసి వుంది.

రైతులు ఇబ్బందులకు గురైనారు. మార్కెట్టు సుమారు మూడు మాసాలు ఆలస్యంగా ప్రారంభం అయింది. రైతుల దగ్గర నిల్వలు పేరుకు పోయాయి. సరకు నాణ్యత పాడై రైతులు నష్టపోయారు. ఈ పరిస్థితికి దారితీసిన కారణాలు విచారణ జరిపి ఇలాంటి విపత్కర పరిస్థితి పునరావృతం కాకుండా చూడవలసిన బాధ్యత ప్రభుత్వానిది.

ఆంధ్ర జ్యోతి, ఏప్రియల్

★

రైతుల కొంపలు కూల్చిన పొగాకు బోర్డు నిర్ణయాలు

రచన : దరువూరి వీరయ్య

మూడు దశాబ్దాలుగా పొగాకు రైతాంగం సాగించిన ఆందోళన ఫలితంగా ఎట్టకేలకు "పొగాకు బోర్డు" నిర్మాణం జరిగింది.

'జూట్'కు ఒక బోర్డు వున్నది. రబ్బరుకు ఒకబోర్డు ఉన్నది. కాఫీకి ఒక బోర్డువున్నది. ఈబోర్డులు వుత్పత్తిని క్రమబద్ధం చేయడంలోనూ, వుత్పత్తిదారులకు న్యాయమైన గిట్టుబాటయిన, లాభదాయకమైన ధరలు రాబట్టిపెట్టి, కిలకాలంగా రైతాంగంను దోపిడీకి గురి చేయుచున్న వాణిజ్య పారిశ్రామిక వర్గాలనుండి రైతులకు రక్షణ కల్పించుటలో జయప్రదమయినవి.

ఆకారణంగానే బహుకాలంగా పై బోర్డులలాంటి చట్టబద్ధమైన వుత్పత్తిదారులకు న్యాయమయిన ప్రాతినిద్యంగల సంపూర్ణ అధికారాలుగల స్వతంత్ర ప్రతిపత్తిగల పొగాకు బోర్డును నియమించవలసిందిగా ఆందోళన చేయడం జరిగింది.

పొగాకుబోర్డుకు గుంటూరు ప్రధానకార్యాలయంగా పనిచేయడంప్రారంభించింది. బోర్డులో రైతుకు సముచితమయిన ప్రాతినిధ్యము లేదు. చిన్న, మధ్య, పెద్ద వ్యాపారులనే మూడు రకాలయిన వర్గీకరణల ద్వారాను, సిగరెట్ మాన్యుఫాక్చరర్స్ పేరుతో కొందరు బోర్డులో వ్యాపారస్తులదే పైచేయి అయింది. బోర్డుచైర్మన్ అధికార ప్రతినిధి ఐ. ఎ. ఎస్. ని నియమించాలని నిర్ణయించబడింది.

బోర్డు విధులలో పొగాకు వుత్పత్తిని దేశీయ అవసరాలు ఎగుమతులు ఆధారంగా క్రమబద్ధంచేయాలి. 2) పొగాకు కొనుగోలు రేటు, తూకం గ్రేడ్ స్పష్టంగా నమోదుచేసి ఓచరును రైతుకు అందజేయడంద్వారా రైతును రక్షించడం, 3) వ్యాపారస్తులు పొగాకు కొన్నవెంటనే డబ్బు రాబట్టిపెట్టడం : 4) పొగాకుకు గ్రేడులు నిర్ణయించి దానిప్రాతిపదికగా 'సూచిక' ధరలు నిర్ణయించడం, 5) నిర్ణయించిన సూచిక ధరలు, రైతుకు అందజేసేట్టు చూడటం. రైతులకు రక్షణ, భద్రత, గిట్టుబాటు కలిగించడం ప్రధాన ఆశయముగా యేర్పడిందీ పొగాకు బోర్డు.

జరిగిందేమిటి ?

ఆచరణయోగ్యంకాని, ఆచరణ సాధ్యంకాని, అనాలోచిత, అసమర్థత, అవివేక విధానాలతో పొగాకు వుత్పత్తిదారులను గత అర్ధ శతాబ్దంగ మొన్నెన్నడూ ఎరుగనంతటి దారుణమయిన బాధలకు, కష్టాలకు గురిచేసింది. అంచనాలకు మించిన అంతులేని నష్టాలకు గురిచేసింది. కొన్ని కొన్ని సందర్భాలలో క్యూరింగు ఖర్చు గూడా చేతికి రానంతటి దౌర్భాగ్యమునకు గురిఅయ్యారు.

ఆచరణ సాధ్యంకాని దివాళాకోరు ఆదర్శవాదంతో రైతాంగాన్ని మోసం దగా చేసింది పొగాకు బోర్డు. పొగాకు బోర్డులోని అధికార సభ్యులకు పొగాకు ఉత్పత్తి గ్రేడింగ్, మార్కెటింగ్, ఎగుమతి విషయాలలో ప్రాథమిక పరిజ్ఞానం కూడా లేదన్న విషయం గత మూడు నాలుగు మాసాల సంఘటనలు స్పష్టంగా బుజువు చేశాయి.

గుత్త వ్యాపారస్తులు. పొగాకు ఎగుమతిదారులు, సిగరెట్ పరిశ్రమ యజమానులు రైతాంగాన్ని ధర నిర్ణయంలో, గ్రేడింగు నిర్ణయంలో కొన్ని సరుకునకు డబ్బు చెల్లించడంలో బహుకాలం మోసం, దగా చేస్తున్నారు. ఎగుమతి చేయు పొగాకుకు కనీస ధర నిర్ణయం వున్నది. అదే రైతుకు గిట్టుబాటు ధర కాని, లేదా కనీస ధరకాని, సూచిక ధరకాని లేదు. పొగాకు బోర్డు రైతుస్థాయిలో సూచికధర నిర్ణయిస్తానని ప్రకటించింది. రైతాంగం, రైతు సంఘాలు హర్షామోదాలు ప్రకటించాయి పొగాకు ఉత్పత్తిలో నైపుణ్యంగల దేశాలని చెప్పబడే అమెరికా, రొడీషియా,

జపాన్ దేశాలలో మూడు నాలుగు గ్రేడులే వుండగా, భారత దేశంలో ఇరవై నుండి ముప్పయిదాకా గ్రేడులుండడం రైతాంగాన్ని దోచుకోవడమే నంటూ రైతుస్థాయిలో ఎనిమిది గ్రేడులకు కుదించడం చేశామన్నారు. ఇందుకు రైతాంగం, రైతు సంఘాలు తమ సంతోషాన్ని వెలిబుచ్చాయి. బోర్డు నిర్ణయించిన గ్రేడులు ప్రాతిపదికగా కనీస ధర నిర్ణయించామన్నారు. మరింత సంతోషంతో తమ ఆమోదాన్ని ప్రకటించారు తూకంలో, ధరలో డబ్బు చెల్లించుటలో జరుగుతున్న అన్యాయాన్ని, అక్రమాన్ని, జాప్యాన్ని అరికట్టేందుకు పొగాకు కొనుగోలు చేసిన మరుక్షణంలోనే "ఓచరు" ట్రిపికేట్‌లో ప్రతి రైతుకు అందించాలన్నారు. సెహబాష్ అన్నది రైతాంగం. పొగాకు కొనుగోలు చేసిన నాడే సగం డబ్బు చెక్కు రూపంలోనూ, మిగతా సగం 90 రోజులలోగా మరొక చెక్కురూపంలోనూ చెల్లించే కట్టుదిట్టమైన షరతులతో ఓచరు రూపొందించ బడిందన్నారు. సగంధర డబ్బులకు మూడు మాసముల కాల వ్యవధినివ్వడం అన్యాయం, అక్రమం అనుకొన్నా మొత్తంమీద ఇంచుమించు తమ ఆమోదాన్ని తెలియజేశారు రైతాంగం.

పొగాకు వాణిజ్య సంస్థ ఇండియన్ టుబాకో అసోసియేషన్‌ల గుత్త వ్యాపారస్తులు, సిగరెట్ పారిశ్రామికులు విడివిడిగాను, సంస్థాపరంగాను తమ అసమ్మతిని ప్రదర్శించారు. బోర్డు విధానాలను మూకుమ్మడిగా దుయ్యబట్టారు. పొగాకుబోర్డు విధానాలు ఆచరణ యోగ్యం కాదన్నారు. మార్పు చేయవలసిందిగా గుంటూరునుండి, హైదరాబాద్‌నుండి కొత్తఢిల్లీవరకు రాయబారాలు నడిపారు. ఓచరు పద్ధతిని చెక్కు రూపంలో డబ్బుచెల్లించడాన్ని సూచిక ధరలు చెల్లించడాన్ని, ఒక యేడాదిపాటు వాయిదా వేయవలసిందిగా కోరారు. వాణిజ్య వర్గాల కోర్కెలను అమలుపరచడం అసాధ్య మన్నారు. రైతాంగాన్ని రక్షించడమే తమప్రాథమికమూ ప్రధానమూనైన ఆశయ మన్నారు. ఏవిధమైన బోర్డు రూపొందించి ఆమోదించిన విధానాలు అమలుచేసి తీరుతామన్నారు చివరి ఆయుధంగా పొగాకు వ్యాపారస్తులు మేము మార్కెట్లో ప్రవేశించి పొగాకు కొనుగోలు చేయబోమన్నారు. మీరు కొనకపోతే మీ యల్. ఓ లైసెన్సులన్ని రద్దుచేసి బోర్డు మార్కెట్‌లో ప్రవేశించి బోర్డు రూపొందించిన విధానాలకనుగుణ్యంగా గ్రేడుల ప్రాతిపదికగా, కనీస ధరలు గ్యారంటీతో మొత్తం పొగాకును కొనుగోలు చేస్తామని నిర్ద్వంద్వంగా ప్రకటించింది ఇది చూచిన అమాయకపు రైతాంగం నిజమని నమ్మి సంతోషాతిశయములతో ఎగిరి గంతేశారు. బోర్డు అధికార, అనధికార సభ్యులను ఊరూర త్రిప్పి ఊరేగించి, సన్మానాలుచేసి, కుప్పలు తెప్పలుగా పూలదండలువేసి, దిన్నర్లు ఇచ్చి తనివితీరా పొగిడేశారు.

చివరకు జరిగిందేమిటి ?

జనవరి మొదటి వారానికి పోగాకు బ్యారన్లు దిగడం ప్రారంభమైంది. గ్రేడ్ చేసి జనవరి 15 నాటికి మార్కెట్లోకి తయారయింది. పొగాకు వ్యాపారస్తులు కదలరు, మెదలరు అదేమని అడిగితే మేము చెక్కు రూపంలో రైతులకు డబ్బు చెల్లించేది లేదు పొమ్మన్నారు. ఈ సంవత్సరానికి ఓచరు కూడా అమలు చేయ లేమన్నారు. బోర్డు నిర్ణయించిన ఎనిమిది గ్రేడుల విధానం ఆచరణ సాధ్యంకాదు పొమ్మన్నారు. సూచిక ధరలు మాకు గిట్టుబాటు కావన్నారు.

వ్యాపారస్తులను బో ు బెదిరించింది. అదిరించింది. మేమే మార్కెట్లో ప్రవేశించి పొగాకు కొనుగోలు చేయబోతున్నామంటూ మరొకమారు హెచ్చరించారు. వాణిజ్యవర్గాలకు చీమకుట్టినట్లుగా కూడా లేదు పొగాకుముమ్మరంగా దిగింది, మూడు నాలుగు ఇరుపులు కూడా పూర్తయింది. పొగాకు ఇరుపుకు, క్యూరింగుకు, బేళ్ళు కట్టడం మొదలగు ఖర్చులకు చేతిలో డబ్బులేక, పొగాకు అమ్ముడుగాక రైతాంగం సంక్షోభంలో పడ్డది. బోర్డు నిర్ణయించిన కనీసధర ఒకటినుండి నాలుగు గ్రేడులవరకు రు. 1050-00 లు కాగా 400-00 ల నుండి రు. 500-00 ల మించి కొనే నాధుడే కనబడలేదు మొదటి గ్రేడు పొగాకును రైతు ఇంటివద్దకు వెళ్ళి అతడి దయాదాక్షిణ్యాలపై చెక్కుపై ధరవేయు వ్యాపారస్తులు దూరాభారం నుండి రవాణా చార్జీలు భరించి వండల మైళ్ళలోవున్న కంపెనీ వద్దకు వస్తే మీసడుకు మాకేమీ ఆక్కర లేదు పొమ్మని వెంటబడితరుము తున్నారు.

ఈలోగా పొగాకు బోర్డు పొగాకు వ్యాపారస్తులకు లొంగి పోయింది. అంతే కాదు, లాలూచీ పడిందని కూడ అంటున్నారు. మొదటి వాయిదా సగం డబ్బు, చెక్కు రూపంలోగాక. రొక్కం రూపంలో ఇవ్వవచ్చునన్నారు. మగతా సగం 90 రోజులకు బదులు 150 రోజులకు పొడిగించేందుకు అంగీకరించింది. ఓచరు యిచ్చారా లేదా అనేది పట్టించుకోవడమే లేదు. వ్యాపారస్తుల ఇష్టారాజ్యమైపోయింది.

పొగాకు కారు చవకగా, పైసా చెల్లించకుండా, తమ యిష్ట మొచ్చినప్పుడు ధరలు వేసి పొగాకు కొన్న నెలదాకా ఓచరు యిస్తున్నారు. పొగాకుపై వేసిన ధర మొత్తం కొనుగోలు చేసిన వారము పది రోజులలో పూర్తి డబ్బు చెల్లించే పెద్ద కంపెనీలు సైతం బోర్డు నిర్ణయంపంక పెట్టి 150 రోజుల తరువాత రమ్మంటున్నారు. అదేమని అడగితే బోర్డు నిర్ణయ మంటున్నారు. తమకు అవసరం కలిగినప్పుడు మాత్రం బోర్డు నిర్ణయ మంటారు. ఓచరు అడిగినా, కనీస ధర అడిగినా, మీ అబ్బకు చెప్పుకో మంటున్నారు. పొగాకు గుత్త వ్యాపారస్తుల కబంధ

హస్తాల నుండి రక్షించే శక్తివంతమైన, చట్ట బద్ధమైన పాలనా వ్యవస్థగా "పొగాకు బోర్డు" తమను ఆదుకొనగలదను కొన్నది రైతాంగం. పొగాకు బోర్డు తమ పాలిట కల్పవృక్షమని, కల్పతరువని, కామధేనువని గంపెడంత ఆశతో వున్న రైతాంగం నిలువునా నీరు గారి పోయింది.

కామధేనువు కల్పవృక్షము, కల్పతరువు కాకపోగా తమ మెడలో గుదిబండగా తల బరువుగా చివరకు ఉరిత్రాడుగా తయారయిందని బాధపడుతుంది రైతాంగం. తుఫాను, ఉప్పెనల మూలంగా క్రుంగిపోయి, రెండుమార్లు నారు కొని, పొగాకు వేసిన రైతాంగం, అప్పులతో ఋణగ్రస్తులై, ఖర్చులు గిట్టక నానాబాధలు పడుతుండగా, "గోరుచుట్టుపై రోకటిపోటు" చందంగా పొగాకు బోర్డు దివాళాకోరు విధానాలు కారణంగా మరింత క్రుంగి పోయింది. దివాలా తీసింది.

జనవరి మొదటి వారములో బ్యానర్లనుండి దిగిన పొగాకు ఫిబ్రవరి ఆఖరు దాకా మార్కెట్లో కొనుగోలుచేయక పోవడంతో రంగు మారిందని, ఫ్లేవర్ తగ్గిందని, కుంటి సాకులతో మార్కెట్లో అమ్ముడుపోక పోవడం కారణంగ 25 నుండి 50కోట్ల రూపాయలదాకా రైతాంగం నష్టపోయిందంటున్నారు.

రైతాంగ రక్షణకు, అభివృద్ధికి కంకణం కట్టుకున్నానని బాకాలూదుకుంటున్న జనతా పాలనలోనేనా పొగాకు రైతాంగం ఇంతటి కష్టనష్టాలకు, బాధలకు గురికావడం?

ముప్పదేండ్ల కాంగ్రెసుపాలనలో రైతాంగం ఎన్నడూ అనుభవించని కష్టాలు, నష్టాలు, బాధలు జనతా పాలనలో జరగడం, రైతాంగం జనతా పార్టీపట్ల, నిస్పృహ నిరాసలతో ఉన్నారు. పాలకులు మారారే తప్ప పాలనలో మార్పు రాలేదంటున్నారు.

మూడు మాసాల అవకతవక, అసమర్థత, అవివేక విధానాల ప్రకటనల తరువాత రైతులనుండి నేరుగా 10 వేల టన్నుల పొగాకు కొనుగోలు చేయడానికి నిర్ణయించింది. పొగాకు మార్కెట్లోకొచ్చి మూడుమాసాలయింది గదా? ఎందరు రైతులు అమ్ముకోకుండా నిలువ వుంచుకొనగలరు? పొగాకు నిలువ వుంచడం సాధ్యమా? బ్యారన్ దిగిన వారము పదిరోజులలో గ్రేడ్ చేయించి, రీడ్రై చేయించకపోతే కలరు మారదా? ఫ్లేవరు తగ్గదా? కలరు ఫ్లేవరు తగ్గిన పొగాకును మార్కెట్లో కొనేదెవరు? పొగాకుబోర్డు, కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ, యస్. టి. సి. లు తమలోతాము సమన్వయంలేక పొగాకును గురించిన అవగాహన లేక

అన్నిటినీ మించి వాణిజ్య వర్గాలను కంట్రోలు చేయగలిగిన సత్తాలేక, రైతాంగాన్ని నిలువునా ముంచారు.

ఇప్పుడు మార్కెట్లో రైతులవద్ద పొగాకు కొనాలని నిర్ణయించటం అలాకొనే పొగాకును కొత్తరకం మధ్య దళారులయిన తాడూ బొంగరం లేని ఎల్ 5లైసెన్స్ పొందిన వ్యాపార కేంద్రములద్వారా రైతులు గ్రూపులుగాను, సిండికేట్లగాను కో-ఆప రేటవ్స్‌గాను రిజిష్టరు చేసుకొని ఎన్.టి.సి.కి తమవద్దగల నిలవలను తెలియజేయాలని ప్రకటించారు. ఇది ఆచరణ సాధ్యమా? యోగ్యమా? రైతులను పెనమునుండి పొయ్యిలో వెయ్యడమేగదా?

పొగాకు బోర్డు వరుసగా, గత మూడు మాసములుగా కాల యాపనతో కూడిన నిర్ణయాలు చేయడం, చేసిన నిర్ణయాలు అమలు చేయక పోవటమే కాక, వాణిజ్య వర్గాలకు లొంగిపోవడం గమనించి నట్లయితే బోర్డు, వాణిజ్య వర్గాలుకలసి కూడ బలుక్కుని లాలూచీపడి, రైతాంగాన్ని మొత్తంగా వందకోట్లదాకా నష్టాలకు గురి చేసినట్లు కనిపిస్తుంది. అందువలన, బోర్డు తీర్మానాలు నిర్ణయాలు, ప్రకటనలు, ప్రసంగాలు ముందుంచుకొని పరిశీలించి దోషులయిన వారిని శిక్షించేందుకు వీలుగా పొగాకు బోర్డు చర్యను సమీక్షించాలి.

సౌజన్య వారపత్రికనుండి

★

కోడితో మేలుకని రవిక్రుంకు వలకు
నుడికిపోయిన రక్తమ్ము గడనచేసి
భోగకాములు తమ దివ్య భోగములకు
విక్రయించిన వతనికే వెఱపులేదు.

—వీటుకూరి వేంకటనరసయ్య

ఓచరు పద్ధతి అమలులో పొగాకు రైతుల చిక్కులు

వర్జీనియా పొగాకు పంట సంక్రాంతినుంచి మార్కెట్‌కు రానున్నది. జనవరి 1976 నుంచి గుంటూరు కేంద్రంగా కేంద్రప్రభుత్వ వాణిజ్య శాఖ ఆధ్వర్యంలో పొగాకు బోర్డు పనిచేస్తున్నది. గిట్టుబాటుధర రైతుకు రాబట్టడం, వర్తకుల నుంచి సకాలంలో రైతులకు డబ్బు రాబట్టి పెట్టడం, మొదలైనవి పొగాకుబోర్డు కర్తవ్యాలు. రైతుస్థాయిలో ఆమోదయోగ్యమైన 8 గ్రేడులు అనగా 1-వి. నుండి 8-వి వరకు నిర్బంధంగా అమలుపరచటం, ఆ గ్రేడులకు రైతుకు గిట్టుబాటు కాగల కనీస ధరలను నిర్ణయించి చట్టరీత్యా అమలు పరచటం బోర్డు ప్రథమ కర్తవ్యం.

ఈ పని చేయకుండానే రైతులకు న్యాయం చేకూర్చడం అసంభవం. కానీ ప్రస్తుత చట్టంప్రకారం రైతు స్థాయిలో పొగాకుకు ధర నిర్ణయించడం బోర్డు

పరిధిలో లేదు. ఆ కారణంగా ప్రస్తుతచట్టం రైతుకు రక్షణ కల్పించలేదు. అది నిస్సహాయ స్థితిలో వున్నది. రైతుకు రక్షణ కలుగవలెనంటే బోర్డు ప్రస్తుత చట్టాన్ని సవరించడం అవసరం.

ఈలోగా చట్టంలోని స్వల్ప అవకాశాలు వినియోగించుకొని రైతుకు రక్షణ కలిగించడం అవసరం, న్యాయంకూడా. ఇందుకు ప్రథమ చర్యగా రైతు స్థాయిలో గ్రేడులకు "సూచిక ధరలు" (ఇండికేషన్ ధరలు) ప్రకటించడానికి బోర్డు ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తున్నది. అయితే ఈధరలను ఎవరు నిర్ణయించుకోబోతున్నారు? బోర్డు చేయాలా, లేక "ఏసిసి" (వ్యవసాయ ధరల కమిషన్) చేయవలెనా? అనేది కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ తేల్చవలసి వున్నది. లోగడ వివిధ పంటలకు ఎ సి సి నిర్ణయించుతున్న ధరలు ఉత్పత్తి ఖర్చులకంటె తక్కువగా వున్నందున అవి శాస్త్రీయం మార్కెట్ ధరలకంటె ఎ సి సి నిర్ణయించిన ధరలు చాలా తక్కువగా వున్నందున, ఇప్పటికే రైతులు ఆందోళన పడుతున్నారు. మిగతా పంటలకు, పొగాకు పంటకు పెద్ద తేడా వున్నందున పొగాకు ధరలు ఎ సి సి నిర్ణయించడంవైతు కెంతమాత్రం క్షేమంకాదు. కాబట్టి, పొగాకు సూచిక ధరలు ఎ. పి సి వారి సపోర్టు ధరలవలె కాక, సహేతుకమయిన, న్యాయమైన గిట్టుబాటు ధరగావుండాలి.

సంతోషించవలసిన నిర్ణయమే

బోర్డ్ తయారుచేసి సరఫరా చేస్తున్న ఓచరును, వర్తకులు ఉపయోగించి, పొగాకు కొన్నవెంటనే సగం డబ్బును, బ్యాంకి చెక్కుద్వారా రైతులకు ఎక్కడికక్కడే చెల్లించి మిగతా డబ్బును మూడు మాసాలలోగా చెల్లించవలసి వున్నది. ఇంత కాలంగా సాగుతున్న అనిశ్చిత వాతావరణం నుంచి బోర్డ్ తలపెట్టిన ఈ చర్యను రైతులు హర్షించగలరు. బోర్డ్ సంకల్పం కృషి క్లామసీయం. ఇందుకు బోర్డ్‌ను పొగాకు రైతులంతరు అభినందించగలరు. ఆచరణలో ఎదురయ్యే అడ్డంకులు, అవాంతరాలుకూడా గమనించవలసి వున్నది.

ఆచరణ సాధ్యమా?

ఓచరు విధానం జయప్రదం కావడానికి అవసరమైన పరిస్థితులున్నాయా? అంచనకు అనేక ప్రతిబంధకాలున్నాయి. ఆ ప్రతి బంధకాలను బోర్డ్‌గాని, బ్యాంకులుగాని, తొలగించగలవని ఊహించడం గాలిలో మేడలు కట్టడం కాగలదేమో. ఇందులో మొదటి విషయం బ్యాంకుల నుంచి వర్తకులకు అందే ఋణం. ఆంధ్రలో పొగాకు

సగటు వార్షిక పంట లక్ష టన్నులు, అయితే రానున్న సీజనులో పంట లక్షన్నర టన్నులదాకా వుంటుందని అంచనా. సగటున లక్ష టన్నుల పంటనే ప్రామాణికంగా తీసుకుంటే ఈ లక్షటన్నులను కొనడానికి నూరు కోట్ల ధనం కావాలి. పొగాకు కంపెనీల అన్నింటి ఋణ వసతులు నలభై కోట్ల రూపాయలు మాత్రమే. మిగతా 10 కోట్లకు రైతుల సరకునే వర్తకులు పెట్టుబడిగా చేసుకుని వ్యాపారం సాగిస్తున్నారు. రైతులకు పూర్తి ధరలు చెల్లించాలంటే బ్యాంకులు నూరుకోట్ల రూపాయల వరకు వర్తకులకు ఋణాలు కల్పించవలసి వున్నది. లేదా బోర్డ్ మరేదైన ప్రత్యామ్నాయ మార్గం కనుగొననలసి వున్నది. కాని ఈ అరవై కోట్లు అవసపు ఋణమును బ్యాంకులు వర్తకులకు ఇచ్చునట్లుగా రిజర్వ్ బ్యాంకు ఏర్పాటు చేస్తున్నదని బోర్డ్ వర్గాల వారి ద్వారా తెలుస్తున్నది. ఇలా జరిగితే మంచిదే అది అసంభవమని బ్యాంకు వాణిజ్య వర్గాలు భావిస్తున్నాయి. మార్కెట్‌కి పొగాకు రావడం కొద్ది రోజులలో జరుగుతుంది. ఈ అవసపు ఋణం గురించి ఇంతవరకు బ్యాంకులకు వర్తమానం లేదు.

పొగాకు కొనుగోలుకు పెట్టుబడికి తోడు గ్రేడింగు, ఈనె తీయడం, రీడ్రయింగ్, ప్యాకింగ్, ఎగుమతి ఖర్చులు, ఎగుమతి పన్ను మొదలైన ఇంకా అనేక ఖర్చులు వ్యాపారస్తులకు చాల భారంగా వుంటాయి. ఈ ఖర్చులన్నీ వర్తకులు మొత్తం రొక్కం చెల్లించవలసి వున్నది. ఇలాంటి వివాదాంశాలను బోర్డ్ గణనలోనికి తీసుకొని ఆలోచించవలసి వున్నది.

మొత్తం నూరుకోట్లు ఒకేసారి అవసరంకాదని మూడు మాసాలు ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్‌లలో చెల్లించవలసి వస్తుందని కాగా, ముందుగా కొన్న పొగాకు ముందుగా ఎగుమతి కాగానే విదేశాలనుంచి రాగల డబ్బు రైతులవద్ద పొగాకు కొనుగోలుకు తిరిగి ఉపయోగపడుతుందని కొందరి విచిత్రవాదన. ఫిబ్రవరి, మార్చి నెలలలో ముప్పాతిక భాగం పొగాకు కొనుగోళ్లు పూర్తవుతాయి. గ్రేడింగ్ ప్యాకింగ్ అయిన తరువాత ఎగుమతులు మార్చినుంచి అగస్టు వరకు ముమ్మరంగాసాగుతాయి. కీడెంచి మేలెంచ మన్నట్లు ఒక్కొక్కసారి ఓడలు ఆలస్యమయి సరకు రేవులలో నెలలు తరబడి నిలబడి పోవడము ఎగుమతులు సకాలంలో జరుగకపోవడం తటస్థించవచ్చు. ఈ సాధక బాధకాలు తెలిసినవారు నూరుకోట్ల రూపాయల పొగాకు మూడు నెలలలో నలభై కోట్లతోకాని రైతులకు పూర్తిగా డబ్బు చెల్లించవచ్చు అనడం పెద్ద పొరపాటు.

రైతులకు డబ్బు చెల్లించి పొగాకు కొనుగోలు చేయగలశక్తి మార్కెట్‌లో అయిదు, ఆరు కంపెనీలకు మాత్రమే వున్నది. మిగతా రెండు వందల కంపెనీలు

హెచ్చుగా రైతుల పెట్టుబడితోనే వ్యాపారం చేయవలసి వున్నది. బోర్డ్ ప్రవేశ పెట్టనున్న ఓచరు విధానం డబ్బుగల అయిదారు కంపెనీలు మాత్రమే అమలు పరచ గలవు. ఈ కంపెనీలు తమ కవసరమయి పొగాకును కొనుగోలు పూర్తిచేసుకొనే వరకు మిగతా కంపెనీలు మార్కెట్‌లోనికి రాలేవు. దానితో మార్కెట్‌లో పోటీ బహు పరిమిత మవుతున్నది. ఆ పరిస్థితి ఆసరాగా తీసుకొని డబ్బుగల కంపెనీలు పొగాకును చౌకగా రైతులనుంచి కొనగలవు. గత్యంతరంలేక పొగాకు నిల్వచేయగల సరుకు కానందున రైతులు భయపడి ఎంతకైనా అమ్మవలసినదుస్థితి దాపురిస్తుంది. ఇలాంటి క్లిష్టపరిస్థితులలో రైతుల దగ్గర నేరుగా పొగాకు కొని ఆదుకొనగల శక్తి లేదా అధికారం పొగాకు బోర్డ్‌కు గాని. ఎన్. టి. సి కి గాని వున్నదా? ఈ రెండు సంస్థలకు రైతులవద్ద పొగాకు కొని గ్రేడింగు ప్యాకింగు రీడ్రయింగ్ చేసే వసతులు అంతగా లేవు. అంతేకాదు. ఈ రెండు కేంద్ర సంస్థల తరపున రైతులవద్ద పొగాకు కొని సమర్పించగల ప్రాథమిక రైతు సహకార సంస్థలు కూడా విరివిగా లేవు. వర్తకులలో రాగల ఐక్యతను బ్రద్దలుచేయగలశక్తి బోర్డ్‌కు లేదు. అటువంటి పరిస్థితులలో రైతులు విధిగా నష్టపడగలరు. ఆశయమెంత ఉదాత్తమైనదయినా ఆచరణలో యిలాంటి దుష్ఫలితాలు దుష్పరిణామాలు సంభవించగలవు. అందువలన ప్రస్తుత పరిస్థితులను గమనించి ఆచరణ సాధ్యమైన రైతుల ప్రయోజనాలను రక్షించగల రైతుల సరుకుకు రావలసిన డబ్బును ముట్టచెప్పగల పద్ధతులను క్రమంగా అమలు పరచుటకు బోర్డు పరిశీలించవలసియున్నది.

వర్తకుల వాణిజ్యశక్తి. ఋణసౌకర్యం వారి స్థాయిలను బట్టి రెండు మూడు వర్గీకరణలు చేసి అంచెలంచెలుగా ఓచరు విధానము ప్రవేశపెట్టడం మంచిదేమో? పరిశీలించ వలసినదిగా కోరుతున్నాము. ఓచరు విధానము జయప్రదం కావడానికి ఈ దిగువ సూచనలు యుపయుక్తములేమో పరిశీలించ ప్రార్థన. మొదటిది: 1978 లో అన్ని సిగరెట్ కంపెనీలు ఐదుకోట్లకు పైబడిన ఎగుమతుల వ్యాపారం గల వర్తకులు ఆ వర్తకుల మధ్య స్థానిక వ్యాపారులు. రెండవది: 1979 లో మూడు కోట్లు - ఐదుకోట్ల మధ్య ఎగుమతిదార్లు, మూడవది: 1980 లో ఒక కోటి వరకు ఎగుమతిదారులు. మిగతా వ్యాపారంచేసే వర్తకులు.

ఇందుకు తోడు చిన్న వర్తకులనుంచి కొనుగోలుచేసే పొగాకుకు పెద్ద వరకులు ఎగుమతిదార్లందరూ, అనగా వర్తకుల మధ్య జరుగు స్థానిక వ్యాపారం ఓచరు విధానాన్ని 1978 లోనే నిర్బంధంగా అమలు జరుగుటకు బోర్డు చర్యలు తీసుకొనాలి. ఇందువలన పరోక్షంగా రైతులకు మేలు జరుగుతుంది.



— శ్రీ దరువగారి వీరయ్య

"ఆంధ్రజ్యోతి నుండి"

వర్జినియా పొగాకు, దాని పుట్టుపూర్వోత్తరాలు

"1971 మార్చి 20వ తేదీన గుంటూరులో నాటి కేంద్రప్రభుత్వ వాణిజ్యపరిశ్రమల వ్యవహారాల మంత్రి శ్రీ కొత్త రఘురామయ్య అధ్యక్షతను జరిగిన పొగాకు రైతుల మహాసభలో పొగాకు రైతుల సంఘం అధ్యక్షులు, ఆహ్వానసంఘ అధ్యక్షులునైన శ్రీ దరువూరి వీరయ్య చేసిన స్వాగతోపన్యాసంలోని కొన్ని భాగాలను సంక్షిప్తంగా వ్యాసరూపంలో ప్రచురించుచున్నాము"

పొగాకు రైతులు ప్రతి రెండు మూడేళ్ళకొకమారు, ధరలు పడిపోయి ఎంతకయినా కొనేనాధుడులేక, అలవలు సులవలకు కొన్నవారయినా డబ్బు చెల్లించక రైతాంగాన్ని మరిన్ని బాధలకు గురిచేయుచూ, రైతుల శ్రమ

శక్తిని పోచుకొని రైతులు వ్యవసాయ పరపతి పుట్టుక, వ్యవసాయం సాగక నానాయాతనలు పడుతూండగా, తామేమో ఆకాశహర్మ్యములు నిర్మించుకొంటూ భర్కకొకకారు, బిడ్డల షికారుకొకకారు, తనకొక దిగుమతి చేసిన కారు, రిఫ్రిజరేటరు, గదికొక ఎయిర్ కండిషనరు (ఎట్రిన్‌తోసహా) మొదలయిన ఆధునిక సౌకర్యాలను గడపడం, జరుగుతుంది. ఈ విషయాలన్నీ కండ్లకు కట్టినట్లున్నదీవ్యాసం.

— సంపాదకుడు

పొగాకు భారతదేశమునకు కొత్త పంటయేనని తెలియుచున్నది. పొగాకును గురించిన పుక్కిటి పురాణములే తప్ప యితర ఆధారములు కానరావడంలేదు.

ప్రాచీన, ఆధునిక వ్యవసాయ శాస్త్రము నంతను మధించి చారిత్రక, సాంకేతిక, శాస్త్రీయ ధృక్పథముతో బహుశ పరిశ్రమచేసి పరిశోధించి వ్యవసాయ శాస్త్ర గ్రంధములను పుంఖాను పుంఖములుగా తెలుగు దేశమున కందించిన సుప్రసిద్ధ వ్యవసాయ శాస్త్రగ్రంధముల రచయిత స్వర్గీయ గోదేటి జోగిరాజుగారు, వేదములు, పురాణములు, ఇతిహాసములు భారతదేశ నాగరిక చరిత్ర, బృహత్సంహిత ఆదిగాగల మరి అనేక ప్రాచీన ఆధునిక వ్యవసాయశాస్త్ర గ్రంథములు ఆధారంగా రచించిన గ్రంథములలో పొగాకుకు యే విధమైన స్థానం యివ్వకేదుగదా దాని వూసేలేదు.

ఆ తరువాత తెలుగుభాషా సమితివారు ప్రచురించిన "వ్యవసాయం - పశు పోషణ - ఆటవీ సంపద" అనే గ్రంధాలలో కూడా 18 శతాబ్దమునకు పూర్వం పొగాకు భారతదేశంలో వున్నట్లు తెలుపలేదు.

18 శతాబ్దం ప్రథమ భాగంలో పోర్చుగీసువారు భారతదేశంలో పొగాకును ప్రవేశపెట్టినట్లు సృష్టీకరించారు. దీనితోపాటు వేరుశనగ, బత్తాయి, నారింజలను సైతం వారే ప్రవేశ పెట్టినట్లు ప్రకటించారు.

వ్యవసాయోత్పత్తులలో ఆహార పంటలు, వాణిజ్యపంటలు అనే రెండు రకాలు ఆ తరువాత ఆయాపంటల గుణదోషములను అనేకములయిన వర్గీకరణలు కూడా చేశారు. గుణదోష వర్గీకరణయందు పొగాకు, గంజాయి, సునాముఖిలను నిషావస్తువులయిన ఓషధులన్నారు.

పొగాకుకు సంబంధించినంత వరకు ఓషధి అవునో కాదో కాని నిషావస్తువు అని స్పష్టంగా చెప్పవచ్చును. ప్రతి నిషావస్తువు వినియోగం విలాసంగానే పరిగణించ బడుతుంది, అందువలననే కాబోలు "అన్నం పరబ్రహ్మ స్వరూపం"అన్నా, అదిలేనిదే జీవితం సాగదన్నది పరమసత్యమేకాక ఆచరణలో ఋజువైనా, ఒక మారు అలవాటయిన వ్యక్తికి అన్నంకంటే కూడా పొగాకు గంజాయి, భంగు, సారాయములకు ప్రధమస్థానం యిస్తారు. ప్రధమ స్థానమేకాదు ప్రాణాన్నయినా తృణ ప్రాయంగా అర్పిస్తారు.

గుండెజబ్బో రక్తపు పోటో, క్షయోవచ్చి ప్రాణాపాయ స్థితిలో వున్నప్పుడు డాక్టరు పొగాకు, త్రాగుడు మానేయమంటే రోగి సుతరామూ అంగీకరించడు, ప్రాణలకంటే కూడా పొగ త్రాగడానికే హెచ్చు ప్రాధాన్యత నిస్తాడు.

చుట్ట బీడి, సిగరెట్టు, తంబాకు, నశ్యం మొదలగు పొగాకు తయారీలు ఒకమారు అలవాటుపడితే చుట్టో, సిగరెట్టో, బీడియో ముట్టించి ఒకదమ్ము లాగక పోతే రచయితకు రచన సాగదు. ఒక చిటికెడు నశ్యం రెండు ముక్కులకు దట్టించి చిదకపోతే కావ్యపఠనం సాగదు. కవనం అల్లలేడు. ఇంతెందుకు దున్నే దున్నే అరకను ఆపి ఒక దమ్ము చుట్టపీలిస్తే తప్ప చాలు సాగదు.

కమ్మని పంచభక్ష పరమాన్నములు భుజించి బేర్రుమని త్రేపుకొంటూ మంచంపై మేనువాల్చుతూనే పొగ చుట్ట ముట్టించి పొగ వదలుతూ ఆలుబిడ్డలతో చిన్న. పెద్దలతో, మరుదినం చేయవలసిన పనులు జరిగిన పనులలో లోపాలు, వ్యవసాయదారుల కష్టనష్టములు, కష్టసుఖాలు మధ్యమధ్య పంచాయితీ రాజకీయాలు మరెన్నో విషయాలు ధారావాహికంగా చెప్పుకుంటూ చుట్ట ఆరిపోతూనే, గుర్రున నిద్రపోతారు. అలానే నాగరికులు సిగరెట్, బీడి లేకుండా కాఫీ త్రాగరు. రచన సాగించరు. నిద్రపోరు. కాబట్టి నిషావస్తువే అయినా ఆరోగ్యాన్ని చెడగొడుతుందని వైద్యశాస్త్రజ్ఞులు చెప్పుచున్నా పొగత్రాగుడు మానడం జరగకపోగా ఏటా 7శాతం నుండి 15 శాతం దాకా పెరుగుతూన్నట్లు గణాంక ప్రవీణులు తెల్పుచున్నారు.

పెరుగుతున్న పొగ త్రాగే అలవాటు వృష్ట్యా పొగాకు ఉత్పత్తులు కూడా పెరగక తప్పదుగాక తప్పదుగదా : అందుకు అవసరమైన ప్రణాళిక ప్రభుత్వ కర్తవ్యాల గురించి ముందు వివరించుకొందాము.

పొగాకు అమెరికాలో ప్రప్రథమంగా కనుగొన బడిందని ఒక కథ వున్నది. 1492 లో కొలంబస్ తన అమెరికా యాత్రను గురించిన రచనలో ఒక గొట్టంలో

వేదోవేసి నిప్పంటించి దానిని పీల్చడం ద్వారా అక్కడి స్త్రీలు, పురుషులు పొగను పీల్చడం చూచానన్నారు.

1535 లో ఫ్రెంచి యాత్రికుడు జాన్స్‌కార్టియర్ అనే అతడు సెయింట్ లారెన్స్ నదీతీరంలోని ఇండియన్‌లు, రాతి గొట్టాలలోగాని, చక్కగొట్టాలలోగాని పొగాకును దట్టించి పొగను పీల్చడం తాను చూచినట్లుగా వ్రాసుకొన్నాడు.

పదహారవ శతాబ్దం మధ్యకాలంలో వెస్టిండీస్‌లో తమ వలసలనుంచి స్పెయిన్‌వారు పొగాకును రవాణా చేయనారంభించారని మరొక కథ వున్నది. ఇచ్చటి సంపన్న కుటుంబాలలో పొగ పీల్చడం ఒక రకమైన లక్షరీ (విలాసంగా) యెంచబడింది. కాలక్రమేణా అది సాధారణ ప్రజలలోకి కూడా వ్రాకింది.

ఇక పొగాకుకు గిరాకి పెరగడం ప్రారంభమైంది. అదొక విలాసంగా కూడా యెంచబడిండట. క్రమక్రమంగా యూరప్ అంతటా పొగ పీల్చడం అలవాటు చేసుకొన్నారు. దాంతో ఇంకా కొందరు ఇది ఆరోగ్యకారక మన్నార. మరికొందరు ఆరోగ్యానికి హానికర మన్నారు. ఇదొక వివాదంతో పడింది.

ఆ నాటి ఇంగ్లండ్‌రాజు మొదటిజేమ్స్ పొగాకు నిషిద్ధ వస్తువని అన్నాడు. 1604 లో పొగాకుకు ప్రతి కూలంగా మారుపేరుతో ఒక ప్రచార వ్యాసం వ్రాసి ప్రచురించాడు కూడా. కాని పొగాకు దిగుమతులపై సుంకాన్ని వసూలు చేయడానికి అంగీకరించాడు.

పొగాకు ఉత్పత్తి ప్రారంభాన్ని గురించి మరొక కథ కూడా అమెరికాలో బహుళప్రచారములో వున్నది. అదేమంటే ఇండియన్ జాతినాయకుడు పొహాటన్ కూతురు పోకహాంటాస్‌ను వివాహం చేసుకొన్న జాన్‌రోల్ఫ్ అనే అతడు 1612 లో వర్జీనియాలోని జేమ్స్ టౌన్‌లో ప్రప్రథమంగా పొగాకు సాగు చేపట్టాడట. అయితే స్థానికమైన పొగాకు మేలురకం కాకపోవడంవలన వెస్ట్ ఇండీస్‌నుండి మంచి విత్తనాలు సంపాదించి మేలురకం పొగాకు పండించ సారంభించాడట. ఆనాటినుండి ఇంగ్లీషు వలస ప్రాంతాలనుండి పొగాకు ఎగుమతులు విరివిగా పెరిగాయి. ఇంగ్లండుకు పొగాకును అమ్మి వర్జీనియావారు గుడ్డలు, పరికరాలు మందుగుండు సామగ్రి వగయిరా సామగ్రినికొనుక్కొనడం ప్రారంభించారు.

పొగాకుపై లాభాలు బాగా ఆకర్షణీయంగా వున్నాయి. జేమ్స్‌టౌన్‌లో 1616 ప్రాంతంలో వీధులలో కూడా పొగాకు పండించడం మెదలెట్టారు. ఆ తర్వాత

200 సంవత్సరాలకు అమెరికానుండి ఎగుమతి అయ్యే ప్రధానమైన వాణిజ్య సరుకు పొగాకు. 1818లో ప్రత్తినుండి విత్తులు విడదీసే యంత్రం కనుగొన్న తరువాత పొగాకు ఎగుమతి వ్యాపారం ద్వితీయస్థానంకో పడింది.

వలసకాలంలో వర్జీనియా, మేరీలాండ్ పొగాకు రైతుల లాభాలు, అదృష్టాలు చిత్ర విచిత్రములుగా కథలు, గాథలుగా బహుళప్రచారముకో వుండేవట.

పొగాకును ఇంగ్లీషువారి ఓడలలోనే ఇంగ్లండుకు ఎగుమతి చేయాలని నిబంధన ప్రవేశపెట్టారు. ఇక ఆయా ప్రభుత్వాలు తమ తమ ఆదాయం కొరకు ఎగుమతి సుంకాలు ఎగుమతి చేసుకొనేవారు ప్రవేశపెట్టగ, దిగుమతి చేసుకొనేవారు దిగుమతి సుంకాలు ప్రవేశపెట్టారు. ఈ దిగుమతి సుంకం పడించడంలో ఇంగ్లండుదే పైచేయిగా వుండేది. ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో పొగాకుపై దిగుమతి సుంకానిది అగ్రస్థానమట. దాంతో ప్రభుత్వానికి మంచి రాబడి యేర్పడింది.

ఇక అమెరికా సంగతా ! తమ పొగాకుకు మంచి మార్కెట్‌గా రూపొందిన యూరప్ ముఖ్యంగా ఇంగ్లండ్ అమెరికాకు చాలా పెద్దదూరం కావడంతో ఇచ్చటి ఉత్పత్తిదారులకు, వ్యాపారస్తులకు నిక్కచ్చిగా ఎంత లాభం వస్తుందో, అంతు పట్టడంలేదు. పాతపంట అమ్ముడుపోయిందో లేదో సరిగా తెలిసేదికాదు. పాతపంట ఇంగ్లండులో సరిగా సకాలంలో అమ్ముడుపోయిందో లేనో తెలియకముందే కొత్త పంట వేయు తరుణ మొచ్చేది. ఒక సంవత్సరం బాగా లాభం వచ్చిందిగదా అని మరుసటి సంవత్సరం హెచ్చుభూమిలో అమితంగా పండించేవాడు. ఖర్చులుగూడా గిట్టేవి కావు. దాంతో మరుసటేడు పంట తగ్గించగా ధరలు ఆకాశాన్నంటి, రైతులకువల్లమాలిన లాభం. ఇలాలాటరీ అయింది. చివరకు పొగాకుపంటను పరిమితంచేస్తూ చట్టాలు చేయవలసి వచ్చింది. ఒకప్పుడు అమెరికాలో ఆసలు పొగాకు పంటను సాగు నిషేధించాలనే ప్రయత్నం చేయవలసివచ్చింది. అయితే ఆ ప్రయత్నం నిండుగా సఫలం కాలేదు.

పొగాకు ఉత్పత్తి అయ్యేదేశాలలో, ఎగుమతి అయ్యే దేశాలలో సుంకాలవలని బాగా రాబడిపెరిగింది. అప్పుడు ఫ్రాన్సు మరికొన్ని యూరప్ దేశాలు పొగాకు వాణిజ్యం ప్రభుత్వమే నేరుగా చేపట్టాయి.

అమెరికా విప్లవం నడపడానికి బెంజిమన్‌ఫ్రాంక్లిన్ ఇరవై లక్షల డాలర్ల ధనాన్ని అప్పుతీసుకొని దానికి బదులుగా 50 లక్షల పౌనుల మేలురకం వర్జీనియా పొగాకును పంపడానికి ఫ్రాన్సుతో ఒప్పందం చేసుకొన్నాడు. వాణిజ్యంలో పొగాకుకు ఎంతటి విశిష్టత, ప్రాధాన్యతకలదో దీనినిబట్టి అర్థం చేసుకొనవచ్చు.

నేడు అమెరికాకు కేవలం ఎగుమతి చేయు ముడి పొగాకుపై సుంకాలద్వారా 800 కోట్ల డాలర్లు ఆదాయం లభిస్తుంది. (ఇప్పుడు ఇంకా పెరిగివుంటుంది.)

నేడు అమెరికాలో సాగుకింద్రగల భూమిలో, $\frac{1}{3}$ శాతం మాత్రమే పొగాకు పంట సాగు చేయబడుచున్నది. 18 రాష్ట్రాలలో యీ పంట విస్తరించియున్నది. ఇందు అధికంగా పండించే రాష్ట్రాలు, కెరోలినా, కెంటకీ, వర్జీనియా టెన్నెసీ, జార్జియాలు.

ఇచ్చట మనం గమనించవలసిన అత్యంత ప్రధానమూ, ప్రముఖమూనైన విషయమేమంటే, అమెరికాలో పొగాకు పైరుచేయు 18 రాష్ట్రాలు కేవలం వ్యవసాయక రాష్ట్రాలు, అమెరికానుండి పొగాకు ఎగుమతి చేసుకొంటున్న అందునా 80 శాతం దాకా ఎగుమతి చేసుకొంటున్న ఇంగ్లండు దేశం. ఇది కేవలం పారిశ్రామిక దేశం. ఇచట పొగాకు ఉత్పత్తికి అవకాశం లేదు. ఆ కారణంగా తమ సిగరెట్ పరిశ్రమకు ముడి సరుకు దిగుమతి చేసుకొంటున్న అమెరికామీద ఆధారపడవలసి వచ్చింది. అమెరికాలో రాను రాను పొగాకు ధరలు పెరిగాయి. దాంతో వారు తమకు అసంఖ్యాకంగావున్న వలస దేశాలతో పొగాకు ఉత్పత్తికి అనువైన దేశమేదా అని అలోచనలు సాగించారు. అప్పటికే వంద సంవత్సరాలకు పైగా భారత రైతాంగము యొక్క ముఖ్యంగా ఆంధ్ర రైతాంగముయొక్క శక్తి, సామర్థ్యాలు దూరదృష్టి, ముందుచూపు సాహసం పట్టుదల అవగాహన అయింది. యే పైరునయినా పండించగలనేర్పు, ఓర్పు, నేర్పు ఎర్రరేగడినేలలు వారి కండల్లో మెదిలాయి, వర్జీనియా పొగాకు ఉత్పత్తికి ఆంధ్రదేశం. ఇచటి రైతాంగం అన్నా మైనదిగా నిర్ణయించుకొన్నారు.

ఐ. ఎల్. టి. డి. అవతరణ

1920 ప్రాంతాల్లో బ్రిటిష్. అమెరికన్ కంపెని తాలూకు నిపుణులు, ఇండియాలో కాలూనారు. ఇంపీరియల్ టుబాకోకంపెని స్థాపించారు. పొగాకుపంట నాణ్యంగా ఉత్పత్తి చేయుటకుగాను "ఇండియన్ లీఫ్ టుబాకో డెవలప్‌మెంట్ కంపెని (I. L. T. D.) నెలకొల్పారు.

వారు విత్తనాలు సరఫరా చేశారు. నారుపోయడంలో మెలకువలు అలవర్చారు నాటువేయడం, తోటపెంచడం ఆకు ఎండగట్టడంలో శిక్షణయిచ్చి అప్పటికి అమల్లోవుండి ఆర్థికంగా నాలుగుడబ్బులు అదనులో శిస్తు దస్తు, చిల్లర, మల్లర అక్కరలకు చేతికందే వేరుశనగ, మిర్చి ప్రత్తి, ఆముదాలకన్నా అధనంగా రాబడి కలిగించారు. రైతులు ఆకర్షించబడ్డారు.

★

జాతీయార్థిక వ్యవస్థకు పెద్ద మొత్తం సంపాదించే పొగాకు పంట

వర్జీనియా పొగాకు ఉత్పత్తిలో అమెరికా చైనాల తరువాత ఇండియాది మూడవస్థానం. ప్రపంచం మొత్తంమీద ఉత్పత్తి కాబడే పొగాకులో ఇండియా 8 శాతం ఉత్పత్తి చేయుచున్నది. ప్రపంచం మొత్తంమీద ఉత్పత్తి 4,500 మిలియన్ల కేజిలు పంట పండుతుంది. కాగా ఇండియాలో అన్నిరకాల పొగాకులు కలుపుకొంటే మొత్తం 810 మిలియన్ల కిలోగ్రాములు పండుతుంది.

ఇండియానుండి ఎగుమతి కాబడే యావత్తు సరకులలో 65 శాతం ఒక్క వ్యవసాయోత్పత్తులే ఎగుమతి జరుగుతున్నాయి. ఇందులో పొగాకు జనపనార, కాఫీ, టీ, మసాలాదినుసు లున్నాయి. వ్యవసాయోత్పత్తుల ఎగుమతులలో పొగాకుది 2.7 శాతం. జాతీయార్థిక సంపదకు ముడి పొగాకుపై ఎక్సయిజు సుంకంద్వారా దాదాపు రు. 160 కోట్లు సిగరెట్లపైనా రూ. 120 కోట్లు తదితర పొగాకుతో తయారయ్యే వినియోగ వస్తువులపైనా, రు. 15 కోట్లకుపైగా ఎగుమతులద్వారా విదేశమారక ద్రవ్యం రూపంలోనూ, మరి రు. 2.5 కోట్లు పొగాకు ఎగుమతి సుంకంద్వారానూ మొత్తం 310 కోట్లదాకా వుంటుంది.

పొగాకు ఉత్పత్తివలన రైతు కుటుంబాలేమి వ్యవసాయ కూలీలేమి మొత్తం 2,50,000 మందికి ఉపాధి, వృత్తి కల్పించుచున్నది. మరొక 1,0 ,000 మంది దాకా గ్రేడింగ్, ప్యాకింగ్, రవాణాలవలన ఉపాధి కలుగుతూ వున్నది.

వివిధ రకాల పొగాకులు

ఇండియాలో అనేక రకాల పొగాకులు ఉత్పత్తి జరుగుతున్నాయి. ఇందు ఫ్లూరన్‌లో క్యూర్ చేయునది ఎఱబెట్టు వర్జీనియారకాలు, బీడి తయారుకు పనికి వచ్చేది నోట్లో వేసుకొనుటకు ఉపయోగపడేది నశ్యం చేయుట కనువైనది, ఎండ బెట్టు నాటు పొగాకు, మొదలుగాగల రకాలు ప్రధానమైనవి.

ఇందులో సిగరెట్ తయారీకి, విదేశాలకు ఎగుమతిచేయు ప్రముఖమ్ము ప్రధానమునై నది వర్జీనియా పొగాకు. దీనిని 1920 లో ఐ. ఎల్. టి. డి కంపెనీ వారు ఇండియాలో ప్రవేశపెట్టారు. ప్రపంచ దేశాలకు ఎగుమతి కాబడే మేలురకం వర్జీనియా ఉత్పత్తికి దోహదం చేసినది ఐ. ఎల్. టి. డి. కంపెనీ అనుటలో సందేహంలేదు.

భారతదేశంలో ఆంధ్ర స్థానం

దాదాపు వర్జీనియా పొగాకు యావత్తూ ఒక్క ఆంధ్రలోనే ఉత్పత్తి జరుగుతుందన్నా ఆశ్చర్యపడనవసరం లేదు. అంటే ఇండియాలో పండించబడే వర్జీనియా పొగాకులో 95 శాతం ఆంధ్రలోనే పండించబడుతుంది. ఇప్పుడిప్పుడే కొద్ది కొద్దిగ మైసూరు, గుజరాతులలో పండించబడుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యముగ గుంటూరు, కృష్ణ, ఉభయగోదావరులు, ఒంగోలు. నెల్లూరు, వరంగల్, జిల్లాలలో రమారమి 3,25,000 ఎకరాలలో 100 మిలియన్ల కిలోగ్రాములు (100,000 మెట్రిక్ టన్నులు) ఉత్పత్తి జరుగుతున్నట్లు అంచనాలు వేయబడుతున్నది. పై జిల్లాలలో లక్షలాది వ్యవసాయ, వ్యవసాయ కార్మిక, పారిశ్రామిక కార్మిక కుటుంబాలకు జీవనోపాధిని ఆదాయాన్ని సమకూర్చుచున్న కొంగు బంగారం పొగాకు పంట. పొగాకు పంట ఉత్పత్తి అనేక వ్యయప్రయాసలతో కూడి కేవలం చర్మ చాటరీని మైమరపించుతుంది.

మనదేమన్నా పనికిరాని పొగాకా ?

నాలుగు దశాబ్దాలుగా పొగాకును, అతినేర్పుతో, ప్రకృతి వైపరీత్యాలను తట్టుకొంటూ మేలురకం పరుగును పండించి, ప్రపంచ దేశాలకు ఎగుమతి చేయుచున్నామే : ఇంతకాలంగ పండించుచున్నా ఉత్పత్తి చేయుచున్న వైతుకు ఎందుకు గిట్టుబాటుధర లభించక బాధలు పడవలసినస్థితి ఎందుకు తప్పలేదు? మన పనికేమైనా నాసిదా ! కొందరు ప్రచారముచేయుచున్నటు కేవలం ఫిల్లర్‌కే పనికి వస్తుందా : కాదని స్పష్టమైన ఆధారాలున్నాయి గదా.

యు. కె. తదితర యూరప్‌దేశాలు తయారుచేయు ఖరీదైన మేలురకం సిగరెట్లలో, ఆయా రకాలు ప్రాతిపదికగ 11 శాతం నుండి 19 శాతం వరకు మనదేశంలో పండిన వర్జీనియా కలపకుండా దానికి ప్రపంచ మార్కెట్లో పరిగణనలేదు.

భారత భూమిపై పూసిన పువ్వుకు పరిమళము, సువాసన సహజమైనట్లే, భారతీయ పొగాకుకు ఫ్లేవర్ వుంటుంది. బేరన్‌నుండి దించగనే చుట్టూ ఫర్లాంగు దూరం వరకు మన పొగాకుకా ఫ్లేవరు నాసికకు తగులుతుంది. ఈ కారణముగనే మన పొగాకును యూరప్ దేశాలు విధిగా కొనితీరాలి.

నూరింట నూరుపాళ్ళు ఇండియా వర్జీనియా పొగాకుతో తయారైన 'ఇండియా కింగ్స్' అనే ప్రపంచ ప్రసిద్ధిచెందిన సిగరెట్‌కు ప్రపంచ సిగరెట్ వాణిజ్య

ప్రదర్శనలో పరుసగ మూడుసార్లు గోల్డు మెడల్ లభించిందంటే మన పొగాకు ఫిల్లర్ టైపు సరుకనే వాదనలో పస లేదని తేలిపోయింది.

అయితే యెందుకు మన పొగాకుకు గిట్టుబాటు, లాభదాయకమైన ధరలు లభించడం లేదంటే కేలం మన అసమర్థత, అవివేకం, అజ్ఞానమేననుటలో సందేహంలేదు.

రైతుకు నిరాశ, నిస్పృహలే ప్రతిఫలమా?

వ్యవసాయం "కత్తిమీద సాము" నిళ్ళమీద నడక లాంటిది. చూచేవారికి ఎంత మొరటుగా కనుపించుతుందో చేసేవారికి అతిసున్నితంగ వుంటుంది. మాటల్లో లేదా కవనంలో వర్ణించవలను పడని జటిలమయింది కూడా. అనుక్షణం పలు రకముల సమస్యలు యెదురవుతూ వుంటాయి. కొన్ని సమస్యలు పరిష్కరించుటకు మానవ ప్రయత్నానికి సాధ్యములు కావు. ఇన్ని జటిలసమస్యలకు కష్ట నష్టములకు, ప్రతిబంధకాలకు ఆలవాలమైన మానవుని, మానవునికే కాదు సకల చరాచర జీవకోటికి జీవనాధారమైన అన్నపానాదులను ఉత్పత్తి చేయగలది వ్యవసాయం. అందుచే కాబోలు మన మహర్షులు స్వానుభవంమీద "అన్నదాత సుఖీభవ"అన్నారు. అన్నదాత అంటే హోటలు యజమానికాదు. వంటచేసి పెట్టినవారు కాదు. సంతర్పణలు, సమారాధనలు చేయువాడు అంతకంటె కాదు. ఆహారమునకు అవసరమైన పంటలను శ్రమించి పండించే రైతుమాత్రమే.

ప్రపంచంలో శాస్త్రీయ సాంకేతిక పరిజ్ఞానం దినదినం వాయువేగ మనోవేగంతో అభివృద్ధి చెందుచున్నది. అనేక వస్తువులు కృత్రిమముగ తయారు చేయబడుతున్నాయి. గంటకు నాలుగువేల మైళ్ళ వేగంతో మధ్యలో ఆగకుండా 20 వేల మైళ్ళ దూరాన్నయినా 400 మంది ప్రయాణికులను చేర్చగల విమానాలను తయారుచేయవచ్చు. ఈ భూమండలాన్నంతటిని తృటిలో భస్మీపటలం గావించగల హైడ్రోజన్, నైట్రోజన్, పోలీవాటర్ బాంబులను నిర్మాణంచేయవచ్చు, చంద్రమండలాన్ని ఆమాటకొస్తే గురు, కుజ, బుధ అంగారకాది గ్రహాలలో మానవులను దించి, జనవాసయోగ్యం కావించవచ్చునేమో, కాని ఒక గింజ గోధుమ బార్లి, జొన్న, సజ్జ, కొర్రధాన్యముగాని లేదా ఒక కాడ పొగాకు, ఒక గుల్ల ప్రత్తి ఒక కాయ మిర్చి లేదా పండ్లు, పుష్పములుగాని తయారు చేయగలరా? లేదే? ఇక ముందయినా తయారు చేయగలరనుటకు ఆధారములు కనుబడుటలేదే!

వ్యవసాయోత్పత్తులనేవి భూమాతను నమ్మి, రక్తాన్ని ఓడ్చి, స్వేదాన్ని ర్చి, కండలు కరిగించి, ఎండనక, వాననక, కాళరాత్రనక దివారాత్రములు

ఱిమల్లు, కరచే పామును సరకుచేయక, తాలికోడి కూతతో మంచంపిగి, తిరిగి ఏ అర్ధరాత్రికో నడుం వాల్చని కర్షక సార్వభౌములే భూమిసిదున్ని ఎరువేసి, నారునాటి, ప్రశాంతిలేని బండచాకిరిచేసి ఉత్పత్తి చేయువలసిందేగాని అన్యధా శరణం నాస్తిగదా?

కోటికి పడగలెత్తి కులకవచ్చు. అంబర చుంబితములైన రమ్య హర్మ్యాలలో, బంగరు టుంగుటుయ్యాలలో వూగవచ్చు. గంటకు రెండువేలపైళ్ళ వేగంతో పయనించే విమానాలలో వూరేగవచ్చు. సెకండుకు వేలల్లో ఖర్చుచేయగల తాహత్తు సంపాదించవచ్చు. వజ్రవైడూర్య, మణిమాణిక్యములతో తులతూగవచ్చు కాని, మానవుడు బ్రతికి బట్ట కట్టాలంటే అన్నం కావాలిగదా అందుకే వేదములను మానవాళికి ప్రసాదించిన మన మహర్షులు యెంతో పరిశోధనచేసి, పరిపిడిపెట్టి స్వానుభవంలో వెలువరించిన పరమసత్యమే "అన్నదాత సుఖీభవ" సందేశమూయొక్క ఉత్కృష్ట తను మధించిన మహామనిషి కావడంవలనే నేమో నోబుల్ బహుమతి గ్రహీత విశ్వకవి రవీంద్రులు తన గీతాంజలిలో రైతును దైవాంశసంభూతుడని యిలా ప్రస్తుతించారు.

సంగీతశ్లోకాలు, రుద్రాక్షజపాలు మానెయ్యి యీ కవాటిబంధిత దేవాలయంలో ఈ చీకటికోనలో యెవరిని నీవు పూజించేది కళ్ళుతెరచి చూడవయ్యా నీ దేవుడిచట కనుపించడు.

"అడుగో అచట కర్షకుడు కటికపేలను
దుంతున్నాడే మార్గకర్త.
రాయిరప్పలు సరిజేస్తున్నాడే అచటనే.
అచటనే ఆ దేవు డున్నాడు!

అడుగో ఆ యెండలో ఆ వర్షంలో వారిమధ్య! ఆయన పైన వస్త్రం చూచావా మైలపడింది. నీ పట్టు వస్త్రాన్ని అవతల పారవేసి ఆ దేవునివలెనే నీవూ ధూళి ధూపరితమైన యీ భూమిపైకి రమ్ము"

పుణ్య పురుషుడు, మానవతావాది, మహామనిషి విశ్వకవి రవీంద్ర కవీంద్రు లన్నట్లు మానవకోటికి, అంతేకాదు. యీ విశాల విశ్వంపై పుట్టుతూ, గిట్టుతూవుండే చరాచర జీవకోటికి జీవనాధారమైన రైతు సార్వభౌముడే శ్రీ మహావిష్ణువు, బ్రహ్మ ఈశ్వరుడు, బుద్ధుడు, జైనుడు, క్రీస్తు, మహమ్మద్ అవతారముల ప్రతి స్వరూపము. అట్టి పరమ పవిత్రుడు, జగద్రక్షకుడునైన ఆ రైతును పూజించని కరములు కరములా? ధ్యానించని నోరునోరా;

ప్రాచీన కాలంనుండి వేదములు, పురాణములు, స్మృతులు, స్మృతులు, బైబిలు ఖురాను మొదలగు పవిత్ర మత గ్రంధములు ఆన్నదాత సుఖీభవ అంటూ గానం చేశాయి. ఈ పరమ పవిత్రమూ, పూజనీయమూ, ఆరాధ్యనీయమూనైన పరిపూర్ణ సత్యమును గుర్తించిన వాడు కావుననే విశ్వకవీంద్రులు సంగీత శ్లోకాలు, రుద్రాక్ష జపాలుతో చీకటికోనలో, కవాట బంధాల్లోవున్న నోరువాయిలేని రాతి విగ్రహాన్ని పూజించడానికి బదులు అడుగాలము అష్టకష్టములుపడి, నష్టములను బేరీజువేసుకొని యేడుస్తూ కూర్చొనక పంటలు పండించి తాను తిన్నా తినకపోయినా చరాచర జీవకోటికి అన్నపదానంచేయు "దైవసముడు" సర్వసముడైన ఆ రైతుబాబునే ఆరాధించండి, పూజించండి, గౌరవించంది అదే మీకు మీ దేశానికి సర్వమానవాళికి భక్తి, ముక్తి కలుగుతుందన్నారు.

కాబట్టి ఓ సోదరులారా ! మహాజనులారా మనమంతా ముక్త కంఠముతో, దీక్షతో సర్వసముడు, ప్రేమైక మూర్తియునైన ఆ జగదీశ్వరుని ఇలా ప్రార్థిద్దాము.

మానవజాతి మనుగడకోసం, జాతీయాభివృద్ధికోసం మానవతాధృక్పధంతో కరుణామయ హృదయంతో రైతాంగాన్ని. రైతాంగ వ్యవస్తను అభిమానించి. ఆదరించి, గౌరవించి, వారి కష్టఫలము ప్రతిఫల ఆశించకుండా పరాన్నభక్తులై మృష్టాన్నంగా భుజించక, వారి శ్రమకు తగిన ఫలితాన్ని వారి కందజేసి అదుకొన వలసిందిగా కోరుతూ, అలాంటి సద్బుద్ధి, దూరాలోచన పాలకులకు, వాణిజ్య వర్గాలకు కలుగజేయవలసిందిగా ప్రార్థిద్దాము.

కాని స్వతంత్ర భారత ప్రభుత్వ అధినేతలు వ్యవసాయాన్ని, వ్యవసాయదారులను చిన్నచూపు చూస్తున్నారు. నిరాదరణ చేయుచున్నారు. వాణిజ్య వర్గాలు వారి శ్రమశక్తిని నిలువునా దోచుకుంటుంటే గుడ్లప్పగించి చూస్తున్నారు. శ్రమించి పంటలు పండించడం మాత్రమే రైతువంతయింది. సుఖసౌఖ్యాలు ఎండమావులయ్యాయి.

ప్రభుత్వోద్యోగి, రాజకీయవాది, వడ్డీవ్యాపారి, తదితర వాణిజ్యవర్గాలు రైతుల రక్తాన్ని జలగల్లా పీల్చుకు త్రాగుతున్నారు. వారి ఎముకల్లో మూలిగలు నమిలి మ్రింగుతున్నాగు. "వట్టి విస్తర మంచినీళ్ళ" సామెతగా ఎప్పుడో తీరుబడి సమయం చూచుకొని సానుభూతి ప్రకటనలు, ఓదార్పు మాటలు చెప్పుచూ వారి పేరనే వారిని అవమానాలపాలు చేయుచున్నారు.

ప్రభుత్వ ఆదరణలేక, న్యాయము, ధర్మము గిట్టుబాటునైన ధరలు రాబట్టు కొనుటలో పై యావత్తు కారణాలవలన రైతాంగం విఫలమైందని ఋజువై పోయింది అందుచేత రైతాంగానికి నష్టకష్టాలు, నిరాశ నిస్పృహలే చివరకు ప్రతిఫలంగా లభించాయి.

ఇక మనం కొంత ముందుకుపోయి, ప్రస్తుతం నేటి మన చర్చనీయాంశమైన పొగాకు ఉత్పత్తి, క్యూరింగ్, గ్రేడింగ్ మార్కెటింగులకు సంబంధించిన సమస్యల గురించి చర్చించు కొందాము.

వర్జీనియా పొగాకుతోపాటు కొనితెచ్చుకున్న కష్టాలు, నష్టాలు, బాధలు.

పొగాకు ఉత్పత్తి, విక్రయాలలో ఒడిదుడుకులు, కష్టనష్టాలు దాపురించడం కొత్తేమీకాదు. వర్జీనియా పొగాకు మన దేశంలోకి యే దుర్ముహూర్తాన యేమంటూ కాలు పెట్టిందోగాని, దాతోపాటె వచ్చాయి. కడుపులో నిప్పు కదిలకుండా వేళకింత కలోగంజో త్రాగి నిమ్మకు నీరెత్తినట్లు, ప్రశాంతంగా బ్రతుకులు సాగించు కొంటున్న రైతాంగానికి కష్టాలపాలు చేసింది బ్రతకంతా లాటరీగా, ఎండమావులుగా మార్చింది. ఆ కష్టాలైనా ఒకటి, రెండూ కాదే! విత్తనములు మడిలో చల్లినది లగాయతు గ్రేడ్‌చేసిన పొగాకు కంపెనీకిచేర్చి అమ్మి ఇల్లు చేరేలోపల సంవత్సరమంతా అనుక్షణం కష్టాలు, నష్టాలు తలంచుకొని భయపడటం పరిపాటయింది.

భయమంటే ఇష్టికొచ్చింది. పొగాకు నారుపోయడం. నాటువేయడం, తోట పెంచడం, ఆకు వలవడం, కర్రలకు అల్లడం, బేరన్ యెక్కించడం క్యూర్ చేయడం, రేకలు దించడం. గ్రేడు చేయడం, చెక్కలు త్రొక్కడం, కంపెనీకి తోలడం, అమ్ముకోవడం మొదలగు అన్ని పనులలో అనుభవం గల ఒక మిత్రుడు వివిధ స్థాయిలలో యెలా భయంతో జీవితం సాగిస్తారో స్వానుభవంతో యిలా చెప్పాడు.

మడిలో విత్తనాలచల్లి ఇల్లు చేరితే సరిగా మొలకెత్తుతుందో లేదో నన్నే భయం.

మొలిచి మూడాకులు వేయగానే చిత్తవెండ తరువాత చిత్తజల్లు పడితే నారు సిరైపోతుందేమో ననేభయం.

నారు మూడు నాలుగాకులువేసి మొక్కరాటు తేలే సమయంలో మాను మచ్చపడుతుందనే భయం.

ఈ అన్ని భయాలుగడచి గట్టెక్కి చేలో నాటితే కత్తి అమోనియా, యూరియాలు చల్లిన నారయితే నాటు బ్రతుకుతుందో లేదో ననేభయం.

నాటు బ్రతికి బట్టకడుతుండగనే ఏరుపురుగు మొదలు తింటుందేమోనని భయం.

మొక్క పెరిగి పెద్దదయ్యే కొలది, పేనుబంక, మచ్చ తెగులు, పురుగు పెజ్జాలువేసి ఈనగాచి నక్కలపాలవు తుందేమోనని భయం.

అన్ని గంచాలు గడచి తీరా ఇరుపుకు రాబోయే తరుణంలో అపసుగాని అదనులో చెడుపర్షాలు పడి, మడ్డి కారిపోయి, ఆకు తేలిక్తై పోతుందేమోనని భయం.

ఇన్ని భయాలు గడచి గట్టెక్కి ఆకు విరచి బేరనుకు ఎక్కిద్దామనుకుంటే బొగ్గుదొరలు సమయానికి అంపిస్తారా లేదా అనేభయం. అందించినా ఆరుటన్నులకు కనీసం నాలుగు టన్నులయినా యిస్తారా లేదా అనే భయం అదేమని అడిగితే అప్పు యివ్వరని భయం.

ఇక బ్యారన్ దిగేదాకా రంగు పడ్తుందా రాదా అనే భయం. రంగువస్తే ప్రైక గాలి తోలి రేకలు మెత్తపడతాయో లేదోననె భయం.

ఆ తరువాత గ్రేడు చేయించి కంపెనీకి చెక్కులు ఎత్తుదామంటే ఎక్సయిజు దారు సమయానికి టి. పి. 8 ఇస్తారో లేదోననేభయం.

తీరా చెక్కులు కంపెనీకి చేరిస్తే కంపెనీవారి బయ్యరు అనే దొరగారు ఆల్లారుముద్దుగా అందచందాలతో ఇద్దరు ముగ్గురు ఒక పూటంతా శ్రమించి తొక్కిన చెక్కును బ్రద్దలుకొట్టి ఎడాపెడా దూసిపారేసి, ముక్కవద్ద పెట్టుకొని ఆముదము తాగిన మూతి పెట్టినప్పుడు మనవరకు నచ్చలేదేమోననే భయం.

ఆరుగాలము కష్టించి అనేక వ్యయప్రయాసలకు ఓర్చి కంపెనీ ప్లాట్‌ఫారంపై పెట్టిన చెక్కుకు ధరవేయబోయే దొరగారికి భగవంతుడేమి బుద్ధి పుట్టిస్తాడో, ఎంత ధరవేస్తాడోనని ఆయనముఖంకేసిచూస్తూ నోరు తెరచుకొని గుడ్లు తేలేసి చూస్తుంటే చెక్కుమొఖం సరకు ముఖం చూడకుండా, రైతు ముఖంచూచి 1 V

4 V పొగాకు అనిరు. 300–00 అంటూ చీటిమీద బరబరా గీకేసి, బ్రహ్మ నీ నుదుట వ్రాసిన వ్రాలు నన్నేమి చేయమంటావన్నట్లు కొరకొరా చూసి, దాటి పోతాడు. గడచిన అన్ని భయాలతో సతమతమైన రైతు నోటమాటరాక, కాళ్లు తడబడి, ఆశ్రుపూరిత నయనాలతో వేసిన ధరలకు చెక్కులు వదలక, ఇంటికిచేర్చుకొందామంటే దయాశూన్యులయిన లంచగొండి ఎక్సయిజు అధికారుల చుట్టూ తిరిగివారి యీసడింపు మాటలు భరించలేక పరగడుపుననే ఇల్లుచేరి, ఎదురుగావచ్చి ఎంత ధర పడిందని అడిగే భార్యాబిడ్డల ముఖమైన చూడకుండా ఆ ఏమి ధర నాశాబ్దం అనుకొంటూ మంచంలో కుప్పకూలి పోతాడు.

అప్పులు–అప్పులు. జీవితమంతా అప్పులు

ఇండియాలో పొగాకుది బయ్యర్సు మార్కెట్ అనేది జగమెరిగినసత్యం గదా! వారి దయాదాక్షిణ్యాలపై అందిన ధరలు ముడింపువేసి ఓ–ఓచరు మొహాన పారవేస్తారు. ఇక్కడనుండి కంపెనీ స్థాయినిబట్టి, కాళ్లు అరిగేట్లు తిరిగి వసూలు చేసుకొనవలసి యున్నది.

పొగాకురైతు అప్పులతోనే జీవితాన్ని ప్రారంభిస్తాడు. ఎరువులు తెగుళ్ళ మందులు, బొగ్గు మొదలు నారు, ఏతకూలి, ఇరుపు కూలి, గ్రేడింగు కూలి, పురిపట్టలు అన్ని అప్పులే. ధర పడే లోపల పొందే కష్టాలు నష్టాలు, అనుభవించే భయం ఒక ఎత్తుకాగా. ఓచరు చేతికొచ్చిన తరువాత బుణదాతల తాలూకు ఆధునిక "నక్షత్రకులు" ఇంట్లోవున్నా, పొలము పోయినా, బజారులో నిలచినా, బస్తీకెళ్ళినా, వెంటాడుతూ, దొంగను తరిమినట్లు తరుముతూ, కంటిమీద కునుకు పట్టకుండా దూడబాతుల్లా పీక్కుతింటారు. ఆత్మాభిమానం, ఆభరణంగా జీవిత విధానంగా ఎంచిన రైతు సిగ్గుతో తలవంచుకొని వెనక ముందులాలోచించకుండా భార్యా బిడ్డలనగా నటా తాకట్టుతో తెచ్చిన అప్పులు తీర్చి, తిరిగి తమ నగలు తమకు ముట్టచెప్పలేదంటూ సణుగుల, గొణుగులు, ఈసడింపులు, ఎత్తిపొడుపులు భరించలేక, ఇంట్లో తాపీగా విశ్రాంతిగా, మెసలలేక, కన్ను బుస్సుమంటూ ప్రపంచ భుజాన వేసుకొని, కంపెనీకి పోయి, ఓచరుమీద సంతకంపెట్టి పెళపెళ, తళతళ మెరిసే కరెన్సీ నోట్లు చేతికందుకొని అప్పుల వారికి పేలాల్లాపంచి, రిక్త హస్తాలతో దీనవదనంతో ఇల్లు చేరడం ప్రతి మూడేళ్ళలో రెండేండ్లు సర్వసాధారణమై పోయింది.

ఆ ఒక్క యేడయినా, గాలిపాటు సరిగావుండి, కష్టించి అధిక ఖర్చులు భరించి ఉత్పత్తి చేసిన రైతులకు పెద్దగా చెప్పుకోదగిన లాభాలు రావు. మందానికి

గిరాకికి పొగాకు ధరలలో మార్పులేదు. ఇంట్లో అట్టం లేకుండా వెంటనే మొత్తం అన్ని గ్రేడుల పొగాకు విడుదలవుతుంది. అంతే.

మిర్చి, వేరుశనగ, పసుపులాగా గిరాకిలో పొగాకు పెద్దగా ధరలు పెరగవు. మహా పెరిగితే క్వింటాలుకు రు. 25-00 ల నుండి రు. 50-00 ల కన్నా ధరలు పెరగవు. మిర్చి మందమయితే క్వింటాలు 170-00 లుంటే గిరాకిలో క్వింటాలు రు. 500-00 లనుండి 900-00 దాకా వుంటుంది. పసుపు మందానికి గిరాకికి రు. 200-00 ల నుండి రు. 500-00 మధ్య వుంటుంది. ఇలాగే ఇతరపంటల విషయంకూడా.

కాగా పొగాకు ధరలతో మార్పు వుండకపోవడానికి ప్రధాన కారణం, పొగాకు ధరలు నిర్ణయించడంలో, గుత్త వ్యాపారులు, సిగరెట్ పారిశ్రామిక సంస్థల అదృశ్యహస్తం పనిచేస్తుండటంలో ఇసుమంతయినా సందేహంలేదు, పొగాకు ఉత్పత్తిదారుల గిట్టుబాటు లాభదాయకమయిన ధరలు రాకుండాచూడే యీ అదృశ్య హస్తాన్ని ఛేదించకుండా మనమెలా బయటపడగలము. ఇందుకు ప్రత్యామ్నాయ మార్గంలేదా. వున్నది ఎందుకు లేదు. ముందు ముందు చర్చించుకుందాము.

పొగాకు వ్యవసాయం - దాని వ్యయ ప్రయాసలు

అసలు వ్యవసాయమే అతి సున్నితమైనదనే విషయంలో ప్రపంచం మొత్తంమీద వివాదం లేదు. ఇక పొగాకు వ్యవసాయం సంగతి సరేసరి పంట మార్పిడీ చూచుకోవాలి. వచ్చే యేడు వేయాలంటే ఈ సంవత్సరం వేయవలసిన పంటను గురించి ప్లాను చేసుకోవాలి. దుక్కిపాటు బాగా చేయాలి. సాలు, ఇరవాలు మూలసాలు, దుక్కికి దుక్కికి మధ్య వారం ఛాళీయిస్తూ మూడూ లేక అవసరాన్ని బట్టి నాలుగు సాళ్లు కూడా దున్నాలి. గడ్డిపరక లేకుండా చేతులమీద ఏరిపారేయాలి. రెండు లేక మూడు సాళ్లు గొట్టి తోలాలి. పెళ్ళ లేవకుండా మెత్తగా భూమిని బాగుచేసి అచ్చుతోలి నాటు వేయాలి. పశువుల ఎరువుతోపాటు, రసాయినికపు ఎరువులు, రంగు రావడానికి పొటాష్ మొదలగునవి సకాలంలో భూమికి అందించాలి.

ఇంత చేసినా అంచనాప్రకారం, మేలురకం తయారు కావడం, కాకపోవడ మన్నది ప్రకృతి దయమీద ఆధారపడివుంటుంది. ఋతుపవనాలు, గాలిపాటు అనుకూలంగా వుండాలి. ప్రకృతి మన చెప్పుచేతల్లో వుందదే? అతివృష్టి కాకూడదు అనావృష్టి కాకూడదు. సకాలంలో సమపాళ్ళతో వర్షించాలి. పొగాకుకు ముఖ్యంగా

గాలిపాటు అవసరం. ఉత్తరపుగాలి తోలపలసిన సమయాలలో తూర్పుగాలి తోలినా తూర్పుగాలి తోలవలసిన సమయంలో ఉత్తరపుగాలి తోలినా ఎందుకూ కొరిగాకుండా పోతుంది. పొగాకుది. లాటరీ, రంగు వస్తే అదే క్వింటాల్ రు. 500-00 రంగురాక మాడిందా పంట ఖరీదు కూడా రాదు. అన్ని పరిస్థితులు అనుకూలించి మేలురకం పొగాకు బాగా అయితే ధరలు పడిపోతాయి. ఇలాంటి దయనీయ పరిస్థితులనుండి రైతుకు రక్షణ కలిగించాలంటే పంట భీమాచేయాలి. గిట్టుబాటుధర నిర్ణయం అవసరం.

పొగాకు వ్యవసాయం - ఎకరా సగటు ఖర్చు

1 భూమి కౌలు	రు. 250
2. భూమిపాటు	
ఎ. నాగలి గొర్రు పంటమధ్య వ్యవసాయం	150
బి. పశువుల ఎరువు తోలకం, పరచడం	85
సి. రసాయనికపు ఎరువులు, తెగుళ్ళ మందులు	90
3 నాట్లు	
ఎ. నారు	50
నాటు ఖర్చులు	25
కలుపుతీయుట	20
తెగుళ్ళ మందులు	20
4. ఇరుపు, క్యూరింగ్	
ఎ ఆకు ఇరుపు, తోలకం, కర్రలల్లడం	45
బి. బొగ్గు	95
సి. బ్యారన్ అద్దె	40
డి. పందిళ్లు, రేకులు, షేడ్లు	10

ఇ. మీటరు, టార్చి, పెట్రోమెక్సు, కిరసిన్	5
యఫ్. కూ్యరుచేయు కూలి, ఫైర్‌మన్	45
జి. పురికొస	12
5. మార్కెటింగ్	
ఎ. గ్రేడింగ్, బేళ్లు కట్టుట	35
బి. పాకింగు సామగ్రి	5
సి. మార్కెటుకు తోలడం	5
6. తదితర ఖర్చులు	10
7. భూమిశిస్తు	9
8. వ్యవసాయదారుని కుటుంబ శ్రమ	100
	1108
నాలుగు మాసాలకు వడ్డీ	48
	1148

[పై పట్టికలోని పొగాకు వ్యవసాయ ఖర్చుల మదింపు 1970 నాటివి. ఆది నేటి పెరిగిన ఖర్చులదృష్ట్యా రెట్టింపు ఉంటుంది.]

ఎకరాకు పై పట్టిక ప్రకారం ఖర్చు చేయవలసిందే. పండినా పండకపోయినా, ధర వున్నా, లేకపోయినా, రంగువచ్చినా, రాకపోయినా, ఖర్చులలో ఒక పైసాతగ్గదు. ఇంతఖర్చుచేసి, పండించి జాతీయార్థికవ్యవస్థకు పెద్దమొత్తం ఆదాయాన్ని చేకూర్చుచున్న పొగాకుకు గిట్టుబాటుధర నిర్ణయించడం అవసరం.

పొగాకు అమ్మకం - పువ్వుల అమ్మకం.

పొగాకు ఉత్పత్తి చేయడంలో, వ్యాపారంలో నాలుగు దశాబ్దాలుగా అనుభవంగల ఒకరైతు పొగాకు అమ్మకాన్ని పువ్వుల అమ్మకంలో పోలుస్తూ, స్వానుభవంతో ఆశక్తిదాయకమూ, ఆచరణలో యదార్థమూనైన యీ క్రింది కథ చెప్పాడు.

మల్లె, చామంతి, గులాబీ, ఏదో ఒక పూపులు అమ్ముకొనే బేరగాడు సాయంత్రం నాలుగు గంటలకు వీధులవెంట పూలోపూలో అంటూ కేకలేస్తూ తిరుగుతుంటాడు. ఒకి అమ్మ పిలిచి ధర అడుగుతుంది. 50 గ్రాములపూలు 50 పైసలంటాడు. ఆయమ్మ ఎందుకూ అంతధరలేదే 30 పైసల కిస్తావా అని బేర మాతుడుంది. బేరగాడు తోకత్రొక్కిన త్రాచుపాములాగా బుసబుసలాడుతూ చీత్కారంచేసి, బలేకొన్నావులేవమ్మా. మల్లెపూలెందుకు తుమ్మపూలయితే టూరికే వస్తాయిగదా! అంటూ కొరకొరా చూచుకొంటూ, వెనక్కు తిరగకుండా తిరిగి పిలిచినా పలక్కుండా వెళ్ళిపోతాడు. ఇలా సాయంత్రం 6 లేదా 7 గంటలదాకా విస్సన్నచెప్పిందే వేదమన్నట్లు" బేరం దిగనివ్వడు. తరువాత 7 దాటిందా అయ్యమొఖం మంగళంలాగా మాడుతుంది. కోపం, తాపం చల్లారతాయి చిరట్లు, బుర్లు దిగిపోతాయి. ఎంత కడిగితే ఆంతరు; చివరకు గ్రామాల్లో అయితే చింత కాయ పచ్చడికి, ఉదయం మిగిలిపోయిన అన్నానికి అయినకాడికి పారకోసి, బుట్ట విదిలించుకొని ఇల్లుచేరతాడు. కారణం తెలుసుగా పూలు విప్పారినా, వాడినా, దిబ్బలో పోయాల్సిందేగదా?

ఇలాంటిదే సరిగ్గా పొగాకు వ్యాపారం. బేరన్‌దిగి గ్రేడుచేసి, చెక్కలు లొక్క మార్కెట్టుకు సిద్ధంగా వుంచిన సమయంలో బేరగాడు వస్తాడు. పెద్ద కంపెనీలు ఇంకా ధరనిర్ణయించవు. అలాంటప్పుడు ఎవరైనా ముందుకువచ్చి మంచిధర యిచ్చినా, రైతు కొండెక్కుతాడు. అంతేగాదు వ్యాపారస్తులకు పొగాకు యెంత వుంటుందో సరైన అంచనాలు లేక మొదట ఒకటిరెండు వారాలు ఒకరితో మరొకరు పోటీపడి కొంటుంటారు. అప్పుడు రైతు బెట్టుగా, ధీమాగా, తనకు నచ్చని ధరవస్తే ససేమి దగ్గరకు బేరనివ్వడు ఇటు పిలిస్తే అటుచూస్తాడు. నీవు కాకపోతే నీ తాతకొంటాడు పోవయ్యా అన్నట్లు "నిమ్మకు నీరెత్తినట్లు" వుంటాడు.

ఇంతలో వ్యాపారస్తులు, ముఖ్యముగ గుత్త వ్యాపారస్తులు ఇంతవరకు కొనుగోలు చేసినది అంచనా వేసుకుంటారు. ఆవరేజి చేయాలిగదా! నలుగురూ కలసి మాటాడుకొని ఒక్కరాత్రి ధరలు iv పుగాకు రు.550-00 ల నుండి రు. 300-00 లకు తగ్గిస్తారు. ఇక గ్రేడులా iv ని 3 v గా మారుస్తారు. ఇతర గ్రేడుల ధరలు సరేసరి. ఇకచూడండి రైతులస్థితి 7 గంటల తరువాత పూల బేరగాడిలాగా బేజారు. బాబూ ఎంతకయినా ధరవేయిబాబూ, డబ్బు తరువాత నిదానంగా యిద్దువుగాని అంటూ దీనవదనంతో, నిరాశతో, నిస్పృహతో "కాలు గాలిన పిల్లి"లా యెక్కిన గడప యెక్కకుండా, దిగిన గడప దిగకుండా కాలకి బలపము గట్టుకొని కాళ్ళరిగేట్టుగా తిరుగుతాడు. అయినా ప్రయోజనం వుండదు. బేరగాడు ససేమిరా నాకొద్దంటాడు.

టెంటాలస్ కథ

ఈ సందర్భంలో ప్రాచీన గ్రీకు తత్వవేత్త "టెంటాలస్ కథ జ్ఞాపకం వస్తుంది.

పూర్వం గ్రీకులో "టెంటాలస్" అనే తత్వవేత్తకు. రాజు ఒక విచిత్రమైన శిక్ష విధించాడు. అదొక విచిత్రమైన తొట్టి, దానినిండా నీరుంటుంది. అందులో టెంటాలస్‌ను క్రింది పెదవులవరకు నీరుండే విధముగ నిలబెడతారు. అన్న పానీయా లివ్వకుండా, గంటలు, రోజులు గడుస్తాయి. దప్పికవుతుంది. పెదవుల దాకా నీరుందిగదా। ఒంగి త్రాగదామంటే నీరు జర్రున క్రిందికి పోతుంది. అలా నీటిమధ్య దాహంతోనే అతడు మరణిస్తాడు.

ఇలాగేవుంది. నేటి మన రైతులస్థితి. కష్టించి వ్యయప్రయాసలకోర్చి పుష్కలముగ పండిస్తే, ధరలు పడిపోయే మెస్పరిజం నీటిమధ్య దాహంతో మరణించిన టెంటాలస్‌కు రాజు విధించిన శిక్షలాగున్నది. ఇదంతా మన పూర్వ జన్మపాపఫలమని సరిపెట్టుకొని విధిని దూరుకొంటూ వుండవలసిందేనా! మారంలేదా?

పశువుల - పంటల భీమా

భీమాపథకం మిగతా అన్నింటికంటెముందు, వ్యవసాయోత్పత్తులకే అవసరం. కారుకు, లారీకి, పరిశ్రమలకు, గిడ్డంగులకంటె జీవితానికంటె కూడా భీమా సౌకర్యం వ్యవసాయోత్పత్తులకే అత్యంత ముఖ్యం. వర్షాలు లేక ఎండడంగాని, వర్షాలు అధికమై నీట మునిగి వురకవేయడంగాని, గాలిపాటు అనుకూలంగా లేక పంటలు దిగుబడి తగ్గడగాని, మానవ ప్రయత్నంతో నివారించ వీలు లేనివి. కారు లారి, మిషను. పరిశ్రమ గిడ్డంగి అప్రమత్తతతో, జాగ్రత్తగా, ఆధునిక శాస్త్రీయ పరిజ్ఞానంతో భద్రత కలిగించుకొనవచ్చును. కాని అతివృష్టి, అనావృష్టి, వరదలు, గాలిపాటుల కారణంగా నష్టాలపాలయ్యే వ్యవసాయోత్పత్తులకు రక్షణ, భద్రత మానవ ప్రయత్నంద్వారా నివారించ సాధ్యం కాదు.

కారో, లారియో అద్దం పగిలిపోయినా, రేకు గీరకపోయినా, భద్రత భీమా వున్నదికదా: ఎకరాపంట అదే పొగాకో, పసుపో, చెరుకో, మిర్చో ప్రకృతి వైపరిత్యాలు కారణంగా నాశనమైపోతే ఖర్చులే కనీసం రు. 1000-00 లుంటుంది గదా: యీ నష్టానికి భీమా కలుగజేయడం న్యాయం ధర్మం కాదా:

అరక దున్నే దుక్కిదెద్దు, పాలిచ్చే ఆవూ, బర్రె గొడ్డూ ఆకస్మికంగా, గాలికుంటో, దమ్మరోగమో, పారుడో, మెడవాపోవచ్చి, మరణిస్తే యీనాడున్న ద్రవ్యోల్బణం కారణంగా ఒక పశువే రు. 800-00 నుండి రు. 1000-00 దాకా వుంటుంది. వ్యవసాయము ఏయే పికాయేడు ఖర్చులకే అస్తుబిస్తుగా వుండగ ఇలాంటి అవాంతరు ఆకస్మిక నష్టములనుండి రైతు ఎలా తట్టుకొనగలడు? కాబట్టి వెంటనే పంటల - పశువుల భీమాచట్టం రూపొందించి అమలు చేయాలి.

"నిన్న మొన్ననే మన ప్రియతమ ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి పంటల పశువుల భీమా సౌకర్యం త్వరలో ప్రకటించ గలమని హామీ నిచ్చియున్నారు. కాలహరణం లేకుండా వెంటనే చట్టం రూపొందించ వలసిందిగా ఆమెను ప్రార్థిస్తూ

పొగాకు కార్పొరేషను

పొగాకు ఎగుమతుల అభివృద్ధి U. S. AID వారి సాంకేతిక సహాయ కార్యక్రమాలక్రింద కేంద్ర ప్రభుత్వ వాణిజ్యశాఖ కోరికపై రీసర్చ్ మరియు మార్కెటింగ్ సర్వీసెస్ సంస్థ రూపొందించిన ప్రణాళికలో పొగాకు సమస్యల శాశ్వత పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వ యాజమాన్యం (Tobacco corporation) "టుబాకో కార్పొరేషన్" నిర్మాణము సూచించియున్నారు. దీనిని పరిశీలించి, అవసరమైన చర్యలు వెనువెంటనే గైకొనవలసి యున్నది.

జూట్‌కు ఇదేవిధమైన "జూట్ కార్పొరేషను ఏర్పాటు చేయబడుచున్నది. అదేమాదిరిగా స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషను సంస్థలో భాగంగా "టుబాకో కార్పొరేషన్ ఆఫ్ ఇండియా" అనే సంస్థను ఏర్పాటుచేసి గుంటూరులో దీని రిజిష్టర్డు కార్యాలయం నెలకొల్పాలి.

గిట్టుబాటు ధర నిర్ణయించుటకు టారిఫ్ కమీషన్‌కు నివేదించాలి

ప్రస్తుతపు ఎగుమతి కనీస ధరలు రైతులకు ఏ విధంగానూ ప్రయోజనం లేకుండా వున్నది. పొగాకు వ్యవసాయ ఖర్చులు మదింపుచేసి, రైతుస్థాయిలోనే కనీసధర నిర్ణయించుట ఆవసరం.

అందుకుగాను, రబ్బరు ఉత్పత్తి ఖర్చులు మదింపు చేయుటకు టారిఫ్ కమీషన్‌కు అప్పగించినట్లుగానే పొగాకు కనీసధరల నిర్ణయించుటకు ఉత్పత్తి

ఖర్చులు మదింపు చేయుటకూ, టారిఫ్ కమీషన్‌కు నివేదించవలసిందిగా కోరవలసియున్నది.

పొగాకు ఉత్పత్తిచేయు రైతులకు పాకిస్తాన్‌లోను ఫార్ ఈస్టు దేశాలలో మాదిరిగ ఆర్థిక సహాయం (క్యాష్ సబ్సిడి) చేయవలసిందిగ ప్రభుత్వమును కోరవలసి యున్నది.

ఈ సదస్సు పొగాకు ఉత్పత్తి, విక్రయాలలో ఎదుర్కొనే యావత్తు సమస్యలను సమగ్రముగ చర్చించి, తీర్మానములను రూపొందించి ప్రభుత్వానికి నివేదించుటలో మీరంతా అన్నివిధాలా సహకరించవలసిందిగా ప్రార్థించుచున్నాను.

జై ఆంధ్ర

దరువూరి వీరయ్య

1971 ఫిబ్రవరి 20

గుంటూరు న్యూస్ నుండి

★



క్రోడితోడ లేచి గూటఁదిళ్ళికదాఁక:
గాలు మడతవెట్టి రాలు మగఁడు
కటికి బూయి వీరి కష్టమ్ములకించి
కంటినీరు విడుచు కవివరేణ్య!

ఏటుకూరి వేంకటనరసయ్య

ఐ. టి. సి. దోపిడిని అరికట్టి

రైతాంగాన్ని తక్షణం

రక్షించాలి

శ్రీ జ్యోతిర్మయి బాసు M. P.

జూలై 18 వ తేదీన లోక్ సభలో పొగాకుబోర్డు బిల్లుపై జరిగిన చర్చలో పార్లమెంటు మార్క్సిస్టుపార్టీ నాయకులు శ్రీ జ్యోతిర్మయిబాసు పొగాకు రైతుల యిబ్బందులను వివరిస్తూ ప్రసంగించారు.

ఆయన ప్రసంగంలోని కొన్ని ముఖ్యమయిన భాగాలను యిక్కడ యిస్తున్నాం:

సంపాదకుడు

మన దేశంలో ప్రధాన మయిన వ్యాపార పంటలు పొగాకు, పత్తి, చెరుకు. జనపనార మొదలగునవి. వీనిలో పొగాకు ఎంతో విలువయినది. కానీ పొగాకు విషయంలోవున్న యిబ్బంది ఏమిటంటే రైతు పండించనయితే పండిస్తాడుకానీ దాని క్రయ విక్రయాల్లో అతనికి ఎంతమాత్రం జోక్యం వుండదు. పొగాకు వ్యాపార మంతా దేశీ, విదేశీ గుత్త వ్యాపారస్తులు అందులో ప్రధానముగా విదేశీ గుత్త వ్యాపారుల ఆదుపాజ్ఞలలో వుంటుంది. వారు రైతులను ప్రతి సంవత్సరం విపరీతంగా దోచుకుంటున్నారు.

మన సరుకుకు ధరలుండవు

మన దేశంలో పొగాకును ఖరీదుచేసే కంపెనీలవారూ, వ్యాపారస్తులు మన పొగాకు నాణ్యమయింది కాదని కాకమ్మ కబుర్లు ఎన్నో చెబుతారు. వారేమి చెప్పినా పొగాకుకు సంబంధించిన శాస్త్రజ్ఞులూ, మన పొగాకును ఖరీదుచేసే యితర దేశాల వారూ చెప్పేదానినిబట్టి మన పొగాకు అమెరికా, రోడీషియా. నాణ్యమయిన పొగాకు నుత్పత్తిచేసే మరే యితర దేశంలోపండే పొగాకుకన్నా నాణ్యతలో తక్కువేమీ కదు అన్ని విధాల వాటి నాణ్యతతో సరితూగుతుంది.

అయినా ధర విషయంలోమాత్రం మనది దిగదుడుపే. అమెరికా వ్యవసాయ శాఖవారి బులెటిన్ ప్రకారం పొగాకు ధరలు పడిపోకుండావున్న మంచి సంవత్సరంలోకూడా అత్యంత నాణ్యమయిన మన వర్జీనియా పొగాకు ధర కే. జి. కి సగటున ఎనిమిది రూపాయలు మాత్రమేవుంది. అదే కాలంలో యుగోస్లావియా, ఇటలీ, జర్మనీ దేశాల పొగాకు ధర వరుసగా 26, 28, 82 రూపాయలున్నది. నేను పొగాకు బోర్డుకు యిలాంటి అన్యాయాల వివరాలు తెలిపే పూర్తి పట్టిక ఒకటి యిచ్చాను.

మన దేశం యీ విషయంలోమాత్రం యింకా వలస దేశంగానే ఉన్నట్లుగా వుంది. కారు చౌకగా మనం ముడిసరుకు నమ్ముకోవాలి. దానితోనే తయారయిన ఉత్పత్తులను నాలుగు మొదలు పది రెట్ల వరకు ధర చెల్లించి కొనుక్కోవాలి. ఏమిటి యీ దుర్గతి. ఇలా ఎంతకాలం గడపగలుగుతాం ?

ఐ. టి. సి. దోపిడి

దురదృష్టమేమిటంటే, ప్రత్యక్షంగాగాని, పరోక్షంగాగానీ యీ వ్యాపార మంతటినీ ఇండియన్ టుబాకో కంపెనీయే కంట్రోల్ చేస్తున్నది. ఢిల్లీలోని రాజకీయ నాయకులలోనూ, ఉన్నతోద్యోగులలోనూ దానికి విపరీతంగా పలుకుపడి

ఉంది. ఆ స్థాయిలో దానికొగరకు పనిచేసేవారున్నారు. యీ ఐ. టి. సి. తన వివిధ బ్రాంచీలలో రాజకీయనాయకుల బిడ్డలకు, సీనియర్ ఉన్నతోద్యోగుల బిడ్డలకు ఎంతో మందికి ఉద్యోగాలు చూపింది. ఈ ఉద్యోగాల విషయం ప్రభుత్వం క్షుణ్ణంగా పరిశీలించితే యీ కంపెనీ పలుకుబడి స్థాయి యెంత? కేంద్ర ప్రభుత్వ వ్యవహారాలలో దాని జోక్యం మోతాదు ఎంత? అనేది స్పష్టపడుతుంది.

ఈ ఐ. టి. సి. విపరీతంగా ఆర్థిక నేరాలకు అలవాటు పడింది. వీరు లెక్కలలో తప్పుడు రాతలురాసి పట్టుబడ్డారు. వీరు సరుకు విషయంలోకన్నా డబ్బు విషయంలో జాస్తిగా తప్పుడు లెక్కలు రాస్తుంటారు.

వీరుచేసే ఇంకో కుంభకోణమేమిటంటే తమ భాగస్వామి యిన విదేశీ కంపెనీలకు సరుకు పంపినప్పుడు మంచి సరుకునుపంపి నాసి సరుకు పంపినట్టుగా లెక్కల్లో రాస్తారు. ఈ దేశంలోని కంపెనీలకు నాసి సరుకు పంపినప్పుడు మంచి సరుకును పంపినట్లు రాస్తారు. ఈ రకముగా లెక్కల్లో ఎగుడు దిగుడు కుంభ కోణాలుచేసి డబ్బును దాచేస్తుంటారు. దాటేస్తుంటారు. అందుకని యీ కంపెనీ లావాదేవీలపై విదేశీ సుంకాల, శాఖవ్యవసాయ మంత్రిత్వశాఖ ప్రత్యేకంగా ఒక కన్నేసి వుండడం అవసరం.

పొగాకుబోర్డు నిర్మాణం

ఈ నాటి పొగాకు బోర్డు నిర్మాణ పద్ధతిచూస్తే చట్టా వ్యాపారులు, సిగరెట్టు ఉత్పత్తిదారులు, వ్యాపారులు మొదలగువారి లాభాలకై పనిచేసేదిగావుంది. ఈ బోర్డు పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు పొగాకు రైతులు, కార్మిక ప్రతినిధులు మొదలగువారితో మాత్రమే ఏర్పరచబడాలి. ఈ బోర్డు తుది నిర్ణయాలు జేసేదిగా ఉండరాదు. పొగాకు వ్యాపారులు, చట్టా వ్యాపారులు సిగరెట్ల కంపెనీల ప్రతినిధు లతో నిండియున్న యీ బోర్డు ఆ కంపెనీల ప్రయోజనాలకు భిన్నమయిన నిర్ణ యాలు వారికి లాభాలు సాగుచేసి పెట్టేవిగానే వుంటాయి.

ఈమధ్య "ప్రభుత్వ పెట్టుబడుల కమిటీ" ఆర్థిక జోక్యమున్న బోర్డుల లోనూ, స్వతంత్ర ప్రతిపత్తిని చలాయించ గలిగిన బోర్డులలోనూ, ప్రయివేటు వ్యాపారస్తులను ఏ పరిస్థితులలోకూడా సభ్యులుగా నియమించ రాదని నిక్కచ్చిగా రికమెండు జేసింది. అలాంటి వారిని నియమిస్తే వారు తమ లాభాలను పెంచుకోవడానికే బోర్డునుపయోగించు కుంటారు అని రాసింది.

శ్రీ రామశరన్‌గారి ఆధ్వర్యాన నడుస్తున్న ఎకనామిక్స్ అండ్ స్టేటిస్టిక్ డైరెక్టరేటువారు కూర్చేసిన వర్జీనియా పొగాకు ఉత్పత్తి వ్యయాన్ని అంచనా కట్టడంలో కావాలనే తక్కువ చేసి చూపారు. ఈ రీతిగా చూపి పొగాకు ధరను తగ్గించి లాభాలను పంచుకోవడానికి చట్టా వ్యాపారులకు సిగరెట్ ఉత్పత్తిదారులకు, పొగాకు వ్యాపారులకు తోడ్పడ్డాడు. ఇదంతా దగా.

ధరల నిర్ణయంలో దగా

వ్యవసాయోత్పత్తుల ధరల స్థిరీకరణ కమీషన్ వ్యాపారపంటలకు ధరలు నిర్ణయించు సందర్భంలో పొగాకు రైతుల ప్రయోజనాలను బలిపెట్టి పెట్టుబడిదారులకు, వ్యాపారస్తులకు లాభించునట్టుగా సిద్ధపర్చింది. అని పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటి బయటపెట్టింది. ఈ ధరలు నిర్ణయించు పద్ధతి అంతా ఒకదగా. జనపనారకు ధరలు నిర్ణయించిన తీరును చూస్తే రైతులకు ఎలా అన్యాయంచేశారు. పెట్టుబడిదారులకు ఏ విధంగా లాభాలు చేకూర్చారు. అనేది అర్థమవుతుంది.

పొగాకు ఉత్పత్తికిగాను రెండున్నర ఎకరాలకు (హెక్టార్) అయ్యే ఖర్చు రు. 6026 వుంటుందని మేము అంచనా వేశాం. కమీషన్‌వారు రు. 4383 అంచనా వేశారు. న్యాయంగా చెప్పాలంటే రు. 6026 కన్నా ఎక్కువే అవుతుంది. మేము లెక్కలు అంచనా కట్టేటప్పుడు బ్యారన్ తరుగుదలను అంచనాకట్టలేదు. బ్యారన్ నిర్మాణానికి 10 నుండి 14 వేల వరకు ఖర్చవుతుంది. పొగాకును క్యూర్ చేయడానికి పెట్టేమంటల వేడికి తట్టుకోలేక తరుచుగా బ్యారన్లలో ముఖ్య పరికరాలు బ్యారన్ గోడలు బీటలు వారుతుంటాయి. వీటిని సరిజేయడం రైతుకు ఎంతో ఖర్చుతోనూ, కష్టంతోనూ కూడుకున్న పనికాగా అసలు బ్యారన్‌నే ఎట్టి ఒడుదుడుకులు లేకుండా పనిచేస్తే దాని జీవితం పది సంవత్సరాలుంటుంది. బ్యారన్ విలువనుగాని దానిని నిర్మించిన స్థలం విలువనుగాని వాటికయ్యే వడ్డీనిగాని మేము అంచనాలలోకి తీసుకోలేదు. అలా తీసుకుంటే మేము అంచనాగట్టిన రు. 6026 కూడాను తక్కువే. ఈ ఖర్చులన్నీ భరించి రైతు నాణ్యమైన పొగాకును తయారు చేస్తాడు. అతనినుండి పొగాకును కారుచౌకగాకాజేసి ఐ. టి. సి, విపరీతంగా లాభాలు దండుకుంటుంది.

దళ్ళివేలం విధానాన్ని ప్రవేశపెట్టాలి

పొగాకు క్రయం విషయంలో ప్రస్తుతం అనుసరిస్తున్న బ్రిటిష్ విధానం పూర్తిగా లోపభూయిష్టంగా వుంది. ఈ విధానం రైతులను దోచుకునేదిగా వుంది.

దీని స్థానంలో ఎలక్ట్రానిక్ పరికరాల ద్వారా నడుపబడే దచ్చివేఁం విధానాన్ని ప్రవేశ పెట్టమనీ, అందుకు ప్రభుత్వము, రిజర్వుబ్యాంకు పూనుకోవాలనీ వేము సూచించాం. ఆ విధానం పొగాకు గుత్తవ్యాపారులు, పొగాకు కంపెనీల చేసే మోసాన్ని అరికిడ్తుంది. పొగాకు రైతులకు ప్రయోజనకరంగా వుంటుంది. ఈ విధానాన్ని అన్నిరకాల పొగాకుకు వర్తింపజేయాలి. అన్నిచోట్ల ప్రవేశ పెట్టాలి.

పొగాకు ద్వారా కేంద్ర ప్రభుత్వానికి ప్రతి సంవత్సరం 500 కోట్ల పన్ను వసూలవుతుంది. ఈ సంవత్సరం 468 కోట్లు వస్తుందని అంచనా వేశారు. పొగాకు రైతుల ప్రయోజనాల గురించి ప్రభుత్వం ఆలోచించాలి. వారికి తగు రీతిగా తోడ్పడాలి. ఇది ప్రభుత్వ కనీస కర్తవ్యం.

ఈ వేటి ధరలు

పొగాకు రైతులు విపరీతంగా దోచుకో బడుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో తుపానొచ్చింది. ఎంతో నష్టపర్చింది. నిరుడు క్వింటాల్ రు, 1200 అమ్ముడు బోయిన పొగాకు ఈ ఏడు రు. 750 నుండి 800 వరకే అమ్ముడు పోయింది. నిరుడు రు. 600 అమ్మిన ఒకరకమైన పొగాకు ఈ ఏడు రు. 250 లకే తీసుకున్నారు. నేను కృష్ణాజిల్లా నందిగామలో స్వయంగా చూశాను. కూర్చబడిన పొగాకు క్వింటాల్ రు. 80 కొన్నారు. అంటే కె. జి, 80 పైసలన్నమాట. 5 లేక 6 కేజీలపచ్చి పొగాకుతో ఒక కె. జి. కూర్చు పొగాకు తయారవుతుంది. అంటే కె. జి. పచ్చి పొగాకు 15 పైసలకు లభించడం ఎంతో కష్టమైపోతోంది. అంటే రైతుస్థితి ఎంతదీనాతి దీనంగావుందో గ్రహించండి.

వెయ్యి మెట్రిక్ టన్నుల పొగాకు కొనడానికి ప్రభుత్వం సిద్ధపడ్డ తర్వాతే ఎస్. టి. సి. పొగాకు కొనడం ప్రారంభించి కూడా కారు చౌకగానే కొంటున్నది. రైతులను విపరీతంగా దోచుకొంటున్నది. తామే నిర్ణయించిన పొగాకు ఎగుమతి ధరలలో కనీస ధరనైనా ప్రభుత్వంవారు రైతుకెందు కివ్వరు అని నేనడుగుతున్నాను. ప్రభుత్వం రైతులకు తోడ్పడుతున్నట్లుగా చెప్తూనే వారి గాయాలపై కారం చల్లుతోంది. ఇది ఎంతో దురదృష్టకరమైన విషయం.

చుట్టుల పరిశ్రమగతి

ఇక చుట్టుల పరిశ్రమ విషయం పరిశీలిద్దాం. చుట్టలుచుట్టేపని చిన్నతరహా పరిశ్రమగాకూడా ఎక్కడా లేదు. ఎక్కడో ఒక చోట 12 మంది పనిచేస్తుండగా

చూశాను. ఈ పరిశ్రమ పూర్తిగా కుటీర పరిశ్రమ. ఈ పరిశ్రమపై అగర్వాల్‌గారి మంత్రిత్వశాఖ విపరీతంగా పన్ను పెంచింది. దానితో ఇక పరిశ్రమే అంతరించే స్థితిలో వుంది. ప్రభుత్వం యీ పరిశ్రమకు సుంకాన్ని పూర్తిగా రద్దుచేసి దానిని రక్షించాలి ఈపరిశ్రమను ప్రోత్సహించడానికి చుట్టలువాడే ఐ. టి. డి. సి. లాటి ప్రభుత్వ సంస్థలు, ఏరింటియాలాంటి సంస్థలు ఈ చుట్టలనే తప్పనిసరిగా కొనాలని ఆదేశించాలి.

ఈ మధ్య మేం కూచ్‌బీహార్ వెళ్ళాం, అక్కడి రైతులు మోతీహరీ, జట్టీ అనేవారు పొగాకు పండిస్తారు. ఈ పొగాకు జర్దాకు, హుక్కాలలోనికి వాడతారు. ఎంతో శ్రేష్ఠమైంది దాదాపు 11 కోట్లకు మించి విలువచేసే 90 వేల మణుగుల పొగాకు కొనేవాడులేక అక్కడ పేరుకొనివుంది తిరిగి పొగాకునాటే రోజులు సమీపిస్తున్నాయి. ఆ 90 వేల మణుగులు పిడుదలగాకుండా అక్కడ తిరిగి వ్యవసాయం జరగటం దుస్థరం. కావున యీ విషయంలో ప్రభుత్వం కల్పించుకొని ఆ ఆటంకాలను తొలగించాలని కోరుతునాను.

ప్రజాశక్తి సౌజన్యంతో

7 అంతర్జాతీయ పొగాకు సంస్థల అక్రమ వ్యాపారం

లండన్, అక్టోబరు 1978: ఏడు అంతర్జాతీయ పొగాకు సంస్థలు కోట్ల. డాలర్ల మేరకు అక్రమ వ్యాపారం చేసినట్లు ఐక్యరాజ్యసమితి నివేదికలో వెల్లడయింది. ఇని బహుళజాతి కంపెనీలనికూడా పేర్కొంది.

కంపెనీలు ధరల విషయంలో కుమ్మక్కు అయినవని, ఆర్థిక లావాదేవీలను ఉద్దేశ పూర్వకంగా దాచిపెట్టినవని సమితి నివేదికలో ఆరోపించబడింది. ఈ కంపెనీలు సాగిస్తున్న అక్రమ వ్యాపారంలో బహుకొద్ది విషయాలు మాత్రమే ఇటీవల బయట పడినవని పేర్కొన బడింది ఈ కంపెనీల ఎకవుంట్లు పూర్తిగా ఆవక తవకలతో నిండివున్నవని, సంపన్న దేశాలలోను, బడుగు దేశాలలోను కూడా ఈ కంపెనీలు మోసపూరితమయిన ఎక్కవుంట్లకు చాలా పెద్దవైన ఎక్కవుంటింగ్ సంస్థలు సహాయపడినవని యీ నివేదికలో వెల్లడించారు.

ఈ అక్రమ వ్యాపార సంస్థలనుంచి అంతర్జాతీయ పొగాకు సంస్థలు పెద్ద సవాలును ఎదుర్కొంటున్నవి.

వీటికి సాలీనా సిగరెట్ల అక్రమ వ్యాపారంద్వారా పది కోట్ల డాలర్లు లాభాలు వస్తున్నవి, మొత్తం లాభాలు 250 కోట్ల డాలర్లు అని అంచనా.

రైతులకు సముచిత ప్రాతినిధ్యం కల్పించడం బోర్డు కార్యాలయం గుంటూరులో వుండటమే పొగాకు పండించే రైతులకు రక్షణ

ఆచార్యరంగా

పొగాకు బోర్డు ప్రధాన కార్యాలయాన్ని గుంటూరునుండి మార్చుటకై కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో శాసనం ప్రవేశపెట్టిన సందర్భంలో. పార్లమెంటు సభ్యులు శ్రీ వి. సి. కేశవరావు ప్రవేశపెట్టిన బోర్డు కార్యాలయం గుంటూరునుండి మార్చరాదనే సవరణపై శ్రీ ఆచార్య రంగా 1978 జూలై 31 వ తేదీన రాజ్యసభలో చేసిన ప్రసంగాన్ని యథాతథంగా ప్రచురించుచున్నాను.

పొగాకు బోర్డు కార్యాలయం మార్పుపైననేకాక పొగాకుకు సంబంధించిన అనేక విషయములపై సమగ్రంగా చర్చించారు.

(సంపాదకుడు)

ఎందుకీ శాసనం?

ఈ సవరణ శాసనం నాకేమాత్రం బాగాలేదు. ఇప్పుడు ప్రవేశపెడుతున్నది కేవలం పాక్షిక శాసనమేనని, ఇంకా కొద్ది రోజుల్లోనే సంపూర్ణమైన మరొక శాసనాన్ని ప్రవేశపెట్టాలనుకుంటున్నామని మంత్రిగారు సెలవిచ్చారు. మరిప్పుడీ పాక్షిక శాసనాన్ని ప్రవేశపెట్టే అవసరం ఏంవుంటుకువచ్చింది? ఈ శాసనం చాలా భయ సందేహాలకు దారితీయడమేగాకుండా, ఏ సత్ప్రయోజనాన్ని కించిత్తు గూడా సాధించలేదు. ఇప్పుడే ఈ పొగాకు సస్థ ప్రధాన కార్యాలయాన్ని గుంటూరునుంచి మఱొక్కడకో మార్చాలనే సవరణను ప్రవేశ పెట్టాలిసినంత హడావుడి ప్రభుత్వానికి ఎందుకు కలిగింది? పొగాకు సంస్థ ప్రధాన కార్యాలయాన్ని ఎక్కడ ఉంచుతే దాని ప్రయోజనం సకమంగా ఫలిస్తుందో అన్న విషయాన్ని తాపీగా కూలంకషంగా చర్చించుకుని, ఇవ్వాళ కాకపోతే ఇంకా కొన్ని రోజులకు, కాకపోతే నెలలకు అవసరమైతే రెండు మూడు సంవత్సరాలకు నిర్దిష్టంగా తేల్చుకున్న తర్వాతనే ఆ ఆలోచన చేస్తే, ఇంతలోనే కొంపలంటుకుపోయే ప్రమాదం ఏదీ సంభవించదనుకుంటాను ఆసలీ పొగాకు బోర్డు ప్రధాన కార్యాలయాన్ని ఉన్నచోటనే ఉంచనిస్తే, ఈ ప్రభుత్వానికి కలిగే నష్టం ఏమిటి? దాన్ని మారుద్దామనే భావం ఎందుకు కలిగినట్లు? ఇంత హడావుడిగా ఈ శాసనాన్ని ప్రభుత్వం ప్రవేశపెడుతున్నదంటే దీని వెనకాల ఏదో ఒక కుయుక్తి ఉన్నదేమోనని అనుమాన పడాలిసి వస్తున్నది ఇది వరకటి ప్రభుత్వాల మాదిరిగానే ప్రస్తుత ప్రభుత్వం గూడా ఐ. ఎల్. టి. డి. లాంటి బడాపెట్టుబడిదారి దోపిడీ సంస్థల వత్తిళ్ళకు లొంగిపోయిందేమోనని భయం పర్జీనియా పొగాకును పండించే రైతాంగానికి కలుగుతున్నది. ఐ. యల్. టి. డి. అనే సంక్షిప్త పదానికి మొదటి రోజుల్లో సామ్రాజ్యవాదపు పొగాకు అభివృద్ధి సంస్థ అనే విపులార్థం ఉంది దాన్నే ఇపుడు భారతీయ పొగాకు అభివృద్ధి సంస్థగా నిర్వచిస్తున్నారు. దీనికి మాదిరిగానే సామ్రాజ్యవాదపు సస్థంగా వ్యవహరిస్తున్న మరియొక సంస్థ ఉన్నది. దానిపేరు 'నవభారత వాణిజ్య ప్రయివేటు సంస్థ' ఇదిగాక మఱొక సంస్థ దాని ఆర్థిక ప్రతిపత్తి అనుసరించి, భారతీయ సామ్రాజ్యవాదసంస్థ అనుకోవచ్చు. దానిపేరే గోల్డెన్ టుబాకో లిమిటెడ్ సంస్థ

పొగాకు బోర్డు ప్రధాన కార్యాలయం

ఈ పొగాకుబోర్డు ప్రధాన కార్యాలయం, అసలు పొగాకు పండించే రైతాగం అత్యధికంగావుండే ప్రాంతంలోనే వుండడం సబబు. మరి దీన్ని పొగాకు రైతునకు,

చిన్న వ్యాపారస్తులకు వీలయినంత దూరంలో వుంచుదామనే దుస్సంకల్పంతో వున్నది ప్రభుత్వం. అందుకనే దీన్ని ఏ హైదరాబాదులోనో, అహ్మదాబాదులోనో, అదీ యిదీ కాకపోతే బొంబాయిలోనో వుంచుదామనే వుబలాటంతో వున్నది ప్రభుత్వం. అట్లాగనక పొగాకు రైతాంగానికి అందుబాటులో లేకుండా దూర ప్రాంతాలకు తరలించరుపోతే, అక్కడ పాశ్చాత్య నాగరక విలాస జీవితాన్ని అనుభవించవచ్చనీ, వివిధ దేశాలనుంచి పొగాకు కొందామనే వుద్దేశంతోవచ్చే బడా బడా వ్యాపారస్తులతో సునాయాసంగా లావాదేవీలు నెరపవచ్చుననే పొగాకురైతుల ఆందోళన వినపడకుండా హాయిగా వుండవచ్చనే, దుర్భావన వుండవచ్చు నంటు న్నాను ప్రభుత్వానికి. పొగాకు రైతులను యింకా బాగా దోపిడీ చేయవచ్చుననే వూహకు డా వుండవచ్చు. నేను శంకిస్తున్న విధమే నిజం కాకపోతే, ఈ ప్రభుత్వం వాస్తవంగా, బడా బడా గుత్త పెట్టుబడిదారులకు జోహుకుం చేయకపోతే, ఉన్న చోటునుంచి, ఉన్నట్లుండి యీ పొగాకు బోర్డు ప్రధాన కార్యాలయాన్ని మరొక చోటుకు తరలిద్దామనే ఆలోచన ఏమి వచ్చిందని మళ్ళీ అడుగుతున్నాను. ఈ పొగాకు బోర్డు ప్రధాన కార్యాలయాన్ని ఎట్టి పరిస్థితిల్లోనూ, గుంటూరునుంచి మరొకచోటుకు తరలించడం మంచిదికాదని, గుంటూరుజిల్లా పొగాకు రైతాంగమే కాకుండా మొత్తం ఆంధ్రప్రదేశ్‌లోని పొగాకు రైతులందరూ నెత్తిన నోళ్ళు పెట్టుకుని మొత్తుకుంటుంటే, ఆఖరికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గూడా యీ మార్పు మంచిది కాదనే అభిప్రాయాన్ని వెలిబుచ్చినప్పటికీ, ఈ కేంద్రప్రభుత్వం పెడచెవినిపెట్టి, మొండిగా వ్యవహరించి యిప్పుడీ సవరణ చట్టం ప్రవేశ పెడుతున్నదంటే, దానిలో ఏమి దురుద్దేశంవుందో అంతుపట్టకుండావుంది. పైగా మా మిత్రులు లోక్‌సభ సభ్యులుకూడా మీరు చేయదలచుకున్న యీ మార్పుకు విముఖులుగా వున్నారే. మరి ఈ ప్రభుత్వం ప్రజా వాణిని ఎంతవరకు ఆదరిస్తున్నదో గ్రహించాలి. ప్రభుత్వానికి గూడా పొగాకు బోర్డు ప్రధాన కార్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్‌నుంచి మార్చడం అభిప్రాయం కాదనీ, అట్లా మార్చబోమని మీకు వాగ్దానం చేస్తున్నామనీ, గట్టి హామీ ఇస్తున్నామనీ ఇది కేవలం పాక్షికమయిన శాసనం మాత్రమేనని, దీన్ని ఆమోదించండని విజ్ఞప్తి చేస్తున్నామనీ, మంత్రివర్యులు మాట్లాడుతున్నారు, కానీ అంత లాయిలాసా ప్రభుత్వానికి ఎందుకంటున్నాను:

పొగాకుబోర్డు ప్రధాన కార్యాలయం ఆంధ్రప్రదేశ్‌లో ఉండాలి

ఒకవేళ ఈ పొగాకు బోర్డు ప్రధాన కార్యాలయాన్ని గుంటూరునుంచి తరలించడం అంటూ జరుగుతే, ఎట్టిపరిస్థితుల్లోనూ ఆంధ్రప్రదేశ్‌నుంచి మాత్రం తర

లించుకుపోవడం అంటూ జరుగుతే. ఎట్టిపరిస్థితుల్లోనూ ఆం ధ్రప్రదేశ్‌నుంచి మాత్రం తరలించుకు పోవడం జరగరాదు. అంటూ మా మిత్రులు శ్రీ వి. సి. కేశవరావుగారు ప్రవేశపెట్టిన సవరణను భారత ప్రభుత్వం ఈ చివరి నిమిషంలోనైనా ఆమోదించడం మంచిదనీ, అసలు ఉన్నదాన్ని ఉన్నట్టుగానే ఉంచడం భావ్యమనీ భావిస్తున్నాను. అంతేగాని కొద్దికాలం ఒక పట్టణ లో మరికొంతకాలం మరొక పట్టణంలో అంటూ, పిల్లిపిలల్ని మార్చినట్లుగా మారుస్తుండడం మంచిదికాదు. ప్రతి పక్షాల తాఖీదికి తట్టుకుంట నికని, ఆంధ్ర ప్రదేశ్‌లోని అన్ని పట్టణాలకు మార్చుకుంటూ, నికరమైన నివాసంలేకుండా చేయడం సమంజసమైన పనిగాదు. అట్లా కొంత కాలం ఒక పట్టణంలో అన్న విధానాన్ని అవలంబించడానికి ఈ ప్రభుత్వం సిద్ధంగా ఉందా ? అటువంటి ఉద్దేశమంటూ ప్రభుత్వానికిలేదని అంటే, దాన్నైనా స్పష్టంగా సభముందుంచడానికి ఈ ప్రభుత్వం ఎందుకు వెనుకాడు తున్నట్టు ? తాను ఇచ్చే హామీలను చేసే వాగ్దానాలనూ విశ్వాసంలోకి తీసుకోవాలని ఈ సభకు ఇంతగా విజ్ఞప్తి చేయడందేనికి ? ఈ ప్రభుత్వాలు శాశ్వతాలా ? ఈ మంత్రులు మంత్రిత్వాలూ నికరాలా ? ప్రభుత్వాలు మారుతుంటవి, మంత్రులు మారిపోతుంటారు అంతకుముందున్న ప్రభుత్వానికీ, క్రొత్త ప్రభుత్వానికీ, ఒకే రకమైన దృక్పథాలుండాలని ఎక్కడుంది ? ఇవ్వాళ ఈ మంత్రి చెప్పినమాటను, ఇచ్చిన హామీని, చేసిన వాగ్దానాన్ని, రేపుపచ్చే మంత్రి పాటించాలని నియామకం ఏముంది ? పాటిస్తాడని నమ్మకం ఏమిటి ?

గుత్తపెట్టుబడి దోపిడీదారుల కబంధ హస్తాలనుంచి బైటపడదామనే రైతాంగం పోరాటం

అంతేకాదు, అసలు ప్రభుత్వాల, మంత్రుల మనస్తత్వాలు, 'క్షణక్షణముల జనరాగ్రద చిత్తములే' అన్నట్లుగా ఉంటవి. ఇక అటువంటప్పుడు వాళ్ళి చ్చే హామీలు, అక్షరాలా అమలు జరుపబడుతవని విశ్వసించటానికి ఆస్కారమెక్కడుంది ? మన జాతీయ పోరాటంతోనే నా రాజకీయ జీవితం కూడా ప్రారంభమైంది. ఇక్కడ ఇంకొక విషయం చెప్పాలి మీకు. అటు, జాతీయ పోరాటంలో భాగస్వామిగా ఉంటూ, ఇటు బ్రిటిషు సామ్రాజ్యవాదపు దోపిడీ విధానానికి వ్యతిరేకంగా రైతాంగాన్ని సమీకరించి, వాళ్ళ శ్రేయస్సుకోసంగా రైతు ఉద్యమాలు నిర్వహిస్తూ, ఆనాటినుంచి నేటివరకూ ద్విముఖంగా పరిశ్రమిస్తూనే ఉన్నాను. గుంటూరు జిల్లాలోని వర్జీనియా పొగాకు పండించే రైతుల సమస్యలనేగాకుండా, ఆనాడు చీరాలలో పొగాకు గ్రేడింగుచేసే శ్రామికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికితెచ్చి, బ్రిటిషు ఆరకపు ఇనుప పిడికిలినుంచి, వాళ్ళందరికీ విముక్తికలిగించడానికి నిరంతరంగా

పాటుబడుతున్నాను. మనము జాతి స్వేచ్ఛను సంపాదించు కొనగలిగామేమోగాని, ఇంత వరకు ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సాధించు కొనలేకపోయాము. ఈ సమావేశములో మన మిత్రులు చాలామంది చెప్పినట్లు మన కాళ్ళమీద నిలబడటానికి ఇంతకాలం నుంచి మన శాయశక్తులా పని చేశాం. కాని ఇంతవరకు అట్టి దశను పొందలేక పోవటము. అణుశక్తి ఉత్పాదక విషయంలోకూడా ఇంత స్వేచ్ఛను అనగా స్వతంత్ర ప్రతిపత్తిని సాధిద్దామని ఇంతవరకు ప్రయత్నం చేశాము. కాని పొగాకు విషయంలో మాత్రం 60 సం ల క్రితం ఎట్లాఉందో ఇప్పటికీ అట్లాగే ఎక్కడ వున్నామే గొంగళి అంటే వేచిన చోటనే యున్నామనట్టుగా ఉంది. 60 సంవ ల నాడు ఒక ఐ. యల్. టి డి. సంస్థ మాత్రమే పొగాకు రైతులను దోపిడిచేస్తుంది. మరి ఇప్పుడో నవభారత్ ఎంటర్‌ప్రైజస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ, గోల్డెన్ టుబాకో లిమిటెడ్ సంస్థ, బి. ఐ. టి కార్పొరేషన్, ఇంకా ఇట్లాగే నాలుగైదు పెద్ద పెట్టుబడిదారీ సంస్థలు పొగాకు రైతాంగాన్ని నిలువు దోపిడి చేస్తున్నాయి. ఈ సంస్థలలో కొన్ని భారత దేశంలో ఉన్నాయి. ఇంగ్లీషు వాళ్లకు ఐ. యల్. టి. డి. మీద అభిమానం ఇంత బహిరంగముగా కాకపోయినా, ఇంకా కొందరు విదేశీయులు మరికొన్ని సంస్థలమీద ఎక్కువ మక్కువ చూపుతున్నారు. ఈ నవభారత్ ఎంటర్ ప్రైజస్ లిమిటెడ్ ప్రైవేట్ సంస్థ అనేది కేవలం భారతీయమైన సంస్థగానే భావింపబడుతుంది. ఇటువంటి బహుముఖ వ్యాపారసంస్థ కూడా మన పొగాకు రైతాంగాన్ని పీడిస్తున్న వాళ్ళతో భుజం కలిపి భాయిభాయి అంటుంది.

పొగాకు పండించే రైతాంగానికి కనీసపు గిట్టుబాటు ధర నిర్ణయించాలి

ఈ చెప్పిన బోర్డులోని వాళ్లెవళ్లు మన రైతులకు గిట్టుబాటయ్యే కనీసపు మూల్యాన్ని చెల్లించటంలేదు ఈ విషయాన్నే మేము ఎన్నాళ్ళనుంచో నెత్తిన నోరు పెట్టుకొని మొత్తుకొంటున్నాము. అటువంటి కనీసపు గిట్టుబాటు ధరను నిర్ణయించమని, దానిని అమలు పరచటానికి అవసరమయ్యే యంత్రాంగాన్ని కూడ నెలకొల్పమని ఈ భారత ప్రభుత్వానికి చెవినిల్లు కట్టుకొని చెపుతున్నాము. మన భారత ప్రభుత్వం ఇప్పటివరకు అటువంటి సదుపాయాన్ని కలిగించే విషయంలో విఫలమైందనే చెప్పాలి. ఇంతకుముందున్న కేంద్ర ప్రభుత్వం పొగాకు రైతులకు కనీసపు గిట్టుబాటు ధర నిర్ణయించే విషయంలో కొంత సుముఖతను చూపించింది. చేతలలోకాకపోయినా, మాటలలోనైనా అంగీకరించింది. గుడ్డిలోమెల్లగా కాని ఆ ప్రభుత్వంకూడా ఈ విషయంలో పాక్షికంగానే వ్యవహరించింది. అంటే ఎగుమతిచేసే వర్జీనియా పొగాకు కనీసపు గిట్టుబాటు ధర నిర్ణయించటానికి

సైద్ధాంతికంగా అంగీకరించింది. కాని మన నాటుపొగాకు విషయంలో మాత్రం ఎటువంటి శ్రద్ధ చూపించలేదు. అంతేకాకుండా ఈ వర్జీనియా పొగాకు కూడా మన దేశంలోనే సాగే అమ్మకాల కొనుగోళ్ల విషయంలో కనీసపు గిట్టుబాటు ధర నిర్ణయించటానికి ఎటువంటి బాధ్యతను అంగీకరించలేదు. ఆ ప్రభుత్వం ఆటువంటి గిట్టుబాటు ధరను నిర్ణయించే బాధ్యతా విషయాన్ని పొగాకు సంస్థ నిర్వహించే విషయాల్లో ఒక చట్టంగా రూపొందించింపేగాని ఆపొగాకు సంస్థకు ఇప్పటివరకు ఆటువంటి కనీసపు గిట్టుబాటు ధరను నిర్ణయించి, దానిని ఆచరణలో గూడా తూ. చ. తప్పకుండా పెట్టటానికి తగిన అధికారాన్నిగాని, అవకాశాన్నిగాని ప్రభుత్వం ఆ సంస్థకు కలిగించ లేదన్నది ఇప్పటికీ అందరికి తెలిసినవిషయమే. సహజంగా గుత్త పొగాకు కంపెనీలు రైతుల విషయంలో ఏమాత్రం శ్రద్ధ చూపించరు. దాని ఫలితంగా యిప్పుడేమైంది. పొగాకు ధరలు చాలా తక్కువ స్థాయికి పడిపోయింది. వర్జీనియా పొగాకు ఎగుమతి విషయంలో నిర్ణయించిన కనీసపు గిట్టుబాటు ధరకూడా చాలా తక్కువస్థాయికి దిగజారిపోయింది. ఈ విషమ పరిస్థితులలో మేము యీ ప్రభుత్వ దర్శనం చేసుకొన్నాము.

ప్రభుత్వం పొగాకు పండించే రైతులను నిర్లక్ష్యం చేస్తుంది :

మిత్రులు శ్రీ మోహన్‌ధారియా మన పొగాకు రైతుల శ్రేయస్సుకోసం పాటు పడే వ్యక్తిగా తనను విశ్వసించ మంటున్నారు మనల్ని. ఆ తరువాత మాబోటి వాళ్ళమంతాగూడా చాలా జాప్యం జరిగిందనే భావించేటంతగా చాలాకాలం తర్వాత ప్రభుత్వ వాణిజ్య సంస్థద్వారా పదివేల టన్నుల వర్జీనియా పొగాకును కొనుగోలు చేయటానికి, దానికి తగిన హక్కును కలిగించటానికి, ఆ సంస్థద్వారా కొనుగోలును ప్రోత్సహించటానికి అవకాశం కల్పిస్తామని అన్నారు. కాని ప్రభుత్వం వాణిజ్య సంస్థ కొనుగోలు చేయటానికి రంగంలో దింపటానికి మళ్లీ చాలా కాలం పట్టింది. ఇంతలోనే రైతులు దిక్కు, దరి తోచక ఆదుకొనేవాళ్లు లేక ఉన్న సరుకును ఎవళ్లు కొంటామంటే వాళ్లకు అలవల సులవలకు అమ్మేసుకొన్నారు.

7. పొగాకు కొనుగోళ్ల విషయంలో జాప్యం వల్ల మధ్యదళారీలు బాగుపడుతున్నారు

ప్రభుత్వ వాణిజ్యసంస్థ నడుంకట్టి రంగంలోకి దిగేనాటికి సరుకంతా వర్తకుల చేతుల్లోకి చిక్కిపోయింది. దీనివల్ల ఎవరికి లాభము? దీనివల్ల మధ్యదళారీలు,

బేళ్లు కట్టేవాళ్లు, వ్యాపార్లు ఈ బడాబడా గుత్త పెట్టుబడిదారీ సంస్థలు బాగుపడ్డవి. మరి ఇప్పుడు చాలా కాలం తటపటాయించి తరువాత భారత ప్రభుత్వం రైతాంగానికి ఏదో కొంత నష్టపరిహారాన్ని చెల్లిస్తానంటూ వాగ్దానం చేసింది. ఇందులో కూడా చాలా విషయాలల్లో ఆ డబ్బు కాస్తా మధ్యదళారీలకే అందిందేగాని, రైతులకు నయాపైసా కూడ దక్కలేదు. ఇది నేటి పొగాకు రంగం పరిస్థితి. ఇప్పుడు మన మంత్రి మహాశయులు ఈ పొగాకు రైతులు అందరు ఇక ఉమ్మడి మార్కెటంటూ ఏర్పరచు కొనకపోతే, వాళ్ళందరికి ప్రభుత్వ వాణిజ్యసంస్థ సక్రమంగా సహాయాన్ని అందజేయటానికి వీలు ఉండదంటున్నారు. వాళ్ళకు ప్రత్యేకమైన క్రయవిక్రయ వేదిక ఒకటి ఏర్పాటు చేస్తామని, ఆ నిర్ణీత ప్రదేశంలోనే కొనుగోలు చేస్తామంటున్నారు. అందుకు వాళ్ళకు కొంత అధికారం ఉండాలంటున్నారు. వాళ్ళ పొగాకుసంస్థ చట్టంకింద అటువంటి అధికారం ఉండనేఉంది. మళ్లీ ఎమంటున్నారంటే పొగాకు రైతులు అందరూ తాము పండించే వర్జీనియా పొగాకును ఆటువంటి నిర్ణీత స్థలానికి తీసుకొచ్చి అమ్మవలసిందని వాళ్ళను వత్తిడి చేయలేమంటున్నారు. అందుకని పొగాకు రైతులు అందరు తాము పండించిన పొగాకును ఈ నిర్ణీత విక్రయ స్థలానికే తీసుకు రావటానికని వత్తిడి చేయటానికే ప్రభుత్వం ఇప్పుడు ఈ శాసనాన్ని ప్రవేశ పెడుతుంది. ఇక అప్పుడు ఈ రైతాంగమంతా చాలా దూర గ్రామాలనుంచి ఎంతో వ్యయప్రయాసలకు ఓర్చి లారీలమీద బండమీద, ఈ నిర్ణీత విక్రయ స్థలానికి తగుసరుకును బలవంతపు బ్రాహ్మణార్థంగా తీసుకొని రావలెనన్నమాట. ఇది అంతా ఎవరి మేలు? రైతులు తమ పొగాకును అంతా తీసుకొనిపచ్చి బట్ట బయలుగా వుండేచోటులో వుంచుతారు.

పొగాకు నిల్వాలకు గిడ్డంగులు కావాలి

పొగాకు నిల్వలు చేసుకొంటానికి కొట్లు ఎక్కడ ఉన్నవి? ఆనిర్ణీత క్రయవిక్రయస్థలంలో కొని పాకలు వేస్తారు. అవిసరిపోతవా? ఈ పొగాకు బేళ్లు అన్నీ వాతావరణ కాలుష్యానికి గురై పాడై పోతవి. మరొక విషయమేమిటంటే అమ్మకానికి సిద్ధంగానున్న పొగాకును కొంటానికి ఏ రోజునైనా కొనేనాధుడు ఉంటాడా? ఎంతో కాలానికిగాని, అమ్మకం జరగటానికి అవకాశం దొరకదు. ఈలోపుగా సామాన్యంగా జరిగేది ఏమిటంటే ఆ ఉన్న సరుకులో సగమైనా కొనుక్కోటానికి ముందుకు వచ్చి ధర పెట్టే నాధుడే దొరకడు. కొద్దికాలంలో అమ్ముడుపోక మిగిలిపోయిన పొగాకు గతి ఏమి కావాలి? అమ్ముడుపోని ఈ సరుకు అంతా ఈ పేద రైతులు ఎక్కడదాచుకోగల్గుతారు? వీటిని దాచుకోటానికి కొట్లు ఉన్నవా? వీళ్ళకు సరుకును నిల్వచేసుకొని ఉంటానికి తగినకొట్లు ఉండవు. ప్రభుత్వం అటువంటి కొట్లను తాను నిర్మిస్తాను అంటుంది. ఇదిగో పథకాలు వేశాం.

అదిగోకట్టించబోతున్నాం. ఇదిగో పునాదులు లేస్తూన్నాయి. అంటూ అరచేతిలో వైకుంఠం చూపిస్తుంది. కాని ఈ ప్రభుత్వ తతంగం అంతా చూస్తూ ఉంటే ఇప్పటివరకు ఆలూలేదు, చూలులేదు కొడుకుపేరు సోమలింగం అన్నట్లుగా ఉన్నది. ఈ ప్రభుత్వం ఈ కొట్లు కట్టటానికి పదో ఇరవయ్యో లేక ముప్పయ్యో కోట్ల రూపాయలు వ్యయపరచడానికి సిద్ధంగా ఉన్నదా? అటువంటి పథకమేదైనా తయారు చేసిందా? అని ప్రశ్నిస్తున్నాను. ఈ విషయంలో తమకు ఇటువంటి నిర్దుష్టమైన పథకం ఒకటి ఉందని ఈ ప్రభుత్వం ముందుకు రావటానికి సిద్ధంగా లేదు. మరి అటువంటప్పుడు రైతాంగాన్ని మరింత బాధపెట్టటానికేగాక, ఇపుడు ఈ సవరణ శాసనాన్ని ఎందుకు ప్రవేశపెడుతుంది?

పొగాకుబోర్డు నిర్మాణ శాసనాన్ని మళ్ళీ మార్చి వ్రాయాలి

ఇక రెండో విషయమేమంటే ఇన్ని సంవత్సరాలనించీ మేము ఈపొగాకు సంస్థ నిర్మాణ సూత్రాన్ని సవరించి క్రొత్తగా రూపొందించాలని అడుగుతున్నాము. అసలు ఈ పొగాకుసంస్థ ఆవిర్భావ దశలోనే దీనికి సంబంధించిన ప్రథమ శాసనాన్ని ప్రవేశపెట్టిన సమయంలోనే ఈ సంస్థలో పొగాకు రైతులకు ఎక్కువ ప్రాతినిధ్యములేదనీ, పెద్దపెద్ద వ్యాపారస్తులకు, బడాబడా ఎగుమతి సంస్థలకు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తుందనీ, ఈ సంస్థానిర్మాణంలో చాలా లోపాలు ఉన్న వనీ గోలపెట్టాము. ఆరణ్య రోదనం చేశాం. వాస్తవంగా ఈ ప్రభుత్వమే కనుక పొగాకు పండించే రైతుల శ్రేయస్సును హృదయ పూర్వకంగా కోరుకుంటుంటే, ఇప్పుడు ఈ శాసనాన్ని సభముందు ఉంచేముందుగా ఈ పొగాకు సంస్థయొక్క నిర్మాణ సూత్రాలను మార్చలేదా అంటున్నాను? ఈ విషయాన్ని ఎందుకు ఆలోచించలేదు ప్రభుత్వము.

పొగాకుబోర్డులో రైతులకు తగిన ప్రాతినిధ్యం లేదు

అందుకనే అయ్యా, పొగాకు రైతులంతా ఇపుడు ఈ శాసనాన్ని భయ సందేహాలతో చూస్తున్నారు. ఆ రోజుల్లో కూడా ఈపొగాకు బోర్డుకూడా పెద్దపెద్ద వ్యాపారస్తుల ఎగుమతి దార్ల పక్షాన్నే వహించింది. ఇప్పుడు గూడా ఆదే దృష్టిలోనే ఉంది. "మీ ప్రభుత్వం, మీ కాంగ్రెసు ప్రభుత్వమే యీ రైతాంగాన్నిగూర్చి అంతగా పట్టించుకొనలేదు. అందుకని

యిప్పుడు మేము చేయడలచుకున్నా చేయలేక పోతున్నాము. మేము గూడా మీ కాంగ్రెసు ప్రభుత్వపు అడుగు జాడల్లోనే నడుస్తున్నాము" అని అనవచ్చు. ఇక అటువంటప్పుడు పూర్వపు ప్రభుత్వంకన్నా తామే రైతాంగంమీద వలపు ఒలక బోస్తున్నామని ప్రగల్భాలు చెప్పుకోటం దేనికి? మరి యీనాటి భారత ప్రభుత్వం కాంగ్రెసు ప్రభుత్వంగాని, కాంగ్రెసు సంస్థగాని రైతుల పక్షాన్ని ఏనాడు ఎహించ లేదని, పైగా తామే రైతుల సర్వ శ్రేయస్సుకోసం అహర్నిశలు నిద్రాహారాలుకూడా లేకుండా పాటుబడుతున్నామని రొమ్ము గుద్దుకుంటుంది. అయ్యా! వ్యాపారస్తుల విషయంలోను, గుత్తపెట్టుబడిదారుల విషయంలోను, పీడకుల విషయంలోను, రైతుల యిబ్బంది సబ్బందులను పట్టించుకోకుండావుండే విషయంలోనూ, మునుపు గద్దెలు ఎక్కినవారు, ప్రస్తుతం గద్దెను అంటిపెట్టుకున్న వారికి సహాధ్యాయులే అంటాను. అయ్యా! యీ సవరణపు చట్టాన్ని ఒకసారి మళ్లీ పరిశీలించండి, యీ పొగాకు సంస్థలో మీరు ఇచ్చిన ప్రాతినిధ్యం ఎటువంటిది? ఈ సంస్థలో 8 మంది సభ్యులు ఉంటారు. ఈ 8 మంది రైతాంగానికి ప్రాతినిధ్యం వహిస్తున్నామని అంటున్నారు. ఇంతకీ యీ సభ్యులు ఎవ్వరికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు? పొగాకు పండించే వాళ్ళకు, వ్యాపారస్తులకు ఎగుమతిదార్లకు, బేళ్ళు కట్టేవాళ్ళకు, సిగరెట్టు కంపెనీవాళ్ళకు యిందులోయిద్దరు సభ్యులు పొగాకు విషయంలో నిపుణులు.

పొగాకు బోర్డు నిర్మాణ సూత్రాలను మార్చాలి:

వాస్తవంగా అన్ని రాష్ట్రాలనించి, యిందులో ముగ్గురు మాత్రమే రైతాంగానికి ప్రాతినిధ్యం వహించే సభ్యులు వున్నారు. ఇక తక్కినవారంతా పొగాకు పండించే రైతులుకాదు. కాకపోతే పొగాకు రైతులను దోపిడీచేసే వర్గానికి సంబంధించినవాళ్ళు. వాళ్ళకుతోడు తక్కిన ప్రతినిధులనుకూడా చేర్చారు. వాళ్ళంతా నిజంగా పొగాకు పండించే రైతుల శ్రేయస్సు కోరేవాళ్లేనా? అందులో ముగ్గురు పార్లమెంటు సభ్యులు వున్నారు. వాళ్ళలో ఎంతమంది రైతులపట్ల మక్కువ కలవాళ్ళో నాకు తెలియదు. లోక్‌సభలోనున్న ఒక మిత్రుడు మాత్రమే గత రెండు సంవత్సరాలనుంచి పొగాకు రైతుల పక్షాన్ని వహించి మాట్లాడుతున్నాడు. తక్కిన వాళ్ళంతా మూకీభావం వహించారు. పట్టీ పట్టనట్లుగా వున్నారు. వాళ్ళు రైతాంగంపట్ల ఎంత ఎక్కువ శ్రద్ధ తీసుకొని పనిచేయాలో, అంత శ్రద్ధ తీసుకోవటంలేదు. రైతాంగం వాళ్ళమీద పెట్టుకున్న ఆశలన్నీ అడియాశలయ్యాయి. ప్రభుత్వ పక్షంగా ప్రాతినిధ్యం వహించే సభ్యులు, ప్రభుత్వ నిపుణులు హాయిగా సుష్టుగా భోజనం చేయడం, సర్వ సౌకర్యాలను అనుభవించడం తప్ప మరేమిన్నీ కోరరు, చేయరు. నేను చెప్పిన విషయం యదార్థం కాకపోతే మాగౌరవమంత్రులను

ఒక మాట ఆడుగుతున్నాను. అట్లా రైతాంగం పక్షం నిలబడి పాటు పడుచున్న సభ్యులు యీ పొగాకు బోర్డులో ఎవరు వున్నారో చెప్పమనండి. ఈ బోర్డులోవున్న ఆరేడుగురు సభ్యులలో ఎంతమంది రైతుల పక్షాన పోరాడు తున్నారో చెప్పమంటున్నా. పైగా యీ సభ్యులంతా రైతాంగాన్ని దోపిడి చేస్తున్న వాళ్ళ పక్షాన భుజం కాస్తున్నారు. లేకపోతే ఆ దోపిడిని నిరంతరాయంగా సాగిపోయేట్లుగా మూకీ భావం వహించి మౌనంగా వుంటున్నారు. తమ ప్రభుత్వం నియమించిన ఆనిపుణులు రాబోయే నివేదిక కొరకు ఎదురుచూస్తూ ఆవశ్యం చేయకుండా మంత్రిమహాశయులు నిజంగా పొగాకు రైతుల సంక్షేమాన్నే కాంక్షించే వారయితే యీ పొగాకు బోర్డు నిర్మాణ సూత్రాల్లో తగినంతమార్పుచేసే శాసనాన్ని ప్రవేశపెట్టటానికి ముందుకు రావాలంటున్నాను. ఈచేసే మార్పులో కేవలం రైతాంగం క్షేమాన్ని కాంక్షించే త్రికరణశుద్ధిగల సభ్యులుమాత్రమేవేర్చుకోవాలేగాని, వ్యాపారుల, బడాబడాపెట్టుబడి దారుల, బేళ్లుకట్టే వాళ్ల పక్షాన ప్రాతినిధ్యం వహించే వాళ్ళకు స్థానం ఉండ కూడదు.

పండించే రైతుల స్థాయిలో పొగాకు గ్రేడింగు

మరి ఇప్పుడు అయ్యా! కనీసపు గిట్టుబాటు ధర నిర్ణయంచేసే సమస్య వుంది. కేవలం విదేశాలకు ఎగుమతిచేసే పొగాకు విషయంలోనే కాకుండా, మన దేశంలోనే అమ్మే, మన నాటు పొగాకులోఉండే రకాల పొగాకుకూడా కనీసపు గిట్టు బాటుధర నిర్ణయించాల్సిన అవసరం ఎంతైనావుంది. మరొక విషయం. వర్జీనియా పొగాకు విషయములో తరతమభేదాలను 88 రకాలనించి తగ్గించాలి. ఇంతకుముందు 31: 4గా విభజనగానే యుండేది. అందులో గూడా రెండు రకాల విభజనమాత్రమే అమలులోఉండేది. అందులో ఒకటిరైతు పొలం దగ్గరనే నిర్ణయించేరకం. ఆగ్మార్క్ సంస్థకు చెందిన వాళ్లు పొలాల్లోకి వచ్చి తమ ముద్రలు వేసి పోతుండేవాళ్లు. రెండోది ఎగుమతి చేసే రకం. ఈ పొగాకు పొలం పంట దశలోనే నిర్ణయించే వాళ్లు. మళ్ళీ ఎగుమతికి అనుకూలంగా ఉండే దశలో నిర్ణయించే పద్ధతి. అందువల్ల పొగాకు పండించటమంటే అనవసర వ్యయం పెరిగిపోతుంది. కాబట్టి ఆ పొగాకును స్వదేశంలోనే అమ్మకం చేసుకొనసీయండి. లేక విదేశానికి ఎగుమతి చేయసీయండి. ఒకే రకమైనవిభజన ఉండటం మంచిదంటాను.

ప్రభుత్వ వాణిజ్య సంస్థద్వారా మనదేశంతో వాణిజ్య సంబంధాలుండే దేశాలకు ఎగుమతి చేయడం

మరి రష్యా, చైనా, ఇంగ్లండు దేశాలకు తక్కిన ఐరోపా దేశాలకు పొగాకు ఎగుమతి చేసే సమస్య ఒకటి మిగిలింది. ఆయ్యా! మేమంతా మునుపెన్నడో ఏకకంఠముగా ప్రభుత్వ వాణిజ్య సంస్థ అంటూ ఒకటి నెలకొల్పబడాలనీ ప్రభుత్వాన్ని కోరాము. కీర్తిశేషులు పండిత జవహర్‌లాల్ నెహ్రూ మా కోర్కెను అంగీకరించారు. మేము దాన్ని ఎందుకు కావాలన్నాము? గుత్తపెట్టుబడిదారీ విధానంలో అనేక విదేశాలనుంచిగాని, మన దేశంనుంచిగాని అనేక వస్తువులు కొంటానికి సోవియట్ యూనియన్‌కు వాళ్ళ ప్రభుత్వ వాణిజ్య సంస్థలేగాకుండా, వాళ్ళ రాష్ట్రీయ వాణిజ్యసంస్థలు మాదా చాలా ఉండేవి. వాళ్లు ఈ సంస్థల ద్వారానే కొనుగోలుచేసేవాళ్ళు. అంటే ఒక రష్యా దేశానికి సంబంధించి ఒకే ఒక కొనుగోలుదారు ఉండేవాడు. అంటే కోనుగోళ్ళదార్లకు ప్రాతినిధ్యం వహించే ఉమ్మడిసంస్థ అన్న మాట. అది మనకు బాగుండలేదు. అందుకని సమాన ప్రతిపత్తితో ప్రభుత్వ స్థాయిలో ఆ విదేశాలతో వాణిజ్య వ్యవహారాలు నిర్వహించేసంస్థ మనకు కూడా ఒకటి ఉండాలన్నాం. ఆపుడు మన వ్యాపారస్తులు మోసగింప బడటానికిగాని, లొంగుబాటు ప్రదర్శించటానికిగాని ఆ విదేశీయుల ముందర చేతులుకట్టుకొని మాంపాహిఅని ప్రాధేయ పడటానికిగాని ఆవకాశంలేకుండా పోతుందని భావించాము. అదే మా ఉద్దేశము. మనపొగాకు రైతులను దోచుకొనే యీ మన దేశపు ఎగుమతిదార్లు మనకు అవసరంలేదు, అందుకని మన పొగాకునంతా మొత్తంగాకొనుగోలుచేసేకమ్యూనిస్టు దేశాలకుగాని, కమ్యూనిస్టులుగాని దేశాలకుకాని ఎగుమతి చేయడానికి సదుపాయం కల్పించాలని అన్నాం.

ప్రభుత్వ వాణిజ్య సంస్థ ద్వారా 25 శాతం ఎగుమతులు

ప్రభుత్వ వాణిజ్య సంస్థ వెలిసింది. కొన్ని సంవత్సరాలవరకు వ్యవసాయిక ఉత్పత్తులను ఎగుమతి చేయడానికి ఆ ప్రభుత్వ వాణిజ్య సంస్థ రంగంలో ప్రవేశించటానికి అనుమతి యివ్వలేదు. అది ఆవిర్భవించటానికి మూలకారణమైన వ్యవహారాన్ని నిర్వహించే అవకాశంలేకుండా పోయింది. చాలా రోజుల తరువాత సిరుడు, ఈఏడు మాత్రమే అది సక్రమంగా పనిచేయడానికి అనుమతి లభించింది. రంగంలో ప్రవేసించిన తరువాత బాగానే పనిచేసింది. మేలు కలిగించే ప్రభుత్వం

ముందుకువచ్చి, ప్రభుత్వ వాణిజ్య సంస్థ ద్వారా కనీసం 25 శాతమైనా ఎగుమతి చేసే వర్జీనియా పొగాకుకు కొనుగోలు చేయడానికి అనుమతిస్తుందని ప్రోత్సహిస్తుందని హామి నిస్తుందని ఆశిస్తున్నాను. కనీసం 25 వ శాతమైనా అనే అంటున్నాను. 25 వ శాతంవరకు అని నొక్కి చెప్పడంలేదు. దానివల్ల తక్కిన ఎగుమతిదారులు ప్రభుత్వ వాణిజ్యసంస్థతో పోటీపడాల్సిన అగత్యం ఏర్పడుతుంది. అట్లా పోటీ పడటం జరిగితే ఆ ప్రత్యేకమైన ఎగుమతిదారులు ఇదివరకటి మాదిరిగా రైతాంగాన్ని దొపిడిచేసే విధానం కట్టుబడుతుంది. రైతులకు పెద్దలాభాలు వచ్చే ధరలు కాకపోయినా కనీసపు గిట్టుబాటుధరలు చెల్లించడానికి సిద్ధపడతారు ఈవిషయంలో మన భారతప్రభుత్వం ఒక నిర్దిష్టమైన విధానాన్ని అనుసరించాలి.

పొగాకు ఎగుమతి విధానాన్ని జాతీయం చేయడానికి గూడ నేను సమ్మతిస్తాను

ప్రభుత్వమే గనుక ఈ ఎగుమతి వ్యాపారాన్నంతా, తానే నిర్వహిస్తుందంటే నేను చాలా సంతోషిస్తాను. బ్రిటిషు వాళ్ళు మనల్ని పరిపాలించే రోజులనుంచి నేను ఇదే చెపుతున్నాను. ఇప్పుడు మనం ప్రభుత్వ అధికార్ణ పద్ధతులపట్ల ఐహికార్థ జాతీయకరణం విషయంలోను జాతీయకరణ విషయంలోను, ఎందుకు విముఖత్వం వహిస్తున్నారో, దానికి కారణాలు ఏమిటో అందులో రాజకీయ కారణం ఏమిటో అన్న విషయంలో చాలా తెలివిగా వ్యవహరిస్తున్నాం. అందుకనే కనీసం 25 శాతం అని నొక్కి చెబుతున్నాను. ఈ ప్రభుత్వం అట్లాచేయటానికి ఇష్టపడుతున్నదా? ఇష్టపడుతుంటే, మాకు ఆ మేరకు ప్రభుత్వం హామీ ఇవ్వాలంటున్నాను. అంటే వాళ్ళా హామీని ఇవ్వాల్సివస్తే అది అమలు పరచడానికి ఇష్టపడుతున్నారనే అర్థం ఏ మాత్రం కాదు. ఈ ప్రభుత్వం పొగాకు నిల్వచేసుకుని ఉంచడానికి తగిన కొట్లు నిర్మించందే పొగాకును క్రిమికీటకాల బారిపడి చెడిపోకుండా తగిన రక్షణ సౌకర్యాలు ముందుగానే కల్పించందే ఇంకా కొన్ని నెలలవరకు ప్రభుత్వం ఆ విధంగా కొనుగోలు చేయడానికి సిద్ధపడలేదు. అంతేగాకుండా రైతులకు కొంతగా, వ్యాపారులకు కొంతగా పొగాకుసంస్థకు కొంతగానైనా ధనఋణ సహాయం చేయడం కూడా ముందు ముఖ్యం. ఎంత కాదనుకున్నా, కనీసం ఈ తతంగమంతా నెరవేరాలంటే కనీసం నూరు కోట్ల రూపాయలు పెట్టుబడి కావాలిసి వస్తుంది. ప్రభుత్వం ఈ హామీని ప్రజలకు ఇవ్వడానికి ముందుకు రావాలనేది నా అభిలాష.

పొగాకు సమస్యల విషయంలో తగిన శ్రద్ధ వహించాలి

ఇప్పుడున్న విషయాన్ని పరిశీలిస్తే పొగాకు చాలా ముఖ్యమైన వస్తువు. దానివల్ల కనీసం ఎక్సైజు సుంకంద్వారా ఆరు వందల కోట్లకు మించిన రాబడి ఉంది. మనకు మన ప్రభుత్వానికి విదేశమారక ద్రవ్యంద్వారా నూరు కోట్లు లభిస్తుంది. అందుకని మన ప్రభుత్వం ఈ పొగాకు విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలి. దాని అభివృద్ధికి సాయపడాలి. రైతాంగం శ్రేయస్సును కాపాడాలి. ఇప్పటివరకు చేయని మరొక ముఖ్యమైన పని ప్రభుత్వం చేపట్టాలి. అదేమిటంటే, దేశంలో అన్నిటికన్నా పొగాకు అభివృద్ధి విషయంలో, అన్నిటికన్నా ప్రధాన ప్రాధాన్యం ఇవ్వాలి. మన ప్రభుత్వం ఈ హామీని ఇవ్వాలని అడుగుతున్నాను.

(ఆంగ్ల మూలానికి అనువాదం)

శ్రీ ధనకుదురం

★

ఉండి తిన్నను లేక పస్తున్నఁగాని
యాస చేయవు పరులకప్పార్జితంబుఁ
నాఁక లెత్తగ నీపంచ కరగునతిథి
తినక త్రోవక పోయిన దినములేదు.

—దువ్వూరి రామిరెడ్డి.



బోర్డు ప్రవేశపెట్టిన వోచరు రైతుకు వెన్నుపోటుగా మారింది!

— రావి కమలాకరరావు

(కార్యదర్శి ఫారం ప్రొటెక్షన్ ఫోరం)

ఈ సంవత్సర ప్రారంభములో పొగాకుబోర్డు ప్రవేశ పెట్టిన వోచరు విధానము విఫల మయినది. పంటకు సరి అయిన ధర రాకపోగా, అమ్మిన దాని సొమ్ముకూడా రైతులకు అంతా అందలేదు. వోచరుతో రైతులు ఉక్కిరి బిక్కిరి అయినారు. వర్తకులు మాత్రము ఇబ్బడి ముబ్బడిగా సంపాదించు కొన్నారు. రైతులను దోచుకొనడానికి 1917 చక్కగా

ఉపయోగపడింది. వోచరు తెచ్చిన ముప్పును వివరిస్తూ 19-4-78 వ తేదీ ఆంధ్ర పత్రికలో ప్రచురితమయిన, వ్యవసాయ రక్షణ సదస్సు (Forum For Farm Protection) కార్యదర్శి శ్రీ రావి కమలాకర రావుగారి రచనను రైతులకొరకు ప్రచురిస్తున్నాం.

—సంపాదకుడు

పొగాకు రైతులకడగండ్లు

వర్జీనియా పొగాకు వచ్చిన తరువాత ఈ సంవత్సరంవంటి దారుణస్థితి తమకు ఎన్నడూ కలగలేదని రైతులు వాపోతున్నారు. అందులో రైతు రక్షణ పేరతో 1976 లోనే నిర్మాణం అయిన పొగాకుబోర్డు ఉండికూడా ఇంతటి ఘోర పరిస్థితి వాటిల్లటం విచిత్రం. డిసెంబరులో సాగవలసిన కొనుగోళ్ళు ఫిబ్రవరి చివరలో కాని ప్రారంభం గాలేదు. ఈ విపరీత జాప్యం మూలంగా, రైతువద్ద పొగాకు నిలువలు పేరుకొని, రంగుతగ్గి, నాణ్యత తగ్గి, రైతులకు ఇరువది కోట్ల రూపాయలు వరకు నష్టం సంభవించింది. నిరుటికంటే ఎగుమతి ధరలు 10 శాతం పెరిగినా, రైతులకు మాత్రం నలభై శాతం తక్కువరేట్లు వేస్తున్నారు. నిరుడు ఇచ్చిన సగటు రేట్లతో ఈ యేటి సగటురేట్లు పరిశీలించిన, వర్తకుల రికార్డుల ద్వారానే ఈ యదార్థాన్ని నిరూపించవచ్చును. సాధారణంగా మార్చినెల చివరకు పొగాకు చాలవరకు విడుదలై, రైతుల చేతికి కనీసం ముప్పది కోట్ల రూపాయలు వచ్చేవి. కాని ఈ యేడు ఇంతవరకు అయిదుకోట్ల రూపాయలు కూడా రైతులకు అందలేదు. దీనంతటికి బోర్డు ప్రవేశపెట్టిన ఆచరణ సాధ్యంకాని వోచరు మూల కారణం. ఓచరుకు భిన్నంగా వ్యవహరించి, పొగాకు కొనకుండా బహిష్కరించిన వర్తకులను మందలించే నాధులు లేకపోయారు.

ప్రభుత్వ ఆధీనంలో ఎగుమతులు

ఒక్క మనదేశంలో తప్ప, ప్రపంచ మంతటా, పొగాకుఉత్పత్తి, విక్రయం ఆయా ప్రభుత్వాల ఆధీనంలో ఉన్నాయి. ఆదేశాలలో రైతుకు సంపూర్ణమయిన రక్షణ ఉన్నది. ప్రపంచ వ్యాప్తంగా విస్తరిల్లిన కొన్ని గుత్త సిగరెట్టు కంపెనీల హస్తాలు" మన పొగాకు పరిశ్రమ చేజిక్కించుకుని ఉన్నది. రైతు రక్షణకుముందు ఈ విదేశీ గుత్తవర్తకుల ఉక్కు చట్రాలను బ్రద్దలు చేయవలసి యున్నది. అందు



కేంద్ర ప్రభుత్వ వాణిజ్య సంస్థ (యస్ టి. సి) యొక్క
సాంకేతిక సలహాదారులు శ్రీ జి. రామలింగం నిడమలూరు రైతుల
పొగాకు పరిశీలించు దృశ్యం.

కొరకు ముందుగా మన పొగాకు ఎగుమతులను జాతీయం చేయవలసి యున్నది. తదుపరి, దేశములోని సిగరెట్టు పరిశ్రమకు, విదేశాల ఎగుమతులకు అవసరమైనంత పొగాకు మాత్రమే మనం పండించాలి. చవిటి నేలలలోను, పల్లపు భూములలోను పొగాకు వ్యవసాయాన్ని నిషేధించాలి. శాస్త్రీయ పద్ధతిలో, భూసారములను పరిశీలించి అనువయిన భూములలో మాత్రమే పొగాకును పండించాలి. పొగాకు బోర్డు ఈ ఆలోచన చేయవలసియున్నది.

ద్వంద్వ గ్రేడింగ్ విధానాలు

తరువాత ముఖ్యమైనది సరిఅయిన గ్రేడింగ్ విధానం. ఇప్పుడు ద్వంద్వ గ్రేడింగ్ విధానం అమలులో ఉన్నది. ఒకటి రైతులవద్దఉన్న ఎనిమిది గ్రేడులు.

రెండవది ఎగుమతికొరకు అమలులో ఉన్న ముప్పది గ్రేడులు. ఎగుమతికి అవసరమయిన ముప్పది గ్రేడులు, రైతుల వద్దనున్న ఎనిమిది గ్రేడులనుండి తీయబడుచున్నవి. అయితే ఎగుమతి గ్రేడులకు చట్టరీత్యా ప్రభుత్వం ధరల నిర్ణయించుచున్నది. కాని రైతులవద్ద గ్రేడులకు కనీసధరలు లేవు. అనగా ఎగుమతి దారునకు భద్రత ఉన్నది. కాని రైతుకు రక్షణలేదు. రైతుల నిలువు దోపిడీకి ఈ ద్వంద్వ విధానము కారణం. అందుచేత ఈ విధానాన్ని సంస్కరించాలి. రైతుల ఎనిమిది గ్రేడులే, ఎగుమతి గ్రేడులుగా పరిగణించి, చట్టరీత్యా అమలు చేయాలి. రైతుల ఎనిమిది గ్రేడులకు కనీస ధరలు ప్రతిసంవత్సరం నిర్ణయించి, చట్టరీత్యా అమలు చేయాలి. గ్రామాలలో సామాజిక గ్రేడింగ్ కేంద్రాలను పొగాకుబోర్డు ఏర్పాటుచేసి రైతుల గ్రేడులకు గ్రామంలోనే సర్టిఫికేట్ యిచ్చే ఏర్పాటు చేయాలి. వేలం పద్ధతిద్వారా పొగాకు విక్రయాన్ని ప్రవేశపెట్టాలి.

యస్. టి. సి. పాత్ర

రైతుల వద్ద స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్ (యస్. టి. సి.) పొగాకు కొనాలని, కొంటారని కొందరు బోర్డు సభ్యులు, అధికారులు ప్రకటనలు చేసినారు. కాని, బోర్డువారు చెప్పినట్లుగా రైతులు పొగాకును ఎనిమిది గ్రేడులుగా చేయకుండా, సాంప్రదాయకంగా వస్తున్న నాలుగు గ్రేడులు మాత్రం చేశారు. బోర్డువారి గ్రేడులు కాగితం మీద తప్ప, గ్రామాలలోని పొగాకుకు లేదు. దీనికి తోడు రైతుల గ్రేడులకు సర్టిఫికెట్లుగాని, కనీసరేట్లుగానిలేవు. ఈ స్థితిలో రైతుల నుండి గేడ్ చేయని పొగాకును. ఎగుమతి రేట్లను ఆధారంగా చేసుకొని కొనడానికి యస్.టి సి. ఆశక్తత తెలియచేసినదని తెలుస్తున్నది. యస్. టి. సి. యొక్క నిర్ణయం ఆభ్యంత సమంజసం. విజ్ఞతాపూర్వకమైనది కూడా.

పొగాకుబోర్డు యస్. టి. సి.

ప్రస్తుత పరిస్థితులలో రైతులనుండి యస్. టి సి. పొగాకు కొనుటకు ఆశక్తత తెలియచేసినది గాబట్టి కేంద్ర ప్రభుత్వం బోర్డుచేత రైతులనుండి పొగాకు కొనిపించాలని కొందరు అందోళన చేస్తున్నారు. యస్. టి. సి. పొగాకుబోర్డు—కేంద్ర వాణిజ్యమంత్రిత్వ ఆధీనంలోనున్న రెండు సంస్థలు. యస్. టి. సి. కొన లేనప్పుడు బోర్డు ఎలా కొనగలదో దురూహ్యము. వేయి కోట్ల రూపాయలు ఎగుమతి దిగుమతి వ్యాపారం చేస్తూ, ముప్పది దేశాలలో కార్యాలయాలు కలిగి, ఇరువది సంవత్సరాల వాణిజ్యానుభవము కలిగి పొగాకు సమస్యలు కొట్టిన పిండిగా తెలిసి, కోట్లకొలది పెట్టుబడి పెట్టకలిగిన యస్.టి.సి. రైతులవద్ద పొగాకు కోనలేనప్పుడు.

నిన్నగాక మొన్న వచ్చిన పొగాకుబోర్డుకు ఉన్న ప్రత్యేకార్హతలు ఏమిటో ? రైతులకు ఎరువులు, పురుగుమందులు, నారు, నీరు, ఋణవసతి. బొగ్గు, సాంకేతిక పరిజ్ఞానం అందించడం పొగాకును సక్రమంగా గ్రేడుచేయడం వగైరాలు పొగాకు బోర్డు ప్రధమ కర్తవ్యం. ఈ విమ్యక్త ధర్మాన్ని మరచి వ్యాపారం చేయాలనే కాంక్ష కొందరు బోర్డుసభ్యులకు కలగడం రైతు రక్షణకు కాదన్నది సామాన్యులకు కూడా బోధపడగలదు. పొగాకు వ్యాపారంలో నుండి యస్. టి. సి. ని నెట్టి వేయాలని గుత్త వర్తకుల కోర్కెలను కొందరు బోర్డు సభ్యులు ప్రతిధ్వనించడం శోచనీయము. బోర్డుగాని అభివృద్ధి సంస్థకాని, వ్యాపారసంస్థకాదు. రబ్బరు, కాఫీ, తేయాకు వీలకులు మున్నగు వ్యవసాయ పంటల అభివృద్ధికి నిర్మాణం చేయబడిన ఆ యా బోర్డులకు ఆ పంటలకు మార్కెటీ సదుపాయములు కల్పించుటలో యస్. టి. సి. సేవలను కేంద్ర ప్రభుత్వం వినియోగిస్తున్నది. అట్లే పొగాకు బోర్డున్నప్పటికి, విక్రయ సౌకర్యాలు కల్పించుటకు యస్. టి. సి. ఆవశ్యకత ఎంతో అవసరం, వ్యాపారసంస్థ అయిన ఎస్. టి. సి. ని త్రోసిపుచ్చి, పొగాకు వ్యాపారము చేయవలయుననే ఆదుర్దాను కొందరు పొగాకు బోర్డు సభ్యుల స్వార్థ పరత్వమును తెలియపరుస్తున్నదేమో !

తక్షణ కర్తవ్యం

ప్రస్తుతం మార్కెట్లులోని మాంద్యాన్ని తొలగించడానికి కేంద్ర ప్రభుత్వం యస్. టి. సి. చేత పదివేల టన్నుల పొగాకు ఉత్పత్తిదారుల సహకార సంఘాల ద్వారా, చిన్న, మధ్య తరగతి వర్తకుల ద్వారాను తక్షణం కొనుటకు ఏర్పాటు చేయాలి. ఓచరు విధానము పరిణామములు సమీక్షించి రైతులకు జరిగిన నష్టమునకు పొగాకుబోర్డు పరిహారమును చెల్లించే ఏర్పాటు చేయాలి.

★

సామ్రాజ్యవాదుల నిలువు దోపిడి !

ప్రభుత్వ దళారీ స్వభావం ! !

పొగాకు రైతాంగ కర్తవ్యం

పెట్టుబడిదారి విధానం; అది ఏదేశం సాగించినా గర్హనీయమ్. సామ్రాజ్యవాద తత్వం, అది ఏదేశ విధానమైనా అనుసరణీయంకాదు. దోపిడీ; అది ఎవరుచేసినా దోపిడీయే. ఈ దృష్టినుండి యీ రచనను నిశితంగా పరిశీలించ వలసియున్నది.

ఈ రచనలో మన పొగాకు దిగుమతి చేసుకొంటున్న ప్రధాన దేశాలలో ఇంగ్లండ్, రష్యా, జపానులు ఉన్నాయి. ఇందులో అన్నిటికంటె తక్కువ ధర లకు కొంటున్నదేశం రష్యాయేనని, ఇట్టి సోషల్ సామ్రాజ్యవాద ధోరణిని అరి కట్ట బడాలంటే పొగాకు ఎగుమతి వాణిజ్యాన్ని ప్రభుత్వసంస్థ ద్వారానే జర గాలని, ఆసక్తిదాయకమైన వివరణలుగల యీ రచనను చదవాలని విజ్ఞప్తి.

— సంపాదకుడు

భారత దేశంలో పండించబడుతున్న ప్రధాన వాణిజ్యపంటలలో పొగాకు ఒకటి. బ్రిటీషు సామ్రాజ్యవాదులు మన దేశంలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోవున్న సారవంతమైన భూములను, చవకగా దొరకే శ్రమశక్తిని కొల్లగొట్టడానికి దొర పొగాకును (వర్జీనియా పొగాకు) ప్రవేశ పెట్టారు. ప్రారంభంలో ఆర్థికలాభాలు చూపించి విస్తారమైన ప్రాంతంలో ఈ పంటను పెంచేలాగున ప్రోత్సహించారు. వర్షాధారంగా పంటలు పండించ వలసివున్న ఆంధ్ర రైతాంగం ఇతర పంటల కన్నా ఎక్కువ ప్రయోజనకరంగా కన్పించడంతో పొగాకు పండించటానికే మొగ్గుతున్నారు. దీనితో తమ యిష్టమువచ్చిన ధరలు నిర్ణయించి బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు చెందిన యింపీరియల్ టుబాకో కంపెనీ తన దోపిడిని విచ్చల విడిగా సాగించింది. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో ఐ. యల్. టి. డి. బ్రాంచీల ద్వారా మన మార్కెట్టులోకి నేరుగా ప్రవేశించి నామ మాత్రమైన ధరలు చెల్లించి మన రైతుల జీవ సత్వాలు పీల్చివేస్తున్నారు. పొగాకుకు అంతర్జాతీయ మార్కెట్లో వున్న గిరాకీ ననుసరించి ప్రపంచ మార్కెట్ ధరలను మన రైతులకు ఇచ్చే పద్ధతిని వీరు అనుసరించటంలేదు. నగటు దిగుబడిని లెక్కించి అలానగటు ఉత్పత్తిని సాధించిన రైతుకు ఖరులు గిట్టేవిధంగా నిర్ణయించి అమలుపరుస్తూ వచ్చారు. నగటు ఉత్పత్తిని మించి, రంగు (నాణ్యత) బాగా వచ్చిన రైతులకు కొద్దోగొప్పో లాభాలు విగలడం జరుగుతుంది. నగటు దిగుబడికితగ్గి, రంగురాక పొతే రైతు నష్ట పోతున్నాడు. స్వంత భూములను సాగుచేయించే భూస్వాములకు కౌలు చెల్లించే పనివుండదు గనుక వారికి సహజంగానే లాభాలు రాకపోయినా నష్టాలు రావు. అంతేకాక భూమి దున్నటం మొదలు, అకు గ్రేడు చేసేవరకు ఇక్కడ కూలి చవక గనుక ఆ విధంగా సామ్రాజ్యవాదులు దోపిడి భారాన్ని వ్యవసాయ కూలీలు కూడ భరిస్తున్నారు. ధర గిట్టుబాటు కాక, అధిక మొత్తంలో కౌలు, వడ్డీలు చెల్లించవలసివచ్చే పేద, మధ్య తరగతి రైతులు దివాలా తీస్తున్నారు. క్రమంగా పొగాకు పంటకు అవసరమైన భూసారాన్ని కోల్పోయిన భూములు సెలైన్ అయినాయని ఆ భూములు పొగాకుకు పనికిరావని (non area) ప్రకటించి కొత్త ప్రాంతాలకు విస్తరిస్తున్నారు. నాన్ ఏరియాలోని పొగాకునుకూడా అతి చవకగా కొంటూనే వుంటారు. ఇరవై సం॥ల క్రితం ప్రతిగ్రామం ఒక ఫ్యాక్టరీయా అన్పించిన గుంటూరుజిల్లానుంచి దాదాపుగా వర్జీనియా పొగాకు అదృశ్యం కావటం ప్రత్యక్ష ఉదాహరణ.

ఐ. టి. సి. గుత్తాధిపత్యం - వారికి దళారీలుగా ఉపయోగపడుతున్న స్వదేశీ కంపెనీలు

గడచిన కాలమంతటా ప్రపంచ వ్యాపితంగానే పొగాకు పరిశ్రమపై గుత్తాధిపత్యం కలిగిన ఐ. టి. సి. బ్రిటీషు వలసగా వుండిన ఈ దేశంలోని ఎదురు లేని దోపిడీ సాగించుతూ వచ్చింది. మిగిలిన చిన్నచిన్న కంపెనీలన్నీ కూడా ఐ. టి. సి దాని కొనుగోలు డివిజన్ ఐ. యల్. టి. డి. ఆధిపత్యానికి లొంగివున్నాయి. ఐ. టి సి. కి దళారీలుగా వ్యవహరించడం తప్ప మరొక మార్గంలేని స్థితికి అవి నెట్టబడ్డాయి. దళారీలుగా తమకుముట్టే కమీషన్‌తో వారు తృప్తిపడుతున్నారు. అందువలన ఈనాడు మన పొగాకు కొనటంలో ఐ టి. సి. దే గుత్తాధిపత్యం. ఈరోజు మన దేశంలో చలామణీలోవున్న సిగరెట్లలో 90 శాతంకు పైగా ఐ. టి. సి. యాజమాన్యంలోనే వున్నాయంటే ఈ రంగంలో మన ముడిసరుకులనూ, శ్రమ శక్తినీ, సహజ వనరులనూ, వినియోగదారులనూ ఎంత స్వేచ్ఛగా వారు కొల్లగొట్టుకోగలుగుతున్నారో మనం అర్థం చేసుకోవచ్చు.

పొగాకు వ్యాపారంలో గుత్తాధిపత్యానికి రష్యన్ సోషల్ సామ్రాజ్యవాదుల ప్రయత్నాలు

సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదులు మన పొగాకు మార్కెట్టులో ప్రవేశించి ఇప్పటికప్పుడే ద్వితీయస్థానాన్ని ఆక్రమించారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదుల వలె వీరు నేరుగా మన మార్కెటులో ప్రవేశించి కొనుగోలు చేయటంలేదు. భారత బడా బూర్జువా వర్గంలోవున్న తమ దళారీలద్వారా వీరు తమకు కావసిలనంత పొగాకును సామ్రాజ్యవాదులకన్న ఏమీ తక్కువకాని పద్ధతిలో కొల్లకొడుతున్నారు.

సామ్రాజ్యవాదుల ప్రయోజనాలతో ముడిపడివున్న భూస్వామ్య దోపిడీ

విదేశీ కంపెనీలు, బడా బూర్జువావర్గం నడిపే స్వదేశీ కంపెనీలేకాక చిన్న చిన్న గోడౌన్లను మొదలు, మధ్యతరహా ఫ్యాక్టరీలవరకు ముఖ్యంగా మద్రాసు నుండి కలకత్తాకు వెళ్ళే ట్రంకురోడ్డు పొడవునా మనకు కన్పిస్తాయి. గ్రామాలలోవుండే పెద్ద భూస్వాములు కొంతమంది కలిసి ఒక గోడౌను ప్రారంభిస్తారు. తమ పలుకుబడి

నుపయోగించి చుట్టుప్రక్కల గ్రామాల రైతులవద్దనుండి పొగాకు కొనుగోలు చేస్తారు. విదేశీ బడాకంపెనీలు 15 నుంచి 30 రోజులు మాత్రమే ముమ్మరంగా కొనుగోలు చేస్తారు. తరువాత రైతులు ఈ మధ్య దళారీలమీద ఆధారపడక తప్పదు. వీరు రైతులకు డబ్బును సకాలంలో ఇవ్వరు. ఒకసంవత్సరానికి యిచ్చినా సంతోషమే.వీరు నామమాత్రమైన కూలియిచ్చి గ్రేడు చేయించి బడా కంపెనీలకు అమ్ముకుంటారు. వీరిలో చిన్నచిన్న రీడ్రయిర్సు కూడా వున్నారు. అనేక కంపెనీలు డబ్బు ఎగవేసి బోర్డులు తిరగ వేస్తున్న ఉదంతాలు సర్వసాధారణం. ఈరకమైన ఫ్యూడల్ పెత్తం దార్లు కొనసాగించే ఈ దోపిడి ఫ్యూడల్ బూర్జువా వర్గపు దోపిడీలో ఒక భాగమే. వారికి పొగాకు సప్లయిలుచేసే నోరుగా వారికి, స్థానికంగా పలుకుబడిఉండే భూస్వాములకు కొంత మంచిధర యిచ్చి మిగిలిన రైతులను కొల్లగొట్టటం చిన్న మొదలు పెద్ద కంపెనీల వరకు అనుసరించే సాధారణ దోపిడి సూత్రం.

సామ్రాజ్య వాదులకు సోషల్ సామ్రాజ్య వాదులకు సహజ సంపదలను సైతం దోచి పెడుతున్న దళారీ పాలక వర్గాలు

మనదేశం "స్వాతంత్ర్యం" పొందినదని ప్రభుత్వం, ప్రతిపక్షాలు, వామ పక్షాలమని చెప్పుకునేవారు పదే పదే అరిగిపోయిన గ్రామఫోను రికార్డులా అదే పనిగా అరుస్తున్నారు. అదే సందర్భంలో సామ్రాజ్య వాద కంపెనీ అయిన ఐ.టి.సి తదితర విదేశీ, స్వదేశీ గుత్త కంపెనీలు పొగాకు వ్యాపారంతోపాటు సముద్ర సంపదలను కొల్లగొట్టే (రొయ్య-చేప) ఎగుమతి వ్యాపారానికి కూడా ఎగబడుతున్నారు. ఎటువంటి ఉన్నత సాంకేతిక పరిజ్ఞానం కూడా అవసరం లేని పొగాకు కొనుగోలు ఎగుమతులను కూడా సామ్రాజ్య వాదులకు అప్పగించి మన రైతులను వారి దయా దాక్షిణ్యాలకు వదలివేసిన ఈ పాలకవర్గాల దళారీ స్వభావాన్ని మనం అర్థం చేసుకోవచ్చు. తమ దళారీలకు అధికారాన్ని బదలాయించి నంతవరకే నేటికి విదేశీ దోపిడీదారులు తమ దోపిడీని యదేచ్ఛగా కొనసాగించ గలుగుతున్నారు. ఈ అంశాన్ని బట్టి మనకు నిజంగా స్వాతంత్ర్యం రాలేదని అధికార మార్పిడి మాత్రమే జరిగిందని మనం అర్థం చేసుకోవచ్చు.

అధికార మార్పిడికి ముందు కొద్ది కొద్దిగా ప్రవేశించిన జపాన్ సామ్రాజ్య వాదులు కూడా అధికార మార్పిడి తర్వాత కోలుకున్నారు. అంతర్జాతీయంగా పొగాకు పరిశ్రమలో అమెరికన్ బ్రిటిష్ సామ్రాజ్య వాదులకు కుదిరిన రాజీ ఫలితంగా మన మార్కెట్‌లో వారి మధ్య పోటీ లేకుండా పోయి ఐ.టి.సి (ఐ.యల్.టి.డి) దాదాపు ఏకచ్ఛత్రాధిపత్యం వహించ సాగింది.

1960 వ దశాబ్దంనుంచి సోవియట్ సోషల్ సామ్రాజ్య వాదులుకూడ మన పొగాకు కొనుగోలులో ప్రధాన పోటీ దారుగా ముందుకు వచ్చారు. ఈ క్రమంలో వీరి దోపిడీ కూడా తీవ్రస్థాయికి చేరుకుంది.

ప్రపంచ మార్కెటులో ఈనాడు పొగాకుకు కనీససగటు కిలోధర అమెరికాలో రు 23, ప. జర్మనీలో రు 25, జపాన్‌లో రు 42లు రైతుకు ముడుతోంది. కాగా మన దేశంలో అది ప్రభుత్వ లెక్కల ప్రకారం కె జి. 1కి 8 రూ॥లు అయినా వాస్తవంలో 5 రూ.కు మించి గిట్టటంలేదు. ఈ విధంగా ప్రపంచ దేశాలలో పొగాకు పండించే రైతాంగం అందరిలో అతి నికృష్ట స్థితిలో భారత రైతు ఉన్నాడు.

సోషల్ సామ్రాజ్యవాదులు వెనుకబడిన దేశాలు

మన పొగాకు ఎగుమతి చేస్తున్న దళారీ కంపెనీలకు (ఇవి ప్రధానంగా సోవియట్ తదితరదేశాలకు ఎగుమతిచేస్తాయి) గిడుతున్న ధరలు ఈ విధంగావున్నాయి. 1972 లో కిలో 1కి 6 రూ॥లు, 76 లో 12 రూ॥లు, 77 లో 14 రూ॥లు, అంటే గ్రేడుచేసి ఎగుమతి చేసిన పొగాకుకు తమ విదేశీ యజమానులనుండి ఈదళారీలు పొందుతున్నది. కిలోకు 14 రూ॥లు. రైతుకు ఇస్తున్నది ఇవ్వగా ఖర్చులుపోగా అధిక మొత్తాలలో లాభాలు పొందగలుగుతున్నారు. ఈ వాణిజ్య వర్గాలు పొందుతున్న ధర కనీసం పాశ్చాత్యదేశాలలో ఏ దేశంకోని రైతు పొందేదానికన్నాకూడా చాలా తక్కువ అంటే మన దళారీ పాలకవర్గాలు విదేశీ దోపిడికి ఎంతగా మన గేట్లు తెరిచారో అర్థం చేసుకోవచ్చు.

మనదేశంలో పొగాకు ఉత్పత్తి ఎగుమతులకు సంబంధించిన వివరాలు.

సం॥	ఉత్పత్తి మిలియన్ కేజీలు		ఎగుమతులు		1కిలో
	మొత్తం పొగాకు	వర్జీనియా పొగాకు	టన్నులు	విలువ లక్షల రూ॥	సగటు విలువ రూపాయలలో
1974-75	863.1	99.5	74,982	8085.5	10.72
1975-76	349.8	96 8	74.276	9809 6	12.53
1976-77	414.2	122.0	80.134	9661.8	12 06
1977 జనవరి to డిసెంబరు	—	—	70.89	124589	16 17

(పొగాకో న్యూస్ - (Nov-Dec 1977)

మన పొగాకును దిగుమతి చేసుకుంటున్న దేశాల —

విలువ కోట్ల రూపాయలలో

నం.	దేశం	1974-75	1975-76	1976-77	1977-78
1.	బ్రిటన్	38.96	30.31	42.84	51.99
2.	సోవియట్ యూనియన్	17.23	28.90	23.99	37.20
3.	జపాన్	6.48	9.53	8.76	9.71
4.	ఇరాక్	—	—	—	2.25
5.	బెల్జియం	—	—	—	1.43
6.	ఇటలీ	—	—	—	1.28
7.	జకోస్లవేకియా	—	—	—	1.13
8.	అమెరికా	—	—	0.385	1.05
9.	పోర్చుగీసు	—	—	0.32	0.32
10.	ప.జర్మనీ	—	—	0.22	0.23

ఈ వివరాలుచూస్తే ఈనాడు మన పొగాకు దిగుమతి చేసుకుంటున్న దేశాలలో బ్రిటన్ మొదటిది, రష్యా రెండవది, జపాన్ మూడవది. 77-78లో మొత్తం దిగుమతుల విలువ దాదాపు 114 కోట్ల రూ లు, 45.6 శాతం దిగుమతులలో బ్రిటన్ ప్రథమ స్థానంలోనూ 32.6 శాతంలో రష్యా ద్వితీయ స్థానంలోనూ వున్నాయి. అంటే ప్రపంచంలో ఏ దేశపు రైతుకైనా గిట్టుతున్న కనీస సగటు ధరలో నాలుగో వంతు మాత్రమే మన రైతుకు గిడుతున్న పరిస్థితికి ప్రధాన దోపిడీదారులైన బ్రిటిష్ సామ్రాజ్య వాదులు, సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదులు కారణమన్నమాట.

పొగాకు రైతులను కొల్లగొడుతున్న సోషల్ సామ్రాజ్యవాదులు

సోవియట్ రివిజనిస్టులు శాంతియుత ఆర్థిక పోటీద్వారా సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని దెబ్బతీయవచ్చునని చెపుతున్నారు. వారి వందిమాగధులైన పాత, కొత్త రివిజనిస్టులు సోవియట్ సహాయం వెనుకబడిన దేశాలు తమ కాళ్ళమీద తాము నిలబడడానికి దోహదం చేస్తున్నదని అంటున్నారు. అది నిస్వార్థమైన సహాయం అని కీర్తిస్తున్నారు. కాని పొగాకు రైతును వారు కొల్లగొడుతున్న తీరు ఈ తీయటి కబుర్ల వెనుక దాగివున్న విషాన్ని బహిర్గత పరుస్తున్నది. వారు చెప్పే శాంతియుత ఆర్థిక పోటీ వెనుకబడిన దేశాల ముడి సరుకులకు సవ్యమైన ధరలు యివ్వటంలో పోటీ కాదని రైతాంగాన్ని కొల్లగొట్టటంలోసామ్రాజ్యవాదులతో పొత్తు కలపటమేనని స్పష్టమౌతున్నది. గ్రేడు ప్రకారం తీసుకొన్నా, సగటు ధరను తీసుకొన్నా సోషల్ సామ్రాజ్యవాదులు బ్రిటిష్, జపాన్ సామ్రాజ్యవాదులకన్నా కూడా ఎంత ఎక్కువ ధరలు యిస్తున్నారో ఈ క్రింది పట్టికచూస్తే తెలుస్తుంది. ఇదీ సోషల్ సామ్రాజ్యవాదులు వెనుకబడిన దేశాలకు చేస్తున్న సహాయం యొక్క అసలు రూపం.

1977 సం॥ పు పంట - వివిధ గ్రేడ్లు - వాటిరేట్లు (డీలర్ల కిచ్చింది) కిలో 1 కి. ధర - రూపాయలలో

గ్రేడు	బిటన్	రష్యా	జపాన్
C (1-4)	21-48	—	—
F (1-4)	22-74	—	—
S (1-4)	24-75	—	—
T (1-4)	22-57	—	—
4 (C)	25-90	—	25.17
3 (C)	—	—	26.08
3	—	20.21	25.62
4	22.93	18.69	24.62
LBY	17.16	17.10	22.95
LG	17.54	17.09	—
LBY	16.14	13.86	—
'B'2	12.40	10.77	—
LMG	10.80	10.77	—

పై పట్టిక చూస్తే ఏ ఒక్క గ్రేడులో కూడా అంతర్జాతీయ సగటు ధరకూడా లేదనీ, కనీసం ఒక్క గ్రేడులోకూడా రష్యా, బిటన్, జపాన్ సామ్రాజ్యవాదుల కన్నా ఎక్కువ ధర కాదుగదా వారితో సమానమైన ధరకూడా యివ్వటంలేదనీ తేలు తోంది. మనదేశాన్ని దోచుకోవటంలో సామ్రాజ్యవాదులు పరస్పరం ఎంతగా సహక రించుకుంటారో, పోటిపడతారో మనం ఆర్థం చేసుకోవచ్చు.


ఒకకిలో పొగాకుతో మూడు వెయ్యిసిగరెట్లు తయారవుతాయనీ దొరపొగాకు చాలా ఖరీదైన సిగరెట్లలోనే వాడుతారన్న వాస్తవాన్ని లెక్కలోకి తీసుకుంటే ఈ దోపిడీ తీవ్రతను మనం ఆర్థంచేసుకోవచ్చు.

రష్యన్ సోషల్ సామ్రాజ్యవాదులు మనదేశంలో చవగ్గా పొగాకును కొంటూ ఇక్కడే మరింత చవగ్గా కార్మికశ్రమ లభిస్తున్నందున దాన్నికూడా కొల్లగొట్టి

వందల కోట్ల రూపాయల లాభాలను ప్రోగుచేసుకొంటానికి పూర్తిగా 100 కి 90 భాతం ఎగుమతి ప్రాతిపదికపై సిగరెట్ పరిశ్రమలను పశ్చిమదేశాలనుండి దిగుమతి చేసుకొన్న అధునాతన యంత్రాలతో నవభారత్ కంపెని ఆధ్వర్యాన స్థాపించింది. ఆ విధంగా చవగ్గా తయారైన సిగరెట్లను తూర్పు యూరపు దేశాల్లోనూ, తన అధీన అరబ్బు, ఆఫ్రికా దేశాల్లోనూ, చివరకు కొన్ని పశ్చిమదేశాల్లోనూ విపరీతమైన రేట్లకు అమ్ముకొంటున్నది. ఈ విధంగా అటు పొగాకు రైతాంగాన్ని, కార్మిక వర్గాన్ని, వినిమయదారులను రెండుచేతులతో నిలువుదోపిడీ చేస్తున్నది. ఇది చాలా కాలంగా మన దేశంలో బ్రిటిషు అధీన కంపెనీల దోపిడిని తలదన్నేదిగా వుంది. ఈ విధంగా సామ్రాజ్యవాదుల, సోషల్ సామ్రాజ్యవాదుల, వారి దళారీల నిక్కష్ట దోపిడీకి గురిచేయబడటమనేది నేటి పొగాకురైతు ప్రధానసమస్య. వీరి దోపిడీకి అవకాశమిస్తున్న దళారీ ప్రభుత్వమే దీనికి పూర్తిగా బాధ్యత వహించాలి. కాగా కన్నీటితుడుపుగా ప్రభుత్వం పొగాకుబోర్డును ప్రకటించింది. ఇది సామ్రాజ్యవాదుల, సోషల్ సామ్రాజవాదుల. గుత్తసంస్థల ప్రయోజనాల్ని కాపాడుతున్న పాలకవర్గ పార్టీల ప్రతినిధులతో కూడినసంస్థ కనుక ఇది మౌలికంగా సామ్రాజ్యవాదుల ప్రయోజనాలతో ఘర్షణపడదు. రాజి పడతుంది. దానిఫలితంగానే ఇది పెట్టిన షరతులన్నీ గందరగోళంగా ఉన్నాయి. కనిసం అన్నిగ్రేడులకు ఇది ధరకూడా నిర్ణయించలేకపోయింది. పైగా రైతులకు అనుకూలంకాని నిబంధనలు కొన్ని ప్రవేశపెట్టింది. కన్నీటితుడుపుగా ఇది ప్రకటించిన కనీసధరకూడా చాలాతక్కువే. ఐనప్పటికి ఈ ధరనుకూడా ఏ కంపెనీకూడా యివ్వలేదు. పలుకుబడి గల్గిన భూస్వాములకు, లంచాలు మేపినవారికి తప్ప ఏ రైతుకు ఈ రేటు యివ్వలేదు. ఏ రైతూ పొందలేదు.

ఈ ఏడు 120 మిలియన్ల కె జి.ల పొగాకు పండినందువలన ధర తగ్గిపోయిందని యీ దళారీ ప్రభుత్వమూ, టొబాకో బోర్డూ సామ్రాజ్యవాదుల దోపిడిని సిగ్గులేకుండా బలపరిచి అనుమతి లేకుండా పండించారని రైతులపై తీవ్రంగా దాడి చేస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే టొబాకో బోర్డు నిర్ణయాలు కాగితాలపై ఉపన్యాసాలకే పరిమిత మయ్యాయి.

స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్ ఎస్. టి. సి. : ఇది ఏర్పడింది మొదలు ఏనాడు కూడా రైతులకు ఉపయోగపడింది లేదు. ఈసంవత్సరం, గుత్త కంపెనీలు దారుణంగా రైతులను కొల్లగొడుతుంటే ఇది రైతులవద్దనుండి నేరుగా పొగాకు కొనలేనని చెప్పింది. 8 గ్రేడులుగా రైతులు విభజించలేరని, అందువలన అలా గ్రేడు చేసిన పొగాకు డీలర్ల దగ్గరనే దొరుకుతుంది గనుక వారు డీలర్ల దగ్గరనే తమకు కావలసిన 15000 టన్నుల పొగాకు కొన్నారు. ఈ విధంగా ఈ ప్రభుత్వ సంస్థ



కేంద్ర ప్రభుత్వ వాణిజ్య సంస్థ (ఎస్. టి. సి.) యొక్క సాంకేతిక సలహాదారులు శ్రీ జి.రామలింగం నిడమలూరు రైతు సహకార సంస్థ ప్యాకింగ్ చేసిన పొగాకును పరిశీలించు దృశ్యం

కూడా దళారీలకు మాత్రమే ఉపయోగపడుతోంది. కో-ఆపరేటివ్ సంఘాలేర్పడి గ్రేడు చేయించే పక్షంలో అలాంటి వారివద్దనుండి కొంటామని పకటించారు. ఇది ఆచరణ సాధ్యమయినదికాదు. ఉపయోగ కరమయినదికూడా కాదు. ఈ సంస్థ ప్రామాణిక మయిన ధరలకు రైతుల దగ్గరనుండి నేరుగా పొగాకు కొని గ్రేడు చేయించవచ్చు. కాని అలా చేసిన పక్షంలో సా మాజ్యవాదులకు అధిపత్యం దెబ్బ తింటుంది. తన్ని తరిమివేయవలసిన సామ్రాజ్య వాదులను. సోషల్ సామ్రాజ్య వాదులను, మన మార్కెటులోకి నేరుగా అనుమతించిన ప్రభుత్వం ఆపని చేయలేదు.

యీ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని పొగాకు రైతు బడ్జెటును పరిశీలించుదాం. 3 ఎకరాలను (ఒక గొర్రు) ఒక యూనిట్‌గా తీసుకుందాం.

కౌలు	రు. 3000-00	నాటుతోసహా	500-00
దుక్కి తలకు	రు. 1000-00	మొత్తం కూలి	రు. 1600.00
ఎరువు	రు 400-00	కాల్పుఖర్చు	రు. 1000-00
నారు (కనీస ధర)	రు. 600-00	బ్యారన్ అద్దె	రు. 400-00
	5000-00	మొత్తం ఖర్చు	రు. 8000-00

ఈ పెట్టుబడితో పేద,మధ్య తరగతి రైతాంగం అధికభాగం వడ్డీలకు తేవలసి ఉంటుంది. వడ్డీ నెలకు నూటికి రు. 3-00 మొదలు రు. 5-00 వరకు ఉంటుంది. బ్యాంకు వడ్డీయే నెలకు రు. 1-50. అసాధారణ పరిస్థితుల్లో నారుధర, బొగ్గుధర పెరిగితే యింకా అదనపు భారం మొయ్యావలసి వుంటుంది కౌలు మినహా మిగిలిన రు. 5.00 ల పెట్టుబడికి వడ్డీ కనీసం రు. 500 అవుతుంది.

ఈ బడ్జెటును పరిశీలిస్తే రైతు ఎన్ని ఇబ్బందులు పడి పెట్టుబడి సింపాదిస్తున్నాడో అర్థం చేసుకోవచ్చు. తీరా అమ్మకం జరిగేనాటికి సగటున వచ్చే దిగుబడిని బట్టి ధరలు వేసేదాన్నిబట్టి అమ్మకం ఫలితం వుంటుంది. గత సం॥ అమ్మకం ఒక యూనిట్‌కు రు. 8000-00 మించలేదు. అదే యూనిట్‌కు ఈ సంవత్సరం అమ్మకం రు. 4500 మాత్రమే వచ్చింది. ఈ పరిస్థితినిబట్టి ఎంత దారుణమైన దోపిడీ జరుగుతున్నదో అర్థం చేసుకోవచ్చు.

పొగాకు ఉత్పత్తిరణలో ఎరువులరూపంతో జరిగే సామ్రాజ్యవాద దోపిడిని వివరించనవసరంలేదు. ఇత కష్టపడి ఉత్పత్తిచేసిన పొగాకురైతు ఈ సంవత్సరం అనుభవించిన దోపిడి చాలా ప్రత్యేకమైనది. పొగాకుబోర్డు విధించిన నియమాలలోఏ ఒక్కటీ అమలుజరగలేదు. కంపెనీలు దారుణమైన ధరలు వేస్తున్నందువలనప్రారంభంలో అనేకచోట్ల రైతులు తమ స్వంత చొరవతో అమ్మకం నిలిపివేశారు.ముమ్మరంగా ఎన్నికల సంరంభంలోపడి కొట్టుకొంటున్న పార్లమెంటరీ పార్టీలేవీకూడా ఈ సమస్యను పట్టించుకోలేదు. ఎన్నికలప్రచారంకోసం ఓంగోలువచ్చిన కేంద్రమంత్రి "రైతు" నాయకుడు చరణసింగ్ తమ సమస్య ఆడగవచ్చిన పొగాకు రైతులను గూండాలతో పోల్చి అవమానించాడు. పార్లమెంటరీ పార్టీలన్నీ తమకూ రైతు

సంఘాలున్నాయంటూ ప్రకటించుకునేవన్నికూడా బోగస్ సంఘాలేనని యీ పరిస్థితి తెలియజేస్తూ సరైన నాయకత్వం లభించనిస్థితిలో ప్రజల యీ అసంతృప్తికి సంఘటిత రూపం యిచ్చే శక్తులు కొరవడడం కారణంగా యీ సంవత్సరం ప్రజ్వరిల్లిన అసంతృప్తి అణగారిపోయింది. సరిగా గ్రేడు చేయలేదనే నెపంతో తమ యిష్టంవచ్చినట్లు గ్రేడు నిర్ణయించి ధరలు విరగకోశారు. ఏటా మాడుఆకుకు కిలోకు కనీసం రు. 2-50 లేక రు. 3-00 వేసేవర ఈ సం. కిలోకు 5 నయాపైసలు వేశారంటే ఎంత విచ్చలవిడిగా రైతులను దోపిడి చేశారో మనం అర్థంచేసుకోవచ్చు. రాష్ట్రంలోని పలుప్రాంతాల్లో మాడుఆకును మొత్తంగానే అమ్ముకొనే పరిస్థితిలేక దిబ్బలో వేసుకొంటున్నారు. ఇప్పటికే పలుచోట్ల నాటుపొగాకు దొరపొగాకుకూడా 30-40 శాతం వరకు ఎవరూ కొనేనాధుడు లేక గిట్టుబాటురేటు బొత్తిగాలేక రైతుల వద్ద పడివున్నది.

సామ్రాజ్యవాద కంపెనీలైన ఐ. టి. సి. మరికొన్ని దళారి కంపెనీలు నాటు పొగాకు ప్రధానంగా పండించే కర్నూలు, మహబూబ్‌నగర్, నల్గొండ, గుంటూరు, ప్రకాశం జిల్లాలనుండి గతసంవత్సరపు కనీస—గరిష్ట రేట్లికన్నా పెద్ద మొత్తంగా దిగ్గోసికొంటూ రైతాంగ మూల్లులను పీల్చుచున్నారు. చివరకు యస్. టి. సి. వారు కూడా చిత్రంవచ్చిన రేట్లువేస్తూ దోపిడీదారుల శ్రేణుల్లో చేరిపోయారు. ఈ విధంగా దొరపొగాకు (వర్జీనియా) పండించే రైతాంగంమాదిరే నాటుపొగాకు పండించే రైతాంగంకూడా తీవ్రదోపిడికి గురవుతున్నారు. కాబట్టి నాటుపొగాకు పండించే రైతాంగం దొరపొగాకు పండించే రైతాంగంతో ఐక్యమై వుమ్మడి శత్రువుకు వ్యతిరేకంగా పోరాటం సాగించాల్సి వుంటుంది.

ఈ పరిస్థితికి మూలకారణం మన వ్యవసాయోత్పత్తులను ముడిసరుకులుగా వాడుకుంటున్న విదేశీ దోపిడిదారులు నేరుగా మన మార్కెట్టులో ప్రవేశించి తమ యిష్టమైన ధరకు కొనగలగటం మన ప్రభుత్వం దళారీ ప్రభుత్వం కనుకనే బ్రిటీష్ సామ్రాజ్యవాదుల, సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదులు 75 శాతంవరకు గుత్తాధిపత్యం కలిగి ఏలుకుంటున్నారు. పొగాకుబోర్డులాంటి నామమాత్రపు సంస్థలు యీ సమస్యను పరిష్కరింపగలవు. సామ్రాజ్యవాదులు, సోషల్ సామ్రాజ్యవాదులు, బడా బూర్జువా, భూస్వామ్యవర్గాలనే నాలుగు మహా పర్వతాల బరువును నిర్మూలించుకోగలిగినప్పుడే సాధారణ భారతీయుడి సమస్యలు పరిష్కారమవుతాయి. ఇది కేవలం రైతాంగసమస్య మాత్రమే కాదు అశేష పీడితప్రజానీకం తమ ఉమ్మడి శత్రువులైన యీ నలుగురినీ ఓడించగలగాలి. ప్రస్తుత అర్థబలస'ఆర్థఫ్యూడల్' వ్యవస్థను నిర్మూలించి జనతా ప్రజాతంత్ర వ్యవస్థను నిర్మించుకోగాగలగాలి.

పై చొలిక కార్యక్రమాన్ని సాధించేందుకు దృఢంగా పోరాటం సాగిస్తూనే ఈ క్రింది కనీస తక్షణ కార్యక్రమం పాతిపదికపై పొగాకు రైతాంగం ఐక్యమై పోరాటానికి సంసిద్ధం కావలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము

1. ప్రపంచ మార్కెట్టులో జపాన్, జర్మనీ, అమెరికా దేశాల రైతాంగానికి గిడుతున్న రేటు నాదించుకోడానికి మన పొగాకు రైతాంగం ముందుకు రావాలి.

2. పొగాకు వ్యాపారంలో ఐ. టి సి (I. L. T. D.), రష్యన్ సోషల్ సామ్రాజ్యవాదుల గుత్తాధిపత్య దోపిడీని రూపుమాపడానికై ఉద్యమించాలి.

3. ప్రభుత్వయొక్క దళారీ విధానాలకు, మధ్య దళారీల దగాకోరు పద్ధతులకు వ్యతిరేకంగా పోరాడాలి.

4. గత 40 సంగాలో 3 రెట్లకు పైగా పెరిగిన ఎరువుల, మందుల ధరలు సగానికి సగం తగ్గింపుకోసం ఆందోళనచేసి సాధించుకోవాలి.

5. దారుణమైన వడ్డీరేట్ల రద్దుకోసం, సరసమైన రేటుకు ప్రభుత్వ బ్యాంకులద్వారా సాధించుకోవటానికి పోరాడాలి.

6. రైతాంగంనుండి పొగాకు కొన్నవెంటనే డబ్బు చెల్లింపుకోసం డిమాండు చేయాలి.

7. బొగ్గు, కలపను సరసమైనరేట్లకు సరఫరాకై ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలి.

8. వివిధ రూపాల్లో సాగుతున్న లంచగొండితనాన్ని అరికట్టేందుకు పోరాడాలి.

9. సామ్రాజ్యవాదుల, సోషల్ సామ్రాజ్యవాదుల ఆధీనంలోని సిగరెట్ పరిశ్రమలద్వారా జరుగుతున్న తీవ్రమైన దోపిడీకి వ్యతిరేకంగా భారత ప్రజలంతా కలిసి పోరాడాలి.

10. సామ్రాజ్యవాద దోపిడీ వ్యతిరేక పోరాటంలో పొగాకు రైతాంగానికి అన్నివర్గాల ప్రజలు అండదండగా నిలవాలి.

జనశక్తి సౌజన్యంతో

★

మన సిగరెట్ పొగాకులు - సిద్ధాంతాలు - సమస్యలు

రచన : శ్రీ ఆర్. వి. యస్. రావు,
రిటైర్డు సీనియర్ మార్కెటింగ్ ఆఫీసరు,
టొబాకో గ్రేడింగ్, కేంద్ర ప్రభుత్వ వ్యవసాయశాఖ.



శ్రీ ఆర్. వి. ఎస్. రావుగారు పొగాకు మార్కెటింగ్, గ్రేడింగ్ విషయాలలో బహుకాలం పరిశోధకుడుగా, ప్రవీణుడుగా పరిశ్రమించిన వ్యక్తి. పొగాకురైతు దయనీయ స్థితినిగురించి - అందుకు పరిష్కార మార్గముల గురించి ఆలోచనను రేకెత్తించగల వివరణాత్మకమైన రచన చేశారు. సీనియర్ మార్కెటింగ్ ఆఫీసరుగా ఉద్యోగ విరమణ చేసిన శ్రీ రావుగారి రచన అవగాహన చేసుకొన ప్రార్థన.

(— సంపాదకుడు)

ఆనాడు "భయం, భయం, పొగాకు భయం" అన్నారు పామరులు. ఈనాడు "బాధ, బాధ పొగాకు బాధ" అంటున్నారు పామరులు. పండితులు కూడ. భారత స్వాతంత్ర్య యోధులుగా, గణుతికెక్కిన ఆంధ్రావని, అంతర్దేశ ప్రఖ్యాతి గాంచిన, ఆంధ్ర రాష్ట్ర పొగాకువారు, విద్యా విజ్ఞతల నిలయమైన గుంటూరు, ప్రకాశంజిల్లా పొగాకులోకం, యీ విధంగా భయం వ్యక్తపరుస్తూ వున్నారంటే తప్పక ఏవేవో లోటుపాట్లు మన పొగాకు వ్యవసాయ, కార్మిక, వాణిజ్య, పారిశ్రామిక రంగాలలో తట్టుకొనవలసి వస్తోందని స్పష్టమౌతుంది. నిష్పాక్షికంగా చెప్పాలంటే - ఇతర దేశాలలో రాష్ట్రాలలో, కాలానుగుణ్యంగా అచ్చట రేకెత్తే సమస్యలు తగు విధంగా, పరిష్కరింపబడుతున్నవి. కాని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో- యీ విషయమయి ఎన్ని వినతి పత్రములు సమర్పించుకొన్నా బాధాకరమయిన, "ఓ హో ఆ ఆంధ్రుల సమస్యలా?" అనే హేళనా పూర్వక సమాధానాలే వినబడుచుండుట కద్దు ! తరుణము మించకుండా మనస్సు విప్పి ఉన్నది ఉన్నటుల మన పొగాకు విషయాలు విశదపరచడం మన కర్తవ్యం.

పొగాకు సమస్యలు పెక్కులు. యీ సమస్యలు తెలియని ప్రభుత్వంగాని, ప్రజానీకంగాని లేరు. అంతేకాదు యీ సమస్యల పరిష్కార మార్గాలు పతి పభుత్వాధికారికి, పొగాకు ప్రజలకు తెలిసినవే ! కాని ఆపరిష్కారమార్గాలు ఆచరణలో పెట్టుటకై ముందుకు వచ్చేవారు కానరారు ! మరి సమస్యలు, సిద్ధాంతాలు విపరించాలంటే కొన్ని గ్రంథాలు వ్రాయాలి. వలయు పరిష్కార మార్గాలు క్లుప్తంగా సూచించుట యిప్పట్టున సమయోచితం.

పొగాకు ఎన్నెన్నో వేరు వేరు భూ ప్రాంతాలలో పండించబడుతూంది. దిగుబడుల తూకం, నాణ్యం కూడా విభిన్న స్థాయిలలో చెప్పలేని "పోటు-పాటు"లతో వుంటున్నవి. మొన్న మొన్న 1976 లో స్వర్ణోత్సవము జరుపుకొనిన, భారత సిగరెట్ పొగాకుపంట - యీ అయిదు దశాబ్దాలలో ముఖ్య సూత్రాలైన ఎకరాయొక్క దిగబడి. వాటి ధర ఎంతగా మెరుగు బడ్డాయి; యీ మెరుగులు నేటి రైతాంగపు కనిష్ట జీవితాశయములనైనా పెంపొందించటానికి ఎంతగా తోడ్పడుచున్నాయి అని ప్రశ్నించుకుంటే - సమాధానాలు చాలా నిరాశాకరంగా వున్నాయి.

పొగాకు ప్రజాసీకానికి అందజేసే సమాచారములుబట్టి - పంట దిగుబడి, గత నాలుగయిదు సంవత్సరాలలో 35 శాతం పెరిగిందట. వాటి ధరలు 33 శాతం ఎగుమతిస్థాయి ధరలు 60, 70 శాతము పెరిగాయని తెలియజేస్తున్నారు. మరి ఎగుమతులా పెరగలేదు. సిగరెట్ తయారీదార్ల కొనుగోలు పెరగడంలేదు. పైపెచ్చు, పండించే ఖర్చు తరవాత తయారీకయేఖర్చు మొత్తము, ఎకరానికి 65, 200 శాతము పెరిగినట్లు తెలుస్తోంది.

పొగాకుపంట పసిడిపంట అంటారు. కాని, బహుముఖ క్లిష్ట పరిస్థితులతో కూడియున్నపంట. అందుచే, యీ పంట - పరిశ్రమకు సంబంధించిన అభివృద్ధి పథకాలు తదనుగుణ్యంగా బహుముఖంగా సుదీర్ఘదృష్టితో, తొట్రుపాటులులేకుండా సావధాన చిత్తముతో ఆచరణలోపెట్టి విజయవంతం కావించాలి. ఇందుకు, నియమాలు, నిర్బంధాలు తోడురావు. నిదానం, సత్ సంకల్పం, సద్భావం ప్రధానం.

మరిన్ని, రైతుస్థాయికో వారి వారి పంటలకు తగువిలువలు అందజేయాలంటే కనీస ధరలు నిర్ణయించుట తప్పదు. ఈ క్రమము, పంటను నిర్దిష్టమైన రకాలుగా ఎంపిక చేసినచో సాధ్యమగును.

అదే విధంగా, రక రకాల కొనుగోలుదారుల యిష్టా యిష్టాలను పాటిస్తూ పంటను ఎంపికచేసి అమ్మకమునకు తీసుకొని రావలెనని నిర్బంధిస్తే, తత్ఫలంగా రైతులకు యిదివరలో వెలువడిన యిబ్బందులూ, ముమ్ముందు వెలువడనున్న పరిణామాలు అందరకు తెలిసినవిషయములే. అందుచే - రైతు భూస్థాయి, సంసారపక్షముగా ఉన్న పంట దిగుబడి దృష్ట్యా రైతులను ఒక్కొక్కరి స్థాయిలో తమ పంటను వర్గీకృతం చేయించుటకు ప్రయత్నించటం "తలకు మీరిన"పని, అట్టి కట్టుదిట్టాలు గిట్టుబాటుకాని కార్యాలు.

మరి ధరలు ప్రతి శీజనులోను కావలసిన నిలకడతో అటురైతుకూ, యిటు కొనుగోలు దారులు, ఉపయోగదారులకు సరసముగా వుండాలంటే తగినంత స్థోమత తోనూ, రైతు శ్రేయస్సు ముఖ్యోద్దేశముగాను, వున్నటుపంటి వాణిజ్య సంస్థలు – ముఖ్యంగా "తల" బ్రహ్మలేని మితవ్యయంతో కూడిన వాణిజ్య సంస్థలు- పరపతి సంస్థలు. పొగాకు రంగంలో స్థిరస్థాయిగా నెలకొల్పబడి వుండాలి.

దిగుబడి ఎంతమితంగావున్నా దాని గుణగణ్యాలు ఎంత ఉత్తమంగావున్నా, కొద్దోగొప్పో ప్రతి ఏటా, నిల్వలు తటస్థమౌతూనే ఉన్నాయి. ఏటేటా పెరుగుచున్న ఈ నిల్వలు రాచపుండ్లుగా తయారౌతున్నాయి. ఇప్పటికే గత మూడు సంవత్సరాలుగా కూరుకొనిన సరుకు అంచనా 35 మిలియను కేజీలకు మించుతోండిట. ఈ నిల్వలు భారము భరించలేనివారు, కొందరు కృంగి కృశించారు. కొందరు అప్పులపాలై వున్నారు. మరికొందరు ఈ కృషికి స్వస్తిచెప్పుకుంటున్నారు. ఈ నిల్వలను తగురీతి జాగ్రత్త పరుచుకొనుటకుగాని, రైతుపై బడ్డయీ వికృత వత్తిడులను తొలగించడానికిగాని ఈ నిల్వలను పొందుపరచుటకు

ఆర్థిక స్థోమతగాని కలుగజేసే ఏర్పాటులు - ఓ సముచితమైన పద్ధతిలో అప్పటికి, ఇప్పటికి గూడా లేకపోవడం నిజంగా చాలా భాదాకరం.

రైతులు, చిన్నకారు వాణిజ్యదారులు ఎగుమతి దారులు ప్రతి ఒక్కరుకూడా తమ అవసరాలను ఒడుదుడుకులు లేకుండా విక్రయ - కొనుగోలులు జరుపు కొనుటకు ప్రభుత్వం గతంలో, ఎన్నెన్నో పర్యాయాలు, ఎన్నెన్నో పథకాలు రూపొందించింది. కాని, ఆచరణ కొచ్చేసరికి అన్ని అడ్డంకులే !

ఎన్నో సుదీర్ఘ ఆలోచనల మీదట, కావలసిన కట్టుదిట్టముల మీదట, ప్రావీణ్యత, ప్రతిష్టతో కూడిన కొన్ని పథకాలు రూపొందించ బడ్డాయి - కేంద్ర రాష్ట్ర ప్రభుత్వముల ఆధ్వర్యాన ఇందు 1978 లో పొగాకుబోర్డు స్థాపితం భారత పొగాకు చరిత్రలో ఒక ఉత్తమోత్తమ ఘట్టం, భారత ప్రభుత్వ వాణిజ్యసంస్థల వారు ఓ ఆదర్శవంతమైన క్రమపద్ధతిని మన పొగాకు వ్యాపారములో పెల్గొనుట ప్రశంశనీయమైన బృహత్పథకము. అయితే ఈ సంస్థల అభివృద్ధికర కార్యక్రమాలు కాలమాన పరిస్థితుల దృష్ట్యా ఆచరణయుతంగా వుండాలి. అంతేకాదు, యీ పరిశ్రమలలో ఏ నాటినుండో స్తంభించుకు పోయియున్న ప్రజాసంక్షేమ రహిత, ప్రభుత్వేతర, స్వార్థపరత్వాలను తొలగించేందుకు కట్టుదిట్టాలు, ఎప్పటి కప్పుడు తీసుకొంటూ వుండాలి. క్రొత్తగా ఇటువంటి అడ్డంకులు రేకెత్తకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ సంస్థలు ఎన్నెన్నో నవీనదాలు దాటిన పిమ్మటనే, ఆ మహత్తర పర్వత శిఖరాలను అధిరోహించ గలుగుతాయి.

ఈ సంస్థలు రూపొందించిన సిద్ధాంతాలు సూత్రాలు - పూర్వపుటలలో సూచించినరీతిగా - ఆచరణయుతంగా వుండాలంటే ఆయా నియమావళులలో కొన్ని కొన్ని మెరుగులు చాలా అవసరము. ఇదేమిటో తెలుసుకో వలసిన భాద్యత ఎంతైనావుంది.

1. పొగాకుపంటయొక్క దిగుబడి నాణ్యత విషయంలో ప్రప్రథమముగా రైతుకు కావలసిన దినుసులు, పరికరాలు ఆర్థిక సహాయము, ఎంతశ్రద్ధగా, ఎంత కాలానుగుణ్యంగా అందజేయగలిగితే అంత తృప్తిగా వుంటుందీ పంట.

పొగాకు బోర్డుయొక్క ప్రప్రథమ కర్తవ్యమిది.

2. పొగాకు బోర్డువారు సూచించిన ఫారము గ్రేడు ప్రకారం పంట ఎంపిక చేసి రెగ్యులేటెడ్ మార్కెటుకు తరలించి వేలము పద్ధతిని విక్రయించుటకై చేయ వలసిన ఏర్పాటులన్నీ పొగాకురైతు సహకార సంఘాల బాధ్యత. యీ సంఘాలు

రెగ్యులేటెడ్ మార్కెట్‌లలో సుస్థిరమైన కొనుగోలు దార్లుగా వ్యవహరిస్తూ ఎప్పటి కప్పుడు వేలములో అమ్మకమవగా మిగిలిన సరుకును ఒక నిర్మితమైన కనీసధరలు ఆధారముగా, కొంటూ వుండాలి.

3. రైతుకు తమ అమ్మకములపై పచ్చే పైకము సకాలములో అందజేయు టకై ఒక "వోచరు" పద్ధతి ఏర్పాటు చేయబడి యున్నది. కావలసిన స్థాయిలో ఆర్థిక స్తోమత వాణిజ్యరంగములోని అన్ని తరగతుల సంస్థలలోను, లేకపోవుటచే ఆ'వోచరు' పద్ధతి, అనుకొనిన రీతిగా, ఆచరణ యుక్తముగాకున్నది. అందుచే :- 1. బ్యాంకులు యిచ్చే ఆర్థిక సహాయము, 2. ఉపయోగదార్లు - ఎగుమతిదార్లు మార్కెటులోకి వచ్చే తీరు. 3. కనీసధరల ఒడుదుడుకులు,- 4. ఆయా సీజను యొక్క దిగబడితీరు :- మొదలగు ముఖ్యాంశముల దృష్ట్యా ఈక్రింది విధముగా ఆ "వోచరు" పద్ధతిలో కొన్ని కొన్ని మెరుగులు తీసుకొని రావలసిన అవసరము ఎంతైనా వున్నది.

(ఎ) కొన్న సరుకు విలువలో 70-80 శాతము వీలైనంత త్వరితముగా రైతుకు అందజేయాలి. ఏసందర్భములోనూ, యీ చెల్లింపు 90 రోజులకు మించ రాదు.

(బి) ఆ చెల్లింపు వ్యవధి 90 రోజులు దాటినచో అప్పటినుండి మరొక 90 రోజులలో కొనుగోలు విలువ మొత్తము వడ్డీతోసహా, (Local Commercial Bank Rate) రైతుకు చెల్లించవలెను.

(సి) యీ చెల్లింపు విధానము కూడా వీలుకానిచో ఆ "వోచరు" పద్ధతిని పునఃపరిశీలనగావించి సర్వవిధముల ఆచరణ యుక్తముగా నుండునటుల రూపొందించవలసి యుండును.

4. యీ గ్రేడుల విక్రయాలు సరసంగా వుండుటకు ఇతమిద్ధముగా యుండుటకు, ఆ గ్రేడులకు కనీసధరలు నిర్ణయించాలి.

5. ప్రాథమిక స్థాయిలో రైతు సహకార సంఘాలు కొన్నసరుకులను ఒక Buffer Stock గా ఏర్పరచాలి. ప్రతి సీజను ప్రారంభమైన వెంటనే కొనుగోలు దారులు తమ అవసరాలను మున్నుందుగా యీ నిల్వలనుండి సేకరించాలి.

ఈ నిల్వలు నిర్ణీతమైన వ్యవధికిమించి "దిగుబడి" యుంటే, ఆసరకులకు సస్యరక్షణ మందులు రసాయనములు ఇత్యాది వేర్వేరు ఉపయోగములకై, ప్రభుత్వ ఆజ్ఞల బలంతో తరలించాలి.

బ్రెజిల్ (దక్షిణ అమెరికా) దేశంలో పెట్రోలు క్రూడాయిలుకు బదులు, ఆల్కహాలు (సారాయి) ఉపయోగిస్తున్నారు. రైళ్ళుబండ్లు కార్లు నడపటానికి, అందుకై, కర్రపెడలం, చెరకు, కొన్ని కూరగాయల పంటలను Starch, Sugar, Food, Meteria, కాకుండా ఆల్కహాలు ఎక్కువగా వచ్చే హైబ్రిడీ రకాలు రూపొందిస్తూన్నారుట. అలాగే మన దేశంలో కూడా సాంకేతిక విజ్ఞాన విశిష్టత చేకూర్చుకోవడం చాలా అవసరం.

6. రెగ్యులేటెడ్ మార్కెట్లలో STC కూడా ఒక సుస్థిర స్థాయిలో కొనుగోలుదారుగా ఉండేటందుకు తగిన ఏర్పాట్లు సమకూర్చుకోవాలి. ప్రభుత్వ మద్దతుతో పనిచేసే ఈ S. T C. ఎంత దృఢచిత్తముతోనూ స్థిరత్వముతోనూ పాల్గొంటే అంతనిలకడగాను, క్రమముగాను రైతులకు సరసమైన ధరలు లభిస్తాయి. ఒడుదుడుకులు లేకుండా పొగాకు వాణిజ్యం సాగుతుంది.

7. ఈ ప్రాథమిక మార్కెట్లలో విక్రయింపబడే పొగాకులో కనీసము (పది) 10 శాతమైనా S. T. C. వారు ప్రతి శీజనులోనూ కొంటూవుండాలి. ఈ నరుకును, తాము ఆమోదించిన ప్రోసెసర్లుద్వారా రీడ్రయింగు ఏగ్ మార్కు గేడింగు చేయించుకొవాలి. అంతేకాకుండా, తాము చేపట్టిన ఆర్డర్లను క్రమము తప్పక తగు విధముగా తట్టుకోటానికి కొందరు డీలర్లును తమ యొక్క పెర్మనెంటు సప్లయి దార్లుగా (Trade Associaties of Small Packers and Handlers of Similar Standing) వుండే ఏర్పాటు తప్పనిసరిగా చేసుకోవాలి. యీ విధంగా చేపట్టిన సరుకులను తమ ఎగుమతి వ్యాపారమునకు అందుబాటుగా స్థాపించుకోవాలి.

మరియు దేశంలోని సిగరెట్లు తదితర పొగాకు పరిశ్రమలు, ఒక్కొక్కరూ తమకు కావలసిన పొగాకులలో కనీసము 25 శాతము S. T. C. నుండి కొనుగోలు చేయాలి. S. T.C. వారు తమ తరపున యీ లభ్యమైన ఆర్డర్లలో కనీసము సగము భాగము పొగాకు రైతుసహకార సంఘములనుండి, మిగతా సగము తమ Trade Assocites నుండి సేకరించాలి. యీ విధముగా విక్రయ కొనుగోలులు జరిగినచో, i రైతులకు - డీలర్లకు మధ్య, డీలర్లకు ఎగుమతిదారులకు మధ్య సరసమైన ధరలు పాటింపబడతాయి. ii రైతుల సహకార సంఘాలకు నిలకడ చేకూరుతుంది. iii రైతుల ఆదాయాలు మెరుగు పడతాయి.

ప్రభుత్వ వాణిజ్యసంస్థగా - ఎప్పుడైనా కాలమాన పరిస్థితులు, వికృతమైనచో - రైతులను వ్యాపారస్తులను వీలైనంతగా ఆదుకొనే బాధ్యతకూడా ఈసంస్థ చేపట్టవలసి వచ్చుచున్నది. చేపట్టాలికూడా. ఒక ముఖ్యగమనిక ఆటు పొగాకు

రైతుల బాగోగులు చూస్తూ, పిమ్మట సహకార సంఘాలకు తగు దోహదమిస్తూ, వివిధ రంగాలలో తమ వాణిజ్యమును పెంపొందించుకొనుచూ, పొగాకు వ్యాపార రంగంలో దుర్ఘటనలు, వాటిల్లినపుడల్లా వీలగు సహాయ కార్యక్రమాలు కూడా చేపట్టుచూ వుండాలీ అంటే, అందుకు కావలసిన ఆర్థిక బలము చిన్నకారు వాణిజ్యదారుల (Trade Associates) సుస్థిర సహకారము తగు విధముగా పెంపొందించుకోవాలి-మన కేంద్ర ప్రభుత్వ వాణిజ్యసంస్థవారు.

8. సిగరెట్ పొగాకు విదేశీ మారక ద్రవ్యాన్ని ఎక్కువగా ఆర్జించాలంటే ఆయా ఎగుమతి షట్టాలలో ఇప్పటికి రేకెత్తియున్న ప్రతి బంధకాలను తొలగించాలి. ఎగుమతులను ప్రోత్సహించే పథకాలకు కరువై నిరాశతోయున్న పొగాకు పంటకు వలయు చేదోడు, ప్రత్యాఘాషకమైన సదుపాయాలు, సముచిత లాభాలు పొందగలిగే అవకాశాలు తగినంతగా, ఏర్పాటు చేయాలి. యీ సందర్భముగా కొన్ని ఉపయోగకరమైన Indirect కార్యక్రమాలను కూడా చేపట్టాలి.

i ఏ ధరకు ఎగుమతులు జరగుతున్నాయో సూచిస్తూ పొగాకు బోర్డువారు సర్టిఫికెట్లు జారీచేస్తున్నారు. కాని, యీ ధరల వివరములు అందుకు సంభందించిన ఎన్నో విషాలు ఏగ్ మార్క్ డిపార్టుమెంటువారు యిస్తూవున్న సర్టిఫికెట్లులో విదితమౌతూనే ఉన్నాయి. అదే పని యింకొక ప్రభుత్వశాఖ గూడా చేయుట అనుచితము.

ii యీనాటి పరిశ్రమల అవసరాలు అంతర్దేశీయ వాణిజ్య మందలి పోటీలు నేటి సిగరెట్ల తయారీలోని మార్పులు, వీటన్నిటి దృష్ట్యా మన ఎగుమతులు నాణ్యవంతమైనదే కాకుండా సరసమైన ధరలు కలిగివుండాలి. అందుచే తయారి ఖర్చులు మితంగావుండాలి. యిందుకు బ్యారను క్యూరింగు తయారికి బదులు సన్ (Sun) క్యూరింగు తయారీ చేయదగునేమో ఆలోచించవలసిన విషయము. పొగాకు బోర్డు వారు సూచించిన ఆ "పారం" గ్రేడులనే కొద్ది కొద్ది మార్పులతో విదేశీ అవసరాలకై కూడా వర్తింపచేయవచ్చును. యిందువల్ల, పొగాకు వాణిజ్య క్రమము అన్నిరంగములలోను ఒకే "కొలతబద్ద" పై సుస్థిరవంతముగా ముందంజ వేయగలదు.

iii. ప్రస్తుతము రాబట్టుచున్న వ్యవసాయ మార్కెట్ పన్ను, ఎగుమతి పన్ను వ్యవసాయ పన్నులను రద్దు పరచుట శ్రేయస్కరము. ఆ మేరకు రైతుకు మరింతగా గిట్టుబాటు ధరలు లభించుట తథ్యము.

iv. యితర ముడిదినుసుల ఎగుమతులపై చేకూర్చుచున్న సదుపాయాలు, లాభదాయక సహాయాలు, నగదు మద్దతులు పొగాకు ఎగుమతులపై కూడా లభించే ఏర్పాట్లు చాలా అవశ్యము.

9. ఆర్థిక సహాయము పండించటానికే కాకుండా ఆ పంటను విక్రయించటానికి అందుకు తగువిధంగా తయారుచేయటానికి చాలా అవసరము. యిందుకు సంబంధించిన ఆవశ్యకతా యీ విధంగా వుంది.

కార్యక్రమాలు	ఆర్థిక ఆవసరాలు (కోట్ల రూపాయలు)
1. వ్యవసాయము	100
2. తయారి	10
3. రాకపోకల, Handling	37
4. వడ్డీ, భీమావగైరా	4
5. కార్యనిర్వహణ	4
మొత్తము.	155

అందుచే సాలీనా రు155/ కోట్ల ఆర్థిక సహాయము పొగాకు రంగములకు బ్యాంకులు అందజేసేలా రిజర్వు బ్యాంకువారు ఉత్తర్వులు అందజేయాలి. యీ సహాయము వీలైనంత తక్కువ వడ్డీ మీద అందజేయాలి ఇటువంటి సౌకర్యం ఆహార దినుసులపట్ల వర్తించి యున్నది. సాలీనా ఎన్నోకోట్లు ప్రభుత్వాదాయము (రు100/-కోట్లు) చేకూర్చే యీ పొగాకు పంటకు కూడా అటువంటి సౌకర్యము కలుగ జేయుట భావ్యము.

అందుచే రైతులు, రైతుల సహకార సంఘాలు మార్కెటింగ్ కమిటీలు, Small Packers (Dealers) ప్రొసెసర్లు (Redrying and Connected operations) ఎగుమతి దారులు ఎగ్‌మార్క్ డిపార్టుమెంటు వారు కేంద్ర ప్రభుత్వ వాణిజ్య సంస్థవారు తమ తమ విధులను నిర్వహిస్తూ పొగాకు బోర్డువారి యొక్క అనుజ్ఞలనూ ఆజ్ఞలనూ మరి వారు నిర్దేశించిన అభివృద్ధి పూర్వమైనట్టి కార్యక్రమములను, సుహృద్భావముతో చేపట్టి, యీ పొగాకు పంటను నిజముగా పసిడి పంటయని ఋజువు చేయగలరని విశ్వసించుచున్నాను. యీ సందర్భమును పురస్కరించుకొని భారత పొగాకు లోకమంతట యిందుకు సంబంధించిన దేశాంద్ర దేశనిలయాలకు, ఆలయాలకు దీపావళి (1978) శుభాకాంక్షలు అందజేయుచున్నాను.

★



పొగాకు బోర్డు యొక్క తల్లకిందుల నడక

రచన : శ్రీ బండ్లమూడి వెంకటేశ్వర్లు

బోర్డు వస్తున్నది. త్రవ్వి తలకెత్తుతుంది అని రైతులు లొట్టలు వేశారు 1976 లో బోర్డు చిన్నగాసాగి, 1977 లో ఒక రూపను పొందింది. 1978 లో బోర్డు రైతులను పాతిపెట్టి, సిగరెట్టు కంపెనీల, గుత్తవర్తకుల దోపిడికి రాచబాట వేసింది.

అంగబలము లేకుండానే, కుర్చీలు, బల్లలు కూడా దొరకక ముందే, రైతుల దగ్గర పొగాకు కొని, రైతులను ఉద్ధరించాలనే సాకుతో వ్యాపారం చేయాలనే దురాలోచన చేసింది బోర్డు - 1976 లోనే, 1957 నుండి పొగాకు ఎగుమతి వ్యాపారంలో ఉన్న కేంద్ర ప్రభుత్వసంస్థ యస్. టి. సి. (స్టేట్ ట్రేడింగు కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)ని తట్టి, బుట్టి సర్దుకొని గుంటూరు నుంచి తరలిపోవాలని బోర్డు వాంఛించింది. యస్. టి. సి కి అంపకాలు చెప్పి తానే వ్యాపారం చేయాలనే బోర్డుయొక్క కాంక్షలోని అంతరార్థం విడమరచి చెప్పపనిలేదు !

బోర్డు చట్టము చూచినవారికి, బోర్డుయొక్క లక్ష్యము ఏమిటో తెలుస్తుంది. ఉత్పత్తిదారులకు గిట్టుబాటు అయిన ధరలు రాబట్టడము, విదేశీ వర్తకుల దోపిడిని అరికట్టడము, పొగాకు పరిశ్రమలోని లోటుపాట్లను చక్కదిద్దడం, పరిశ్రమలోని అందరి శ్రేయమును, దేశహితమును రక్షించడము, పొగాకు పరిశ్రమలో చక్కని వాతావరణము నెలకొల్పడము బోర్డుయొక్క లక్ష్యములు. ఈ లక్ష్యములను మరచి, వాస్తవ స్థితిగతులను గమనించలేక, చీకటిలో తవుళ్లాడే గ్రుడ్డివానిలా పొగాకుబోర్డు ఏమేమో ఆలోచిస్తున్నది ! సమస్యలను క్షుణ్ణంగా అవగాహన చేసుకొనకుండా, మిడిమిడి జ్ఞానంతో, నిర్మాణాత్మక ధోరణిలేకుండా, రైతుల వర్తకుల మధ్య ద్వేషాగ్నిని రగిల్చి, పొగాకు వాతావరణము కలుషితం చేస్తున్నది. బోర్డు క్లుప్తముగా చెప్పుకొనవలెనంటే, తలక్రిందబెట్టి, కాళ్ళుపైకెత్తి నడిచే వ్యక్తిలాగా బోర్డు అసహజముగా నడుస్తున్నది !

ఏ పని ముందు ? ఏ పని వెనుక ?

నారుమళ్ళు పెంపకంనుండి, విదేశాలకు పొగాకు అమ్మకం వరకు వివిధ దశలలో ఉన్న బహుళ సమస్యలను అర్థం చేసుకొని, ఏదిముందు, ఏదితరువాత అనునది బోర్డు నిర్ణయించుకోవాలి. నారు సంగతి వదలి, వ్యాపారం విషయం కలలుగనడం ఉట్టికెక్కలేనమ్మ, స్వర్గానికి ఎగిరినట్లుగా ఉంది. పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను ఎన్నుకొని, ముందు వెనుకలు (Priorities) గమనించి, క్రమపద్ధతిలో బోర్డు కృషిచేయాలి.

నాణ్యమయిన పంటకొరకు మేలయిన విత్తనాలు అవసరం

నాణ్యమయిన పంటకావాలంటే మేలైన విత్తనాలు సేకరించుకోవాలి. ఎవరిష్టము వచ్చిన విత్తనం వారు వేయడం, ఏదో పొగాకు పండించటం అలవాటు అయినది. ప్రప్రథమముగా బోర్డు ఈ విషయంలో తగుచర్యలు తీసుకోవాలి. విత్త

నాల సేకరణ, నారుమళ్ళవేత, పెంపకంలో తగుజాగ్రత్త తీసుకొనాలి. అందుకు కావలసిన ఎరువులు, మందులు, ఋణసహాయంకూడా కల్పించి, బోర్డువారు నారు మొక్కలకు కనిష్ఠ (minimum), గరిష్ఠ (maximum) ధరలు నిర్ణయించాలి. పొగాకు వ్యవసాయాన్ని క్రమబద్ధము చేయవలెనంటె, ముందు నారుమళ్ళ వేతను క్రమబద్ధము చేయాలి. నారుమళ్ళు వేసేవారినికూడా బోర్డులో రిజిష్టరు చేయించి, మళ్ళ విస్తీర్ణంపై తగు కట్టుదిట్టములు చేయాలి. నారుమళ్ళు పెంచేవారి శారీరక శ్రమను తగ్గించడానికి, మోటారు, పంపులు, ఏర్పరచి, నీరు నిలువజేయడానికి, టాంకులు (over head tanks) నిర్మించి, సులభంగా నీరు నడిపించే వసతులను కల్పించడానికి బోర్డు యోచన చేయాలి.

వ్యవసాయాభివృద్ధి కొరకు రైతులకు అవసరమయిన వసతులు

నారు మొక్కలు వేయడంనుంచి, పంటను విక్రయించు కొనేంతవరకు రైతులు అనేక ఇబ్బందులపాలు అవ్వుచున్నారు సకాలంలో వర్షాలులేక, చేనులోని గుంటలలో నీళ్ళులేక, మొక్కలు వేయడానికి కావలసిన నీళ్ళుకూడా కరువై, రైతులు అల్లాడి పోతుంటారు. పంటకాల్వలనుండి బళ్ళమీద, లారీలలో రైతులు నీళ్ళు మోసుకుపోతుండే ఇరిగేషన్ డిపార్టుమెంటువారు అడ్డగించిన సంఘటనలున్నాయి. అట్లే పొగాకు కాల్చుకొనడానికి బొగ్గుదొరకక అడవినుంచి కర్రకొని తెచ్చుకొనే రైతులను దారులుగాచి, చెక్‌పోస్టులవారు లంచాలు గుంజుతున్న సంఘటనలు వింటున్నాం. ఇక ఎరువులు, మందులు బ్లాక్‌మార్కెట్టులలో కొనటంలో రైతులు ఎంత అవస్థలు పడుతున్నారో? ఈ విషయాలను బోర్డు ఈ మూడేళ్ళలో ఏమయినా ఆలోచన చేసిందా? ఇక తలతాకట్టుపెట్టి బ్యాంకులలో అప్పులు తెచ్చుకోడానికి, వాటిని తీర్చడానికి రైతులు బడే బాధలు విన్ననాధుడు లేకపోయె! ఈ యమగండాలు తప్పించుకొని, పండించిన పొగాకును అమ్ముకొనడంలో రైతులు మరొక జన్మ ఎత్తవలసివస్తుంది గదా!

తక్కువచేట్లు, - తప్పుడు తూకాలు, - రైతులకు పంగనామాలు

రైతులవద్ద నిర్బంధ గ్రేడింగ్ అమలు పరచాలి. రైతు స్థాయిలో ఎనిమిది ఫారమ్ గ్రేడులకు కనీస ధరలు నిర్ణయించాలి. రైతుల పొగాకుకు గ్రామంలోనే క్వాలిటీ సర్టిఫికేటు యిప్పించాలి. వేలము ద్వారా పొగాకు అమ్మకం జరగాలి. తప్పుడుతూకాలు పట్టుకొని, దండించేదానికి సీజనులో తూకాలు, కొలతలవారు (Department of Weights and measurement) గ్రామాలలోని వర్తకుల గిడ్డంగులలో సరుకు తూకంవేయాలి. అవసరమయితే సంచారదళం (Flying squard)ను ఏర్పాటుచేసి ప్రతిచోట సరుకు తూకము (Check Weishtment)

వేయించాలి. పొగాకు అమ్మగా వచ్చిన డబ్బును ముందు రైతులకు దక్కకుండా మధ్యలో బ్యాంకులు కాజేయకుండా ఏర్పాటుచేయాలి. రైతులసొమ్మును బ్యాంకులు కాజేయకుండా చూడాలి.

రైతులకు బాకీలు - కోర్టుల డిక్రీలు - అమలు జరుగవా ?

రైతులకు బాకీపడిన కొందరు వర్తకులు చాలాకాలంగా డబ్బు చెల్లించలేక పోయినారు. రైతులవద్ద పొగాకు అమ్మిన ఆధారంగా వర్తకులు యిచ్చిన వోచర్లు ఉన్నాయి. ధైర్యంగల కొందరు రైతులు కోర్టులకువెళ్ళి, వర్తకులపై డిక్రీపొంది యున్నారని తెలుస్తున్నది. కాని యీ డిక్రీలను అమలు పరచి, రైతులు డబ్బు రాబట్టుకొనలేకుండా నిస్సహాయులయి ఉనారు. వోచరు ఆధారాలున్నా కోర్టాకు పోని రైతులున్నారు. "రైతుల రక్షణకు వోచరు" అని పల్లిస్తున్న బోర్డువారు యీ పాత వోచర్లు, అమలుజరగని కోర్టు డిక్రీలు వివరాలు సేకరించి రైతులకు డబ్బు యిప్పించడానికి తగుచర్యలు తీసుకోవాలి. రైతులకు బాకీపడిన వర్తకుల, నష్ట పడ్డామని వాపోయి రైతులకు రూపాయికి పావలా యిచ్చిన వర్తకులు ఎందరో ఉన్నారు ? యీ మహానుభావులపై బోర్డు తగుచర్య తీసుకోవలసియున్నది.

అగ్ మార్కు గ్రేడుల కుంభకోణం

ఎగుమతికి ఆగ్‌మార్కువారి లేబులు, సర్టిఫికేటు విధిగా కావాలి. పొగాకు నాణ్యతనుబట్టి యీ గ్రేడు లేబుళ్లు ఉండడంలేదు. వర్తకులకు ఏ లేబిళ్లు కావలిస్తే ఆగ్‌మార్కువారు ఆ లేబిళ్లు యిస్తున్నారు. నాణ్యమునకు చిహ్నముగా ఉండవలసిన ఆగ్ మార్కు లేబిళ్ళు, దేశి, విదేశీ వర్తకుల కోరిక మేరకు ధారాళంగా లభించు తున్నాయి. నేటి అగ్ మార్కు డిపార్టుమెంటు వలన పరోక్షంగా రైతులు దోపిడీ చేయబడుచున్నారు. క్రింది గ్రేడులకు పై గ్రేడు లేబుళ్లు, పై గ్రేడులకు క్రింది గ్రేడు లేబుళ్లు వర్తకుల కోరిక ప్రకారం యిచ్చి, కొందరు ఆగ్‌మార్కు అధికారులు తీరని అన్యాయానికి వ్యాపారంలో అక్రమ చర్యలకు దోహదమిస్తున్నారు. ఇట్లా ఆగ్ మార్కు లేబులు అతిచౌక అయిపోవడంతో, ఏ విదేశీ వర్తకుడుగాని, దేశీయ సిగరెట్టు కంపెనీలుగాని ఆగ్ మార్కును గౌరవించడంలేదు. లేబులుమీద పొగాకు అమ్మికొనే సుదినం ఎప్పుడో ?

పంటలోవచ్చే గ్రేడుల ప్రకారము పొగాకు విక్రయించవలసి యున్నది. కాని ఇందుకు భిన్నంగా కొనుగోలుదారుల కోరిక ప్రకారం గ్రేడులు మారుచున్నవి. పంట దిగుబడినిబట్టి ప్రభుత్వం నిర్వచించిన 1. ఓ. 3 గ్రేడులు కొనేవారు లేనందున ఆ రెండు గ్రేడులు మూడవ గ్రేడులోకి క్రిందకు పోతున్నాయి. అట్లే 3 వ గ్రేడు

వచ్చింది, యిూ 1, 2, 3 గ్రేడులు అన్నీ నాలుగవ (4) గ్రేడులోకి దిగుతుంది. కొనుగోలు దారులకు లభిస్తున్న యీ స్వేచ్ఛ ఎన్నో దుష్పరిణామాలకు దారి తీస్తున్నది. చివరకు యీనష్టమంతా రైతులపై పడుతున్నది. దేశానికి కూడా నష్టమే! ప్రభుత్వము నిర్ణయించిన కనీసధరలు (Minimum Export preices) పరోక్షంగా అమలు జరుగక, తుక్కు అవుతున్నాయి;

బోర్డువారు యీ ఆక్రమాలను గమనించి, వాటిని నిరోధించి, రైతులకు వర్తకులకు ప్రయోజన కరమయినట్లుగా తీర్చి దిద్దవలసి ఉన్నది.

పొగాకు ఎగుమతులు - వర్తక సాంపుల్స్

విదేశాలనుండి ఎగుమతి ఆర్డర్లు సంపాదించడానికి పొగాకు నమూనాలను (Trade Samples) ముందుగా పంపి, ఆమోదమును పొందవలసి ఉన్నది. విదేశీవర్తకుల తృప్తికొరకు పైగ్రేడు సాంపుల్స్ పంపడం అందరికి అలవాటు అయినది. అంటే నాల్గవగ్రేడు (Grade 4)కు, మూడవ గ్రేడు (Grade 3) సాంపులు పంపబడు చున్నది. ప్రభుత్వము నిర్ణయించిన కనీసధరలకు యీ సాంపులు గ్రేడులకు సంబంధమే ఉండదు. విదేశీ వర్తకులు మన ఎగుమతి దారులను యీ విషయంలో చాలా యిబ్బంది పెట్టుచున్నారు. అట్లాగే పై గ్రేడుల పొగాకును క్రింద గ్రేడుల రేట్లకు కాజేస్తున్నారు. బోర్డు వారు తెలిసో, తెలియకో ఏమిపట్టించు కొనడంలేదు. ఇది ఒక్క వర్తకుల సమస్యకాదు. కడకు దాని దుష్ఫలితాలను అనుభవించేది రైతులు, దేశము! బోర్డువారు ఇది గమనించాలి. విదేశీ వర్తకుల ఆగడాలను అరికట్టాలి. అందుకు మార్గమిది. ప్రతి సంవత్సరము అన్నిగ్రేడుల సాంపుల్స్ బోరువారు పంటకాగానే తయారుచేయించి, వాటిని తమ శీతల గోడవునులో (Cold storage) భద్రపరచి, వర్తకులకు విక్రయించాలి. వర్తకులు బోర్డునుండి తీసుకొన్న సాంపుల్స్ మాత్రమే విదేశాలకు పంపాలి. ఈ సాంపుల్స్‌పై బోర్డువారిముద్ర ధృవపత్రము విధిగాఉండాలి. ఇతరవిధములయిన సాంపుల్స్ పంపటాన్ని నిషేధించాలి. ఎగుమతి ఆర్డర్లు బోర్డు యిచ్చిన సాంపుల్స్ ఆధారముగా జరుగాలి. కాదన్న విదేశీ వర్తకులతో బోర్డు మాత్రమే వ్యవహారము చేయాలి. వ్యాపారంలో తప్పుడు మార్గాలను అరికట్టి, వర్తకుల, రైతుల రక్షణకు జరుగవలసిన ప్రప్రథమ కర్తవ్యము ఈ వర్తక నమూనాలు ప్రవేశ పెట్టడము.

పొగాకుపంటను తగ్గించడం ఎందుకు?

ప్రపంచంలో పొగాకు పండించడంలో మనస్థానం భ్రష్టమై, మూడునుండి నాలుగుకు దిగజారింది. చైనా 587,000 టన్నులు అమెరికా 546,700, బ్రెజిలు

140, 250 టన్నులు, సాలీనా పండిస్తున్నారు. మనం 104,500 పండిస్తున్నాము. అమెరికా, చైనా, బ్రెజీలు అంతపంటను అమ్ముకొన గలుగుతుంటే, మనం ఎందుకు అమ్ముకొనలేము ? ఈ విషయం మన బోర్డువారు ఎందుకు ఆలోచించరు ? ఎగుమతులను పెంపొందించడానికి కేంద్ర ప్రభుత్వము. కేంద్ర వాణిజ్య, సంస్థ (S T C) బోర్డు ఎందుకు కృషిచేయరు ? ఆడలేక నుద్దెలమీద బడినట్లు ఎగుమతి చేయడం చేతగాక, పంట తగ్గించమని రైతులను ఒత్తిడి చేయడమా ? ఏమి అసమర్థత ? సిగ్గు చేటు ? ప్రయివేటు వర్తకులకు ఉన్న సామర్థ్యం, చాకచాక్యం, ప్రభుత్వమునకు ఎందుకులేదు ? ఈ చేతకానితనమును కప్పిపుచ్చుకొనుటకు పండించవద్దని రైతులనెత్తిన సీలలు కొట్టడమా ? ఏమి దౌర్భాగ్యం ! బోరువారు ఆలోచిస్తారా ?

పరిశ్రమను పట్టి పీడిస్తున్న పలు మూల సమస్యలను ఆకళింపు చేసుకొని బోర్డు నిర్మాణాత్మక చర్యలు తీసుకొనాలి. రైతులమేలు కొరకు ఉద్దేశించి ప్రవేశ పెట్టిన వోచరు అర్ధంతరిగి రైతులకు తీరనిహాని కల్పించింది. ఈ వోచరు వలన పెద్ద వర్తకులు, సిగరెట్టు కంపెనీలు ఎన్నడు సాధ్యంకాని ప్రయోజనాన్ని పొందారు ! వచ్చే సంవత్సరము పొగాకు అమ్మకమునకు వేలం పద్ధతి ప్రవేశపెట్టనున్నట్లు బోర్డు ప్రకటించింది. తగిన ఏర్పాట్లు లేకుండా వేలము అమ్మకాలు వస్తే, గత వోచరును ఉపయోగించుకొన్నట్లుగా, వర్తకులు తికమకలు కల్పించి, తమకు అనుకూలమయిన పరిస్థితులను సృష్టించి, రైతులను దోచుకొనగలరు. అటువంటి అనాలోచిత ప్రయోగాలుచేసి, రైతులను గాలికి వదలడం ధర్మంకాదు. అందువలన, పూర్వాపరాలను పరిశీలించి, ఓచరు అనుభవాన్ని గుర్తుంచుకొని, బోర్డువారు నిర్దుష్టమయిన, సత్ఫలితాలను ఈయగల కార్యక్రమాలు చేపట్టాలి.

★

రైతాంగానికి "అక్కరకురాని చు(చ)ట్టం"

టొబాకో బోర్డు చట్టం

రచన శ్రీ పి. బుచ్చయ్య

పొగాకు పరిశ్రమను క్రమబద్ధం చేయడానికి కేంద్ర ప్రభుత్వం "టొబాకో బోర్డు"ను ఏర్పాటు చేసింది. అయితే అది రైతాంగం పట్ల "అక్కరకురాని చుట్టం" వలె వ్యవహరిస్తోంది. అక్కరకురాని చుట్టం పై సుమతీ శతకకారుని వ్యాఖ్యానం ఏమిటో మనకు తెలుసు కాగా, ఎన్నో సంవత్సరాల నిరీక్షణ తర్వాత మొత్తం పొగాకు పరిశ్రమ ప్రయోజనాల పరిరక్షణకోసం ఏర్పాటు అయిన ఈ "టొబాకో బోర్డు"ను అంత తొందరగా పనికిరాదనుకోవడం సముచితమైన చర్య కాబోదు అందువల్ల, రైతాంగం ప్రయోజనాలను పరిరక్షించుకొనేందుకు టొబాకో బోర్డు చట్టంలో తత్సంబంధమైన మార్పులకోసం వత్తిడి తీసుకురావలసిన అవసరం ఎంతైనా వున్నది.

పొగాకు కొనుగోలు విధానంలో బోర్డు ప్రవేశపెట్టిన "ఓచర్ పద్ధతి" రైతాంగం పాలిటి "శాపం" లా పరిణమించింది. అలాగే గ్రేడింగ్, ధరల వంటి అనేక విషయాలలో అది వాస్తవ విరుద్ధంగా, నియమ విరుద్ధంగా వ్యవహరిస్తోంది.

లోప భూయిష్టమైన "ఓచర్ పద్ధతి"

పొగాకు పరిశ్రమ, రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపట్ల "టొబాకో బోర్డు"కు నియమబద్ధమైన, నిర్మాణాత్మకమైన అవగాహన లేకపోవడం ఎంతైనా దురదృష్టకరం. పొగాకు కొనుగోలుకు అది "ఓచర్ పద్ధతి"ని ప్రవేశ పెట్టింది. ఈ "ఓచర్ పద్ధతి కింద "చెల్లింపు"లను నగదురూపంలో కాక, "చెక్"ల రూపంలో ఇచ్చే అవకాశం వాణిజ్య వర్గాలకు దక్కింది. ఇది రైతులపాలిటి "అశనిపాతం"లా పరిణమించింది. కొనుగోలుదారులలో "పోటీవ్యాపార" మనస్తత్వం మృగ్యమైపోయింది. ఈ "ఓచర్ పద్ధతి" వాణిజ్య వర్గాలకు, బ్యాంకులకు మాత్రమే ఉపయోగపడే దృక్పథం కలగి వుండడం వల్ల, దానిని న్యాయస్థానంలో సవాలు చేయవలసి వచ్చింది. టొబాకో బోర్డుతో సహాయ నిరాకరణకు సయితం రైతులు పాల్పడవలసి వచ్చింది.

రైతుల, వాణిజ్య వర్గాల మధ్య ఏర్పడిన విభేదాల కారణంగా పొగాకు కొనుగోళ్లు మూడు నెలలపాటు సంభించి పోయాయి. తత్ఫలితంగా రైతులవద్ద పొగాకు నిల్వలు పేరుకొని పోవడంతో, సరుకు నాణ్యత దెబ్బతిని రైతులు విపరీతమైన కష్టనష్టాలకు గురికావలసి వచ్చింది. నిజం ఇలావుండగా, పొగాకు కొనుగోళ్ళలో ఈ సంవత్సరం ఏర్పడిన ప్రతిష్టంభనకు కారణాలను కొందరు వక్రంగా చిత్రిస్తున్నారు. ఊహించనంతటి పెద్దమొత్తంలో ఈసంవత్సరం పొగాకు పండడమే "కొనుగోళ్ళ స్తంభన"కు కారణమని వారు అంటున్నారు. నిజానికి, ఈ సంవత్సరంకంటె అధికంగా పొగాకు పండిన సందర్భాలు గతంలో అనేకం వున్నాయి.

సాధారణంగా దక్షిణ ప్రాంతంలోని తేలిక నేలలలో పండే పొగాకు కొనుగోళ్లు డిసెంబర్ మొదటివారంలో ప్రారంభమై, జనవరి రెండవ వారాంతం వరకు జరుగుతూ వుంటాయి. అలాగే, నల్లనేలలలో పండే పొగాకు కొనుగోళ్ళు జనవరి మాసాంతంలో గాని, ఫిబ్రవరి మొదటివారంలో గాని ప్రారంభమవుతాయి. టొబాకో బోర్డు ప్రవేశపెట్టిన "ఓచర్ పద్ధతి"లో ఇంకా కొన్ని మార్పులుండవచ్చునన్న ఆశాభావంతో ఫిబ్రవరి 15వ తేదీవరకు వాణిజ్య వర్గాలు మార్కెట్‌లోకి చురుకుగా ప్రవేశించలేదు. ఒకవేళ అడపాదడపా కొనుగోలుచేస్తే, అది వారి ఇష్టాయిష్టాల మేరకు జరిగిన లావాదేవీలే. కొనుగోలు దారులు కొన్ని రకాలైన పొగాకును మాత్రమే కొనుగోలు చేయడంవల్ల రైతులవద్ద విపరీతంగా నిల్వలు పేరుకొని పోయాయి. రైతులు ఎదుర్కొంటున్న విపరీత పరిస్థితులను కొద్దిగా గమనించిన టొబాకో బోర్డు వాణిజ్య వర్గాలతో సంప్రతించి, "ఓచర్ పద్ధతి"లో కొన్ని

వెసులుబాట్లు కల్పించింది. ఆవి — 'చెల్లింపులు' నగదుగా గాని, చెక్‌ల రూపంగా గాని వుండవచ్చునని, చెల్లింపులు రెండవ వాయిదా (ఇన్‌స్టాల్‌మెంట్) గడువు రెండు నెలలకు బదులు నూటయాభై రోజులుగా వుండవచ్చునని సిఫారసు చేసింది. వీనితో కొనుగోళ్ళు కాస్త చురుకుగానే జరిగినాయి కాని, రైతుల వద్ద పొగాకు నిల్వలు పేరుకుని ఉండిపోయిన అవకాశాన్ని ఆసరాగా తీసుకుని అతిచవక ధరలను మాత్రమే వాణిజ్య వర్గాలు రైతులకు ఇవ్వజూపాయి. తమ ఉత్పత్తులను న్యాయమైన ధరలకు అమ్ముకోవడంలో రైతులు ఈ సంవత్సరం దారుణంగా నిరాశచెందారు. చివరికి వర్జీనియా (ఎఫ్. సి. వి) పొగాకును సమీకృతం వారు న్యాయమైన ధరలకు అమ్ముకోలేక పోయారు.

టుబాకోబోర్డు చట్టంలోని క్లాసు 8 (2) (h) నిబంధన ప్రకారం రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేసే ప్రత్యామ్నాయపు ఏర్పాట్లను చేయవలసివున్నది. అయితే, బోర్డు ఈ విషయంలో ఘోరంగా విఫలమయింది. రైతులనుంచి నేరుగా పొగాకును కొనుగోలు చేయమని ఎస్. టి. సి. ని బోర్డు వత్తిడి చేసింది. కాని అందుకు యస్. టి. సి. తన ఆశక్తతను తెలియజేసింది. యస్. టి. సి. అందుకు కారణాలను ఇలా వివరించింది. 1 బోర్డు సిఫారసు చేసిన ప్రకారం రైతులు ఎనిమిది గ్రేడ్లను సక్రమంగా అమలు జరపక పోవడం, 2 ఆయా గ్రేడ్లకు చట్ట బద్ధమైన కనిష్ఠ ధరలను నిర్ణయించకపోవడం అయిదు గ్రేడ్లకు కనీసం "సూచిక ధరలు" సమీకృతం (ఇండికేటివ్ ప్రైసెస్) లేక పోవడం, 3 బోర్డు సూచించిన ప్రకారం గ్రేడింగ్ జరిగిందో లేదో ధ్రువీకరించే ఎటువంటి ప్రభుత్వ సంస్థలేక పోవడం, ధరల నిర్ణయంలోగాని, గ్రేడింగ్ విషయంలోగాని ఎస్.టి.సి.కి, రైతులకు మధ్య వివాదం తల ఎత్తితే, తీర్పు ఇవ్వగలిగిన సంస్థ లేకపోవడం వంటి కారణాలను అది పేర్కొన్నది.

ఈ మూల సమస్యలను గమనించి తర్వాత డీలర్లనుంచి కూడా పొగాకును కొనుగోలు చేయడానికి ఎస్.టి.సి ని టుబాకుబోర్డు అంగీకరించింది. రైతులకు, వ్యాపారులకు మధ్య వివాదం తల ఎత్తినప్పుడుగాని, ఎస్. టి.సి. ని కొనుగోలు రంగంలోకి తీసుకురావలసి వచ్చినప్పుడుగాని టుబాకోబోర్డు మరి కొంత వాస్తవ దృక్పథంతో వ్యవహరించినట్లయితే, రైతులు ఈనాడు గుర్తైనంతటి భారీనష్టాలకు గురియి వుండేవారుకాదు. అటు టుబాకోబోర్డు ఆచరణ సాధ్యంగాని ఆలోచన ఇటు వాణిజ్యవర్గాలు అనుసరించిన "దోపిడీ"విధానంవల్ల, రైతులు ఈ సంవత్సరం ఇరవై అయిదుకోట్ల రూపాయలమేరకు (రంగు, వాసనల విపరిణామాలవల్ల) నష్టపోవలసి వచ్చింది. ఆ నిష్పత్తి మేరకు ప్రభుత్వం కూడా విశేష మారక ద్రవ్యాన్ని కోల్పోయింది.

అందువల్ల రైతాంగం పాలిటి అశనిపాతంలా వున్న ఈ ఓచర్ పద్ధతిని రద్దుచేసి "వేలం పాట" పద్ధతిని ప్రవేశ పెట్టవలసిన అవసరం ఎంతైనా వున్నది.

ఉత్పత్తి దశలోనే గ్రేడింగ్ కార్యక్రమం

పొగాకును గ్రేడింగ్ చేసే కార్యక్రమం ఇపుడు రెండు దశలలో అమలు జరుగుతున్నది. మొదటిది ఉత్పత్తిదారుల (రైతుల) దశలోను, రెండవది ఎగుమతిదారుల దశలోను జరుగుతున్నది. ఈ ద్వంద్వ విధానంవల్ల రైతులు విపరీతమైన దోపిడీకి గురికావలసి వస్తున్నది. అందువల్ల ఈ ద్వంద్వ విధానాన్ని రద్దుచేసి, ఉత్పత్తి దశలో జరిగే ఒకే గ్రేడింగ్ విధానాన్ని ప్రవేశపెట్టాలి.

ద్వంద్వ విధానం క్రింద ఉత్పత్తిదారుల దశలో జరిగే వివిధ గ్రేడ్లు: 1-V, 2-V, 3-V, 4-V, 5-V, 6-V, 7-V, 8-V.

ఎగుమతిదారుల దశలో జరిగే వివిధ గ్రేడ్లు:

(1) ప్లెయిట్ గ్రేడ్లు: 1, 2, 3, 4, LBY, LG, LBY_2, LMG, B MG, DG, DB, PL, Bits.

(2) కాంపోజిట్ గ్రేడ్లు: C1-4, F1-4, S1-4. T1-4, (2), 3(c), 4(c) LBY (c), LBY_2 (c), B (c), LG (c), LMG (c), MG (c).

ఎక్స్‌పోర్ట్ గ్రేడ్ విభాగంలోని కాంపోజిట్ గ్రేడ్ రకాన్ని ఎగుమతిదారుల సిఫారసుపైనే టుబాకోబోర్డు ఏర్పాటు చేసింది. కాగా, ఎగుమతిదారుల దశలో జరిగే పొగాకు గ్రేడ్లకు మాత్రమే కనిష్ఠ ధరలను (ఫ్లోర్ ప్రైసెస్) నిర్ణయించి రైతుల దశలో జరిగే గ్రేడ్లకు పెట్టకపోతున్నది. స్థానిక ఎగుమతిదారుల, విదేశీ కొనుగోలుదారుల "దోపిడీ"కి రైతాంగం గురికావడానికి కారణం ఇటువంటి ద్వంద్వ విధానమే!

అలాగే, సాధారణంగా గ్రామాలలోని రైతులు సాంప్రదాయంగా వస్తున్న నాల్గు "కచ్చాగ్రేడ్ల" విధానాన్నే ఇప్పటికీ అనుసరిస్తున్నారు. అవసరపు ఖర్చులను భరించినా, బోర్డు సిఫారసుల ప్రకారం ఎనిమిది గ్రేడ్ల విధానాన్ని రైతులు జరిపితే, ఎగుమతిదారులు తమ ఎగుమతికి కావలసిన కొన్ని అత్యుత్తమ రకాలకు చెందిన గ్రేడ్లనే కొనుగోలుచేసి, మిగతా వాటిని విడిచిపుచ్చవచ్చు. అటువంటి సందర్భాలు

రాకుండా అన్ని గ్రేడ్లకు చెందిన పొగాకు అమ్ముడుపోయేట్లుగా టుబాకోబోర్డు దృఢమైన చర్యలు తీసుకోవాలి.

ధరలవిధానం

టుబాకోబోర్డు చట్టాన్ని పరిశీలిస్తే, "ఫారమ్ గ్రేడ్"లకు ధరలు నిర్ణయించే అధికారం బోర్డుకులేదన్న విషయం స్పష్టమవుతుంది. ఫారమ్ గ్రేడ్ (ఉత్పత్తిదారుని దశలో జరిగే గ్రేడింగ్)లలో మొత్తం ఎనిమిది రకాలుండగా, కేవలం మూడు గ్రేడ్లకు మాత్రమే టొబాకోబోర్డు "సూచిత ధరల"ను (ఇండికేటివ్ ప్రైసెస్) ప్రకటించడం శోచనీయం. ఆ సూచిత ధరలు సముచితం న్యాయబద్ధంగా లేక పోషితమేకాక, వాటికి ప్రభుత్వ ఆమోదం కూడా లేదు. అందువల్ల అన్ని గ్రేడ్లు గ్రామస్థాయిలో అనువర్తించే చట్ట బద్ధమైన కనీసధరలను నిర్ణయించాలి., అంతేకాక అవి ప్రకటించిన మూడు గ్రేడ్ల సూచిత ధరలు సముచితం వివిధ ప్రాంతలలోపండే పొగాకు నాణ్యతకు అనుగుణంగా లేవు. ఒక ప్రాంతం పొగాకుకు మరొక ప్రాంతం పొగాకుకు నాణ్యతలో తేడా వుంటుంది. అంటే నాణ్యత ప్రాంతానికి మారుతూ ఉంటుందన్నమాట. కొన్ని నిర్దిష్టమైన ప్రాంతాలలో పండిన పొగాకు మాత్రమే బ్రిటన్, జపాన్‌వంటి దేశాలకు పనికి వస్తుంది. అలాగే, కొన్ని ప్రాంతాలలోపండే పొగాకు మాత్రమే చవక ధరలు చెల్లించే దేశాలకు ఎగుమతి చేయడానికి పనికొస్తుంది. అందువల్ల ప్రాంతాల విభేదంలేకుండా, అన్ని ప్రాంతాలకు కలిసి ఒకే "సూచిత ధరల"ను అమలు జరపడం సాధ్యంకాదు. కనిష్ట ఎగుమతి ధరలను దృష్టిలో పెట్టుకుంటే, ఈ సూచిత ధరలు ఏ మాత్రం వాస్తవ దృష్టితో చేసినవి కావన్న విషయం తేలిపోతుంది. ప్రాంతీయాంతరాలు లేకుండా టుబాకో బోర్డు సూచిత ధరలను ప్రకటించడంవల్ల ఆ ధరలు తమ తమ ప్రాంతాల పంటలకు కూడా వర్తిస్తాయని రైతులు తలపోశారు. అయితే, కొన్ని ప్రాంతాలలో పండిన పొగాకుకు ఎగుమతి దారులు తక్కువ ధరలను ఇవ్వ జూపడంలో రైతులు నిరాశపాలయ్యారు. అందువల్ల ప్రాంతాల అంతరాలనుబట్టి అన్ని గ్రేడ్లకు చట్టబద్ధమైన కనీసధరలను ప్రకటించాలి.

నిజమే టుబాకోబోర్డు గైకొన్న కొన్ని క్రమబద్ధిత చర్యలవల్ల రైతులు తమ "చెల్లింపు"లను సకాలంలో అందుకోడానికి ఆస్కారం కలిగింది. అయితే, ఈక్రింద సూచించిన సూచనలను కూడా బోర్డు పరిగ్రహిస్తే, రైతాంగం, వాణిజ్య వర్గాల సాధక బాధకాలను చాలా వరకు తొలగించవచ్చు.

1. పొగాకు ఎగుమతి దారులకు. డీలర్లకు బ్యాంకు ఋణాలను మంజూరు చేయించడంలో బోర్డు శ్రద్ధ తీసుకోవాలి. నిజానికి, ఈ విషయంలో బోర్డు విఫలమయినట్లే కానవస్తోంది. పొగాకు ఎగుమతి దారులకు, డీలర్లకు అవసరపు ఋణాలను మంజూరు చేస్తాయని రిజర్వ్ బ్యాంకి వాగ్దానం చేసినప్పటికీ, బ్యాంకుల చట్టాలలో, నిబంధనలలో ఆ మేరకు మార్పులు చేయలేదు.

ఇటువంటి లోపాలను టొబాకోబోర్డు చట్టంలో సవరించి(సక్రమంగా అమలు చేసినప్పుడే, దానివల్ల పరిశ్రమలోని అన్ని వర్గాలకు మేలు చేకూరుతుంది.

"సారెకు మంచు బొట్లు చెవి
జంపున ముత్తెములట్లు జారఁజే

జారిన పగ్గమూని యొర
చాలునఁ గోడెనదల్చి మేడిపై

భారము మోపి కష్టపడు
భాగ్యము చూడఁగదోయి ! క్రైతసిం

గారము కింతకన్నఁదగు
ఘట్టము లేర్చెదవా కవీశ్వరా ॥

ఏటుకూరి వేంకటనరసయ్య

లోపభూయిష్టమయిన పొగాకు బోర్డు చట్టమును సవరించవలసిన ఆవశ్యకత

రచన : శ్రీ పి. రాజగోపాలనాయుడు

పార్లమెంటు సభ్యులు

పొగాకుబోర్డు చట్టములోని మూలభాగముయొక్క తెలుగు అనువాదమును చూడనగును. రైతుల ప్రయోజనములను కాపాడుటకు, ఈ చట్టమును మార్చవలసి యున్నది. మార్పులు అవసరమయిన ప్రధానాంశములు ఈ రచనలో విశదీకరించ బడినవి.

—సంపాదకుడు.

ప్రస్తుత పొగాకుబోర్డు చట్టము రైతుల శ్రేయస్సు కొరకు ఉద్దేశించ బడినది గాదు. సిగరెట్టు కంపెనీల, ఎగుమతిదారుల, ప్రయోజనములను ఈ చట్టము కాపాడు చున్నది. ముఖ్యకారణాలను దిగువ పేర్కొంటున్నా.

1. దేశీయ సిగరెట్టు కంపెనీలను చట్టము ప్రకారము రిజిష్టరు చేయవలసిన అవసరములేదు. కాని ఆ కంపెనీల ప్రతినిధులకు బోర్డులో పీఠాలు ఏర్పాటు చేయబడినవి. ఇది విడ్డూరము :

2. బోర్డులో రైతులకు సరిఅయిన ప్రాతినిధ్యములేదు. రైతు ప్రతినిధులు రైతులచేత ఎన్నుకొనబడక, ప్రభుత్వంచేత నామినేటు చేయబడదము.

3. రైతుల స్థాయిలోని ఎనిమిది గ్రేడులకు చట్టరీత్యా కనీసధరలు నిర్ణయించుటకు అధికారము లేకపోవడం.

4. ఎగుమతిదారులకు తోడ్పడు, చిన్న మధ్య తరగతి వర్తకులకు తగురక్షణ లేకపోవడము.

పై లోపముల మూలకంగా రైతుకు రక్షణలేదు. గుత్త ఎగుమతిదారులు, సిగరెట్టు కంపెనీలు ప్రయోజనము ఎట్లు పొందుచున్నది పరిశీలిద్దాం.

బోర్డు పరిధిలోనుండి సిగరెట్టు కంపెనీలకు పూర్ణ స్వేచ్ఛ

పొగాకుబోర్డు చట్టము (1975) మూడవ ప్రకరణములో 10, 11, 12 క్లాజులు పొగాకు పరిశ్రమలోని రైతులు, పనిను చేయువారు, వర్తకులు, ఎగుమతిదారులు పాకర్లు, బ్రోకర్లు వేలందార్లూ - అందరూ బోర్డులో ఏటా కొంత రుసుము చెల్లించి, తమ పేర్లను నమోదు (రిజిష్టరు) చేయించుకోవలసి యున్నది. కాని దేశీయ సిగరెట్టు కంపెనీలు మాత్రము నమోదు చేయించు కొనవలసిన ఆవశ్యకత లేదు. బోర్డు చట్టములోని ప్రథమ ప్రకరణములోని, రెండవ క్లాజులో పొందు పరచబడిన ఆశయమునకు అనగా పొగాకు పరిశ్రమను, జాతీయ శ్రేయస్సు దృష్ట్యా, కేంద్ర ప్రభుత్వము అధీనములోనికి తీసికొనిరావడము- ఈ లోపము తీవ్ర అవరోధము.

మన పంటలో సగభాగము సిగరెట్టు కంపెనీలు కొంటున్నవి. పొగాకు మార్కెట్టును ఈ సిగరెట్టు కంపెనీలు అదుపులో పెట్టుచున్నాయి. మార్కెటులో రైతులకు యిచ్చే ధరలు ఈ కంపెనీలపై ఆధారపడి యున్నవి. క్లుప్తంగా చెప్ప

వలెనంటే రైతుల బ్రతుకు, మార్కెటు నడక ఈ కంపెనీల గుప్పెళ్లలో ఇరుక్కుని ఉన్నాయి. ఇంతట కీలకపాత్ర వహిస్తున్న ఈ దేశీయ సిగరెట్టు కంపెనీలను బోర్డు పరిధిలోకి రాకుండా చేసి, ప్రభుత్వం ఏ విధంగా సిగరెట్టు పరిశ్రమను అదుపులోకి తీసుకొనిరాగలదు? మార్కెట్లు పరిస్థితులను ఈ కంపెనీలు తమకు అనుకూలంగా మార్చుకుంటారు. తాము చెప్పిందే వేదముగా చేయించగలరు. పంట ఎక్కువగా పండి, మార్కెటులో పుష్కలంగా లభించినపుడు, ఈ కంపెనీలు రైతులనుండి పొగాకును కారు చౌకగా కాజేస్తున్నారు. మార్కెట్లలో సంక్షోభాన్ని పుట్టించి, రైతులను గడగడలాడిస్తారు. రైతు పొగాకుకు కనిస ధరలు లేనందున, ఈ కంపెనీలు రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. ఈకంపెనీల కనుసన్నలలో వర్తకులు నడుస్తారు. అందుచేత మార్కెట్టును కంట్రోలు చేసి వర్తకులబారినుండి రైతులను రక్షించడానికి పొగాకు బోర్డుకు ఇప్పటి పరిస్థితులలో సాధ్యముకానిపని. ఏటా పంటలో సగభాగము కొంటూ, మార్కెటును శ్రవశము చేసుకొని, రైతును దోపిడి చేస్తున్న ఈ దేశీయ సిగరెట్టు కంపెనీలను బోర్డు పరిధిలోనికి రాకుండా స్వేచ్ఛనీయడము పరిశ్రమాభివృద్ధికి చేటు.

దేశీయ సిగరెట్టు కంపెనీలకు బోర్డు పరిధిలోకి రానీయకుండా, వారికి బోర్డులో ప్రాతినిధ్యము కల్పించడము (బోర్డు చట్టములో రెండవ ప్రకరణము క్లాజు (4) లో సబ్‌క్లాజు (యి) విచిత్రము, అనుచితము. బోర్డులో నమోదుగాకుండా, బోర్డు కమ శిక్షణకు బద్ధులు కాకుండా, బోర్డు పాలసీలను రూపొందించడానికి ఈ సిగరెట్టు కంపెనీలకు అవకాశం ఈయడం అనుచితం, అవాంఛనీయము. రైతులనుండి, వర్తకులనుండి పొగాకు కొనుచున్న ఈ సిగరెట్టు కంపెనీలు వర్తకులకు విభజించి, అనుకూలమయినవారికి ఆదరణచేస్తూ, పొగాకు మార్కెట్టుపై పెత్తనం సాగిస్తున్నారు. ఇటువంటి కంపెనీల ప్రతినిధుల అభిప్రాయాలకు భిన్నంగా తక్కిన వర్తక ప్రతినిధులకు మాట్లాడగల ధైర్యముండదు. ఆ కారణంగా బోర్డు సభ్యులలోకూడా ఈ సిగరెట్టు కంపెనీలు పలుకుబడి గలిగి, బోర్డు విధానాలను తమకు అనుకూలంగా చేసుకొని, బోర్డును తమ జేబుసంస్థగా మార్చుకొనవానికి ఈ దేశీయ సిగరెట్టు కంపెనీలు యత్నించగలవు. కడకు బోర్డునే కంట్రోలు చేయగలవు. ఇంకా ప్రభుత్వము పొగాకు పరిశ్రమను ఎట్లు కంట్రోలు చేయగలదు? ఈ సిగరెట్టు కంపెనీలకు ఇంత స్వేచ్ఛ అవకాశములు ఈయడము అనాలోచితముగాని, పొర పాటున జరుగలేదు. రైతులను, చిన్నవర్తకులను గాలికి వదలి, సిగరెట్టు కంపెనీలను రక్షించడానికి పడిన తాపత్రయమే బోర్డు చట్టము ఇంత లోపముగా కావాలని తయారు చేయబడినది.

వివిధ గ్రేడులకు ప్రభుత్వం ఏటా కనీస ఎగుమతి ధరలు నిర్ణయిస్తుంది. ఈ కనీస ధరలు వ్యవసాయఖర్చులు దృష్టిలో నుంచుకొని కాక, ఇతర దేశాలలో

ధరలు, పోటీని గమనించి మన పొగాకును వీలుగా నిర్ణయించబడుచున్నవి. అందు చేత ఈ కనీస ఎగుమతి ధరలు రైతుకు గిట్టుబాటుకాగల ధరలుపై ఆధారపడిలేదు. సిగరెట్టు కంపెనీలు, ఎగుమతి దారులు, వర్తకులు ఈ కనీస ఎగుమతి ధరలను మనసులో నుంచుకొని రైతులకు ధరలు వేస్తారు. ఎగుమతిదారులకు, సిగరెట్టు కంపెనీలకు వ్యత్యాసం ఉన్నది. సిగరెట్టు ఆమ్మకము ధరలకు, ఆసిగరెట్టు కంపెనీలు రైతులకిచ్చే ధరలకు సంబంధం ఉండాలి. కాని సిగరెట్టు కంపెనీలు కూడా ఇతర వర్తకులు, ఎగుమతిదారుల వలెనే రైతులకు రేట్లువేస్తారు. పంటలో సగం కొంటున్న సిగరెట్టు కంపెనీలు పొగాకును చౌకగా కాజేస్తున్నారు. రైతులశ్రేయస్సు దృష్ట్యా ఎగుమతి అవసరాలకు, దేశంలో సిగరెట్టు తయారుకు కొనే పొగాకుకు వేరు వేరు ధరలుండాలి. విపరీత లాభాలు గడిస్తున్న సిగరెట్టు కంపెనీలకు, ఇతర వర్తకులకు వేరువేరు కొనుగోలు ధరలుండాలి.

బోర్డులో రైతు ప్రతినిధులు

బోర్డు సభ్యులు ఎట్లు నామినేటు చేయబడుచున్నది చట్టముయొక్క తెలుగు అనువాదము ఇంతకుముందు (——పేజీలలో) చూడనగును. ఆప్రకారంగా ఈ క్రింది విధంగా 21 మంది సభ్యులు బోర్డులో ఉంటారు.

1.	అధికార ప్రతినిధులు	—	10
2.	పార్లమెంటు సభ్యులు	—	3
3.	సిగరెట్టు కంపెనీలు, ఎగుమతి దారులు, వర్తకుల ప్రతినిధులు	—	5
4.	రైతు ప్రతినిధులు	—	3 = 21

పార్లమెంటు సభ్యులను కాక. మిగత 18మంది సభ్యులను ప్రభుత్వం నియమిస్తుంది. కాని ఎన్నికలలో వచ్చినవారు కాదు. రాజకీయ పలుకుబడితో నియమించబడు సభ్యులతో కూడిన ఈబోర్డు రైతులగురించి ఆలోచిస్తుందనుకోవడము భ్రమ. ముగ్గురు రైతు ప్రతినిధులు అంతమంది వర్తకులను కాదని ఏమిచేయగలరు? రైతు రక్షణకు కావలసిన ఏర్పాట్లు చేయగలరు? సిగరెట్టు కంపెనీల, ఎగుమతి దారుల, వర్తకుల భద్రతకు బోర్డు తోడ్పడుతుంటే, ఈ రైతు ప్రతినిధులు నిస్స

హాయులుగా ఉండవలసినదేగదా! సంఖ్యాబలంగల వర్తక ప్రతినిధులు బోర్డును తమకొరకు ఉపయోగించుకొనగలరు.

పొగాకు బోర్డు సమర్థవంతంగా, రైతులకొరకు కృషి చేయవలెనంటే (1) రైతు ప్రతినిధులు సంఖ్య మూడింట రెండువంతులుండాలి. (2) యీ రైతు ప్రతినిధులు బోర్డులో రిజిష్టరు గాబడిన డెబ్బదివేలమంది రైతులచే ఎన్నుకొనబడాలి. (3) ప్రభుత్వ ప్రతినిధులకు ఓటింగ్ అధికారము తొలగించబడాలి.

రైతుస్థాయిలో గ్రేడింగు - ఆ గ్రేడులకు చట్టరీత్యా కనీస ధరలు

పొగాకు బోర్డు చట్టములో రైతుల స్థాయిలో పొగాకుకు కనీస ధరలు నిర్ణయించడానికి అవకాశములేదు. కాని ఎగుమతి దారునికి యీ కనీసధరలు ఏర్పరచబడినవి. ఇది పెద్ద లోపము. పొరపాటున జరిగినదిగాదు. కావాలని వర్తకుల రక్షణకు ఏర్పరచినవి. (చట్టములోని రెండవ ప్రకరణములోని క్లాజు 8 [2] (డి), 8 [2] (హెచ్) చూడనగును. ఎందుకు యీ వ్యత్యాసము? రైతుల పొగాకు కనీస ధరలు లేకుండా నిర్బంధ గ్రేడింగు చేయించడము ఎగుమతిదారుల, వర్తకుల ప్రయోజనం కొరకే. ఎగుమతి స్థాయిలో గ్రేడింగు ఉన్నందున, ఎగుమతికి కనీస ధరలు 1963 నుండి అమలు జరుగుచున్నాయి. అదేవిధంగా రైతుల స్థాయిలో గ్రేడింగు చేయించి కనీస ధరలు నిర్ణయించాలి. రైతులను మరచిపోయి, వర్తకుల రక్షణకు బోర్డు చట్టములో తగు కట్టుదిట్టములు చేయబడినవి.

తమ స్వార్థము కొరకు ద్వంద్వ గ్రేడింగ్ విధానము రైతులవద్దఒకటి, ఎగుమతికి మరొకటి-ఉండాలని వర్తకులు వాదిస్తారు. ఒకే గ్రేడింగ్ విధానాన్ని ఈ వర్తకులు వ్యతిరేకిస్తున్నారు. రైతుల గ్రేడులు, ఎగుమతి చేయడానికి వీలులేదని వర్తకులు వాదిస్తారు. అందుచేత ఎగుమతి గ్రేడులు రద్దుచేసి, రైతుల గ్రేడులనే నిర్బంధముగా అమలుపరచాలి. అట్టి పరిస్థితులలో విదేశీ కొనుగోలుదారుల కొరకు వర్తకులు తిరిగి గ్రేడు చేయించుకొనడానికి వారికి స్వేచ్ఛఉండాలి. అమెరికా, కెనడా, రొడేషియాలలో ఇదే పద్ధతి అమలులోఉన్నది.

ప్రస్తుతం ఎగుమతి కొరకు జరుగుతున్న గ్రేడింగ్, పొగాకు నాణ్యతలు మారుచున్నాయి. దిగుమతిదారుల వసతి ప్రకారం గ్రేడు, క్వాలిటీ మారుస్తున్నాము. తత్ఫలితంగా ఆగ్‌మార్క్ గ్రేడులు 1, 2, 3 అదృశ్యమై, క్రిందిగ్రేడులలో లీనమై పోతున్నాయి. పంటలో వస్తున్న గ్రేడులకు, ఎగుమతి గ్రేడులకు సంబంధమేలేదు.

మన ఎగుమతి దారులు విదేశీ ఎగుమతిదారుల దయాదాక్షిణ్యములపై ఆధారపడి, నిస్సహాయ లగుచున్నారు. ఈ క్వాలిటీపై ప్రభుత్వమునకు అదుపులేనందున, మన పొగాకు చౌకధరలకు బయటకు పోతున్నది. దీనితో ప్రభుత్వం నిర్ణయించిన ధరలు అమలు జరగడంలేదు. ఈ విధానమునకు కడకు బలియగుచున్నదిరైతు. మనకు వస్తున్న ధరలు (Unit Value realisations) చూస్తే, రైతులు ఎటు దోచుకొనబడుచున్నది విశదముగా గలదు. రైతులవద్ద గ్రేడింగ్‌తోబాటు, రైతులకు కనీసధరలు అమలు పరచడమే దీనికి విరుగుడు.

అమెరికా, కెనడా, రొడీషియాలలో వలెనే, మన దేశంలోకూడా రైతుశ్రేయమును లక్ష్యముగా పెట్టుకొని తగు కట్టుదిట్టములు చేయాలి. రైతులవద్ద గ్రేడింగ్, రైతుల గ్రేడులకు చట్టరీత్యా కనీసధరలుండాలి. ఎగుమతి గ్రేడింగ్ ఎగుమతికి కనీసధరలు రద్దుచేయాలి. వ్యవసాయఖర్చులు, రైతుకు లాభము మదించి, రైతుల స్థాయిలో 3 గ్రేడులకు కనీస ధరలు నిర్ణయించాలి. బోర్డు చట్టములో ఇందుకు అవకాశముండాలి.

ఎగుమతి దారులకు తోడ్పడే చిన్న మధ్యతరగతి వర్తకులకు రక్షణ

పెద్ద వర్తకులకు ఎగుమతి కొరకు చిన్న మధ్య తరగతి వర్తకులు పొగాకు యిస్తారు. కాని యీ పెద్ద వర్తకులు ఎగుమతి అయిన తరువాత కూడా చిన్న వర్తకులకు డబ్బు చెల్లించరు. తత్కారణంగా చిన్న, మధ్య తరగతి వర్తకులనుండి రైతులకు డబ్బు అందదు. పెద్ద వర్తకుల వలన రైతులకు ఇబ్బంది గలుగుచున్నది. పెద్ద వర్తకులనుండి డబ్బు రాబట్టుటకు తగిన ఏర్పాట్లును బోర్డుచేయాలి.

రైతుల ప్రయోజనములదృష్ట్యా ఈ దిగువ మార్పులతో పొగాకుబోర్డు చట్టమును సవరించాలి.

దేశీయ సిగరెట్టు కంపెనీలపై కూడా బోర్డుకు అజమాయిషి ఉండాలి. బోర్డుతో ఈ కంపెనీలు రిజిష్టరు కావాలి.

బోర్డు సభ్యుల సంఖ్య 30 కి పెంచాలి. ఈ 30 మందిలో 20 మంది రైతు ప్రతినిధులుండాలి.

బోర్డుతో రిజిష్టరు చేసుకున్న రైతులు ఈ 20 మంది స్థలనుభు ప్రత్యక్ష ఎన్నికలద్వారా ఎన్నుకోవాలి.

బోర్డులోని అధికార సభ్యులకు బోర్డు సమావేశములలో వోటింగ్ అధికారమును తొలగించాలి

రైతుల స్థాయిలో ఎనిమిదిగ్రేడులను నిర్బంధంగా చేయించాలి; ఎగుమతి గ్రేడులు రద్దు చేయాలి.

ఈ ఎనిమిది గ్రేడులకు చట్టరీత్యా కనీస ధరలు నిర్ణయించబడాలి; ఎగుమతి కనీస ధరలు రద్దుగావాలి.

రైతులు అమ్మకోలేని పొగాకును, ప్రభుత్వ వాణిజ్య సంస్థ (STC) కొనాలి.

స్థానిక వర్తకుల మధ్య గ్రేడు చేయబడిన పొగాకు క్రయ, విక్రయములకు కనీస ధరలుండాలి.

బోర్డు సభ్యులుగా వచ్చు పార్లమెంటు సభ్యులు పొగాకు పండించే ప్రాంతమునుండి ఎన్నిక అయినవారు అయి ఉండాలి.

ప్రస్తుత పొగాకు బోర్డు చట్టమును పై అవసరములకు అనుగుణముగా సవరించేంత వరకు, రైతులకు రక్షణలేదు.

సరుకు విడుదలై అయిదారు నెలలయినా డబ్బు చేతికిరాని పొగాకు రైతుల గోడు

శ్రీ వి. సి. కేశవరావు (యం. పి.)

పొగాకు బోర్డు 1978 ఎమెండ్‌మెంటీ బిల్లుకు పార్లమెంటు సభ్యులు శ్రీ వి. సి. కేశవరావుగారు బోర్డు కార్యాలయం గుంటూరులోనే వుండాలనే సవరణను ప్రతిపాదించి, దానిపై రాజ్యసభలో చేసిన ప్రసంగాన్ని సంక్షిప్తంగా ప్రచురించడం చున్నాము.

(సంపాదకుడు)

పొగాకు బోర్డు ఎమెండ్‌మెంటీ బిల్లు ఇప్పుడు, ఇంత ఆదరా బాదరగా ప్రవేశపెట్టవలసిన అవసరం ఏమి వచ్చిందో నాకు అర్థం కావడంలేదు. పొగాకు ఉత్పత్తిచేయు రైతుల ప్రయోజనం కొరకు 1975లో పొగాకు బోర్డు చట్టం చేయ

బడింది. ఆంధ్ర పదేశ్‌లో ఉత్పత్తి కాబడే వర్జీనియా పొగాకు గుంటూరు, ప్రకాశం జిల్లాలు, వాటిని చుట్టుకొనివున్న ప్రాంతాలలోనే 2 లక్షల హెక్టార్లలో ఉత్పత్తి జరుగుతుంది. ఇది మొత్తం భారతదేశ ఉత్పత్తిలో 95 శాతంవుంటుంది. మిగత 5 శాతం కర్ణాటక. గుజరాత్‌లలో జరుగుతుంది. నా మిత్రులు బోర్డు కార్యాలయాన్ని బెంగుళూరుకు మార్చాలని అనుకొంటున్నారని తెలుస్తుంది.

ఇప్పుడు బెంగుళూరులోగల హెచ్. యం. టి. ని గాని, హెచ్. ఎ ఎల్. ను గాని హైదరాబాదుకు మార్చవలసిందిగా నేను కోరితే ఇతరులేమను కొంటారు? ఎందుకంటె, ఆ పరిశ్రమలకు బెంగుళూరే సహజసిద్ధమైన ప్రదేశము. అలాగే గుంటూరు పొగాకు ఉత్పత్తికి, మార్కెటింగ్‌కు అనువైన కేంద్రం. రెండు లక్షల హెక్టార్లదాకా ఆ ప్రాంతంలో వర్జీనియా పొగాకు పైరు వేయబడుతుంది. 70,000 ల కుటుంబాల రైతులు పొగాకు పండిస్తున్నారు. ఉత్పత్తి, క్యూరింగ్, గ్రేడింగు. రీడ్రయింగ్‌మొదలయిన కార్యక్రమాలలో నాలుగు లక్షలదాకా కార్మికులకు జీవనోపాధి కలుగుతుంది.

ఈ పంట అతి సున్నిత మయినది. నాట్లు వేసిన కొద్దిరోజుల్లో ఏకొంచం వాన పడ్డదా అంటే నాటు చచ్చిపోతుంది. ఆవిధంగా అనేక సంవత్సరాలు నాట్లు ఒకటికిపుంచి వేయవలసి వస్తుంది. బ్రతికి బట్ట కట్టిన తరువాత రసాయని ఎరువులు వేయాలి. తెగుళ్ళ మందులు చల్లుతూవుండాలి. కలుపు తీయాలి. రెండు మూడు మాసాలదాకా పసిబిడ్డను పెంచినట్లుగా పెంచాలి. రసాయనిక ఎరువులు, తెగుళ్ళ మందుల ధరలు విపరీతంగా పెరిగాయి. యీ పెరుగుదల రైతులు భరించ లేనంతగా పెరిగాయి. అవి అన్నీ కర్రీలే. మిగతా పంటలను పోల్చుకొంటే పొగాకు పంట వ్యయప్రయాసలతో కూడినది.

ఇంతగా పెట్టుబడులుపెట్టి కష్టపడి ఉత్పత్తిచేస్తే తీరా పంట చేతికొచ్చే నాటికి వ్యాపారస్తులు ఎవరూ కొనడానికి ముందుకురారు. కొన్ని ప్రాంతాలలో నవంబరునాటికి, మరికొన్ని ప్రాంతాల్లో డిశంబరునాటికి బ్యారన్‌లు దిగుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో జరుగుతున్న సంవత్సరం ఫీబవరిదాకా వ్యాపారస్తులెవరూ మార్కెట్లో ప్రవేసించలేదు. కచ్చా గ్రేడ్‌చేసి బేళ్ళుకట్టి అమ్మకానికి సిద్ధంచేయబడిన పొగాకు నిలవవుండేకొలది రంగు మారుతుంది. ఫ్లేవరు తగ్గుతుంది. అప్పుడువాళ్లు వెంటపడతారు. ఏమిటిగతి! బహుకాలం పెద్ద ఎతున ఆందోళన సాగించిన మీదట ప్రభుత్వ వాణిజ్య సంస్థ మార్కెట్లో ప్రవేసించింది. వారయినా కొంతవరకు మాత్రమే కొన్నారు.

ప్రభుత్వం ముందుకువచ్చి తమ సరుకుకొని ఆదుకొంటుందనే నమ్మకం కలుగక, నిరాశచెంది, క్యూరింగ్ ఖర్చులు పుట్టక చివర ఇరుపులు వదలివేశారు. ఆ విధంగా 1.5 మిలియన్ కిలోలు దాకా సరుకు నష్టమైపోయి వుంటుందని అంచనా వేస్తున్నారు. ఇక ఐ. యల్. టి. డి. నేషనల్, ఈస్టుఇండియా గోల్డెన్ లాంటి పెద్ద కంపెనీలు అతితక్కువ ధరలకు అంటే కారుచవకగా తమకు కావలసిన సరుకు మాత్రమే కొన్నారు. నాకర్నాటక మిత్రులు చెప్పినట్లుగా లోగడ సంవత్సరా ల్లో క్వింటాలు రు 1100–00 లకు కొన్న రకాలు ఈ సంవత్సరం రు 300–00 లకు మాత్రమే కొన్నారు. ఇప్పుడు మీకు ఆర్థమైవుండాలి రైతులు ఎంతగా నష్ట పడింది. ఒక్కమాటలో చెప్పాలంటే నారు ఖర్చులుకూడా తిరిగిరాలేదు.

బోర్డు కార్యాలయం గుంటూరు

బ్యారన్ పొగాకు ఎక్కువగా పండించే గుంటూరు ప్రకాశం జిల్లాలనుండే రు 450 కోట్లదాకా ఎక్సయిజు సుంకంద్వారా ఆదాయం లభిస్తుంది. ఎగుమతుల ద్వారా రు 100 కోట్లదాకా విదేశమారక ద్రవ్యం లభిస్తుంది. దీనినిబట్టి బోర్డు కార్యాలయాన్ని హైదరాబాదుకో, మరెక్కడికో మార్చాలని ప్రయత్నించడంలో ఏమిన్యాయమున్నదో? మీరే ఆలోచించండి. అసలు అలాంటి ఆలోచన మంత్రివర్గానికి ఎందుకుకల్గిందో నాకు అర్థం కావడంలేదు. కొందరు ఉన్నతాధికారులు తమ విలాస జీవితాలకొరకు గుంటూరు తగిన ప్రదేశం కాదనుకొన్నారెమో. హైదరాబాదైతే ఒకటి రెండు గంటల్లో ఢిల్లీ చేరవచ్చుననేమో!

పొగాకుబోర్డు గుంటూరులోనే నెలకొల్పడానికి దీర్ఘకాలం అందోళనసాగించ బడింది. లోగడ ఇచ్చటనే ఇండియన్ టొబాకో డెవలప్‌మెంటు కౌన్సిలు వుండేది. విదేశ వ్యాపార ప్రతినిధులు మాకాం చేయుటకు కట్టించిన పెద్దపెద్ద భవనము లున్నాయి. నా మిత్రులు శ్రీ ఆర్. నరసింహారెడ్డిగారు చెప్పినట్లుగా గుంటూరుకు 45 కిలో మీటర్ల దూరంలో గన్నవరంవద్ద విమానాశ్రయం వున్నది. అధికారులు ఎంతటి విలాస జీవితాన్నయినా గడపవచ్చు.

కారుచవక రేట్లతో పొగాకును కొన్న వ్యాపారస్తులయినా రైతులకు డబ్బు ఇచ్చారా అంటే అదీలేదు. ఎన్నిమార్లు అడిగినా ఆసరుకు అమ్ముడు పోలేదని, ఎగు మతి కాలేదని ఆంతదాకా ఆగమనే సమాధానం తప్ప డబ్బు మాత్రం ఇవ్వరు. కాని రైతుకు ఇవ్వవలసిన దానికంటె రెట్టింపు ధనం వారి చేతికందింది. నాకు అనుభవం వున్నది. వేలాది రైతులేమో దివాలా తీశారు. వ్యాపారస్తులేమో ఏడాది కేడాది అంతులేని సంపదలు పెరిగి పోయాయి. ఈ సంవత్సరం వ్యాపారం ప్రారంభించిన వారు మరుసటికల్లా లక్షాధికారులై పోయారు. గోడౌన్లు,

విలాస భవనాలు కట్టారు. అనేక బ్రాంచీలు తెరిచారు. వాణిజ్యాన్ని విస్తరింప చేశారు. అయినా రైతులకు మాత్రం డబ్బు ఇవ్వకుండా ఎగనామం పెట్టారు. పొగాకు కొన్న వెంటనే రైతుకు డబ్బు చెల్లించే ఏర్పాటు చేయవలసి యున్నది.

పొగాకు వేలం విక్రయం ప్రవేశ పెట్టేందుకు కూడా బిల్లు తయారు కాబోతున్నది. మంచిదే. ఏదయినా సరుకు విడుదలయిన వెంటనే రైతుకు డబ్బు చేతికొచ్చేమార్గం కనిపెట్టాలి. గిడ్డంగుల సౌకర్యం కలిగించాలి.

ఆసలు ప్రధాన విషయమేమంటే, పొగాకుబోర్డు కార్యాలయం గుంటూరు లోనే వుండాలనే నా సవరణను గౌరవనీయులయిన మంత్రిగారు ఆమోదించగలరని ఆశిస్తున్నానంటూ ప్రసంగం ముగించారు.

సుక్షేత్రములు దయాహృన్మయై పిడించు
ఋణదాతలకు సమర్పింప వలసె

ఇల్లాలిమెడలోని నల్లపూసయు వెచ్చ
పెట్టి పన్నుల పొట్ట బెట్టవలసె

దిన వెచ్చమునకునై తెచ్చు బాకీలకై
కొంపతాకట్టులో దింపవలసె

కడుపుకక్కుర్తికై గతిలేక పశుకోటి
నెల్లమెల్లన విక్రయింపవలసె.

ధరలు పడిపోయె సేద్యంబు తక్కువాయె
శిస్తు మెండాయె నింకేమి సేయుదోయి !
నిర్జరారణ్యమేనీకు నెలవటోయి !
కర్షకా ! యిదియేనాటి కర్మమోయి.

తెలుగులెంక తుమ్మల సీతారామమూర్తి.

నైవేద్య నివేదనము

సంగీత శ్లోకాలు రుద్రాక్ష జపాలు మానివెయ్యి !

ఈ కవాటబంధిత దేవాలయంలో

ఈ చీకటి కోనలో ఎవరిని నీవు పూజించేవి !

కళ్లు తెరచి చూడవయ్యా ! నీ దేవుడిచట కనుపించడు !

ఆడుగో, అచట కర్షకుడు కటిక నేలను దుంతున్నాడే మార్గకర్త, రాయి రప్పలు సరిజేస్తున్నాడే అచట అచటనే ఆ దేవుడున్నాడు !

ఆడుగో, ఆ యెండలో ఆ వర్షంలో వారి మధ్య ఆయన పై వస్త్రం చూడావా మైలపడింది. నీ పట్టు వస్త్రాన్ని అవతల పారేసి, ఆ దేవునివలెనే నీవూ ధూళి ధూసరితమైన ఈ భూమిపైకిరమ్ము

ముక్తి ముక్తి ! అదెచ్చటనున్నది ? మన ప్రభువే ఈ సృష్టి కలాపాన్నంతా సంతోషంగా చేపట్టాడు. ఎప్పటికీ మనతో ఆయన బంధింపబడే వుంటాడు

మీ మీ ప్రార్థనలను చాలించి పూలను ధూప దీపాలను ఆవల పెట్టండి. మీని జీర్ణాంబరములయిన నేమి ! రండి కలియండి. కష్టమో నష్టమో వానిదరిచేరండి.

విశ్వకవి రవీంద్రనాధ ఠాగూర్

(గీతాంజలినుండి)

గుత్తపెట్టుబడిదారుల దయాదాక్షిణ్యాలకు పూర్తిగా
వదిలి వేయబడి పెక్కుకష్టాలకు గురవుతున్న

పొగాకు రైతులు

శ్రీ యన్. చంద్రశేఖరరెడ్డి

ఈ రచన ప్రధానంగా నాటు పొగాకుకు సంబంధించినది. ఇందు ఉత్పత్తిదారులు నాటు వేయడం మొదలు పిలకదీయడం, ఆకుకోయడం, తాళ్లుకూర్చడం, ఎండగట్టడం, మండెమూర్చడందాకాగల రైతులకృషినికండ్లకు కట్టినట్లు వివరించబడింది. ఇక పొగాకు కొనుగోలులో బయ్యర్లు, సూపర్ వైజర్ల ఆగడాలను, గుత్తసంస్థల దోపిడీని వివరించబడినది. నాటు పొగాకుకు సంబంధించిన సమగ్రచర్చ ఇందులోవున్నది.

(సంపాదకుడు)

నాటువేసి నీటికోసం ఆకాశంవైపు చూడటం నాటి రాతి-యుగంనుండి నేటి అణుయుగం వరకు భారత దేశపు రైతుకు వారసత్వంగా వస్తున్న మారని పరిస్థితి. అతివృష్టి, అనావృష్టి లేకుండా సకాలంలో సరిపడా వర్షాలు కురిసి పంటలు పండినా, ఆ పంట అమ్ముడుపోవటానికి వ్యాపారస్తుల, పెట్టుబడిదారుల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడాలి రైతు. పంటకు సరైనధర వస్తేనే కడుపు నిండినట్టు, లేకపోతే యెంత పంట పండినా కళ్ళనీళ్లు కడగక్కు తప్పవు రైతుకు. పంటలు పండించడం ఎంత కష్టమో, పండించిన పంటను అమ్ముకోగలగటం మరింత కష్టమని పొగాకు రైతులు అనుభవ పూర్వకంగా చూస్తున్నారు.

మడులు చేసిందీ, విత్తనాలు చల్లిందీ భుజం భుజం మార్చి మార్చి దీర్ఘకాలం నీళ్లు పోసిందీ, నారు పెంచిందీ, దుక్కి-దున్నిందీ, వర్షాలులేకపోతే మొక్క-మొక్కనూ నీరుపోసి నాటువేసిందీ, ఎరువేసి పెంచిందీ-పెద్దచేసిందీ, పిలకతీసిందీ-తీసిన చేతితోనే చేదుకూడా తిన్నదీ, ఆకును గల్లించే, బారం కూర్చిందీ, ఎండబెట్టిందీ, ఆకు, ఆకుతీసి బూజుతుడిచిందీ, అమ్మకానికి అవసరమైన రీతిలో పొగాకును తయారు చేసిందే-ఆరైతే.

ఆ పొగాకును కొనేది, లేనిది, దానికి ధరను నిర్ణయించేదీ పొగాకునుకొనే వ్యాపార సంస్థలు, అత్యధిక లాభార్జనే ధ్యేయం తప్ప వుత్పత్తిదారులైన రైతుల సంక్షేమంతోకాని, కొనుగోలుదారుల సౌలభ్యంతోకాని దానికి నిమిత్తంలేదు.

ఐ. ఎల్. టి. డి

పొగాకు కొనుగోలు రంగంలో ఐ. ఎల్. టి. డి. దే గుత్తాధిపత్యం. నాటు పొగాకును గురించి, అది పెంచటంవల్ల రైతాంగానికి వచ్చే లాభాలను గురించి, ప్రచారం చేసిందీ, పండించే రైతులకు ప్రాథమిక దశలో అప్పులు, యితర రూపాల్లో సౌకర్యాలను కలుగజేసి ఆశలను రేకెత్తించిందీ వీరే. ఆ విధంగా ఆహార ధాన్యాలను వుత్పత్తిచేసే రైతాంగాన్ని పొగాకును ఉత్పత్తి చేసేందుకు ప్రోత్సహించిందీ, అత్యధిక ఉత్పత్తికి దారి తీయించిందీ వీరే. గత సంవత్సరం వరకూ పొగాకు నాణ్యత ఎలాగున్నా రేటువేసి కొనుగోలుచేసిందీ, యితర పొగాకు వ్యాపారుల వద్దకు వెళుతున్న బండ్లను త్రిప్పి తమ కంపెనీకి బలవంతంగా తెచ్చుకున్నదీ వారే.

భూస్వామ్య వ్యవస్థ వికృత రూపాల్లో ప్రణాళికా బద్ధమయిన ఉత్పత్తి విధానం లేకపోవటంకూడా ఒకటి. ఎవరెన్ని ఎకరాల్లో పొగాకు వేస్తామని చెప్పినా అంతటినీ కొనుగోలు చేస్తామని ఎలాంటి "బాండ్" విధానం లేకుండా రైతులతో

ఉత్పత్తి చేయించింది ఐ. ఎల్. టి. డి. యే. బాండ్ విధానాన్ననుసరిస్తే ఆ రైతుల పొగాకును తప్పనిసరిగా కొనితీరవలసివస్తుంది కనుక అలాంటి చిక్కుల్లో తాను యిరుక్కోకుండా, అశేష రైతాంగాన్ని చిక్కుల్లోనికి తోసింది ఐ. ఎల్. టి. డి.

కొనుగోలు సందర్భంగా ఈ కంపెనీ వడపోత విధానాల్ని తీవ్రంగా అనుసరిస్తోంది. పొగాకులో ఏమాత్రం తడి తక్కువున్నా, ఎక్కువున్నా పొగాకు కొనుగోలును తిరస్కరించడం (సి. ఆర్. చేయటం) జరుగుతోంది. అనేక వ్యయ ప్రయాసలకోర్చి బేళ్లుకట్టి తీసుకు వచ్చిన సుదూర ప్రాంతపు రైతాంగం దాన్ని నిస్పృహతో తిరిగి యింటికి తీసుకు వెళ్ళవలసి వస్తోంది. బయ్యర్ నోటినుండి సి ఆర్ (క్రాస్)అని వినవలసి వస్తుందేమోనని అతనివెంట చేతులు కట్టుకొని నిలబడ్డ రైతాంగం గుండె లరచేత పట్టుకొని, నోళ్లు తెరచుకొని చూడవలసి వస్తోంది. అతడు సి. ఆర్ అంటే అచేతనంగా బేలు వద్దనే నిలబడిపోయి శూన్యంలోకి చూస్తున్న రైతు ఆవేదన, మూగ రోదన ఎవరు వినేది? ఎవరు తీర్చేది?

ఒక్కొక్కచోట రైతాంగం ఇలా అనేకసార్లు సి. ఆర్. కాబడిన పొగాకు బేళ్ళను ఆ కంపెనీ ఎదురుగానే తగులబెట్టి వెళ్ళిన ఘటనలు కూడా ఉన్నాయి. ఐ. యల్. టి. డి. తాను అనుసరిస్తోన్న విధానాలను వ్యతిరేకించినచోట రైతాంగాన్ని బెదిరించే ధోరణిలో తన కొనుగోలు కేంద్రాలను మూసివేయటం కూడా జరిగింది.

పొగాకును కంపెనీవద్దకు తీసుకువచ్చేందుకు అనుమతిపత్రం (కారు) సంపాదించటంలోనే రైతువూపిరి సగంపోతోంది. అందుకు సూపర్‌వైజర్లలో యితర వుద్యోగులకు తప్పనిసరిగా లంచం పెట్టవలసివస్తోంది. బయ్యకు (BUYER), సూపర్‌వైజకో అలా బయటకు వెళుతోంటే (వుత్సవ విగ్రహంవెంట జనం వెళ్ళినట్లు) వందలాది రైతులు అతని చూపుకోసం మాటకోసం అతని వెంట బడి బయలుదేరటం, అతను ఈసడింపుగానైనా చూసినప్పుడు ఈ దేశపు "వెన్నెముక" వొంగిపోయి, పైకెత్తిన రెండు చేతులను దగ్గరకు చేర్చటం, వాళ్ళ యిళ్ళ

ఒక్కోచోట రైతాంగం అనేకసార్లు క్రాస్ చేయుబడిన పొగాకు బేళ్ళను ఆ కంపెనీ ఎదురుగానే తగులబెట్టిన ఘటనలెన్నో వున్నాయి.

వద్ద పడిగాపులు పడటం-ఇదంతా ఐడా బూర్జువా, బడా భూస్వామ్య ప్రభుత్వాలు రైతాంగాన్ని పూర్తిగా గుత్త సంస్థల దయాదాక్షిణ్యాలకు వదలివెయ్యటాన్ని రుజువు చేస్తున్నది. రైతాంగ వ్యతిరేక గుత్త పెట్టుబడిదారీ ప్రయోజనాలను భక్తితో పరిరక్షించే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్వభావాన్ని నిరూపిస్తున్నది.

తమ చిత్తంవచ్చినప్పుడు ఆలస్యంగా కొనుగోలు కేంద్రాలను తెరవటంలో, కొన్న సరుకుకు సకాలంలో డబ్బుచెల్లించక పోవటంలో, రైతాంగాన్ని బెదిరిస్తూ కొనుగోలు కేంద్రాలను మూసివేయటంలో, నిర్దాక్షిణ్యంగా క్రాస్ చేయటంలో— వుత్పత్తిదారులపై గుత్త సంస్థలు తమ ఆధిపత్యాన్ని ఎలా చెలాయిస్తాయో రైతాంగం ప్రత్యక్షంగా చూస్తున్నారు.

నిర్బంధ వసూళ్లు

వర్షాలతోపాటు రైతుల కష్టాలూ మొదలయ్యాయి. ఉన్న కాస్త యిండ్లలో పొగాకును నింపేసుకొని, పశువులను ఆరుబయట కట్టేసుకున్నారు రైతులు. వర్షంలో పశువులు తడిసిపోతున్నాయి. వాటికి నిలువనీడ కన్పించలేని దుస్థితికి రైతులు నెట్టివేయబడ్డారు. రైతులు నివసించే కొట్టాలు, మట్టి మిద్దెలు కారటంవల్ల "నోటిదగ్గర కూడు సీటిపాలయ్యిం"దని రైతులు పడే ఆవేదన వర్ణనాతీతం.

ఇలాంటి దిక్కుతోచని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్న రైతాంగాన్ని ఆదుకోవలసిన కనీస నైతిక బాధ్యతను బంగాళాఖాతంలో విసిరి, ప్రభుత్వం రైతాంగం మూల్గుల్ని మరింత పీల్చే విధానాలను చేపడుతోంది. నిర్బంధంగా పన్నులు, బకాయిలు వసూలు చేయటం, యివ్వనివారి సేద్యయోగ్యమైన ఎద్దులను, పరికరాలను జప్తులు చెయ్యటం గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ నిత్య కృత్యాలయ్యాయి. ఇటు పొగాకును కేంద్రానికి చేర్చేందుకుగాని, అటు సేద్యాలు చేసి విత్తనాలు వేసేనేందుకుగాని యిబ్బందికరంగా ఈ జప్తులు పరిణమించాయి. అయినా సరే నిర్దాక్షిణ్యంగా రైతుల యిళ్ళమీదపడి "బందిపోట్ల" మాదిరిగా, ఎలాంటి ముందు నోటీసులు లేకుండా 'లూటీ' చెయ్యటం సహజమై పోయింది.

ప్రజలది కాదీ ప్రభుత్వం

వ్యావసాయిక దేశమైన భారత దేశంలో వ్యవసాయ రంగమే దేశ వుత్పత్తిలో ప్రభుత్వ ఆదాయంలో ప్రధానస్థానం ఆక్రమిస్తోంది. అలాంటి వ్యవసాయ రంగంలో ప్రభుత్వం వుత్పత్తి శక్తులను అలక్ష్యంచేసి, వుదాసీన వైఖరినవలంబిస్తోంది. పొగాకు సమస్య పరిష్కారం విషయంలో ప్రభుత్వం అనుసరిస్తోన్న విధానం

యిందుకొక తార్కాణం. కేంద్ర ప్రభుత్వ సంస్థ సెంట్రల్ ఎక్సైజ్ద్వారా ఏరకం పొగాకు ఎంత పండిందీ. ఐ. ఎల్. టి. డి. లాంటి గుత్త సంస్థల అవసరాలు, కొనుగోలు శక్తి ప్రభుత్వానికి తెలియంనికాదు. అయినా దేశాన్ని గుత్త సంస్థల పాదాక్రాంతం చెయ్యటంలో భాగంగానే పొగాకు రైతాంగాన్ని కూడా వారి వుక్కు-పాదాల క్రింద పడద్రోసింది. పొగాకు రైతులు ఎదుర్కొంటున్న యిబ్బందులు ప్రభుత్వ దృష్టికి రాకుంటా పోలేదు.

తప్పనిసరి పరిస్థితుల్లో పొగాకు రైతులు ఆందోళనకు పూను కొంటున్నవేళలో, ఆందోళనను నీళ్ళు గార్చేందుకు మాత్రమే ప్రభుత్వం మంత్రుల, యితర అధికారులు కళ్ళ నీళ్ళ తుడుపుగా అనేక ప్రకటనలుచేసూ, మమ కొస్తున్నారు. అయితే "మార్కెటింగ్ ఫెడరేషన్ ఫలానా తేదీ నుండి కొను గోలు చేస్తుంవహో" అని ప్రకటించిన వివిధ తేదీలు గడచిపొయ్యాయి. ఇంత వరకూ (24-7-1978) మార్క్-ఫెడ్ ఎక్కడా కొనుగోలు కేంద్రాలు తెరిచిందీ లేదూ, కొనగోలు చేసిందీ లేదు.

గుత్త సంస్థలను మించిన ప్రభుత్వ దోపిడీ విధానం

ప్రజలు కష్టించి పండించిన పంటలు అమ్ముడు పోకపోయిన పరిస్థితుల్లో, లేదా పంటలకు గిట్టుబాటు ధరలులేని పరిస్థితుల్లో ప్రజల పక్షాన నిలబడి సబ్ డీ యిచ్చైనాసరే పరిస్థితిని అదుపులోనికి తెచ్చి సమస్యను పరిష్కరించవలసిన కనీస బాధ్యత ప్రభుత్వానిది.

రాష్ట్ర వ్యవసాయ మంత్రి ఎర్రపాటి వెంకట్రావు ఈ నెల 12 న ఒక ప్రకటనచేస్తూ ప్రస్తుతం ఐ. ఎల్. టి. డి. కొంటున్న ధరలకన్నా యింకా 15 శాతం తక్కువ ధరలతో మార్క్-ఫెడ్ కొనుగోలు చేస్తుంవని "హామీ" యిచ్చారు. దోపిడీ, లాభార్జన ప్రధాన ధ్యేయంగా పెట్టుకున్న ఒక సంస్థ ఈ ఐ. ఎల్. టి. డి. అలాంటి గుత్తసంస్థలు నిర్ణయించిన కనీస ధరకన్నా 15 శాతం తక్కువ ధరలకు ప్రభుత్వసంస్థ కొనుగోలు చేస్తుందంటే ఇది గుత్తసంస్థలను మించిన దోపిడీ ప్రభు త్వమని తనకుతానే మరొకసారి రుజువు చేసుకుంది రైతుప్రతినిధులుగా తమకు తామే చెప్పుకుంటున్న కొందరు, రైతాంగాన్ని దోపిడీచేసే ఈ ధరల విధానాన్ని వ్యతిరేకించక పోగా తమ హర్షాతిరేకాన్ని పత్రికాముఖంగా తెలియజేయటం వారి రైతాంగ వ్యతిరేక స్వభావాన్ని బహిర్గత పరుస్తున్నది.

నాటు పొగాకుకు సంబంధించి యిప్పటివరకూ కేవలం 40 శాతం మాత్రమే కొనుగోలు చేయటం జరిగింది. ఇంకా 60 శాతం రైతులవద్దనే నిల్వపడి వున్నది. పలుకుబడిగల భూస్వాములు మాత్రమే తమ పొగాకును పూర్తిగా విక్రయించుకోగలిగారు.

ఎక్కువకాలం యిండ్లలో పొగాకు వుంచుకోవడం ఆరోగ్యానికి హానికరం కూడా. అంతేగాకుండా పొగాకును సక్రమంగా నిలువచేసే సౌకర్యాల లోపంవల్ల పొగాకు నాణ్యతను, బరువును కోల్పోతుంది. ఇప్పటికే దాని ప్రభావం కొంత మేరకు వుంది. తాను చెల్లించవలసిన ప్రభుత్వ, ప్రైవేటు అప్పులకు వడ్డీలు పెరిగి పోతున్నాయి. పైగా ధాన్యంవలె ఒకమూల పడేసేది కాదుకనుక, నిరంతరం దాన్ని ఒకపై పునుండి మరోపైపుకు తిప్పుతూ వుండాలి కనుక కాలయాపనవల్ల రైతు అదనంగా అనేక రెట్లు శ్రమించ వలసి వస్తోంది.

ఇది విత్తనాలకాలం సంవత్సరానికి ఒకేసారి యిలాంటి అవకాశం వచ్చే ఈ సమయంలో సేద్యానికి వుపయోగించవలసిన ఎద్దులను కంపెనీకి పొగాకును చేరవేసేందుకు వుపయోగించవలసి రావటంవల్ల రెండుపధాలా రైతు నష్టపోవలసి వస్తున్నది.

ఉన్న రెండెకరాల్లో పొగాకును మాత్రమే వేసిన కొందరు రైతుల ఆహార సమస్య దయనీయంగావుంది. పొగాకు అమ్ముడుపోవాలి. డబ్బుచేతికి రావాలి, తిండిగింజలు కొనుక్కోవాలి. ఇదీ పరిస్థితి.

నిరాశా, నిస్పృహలలో ప్రభుత్వ అలక్ష్యంతో విసిగిపోయిన రైతాంగం పోరాటాలకు కూడా సిద్ధమవుతున్నది. ఇప్పటికే కొన్ని కొనుగోలు కేంద్రాలవద్ద నిరాహారదీక్షలు, మరికొన్నిచోట్ల గుత్తసంస్థల ప్రతినిధులైన బయ్యర్లను (బయ్యర్‌ను మోరావోచేయడాలు, వందలాది రైతులు పూరేగింపుల ద్వారా సమస్యలను ప్రజలందరి దృష్టికి తీసుకువెళ్ళటంలాంటి కార్యక్రమాలు రైతుకూలీ సంఘం, తదితర సంస్థల నాయకత్వాన జరిగాయి. ప్రభుత్వం ప్రస్తుతం తీసుకున్న నిర్ణయాలైనా ఈ రైతు వుద్యమాల ఫలితమేనని గుర్తించక తప్పదు.

"విమోచన" సౌజన్యంతో.

★

పొగాకు బోర్డు చట్టము (1975) నిజరూపము

పొగాకు బోర్డు చట్టము (1975) లోప భూయిష్టమయినది. బోర్డులో రైతు ప్రతినిధులకు సహేతుకమయిన ప్రాతినిధ్యము లేకపోగా, వర్తకులకు, సిగరెట్టు ప్రాసెసింగుదారులకు అనుచితమయిన ప్రాధాన్యత ఈయబడినది. ఈ చట్టము రైతు రక్షణకు పరిశ్రమాభివృద్ధికి తోడ్పడదు.

కేంద్ర ప్రభుత్వము రూపొందించిన ఈ చట్టములోని మూలభాగముల తెలుగు అనువాదమును రైతుల కొరకు యథాతథముగా ప్రకటిస్తున్నాము.

— సంపాదకుడు.

ఛాప్టరు 2 పొగాకు బోర్డు

(1) ప్రభుత్వ గజెట్టు ప్రకటనద్వారా కేంద్ర ప్రభుత్వము ఒక నిర్ణీత తేదీనుండి ఈ సందర్భములో నిర్ణాయకము చేయునట్లుగా, పొగాకు బోర్డు అని పేరుగల బోర్డు ఈ చట్టము కొరకు ఏర్పాటు చేయబడుతుంది.

(2) పైన నామకరణము చేయబడిన విధముగా బోర్డు ఒక సంస్థగా రూపొంది, క్రమ వారసత్వము, ఒకే సీలు కలిగి స్థిర, చరాస్థులను క్రయము చేసి, అనుభవించి, విక్రయించుటకు, ఒప్పందములు చేసుకొనుటకు, న్యాయస్థానములకు ఫిర్యాదులు చేయుటకు, వాటినుండి వచ్చు ఫిర్యాదులకు లోబడి ఉండుటకు తగిన అధికారములు కలిగి యుండును.

(3) ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో ఈ బోర్డు యొక్క ప్రధాన కార్యాలయములు నెలకొలబడును. ముందుగా కేంద్ర ప్రభుత్వము యొక్క అనుమతి పొంది బోర్డు దేశములోగాని, విదేశములలోగాని తమ శాఖలను. ప్రతినిధులను ఏర్పాటు చేసుకొన వచ్చును.

4. ఈ క్రింది సభ్యులతో బోర్డు ఏర్పాటు కాగలదు:

(ఎ) కేంద్ర ప్రభుత్వము నియామకము చేయు చైర్మన్.

(బి) పార్లమెంటు సభ్యులు ముగ్గురు - ఇద్దరు లోక్‌సభ నుండి, ఒకరు రాజ్యసభనుండి - ఎన్నిక గావాలి.

(సి) ఈ దిగువ వారిని ప్రాతినిధ్యము వహించగల ఏడుగురు సభ్యులను కేంద్ర ప్రభుత్వము నియమిస్తుంది:

(1) కేంద్ర ప్రభుత్వ వ్యవసాయశాఖ

(2) కేంద్ర ప్రభుత్వ వాణిజ్యశాఖ

(3) కేంద్ర ప్రభుత్వ ఆర్థికశాఖ

(4) కేంద్ర ప్రభుత్వ పారిశ్రామికాభివృద్ధిశాఖ.

(ఏ) కేంద్ర ప్రభుత్వమునకు చెందిన భారత వ్యవసాయ పరిశోధనా మండలి.

(బి) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము.

(సి) కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వము.

(డి) ఆంధ్ర, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వములుగాక, పొగాకు పండించు ఇతర రెండు రాష్ట్రములు ప్రభుత్వములనుండి కేంద్ర ప్రభుత్వము నియామకము చేయు ఇద్దరు ప్రతినిధులు. ఈ ఇరువురు నామావళి ములబట్టి మారుతూ ఉండగలరు.

(ఇ) పొగాకు విక్రయములోను, వ్యవసాయార్థ శాస్త్రములోను ప్రముఖులయిన ఎనిమిదిమంది ప్రతినిధులను మించకుండా పొగాకు రైతులు, వర్తకులు, పొగాకు, సిగరెట్లు, ఎగుమతిదారులు (పాకర్లతో సహా) తరపున కేంద్ర ప్రభుత్వము నియామకము చేయబడగలరు.

(ఎ) చైర్మను నిర్ణయించిన, అధికారమిచ్చిన కార్యక్రమములను జరుపగల అధికారములను నిర్వర్తించుటకు, బోర్డు సభ్యులు ఉపాధ్యక్షుని ఎన్నుకొనగలరు.

(జి) సభ్యులయొక్క పదవీకాలము, ఖాళీలను భర్తీచేయు విధానము, వారివారి నిధుల నిర్వహణ పద్ధతులు ప్రభుత్వ నిర్ణయ ప్రకారముండును.

(7) కేంద్ర ప్రభుత్వము నియమించిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టరుగాని, మరొకఅధికారిగాని, బోర్డు సమావేశములకు హాజరు కాగలరుగాని, ఓటుచేయుటకు అధికారముండదు.

బోర్డుయొక్క విధులు

8 (1) కేంద్రప్రభుత్వము యొక్క అజమాయిషి క్రింద, పొగాకు పరిశ్రమాభివృద్ధికి అనువయిన చర్యలద్వారా పొటుపడడమే పొగాకుబోర్డు యొక్క విధి.

(2) పైన సబ్-సెక్షన్ (1) లో పొందుపరచబడిన దానికి భిన్నము కాకుండా అక్కడ సూచించబడిన చర్యలు ఈ కింది ఆశయ సాధనకు తోడ్పడాలి :

(ఎ) దేశావసరములకు, విదేశాలకు ఎగుమతి చేయుటకు అవసరమయిన వర్జీనియా పొగాకు ఉత్పత్తి, పదును చేయుటను, క్రమబద్ధము చేయుట.

(బి) దేశములోను, విదేశాలలోను వర్జీనియా మార్కెట్లను పరిశీలిస్తూ, రైతులకు గిట్టుబాటు కాగల, సముచిత మయిన ధరలు అందునట్లు చేస్తూ, పొగాకు ధరలలో విపరీతమయిన తేడాలు రాకుండా చూడడము

(సి) భారతదేశములో ఉత్పత్తి అగుచున్న వర్జీనియా పొగాకు కు సిగరెట్లకు ఇప్పుడున్న మార్కెట్లను మెరుగుపరచి, స్థిరపరచడము, కొత్తమార్కెట్లను అభివృద్ధి చేయడము, ఇతర దేశాల అవసరాలను దృష్టిలోనుంచుకొని విక్రయ విధానాలను రూపొందించడము

(డి) ఎగుమతిదారులమధ్య అనుచితమయిన పోటీని నివారించుటకు వీలుగా, వర్జీనియా పొగాకుకు కనీస ఎగుమతి ధరలు నిర్ణయించుటకు కేంద్రప్రభుత్వం కు సిఫారసు చేయుట

(ఈ) ఉత్పత్తిదారుల, వర్తకుల, పారిశ్రామికదారుల, దేశముయొక్క శ్రేయస్సుకు అనుగుణముగా వర్జీనియా పొగాకు దేశములో వర్తకము, విదేశములకు ఎగుమతి సంబంధించిన వివిధాంశములను క్రమబద్ధము చేయడము

(యఫ్) రైతులకు, వర్తకులకు, ఎగుమతి దారులకు (పాకర్లతో సహా). పారిశ్రామికులకు (సిగరెట్లు తయారుచేయువారికి), వర్జీనియా పొగాకు పరిశ్రమతో సంబంధమున్న సర్వులకు ఉపయోగకరమయిన విజ్ఞానమునకు సమాచారము అందించుట

(జీ) రైతుల రక్షణకొరకు, అవసరమని తలంచినపుడు, సమయములో రైతుల నుండి వర్జీనియా పొగాకును కొనడము, తరువాత దేశములోగాని లేక ఇతర దేశములలోగాని తగిన సమయములో ఆ పొగాకును విక్రయించడము

(హెచ్) రైతుల స్థాయిలో పొగాకు గ్రేడింగ్‌ను అభివృద్ధి చేయడము

(ఐ) పొగాకు పరిశ్రమాభివృద్ధికి అవసరమయిన శాస్త్రీయ, సాంకేతిక, ఆర్థిక పరిశోధనలనుచేయించడము, తోడ్పడము, ప్రోత్సహించడము.

(జె) ముందుముందు సూచింపబడు అటువంటి ఇతర విషయములు

(3) సబ్ సెక్షన్ (1)లో పొందుపరచబడిన నిధులకు భిన్నము గాకుండా, సబ్ సెక్షన్ (2)లో పొందుపరచబడిన అంశముల నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చుచూ, సబ్ సెక్షన్ (1)లో చూపబడిన చర్యలు వర్జీనియా పొగాకుగాని ఇతర విధములయిన పొగాకుకుకూడా సబ్ సెక్షన్ (2)లోని (సి) నుండి (జి) క్లాజులలో నిర్దేశించబడిన అంశములన్నింటికిగాని, లేదా కొన్నింటికిగాని, వర్తించగలవు. దీనికొరకు వర్జీనియా పొగాకుకు ఉద్దేశించబడినవి ఇతర విధములయిన పొగాకుకు కూడా ఉద్దేశించబడునని తెలిసికొనగును.

(4) కేంద్రప్రభుత్వము చేయు నిబంధనలకు లోబడి, ఈ సెక్షన్ ప్రకారము బోర్డు తన విధులను నిర్వర్తించగలదు. పొగాకు పరిశ్రమతో సంబంధించిన (ఉత్పత్తితోసహా) కేంద్రప్రభుత్వ సంస్థలు, ప్రతినిధులు, అధికారులతో సన్నిహిత సంబంధము నెరపుతూ, ఇతర సంస్థలు చేయునది తిరిగి చేయకుండా, ప్రభుత్వ నిబంధనల ప్రకారం బోర్డు పనిచేస్తుంది.

★



వేలం విక్రయం ఆచరణయోగ్యంగా ఉండాలి గుంటూరునుండి బోర్డు కార్యాలయం మార్చరాదు

రచన : శ్రీ జాగర్లమూడి చంద్రమౌళి ఎం. యల్. ఎ.
ఛైర్మన్/ఇండియన్ టుబాకో డెవలెప్‌మెంట్ కౌన్సిల్.

బోర్డు కార్యాలయం గుంటూరులోనే శాశ్వతంగాఉండడం, అవసరమూ, న్యాయమూ, సబబూనని, పొగాకు వేలం విక్రయం పద్ధతిలోగల సాధక బాధకాలను, ఆచరణ దృష్టిలో పెట్టుకొని, రైతుల ప్రయోజనాలు కాపాడేవిధంగా మార్చవలయునని, టుబాకో డెవలప్‌మెంట్ కౌన్సిలు ఛైర్మన్ శ్రీ జాగర్లమూడి చంద్రమౌళిగారు కేంద్ర ప్రభుత్వ వాణిజ్య మంత్రికి 1978 మే 15 వ తేదీన వ్రాసిన లేఖ, సారాంశాన్ని పాఠకులు గమనించ ప్రార్థన.

— సంపాదకుడు

గుంటూరునుండి పొగాకు బోర్డు కార్యాలయాన్ని మార్చేందుకు 1975 బోర్డుకు యాక్టుకు అమెండ్‌మెంటు యాక్టు 1978 బిల్లు నంబరు 79 ప్రవేశపెట్టడం దురదృష్టకరం. ఈ అమెండ్‌మెంటులోనే పొగాకు వేలం విక్రయ విధానాన్ని అమలు పరచేందుకు కూడా బిల్లు ప్రవేశపెట్టారు. కట్టుదిట్టంగా, ఆచరణయోగ్యంగా వేలం విక్రయం చేపట్టగలిగితే సంతోషమే.

మొదట గుంటూరునుండి బోర్డు కార్యాలయాన్ని మార్చడంలోగల ఔచిత్యాన్ని చర్చించుకొందాము. ఇందుకు వాణిజ్య మంత్రిత్వశాఖ వారు చెప్పే కారణమేమంటే, గుంటూరునుండి పొగాకు పంపించే రాష్ట్ర రాజధానులకు, కొత్త ఢిల్లీకి సరియైన రైలు, విమాన సర్వీసులు లేవంటారు, ఇది పూర్తిగా అనుచిత విమర్శ. ఎందుకంటే, హైదరాబాదు. బెంగళూరు. మద్రాసులకు గుంటూరునుండే ఎక్స్‌ప్రెస్ రైళ్ళ వసతులున్నాయి. విమానమేకావాలనుకొంటే గుంటూరుకు 45 కిలో మీటర్ల దూరంలో గన్నవరం విమానాశ్రయమున్నది. అంతేకాదు. ఢిల్లీ 24 గంటలలో ప్రయాణం చేయగల తమిళనాడు, కె. కె. ఎక్స్‌ప్రెస్ రైళ్ళున్నాయి.

ఇక గుంటూరు అర్హతలా? అన్నీ అర్హతలే. గుంటూరులో బోర్డు కార్యాలయం ఎందుకుండాలో మొదట్లో 1975 యాక్టులోనే మంత్రిత్వశాఖ వారు పొందుపరచిన విషయాలనుండే వివరిస్తాను. దేశంలో ఉత్పత్తి కాబడే వర్జీనియాపొగాకులో 95 శాతం ఆంధ్రలోకాగా అందు గుంటూరు, దాని చుట్టూ 80 శాతం ఉత్పత్తి జరుగుతుంది.

వర్జీనియా పొగాకు దిగుమతి చేసుకొంటున్న ఇంగ్లండ్, రష్యా, జపాను, మరి అనేక యూరపియన్ దేశాలతో అనాదిగా గుంటూరుతో అనునిత్యం సంబంధాలున్నాయి. లక్షల టన్నులు పొగాకు నిలవచేయగల గిడ్డంగులున్నాయి. రీడయింగ్ ప్లాంటులు పెచ్చుగా, గుంటూరు చుట్టుకొనేవున్నాయి. అంతేకాదు పొగాకు విదేశాలకు ఎగుమతిచేయు ప్రధాన వాణిజ్య వర్గాలన్నీ గుంటూరులోనే వున్నాయి. సంవత్సరంలో సగంకాలం విదేశ కొనుగోలుదారుల ప్రతినిధులు గుంటూరులోనే వుంటారు. ఈ ప్రశంస లన్నింటిని చేసింది వాణిజ్య మంత్రిత్వశాఖవారే. మరి ఇంతలోనే గుంటూరుబోర్డు కార్యాలయానికి అర్హమైనది కాదనడంలోని నిగూఢ రహస్యమేమైయుంటుంది ?

పొగాకు మాత్రమేకాక, ప్రత్తి, మిర్చి, పసుపు, ధనియం మొదలయిన వాణిజ్యపంటల ఉత్పత్తికి, మార్కెటింగ్‌కు కూడా గుంటూరే ప్రధాన కేంద్రము.

ఆంధ్రప్రదేశ్‌లో విద్యా, విజ్ఞాన సంస్కృతి నిలయంగా గుంటూరు ప్రసిద్ధి చెందింది. నాగార్జున యూనివర్సిటీ కూడా వున్నది. వైద్యకళాశాల వున్నది. అంచు జిల్లాలో విజయవాడవద్ద ఇంజనీరింగు కళాశాలవున్నది. ఇలా గుంటూరు అభ్యుదయ లను వరుసగా ఎన్నయినా చెప్పుకోవచ్చు. అందువలన బోర్డు కార్యాలయాన్ని తరలించాలనే ఆలోచనను విరమించ వలసిందిగా గుంటూరు ప్రజలేకాక, ఆంధ్ర ప్రజలు, ఆంధ్రప్రభుత్వము కూడా కోరుతున్నది.

పొగాకు వేలం విక్రయం

పొగాకు వేలం విక్రయపద్ధతి అభివృద్ధి చెందిన అమెరికా, కెనడా, రోడేషియా, లాంటి దేశాలు బహుకాలంగా అమలుపరచుచూ జయప్రద మొనరించ బడి, ఉత్పత్తిదారుల ప్రయోజనాలను రక్షించబడడం జరిగింది. ఆ విధానం మనకుకూడా వర్తింప జేయుటకు కేంద్రప్రభుత్వము నిర్ణయించుకొనడాన్ని హృదయ పూర్వకంగా ఆహ్వానిస్తున్నాను.

అయితే ఇందుకు సంబంధించిన బోర్డుయాక్టు అమెండ్‌మెంట్‌లో రైతు హక్కుల రక్షణకు, కోర్కెల సాధనకు ఉపయుక్తంగాలేదు. ఆచరణ సాధ్యంగాని విధానాలు. వేలం విక్రయం ఆచరణలో పెట్టుటకు అనువయిన వసతులు కల్పించ బడలేదు. అందువలన ఆచరణలో జయప్రదం కావడానికి వీలులేదు.

ఇందుకు అనువయిన వాతావరణం కల్పించాలంటే ఇప్పుడనుసరించుచున్న ఉత్పత్తిదారుల కొకరకం, ఎగుమతి దారులకు మరొకరకంగా వుండే ద్వంద్వగ్రేడింగు విధానం రద్దుచేయాలి. ఇప్పుడు అమలులోగల ఎక్స్‌ర్టు గ్రేడులను రద్దుచేయాలి. ఉత్పత్తి స్థాయిలోగల ఎనిమిది గ్రేడులను క్రమబద్ధంచేసి. అదేగ్రేడులను ఎగుమతికి కూడా చట్టబద్ధం చేయాలి. అప్పుడే వేలం విక్రయం జయప్రదం కాగలదు.

బోర్డుచే రిజిష్టరు చేయబడిన కమ్యూనిటి గ్రేడింగు కేంద్రములను నెలకొల్పి రైతుస్థాయిలో ఎనిమిది ఫారమ్ గ్రేడులను కంపల్సరి చేయడం.

అలా ఫారమ్ గ్రేడు చేయబడిన ప్రతి బేలు 100 కిలోలు మాత్రమే ఆక్షను యార్డులో అనుమతింప బడాలి. ఈ ఫారమ్ గ్రేడులను క్వాలిటి కంట్రోలు అధారిటిచే సర్టిఫై చేయబడి గ్రేడింగు లేబుల్ ప్రతి బేలుకు యివ్వవలసి యున్నది.


అంతేకాదు భూమి కవులు, వ్యవసాయిం, ఎరువులు, తెగుళ్ల మందులు, మజూరి, యజమాని కుటుంబ సభ్యుల శ్రమ విలువ, మదింపువేసి న్యాయము, గిట్టుబాటు, లాభదాయకమయిన కనీస ధరలు నిర్ణయించవలసి యున్నది. ఈ నిర్ణయము అక్టోబరునాటికే జరగాలి.

వేలంలో అమ్మకంగాని బేళ్ళను ప్రభుత్వ సంస్థ ద్వారా కనీసధర హైతుకు అంచజేయాలి. వేలం విక్రయం ప్రారంభంతోపాటే ప్రభుత్వం నిర్ణయించిన కనీస ధరను చెల్లించి పొగాకును నిల్వచేయగలిగి గిడ్డంగుల సౌకర్యంతో సిద్ధముగా ఉండాలి.

పై యాపత్తు ఆచరణ యోగ్యమైన, ఆచరణ సాధ్యమైన తక్షణ చర్యలను అమలు చేయగలిగినప్పుడు మాత్రమే, పొగాకు ఉప్పత్తిదారుల ప్రయోజనాలను కాపాడగలవు.

ఈ పైవిషయాలలో ఎక్కడ ఏఒక్క లోపం జరిగినా. జరుగుతున్న సంపత్సరం ఓచరు పద్ధతి మాదిరిగానే పొగాకు ఉత్పత్తి దారులకు ఊహించ నంతటి అపార నష్టానికి దారితీయగలదు.

కాబట్టి ప్రభుత్వం పొగాకుబోర్డు యీపైవిషయా లన్నింటిని దృష్టియందుంచు ొని కట్టుదిట్టమైన ఆచరణ యోగ్యమైన, ఆచరణసాధ్యమైన పద్ధతులను ప్రవేశ పెట్టాలి.



బ్యారన్‌నుండి తీసిన ర్యాకులు

పండించు రైతుకొక ధర నిర్ణయించవమను

— బుర్రకథసామ్రాట్ శ్రీ నాజర్

రైతు రాజును మాట ఓరన్నా
వేతిబీరలొ నెయ్యి రైతన్నా

దుక్కులను పదును లొ
దుస్తావు అదునులో
నారునకు నాటుటకు
యమయాతనల బడి

పొగతోట బెంచెడి - ఓరన్నా
అగచాట్లు మిగిలెడి - రైతన్నా

పాదుమం దుంచావు
వ్యాధి మందేశావు
పొడిమందు జల్లావు
తడిమందు గొన్నావు

అబ్బో మందులతోనె - ఓరన్నా
అప్పు మోపాయనే - రైతన్నా

నీవు నీ పాలేరు
నీ తోటి కూలీలు
అగ్గిలో మాడారు
బొగ్గుల్లో పొర్లాడారు

లాభాలు ధనికులకు - ఓరన్నా
పొగదుంపలే మీకు - రైతన్నా

సరుకు మంచిని కోరి
బెరుకు ఆకుల నేరి
ధనికు లడిగిన ధరకు
ధారబోస్తుంటారు

బేరనారిన రోజె - ఓరన్నా
జేబులోరుట నిజం - రైతన్నా

సిసలైన సిగిరెట్లు
కసలైన పొగ ఆకు
పండించు జగమందు
పరువు గల దొరవందు

అంగటన్ని కలవు - రోరన్నా
అంగిట్లొ కనిగలదు - రైతన్నా

ఎక్కైనజు సెస్సులున్
ఎన్నెనొన్నొ పన్నులున్
పరదేశ మారకం

ప్రభువులకు దారకం

నలిగె నడి రైతులు - ఓరన్నా
బలిసె వ్యాపారులు - రైతన్నా

సాటి రైతూ ననగ
వాటేశు కొనబోక
వ్యాపారికే రోజు
లాభాలపై మోజు

ధనిక తత్వంలోన - ఓరన్నా
మానవత్వం సున్న - రైతన్నా

మనవద్ద కొనువారి
కున్న దొక ధర యని
పండించు రైతు కొక
ధర నిర్ణయించమని

నిలదీసి యడగరా - ఓరన్నా
కలిసి పోరాడరా - రైతన్నా

పొగాకు రైతుల సమస్యలు

— యస్. విజయకుమార్

భారత దేశంలోని పొగాకు పరిశ్రమ విదేశమారక ద్రవ్య సముపార్జనలో అగ్రతాంబూలం పొందిన పరిశ్రమలలో ఒకటి. ప్రపంచ పొగాకు పరిశ్రమలో ప్రథమస్థానం అమెరికాదైతే, ద్వితీయస్థానం చైనాది, తృతీయస్థానం భారత దేశానిది. ఈ పరిశ్రమ నారుపోసే దానినుంచి మరల పొగరూపం దాల్చి బూడిదయ్యేంత వరకు అనేక కోట్ల ప్రజలను లాలించి, బుజ్జగించి మరులుగొల్పి, మైమరపించి, ఏడిపించి జేబులు నింపే భ్రాంతి కల్పించి, వ్యయించి, చిద్విలాసంతో చిందులు త్రొక్కే సజీవ పరిశ్రమ. ఇంతటి శ్రమను కోరే పరిశ్రమ మరొకటి ఉన్నదని ఊహించలేం.

భారత దేశంలో కూడా ఈ పరిశ్రమకు అగ్రస్థానం ఆంధ్రదేశానిదే. దేశీయ ఉత్పత్తులలో నూటికి 80 వంతులు ఆంధ్రప్రదేశ్‌లోనే జరుగుతున్నది. అయితే ఆంధ్రప్రదేశ్‌లో వర్జీనియా పొగాకుకు ముడి వస్తువుగా ఒక్క సిగరెట్ పరిశ్రమ కూడా నెలకొల్పబడలేదు. అది మన అభద్రతకు నిదర్శనమే గాక అసమర్థతకు ముఖ్యం.

ఒక దేశంలో ఉత్పత్తి అయ్యే ముడి వస్తువులు ఆ దేశ సౌభాగ్యానికి పునాది రాళ్ళు. ఆ ముడి వస్తువులకు రూపకల్పన చేసి వినిమయదారులకు అందించడం ఆ దేశ పారిశ్రామికుల శ్రద్ధకు ఒక చక్కని సదవకాశం. రైతులు, కూలీలు, వ్యాపారస్థులు, పారిశ్రామికులు సంయుక్తంగా చేసే కృషిలో ప్రధానంగా ఈ వ్యవసాయికోత్పత్తి విజయం ఆధారపడి ఉంటుంది. దేశీయ అవసరాలకు మించిన అదనపు ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేయడంలో, అందులోను దేశదేశాల పోటీని గమనిస్తూ, విదేశమారక ద్రవ్యాన్ని సంపాదించడంలో, ప్రభుత్వం తీసుకునే శ్రద్ధపై జాతీయ సంపద పెంచడంలో దానికున్న ఆసక్తి వ్యక్తమౌతుంది. లక్షలాది రైతులకు, కూలీలకు, వేలకొలది వ్యాపారులకు అహర్నిశలూ పనికల్పించే ఈ పరిశ్రమపట్ల భారత పారిశ్రామికులు కూడా చూపిన నిర్లక్ష్యత, మారి భావ దాస్యంతో కూడిన స్వార్థ ప్రయోజనాలు క్షంతవ్యాలు కాదు.

భారత దేశంలో టర్జీనియాకు అర్ధ శతాబ్దం చరిత్ర ఉంది. అది ఎక్సైజ్ చేతులలోబడి దాదాపు 25 సంవత్సరాలౌతున్నది. ఈనాడు ఎక్సైజు సుంకం ద్వారా భారత ప్రభుత్వానికి వచ్చే ఆదాయం 500 కోట్ల రూపాయలకు పైగా ఉంది. విదేశీ మారక ద్రవ్యంలో దాదాపు 120 కోట్ల రూపాయల మేరకు అది సంపాదించి పెడుతున్నది. ఈ పంట పండించే ప్రాంతాలలో రోడ్డు రవాణా సౌకర్యాలు నేటికీ అస్తవ్యస్తంగా ఉన్నవి. పొగాకు రైతుల మధ్య చెరకు, జనుము పండించే రైతులమధ్య విచక్షణ చూపడమా? చెరకు పండించే ప్రాంతాలలో ఫ్యాక్టరీయే రోడ్డు రవాణాకు సంబంధించిన అభివృద్ధికి వాటాలు ఇస్తుంటే, పొగాకు పండించే ప్రాంతాలలో రోడ్ల పరిస్థితి మరీ దుర్భరంగా ఉన్నది ఏమైపోతున్నది ఎక్సైజు ఆదాయమంతా? ఏ పద్దు క్రింద అది ఖర్చు పెడుతున్నారు? ప్రజల ఈ ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పుకోవాలి.

చెరకు పండించే రైతులకు ఆయా ఫ్యాక్టరీల లాభాల ద్వారా గృహనిర్మాణ సౌకర్యాలు కల్పించకపోయినా రోడ్డు రవాణా సౌకర్యాలు కల్పించి, బోనసులు ఎంతోకొంత శాతం చెల్లించడం ఉంది. ఇక ఆ ఫ్యాక్టరీలలో పనిచేసే కార్మికులకు ఉద్యోగస్థులకు ఎన్ని చక్కెర నగర్లు నిర్మాణమైనాయో మనకు తెలుసు. అలాగే పారిశ్రామిక కేంద్రాలు తీసుకోండి. ముఖ్యంగా సింధియాకాని, సింగరేణి బొగ్గు గనులు కానీ, సిర్‌పూర్ కాగితం పరిశ్రమ కానీ, హెచ్. యమ్ టి. కానీ ఇలాంటి పరిశ్రమలలో పనిచేసే కార్మికులకు, ఉద్యోగులకు గృహవసతి సౌకర్యాలను ఆయా పరిశ్రమలు కలిగించాయి. కానీ మన పొగాకు పరిశ్రమ శ్రామికులందరినీ, రైతుల్ని, కూలీలను దోచుకునే పరిశ్రమగా రూపొందినది.

ఈ పరిశ్రమలో తలదూర్చిన ప్రతి ఒక్కరూ ఒక స్థిర చిత్తంలేని దురాశకు గురి అవుతున్నారు. రంగుల రాట్నంలో తిరుగుతూ నిజమైన గుర్రాలమీద ప్రయాణం చేస్తున్నామని భ్రమ పడుతున్నారు. బ్రతుకంతా లాటరీకి అప్పగించి బావురుమంటున్నారు. ఈ పరిశ్రమతో నిజమైన ప్రయోజకులు పెట్టుబడిదారులు. వారు కూడా విదేశీ పెట్టుబడిదారులు కావడం, వారి చేతులలో నూటికి 80 వంతుల పరిశ్రమ ఇరుక్కోవడం మరో దౌర్భాగ్యం.

రైతుల వద్దనే పొగాకు మిగిలిపోతుంది. ఒక్కొక్క సందర్భంలో వర్తకుల వద్దనే పొగాకు మిగిలిపోతుంది. ఇంతకంటే దుస్థితి ఇంకేముంటుంది?

ఎర్రటి ఎండలో ఎరువులు తోలాలి. గుండెలు పగిలేట్లు నాగలితో దుక్కి పగలకొట్టాలి. ఇరువాలు నాగలి పట్టాలి ఇది తొలకరి వానతో జరిగే ప్రారంభక్రుషి. ఇక మలకరి వర్షాలతో ఒకవైపున నారుమళ్ళు. మరోవైపున గొర్రుతో ఇరవాలు. ఇక్కడ పసిబిడ్డగా నారు పెంచాలి. ఒక ప్రక్క కలుపు రాకుండా జాగ్రత్తపడాలి. దుక్కి చెక్కు కట్టకుండా, పెడ్డ లేవకుండా గొర్రుతోలి గుంటక తోలి నిలువు అడమే కాకుండా, మూలసాళ్ళు నడిపి పాటుచేయడానికి ఘనీభవించిన గడ్డను వెన్నలాగా మెత్తబరచడానికి బండెడు చాకిరీతో, పుట్టెడు ఆవేశంతో ఆరుగాలం కొరకు ఎదురు చూస్తూ ఏ రైత్తైనా పాటుపడాలి. తాను పెంచినా, మరొకరు పెంచినా, లెక్కించి మరీ మొక్కలు తెచ్చి, అచ్చుదోలి తీర్చిదిద్దినట్లు నాటాలి. ఈ విధంగా రైతు అత్యంత ప్రయాసతో సేద్యం చేస్తాడు.

ఇక అప్పటినుంచీ పైరగాలితో పందెమేస్తూ పెరిగే పొగమొక్క కుదిటిలో మల్లె పుట్టిందా? చిటపట చినుకులతో మడ్డి కారిందా? పురుగు నాకిందా? ఇవి రైతు పర్యవేక్షణలు. అదిలో పోయిందా? పారాడ్తైనా పడిమొక్క పెడతాడు. మధ్యతో పోయిందా? ఇక గోవిందా!

ఒక వైపున ఇలా తోటపెంచుకుంటూనే బేరన్ పొయ్యి సరిజేస్తాడు. గొట్టాలు దులిపి బిగిస్తాడు. తలుపులు, కిటికీలు అమరుస్తాడు. అప్పో సప్పో బొగ్గు తోలుకొస్తాడు. కాల్చుకు ఇరుపుకు మనుషుల్ని అమర్చుకొంటాడు. కర్రలు, పురికొస, పరదాలు, పట్టలు, బ్యాటరీలు, పెట్రోమాక్సులు, పందిళ్ళు, రాక్సులు నిముషం తీరుబడి లేకుండా హంగు హంగామాలన్నీ సమకూర్చుకొంటాడు.

తొలి ఇరుపు తొలి బేరన్ తొలి కాల్పులోనే ఆ ఏటి అదృష్టమో, దురదృష్టమో తేలిపోతుంది. ఒకే చేను ఒకే ఇరుపు, ఒకేరోజు, ఒకే చేతికాల్పు ఒకే రంగు రాదు. బంగారు వన్నె రావచ్చు. బొబ్బె చేతికి ఇవ్వవచ్చు. అన్ని రంగులు దిగ

వచ్చు. కానీ ఏ రంగూ నిలవక పోవచ్చు. కనుక కచ్చా పచ్చా గ్రేడింగ్ చేసి, హవాపుడిగా కంపెనీకి తోలితే అక్కడ ధరలు వేసేది దొరలు. మనం వారి దృష్టిలో నోరూ వాయీలేని మరలం. చెక్కు బ్రద్దలుగొట్టి ఎడా పెడా పీకి, ఎగాదిగా చూచి, ఒడ్డు పొడుగు ఓరగా తిలకించి రేటు వేయడంలో రాటుదేలిన ఆ చేతుల గిట్టతో మన అగచాట్లో, అలవాట్లో ప్రారంభమౌతాయి.

ఎన్నెకరాలు వేశావు? ఎంత పైరు పండింది? అని ఎక్సైజులో ఒక భాగం కన్నువేసే ఉంచుతుంది. అంచనాకు తగ్గితే పొనుకు 7 రూపాయలు పెనాల్టీ వేయడానికి కాచుకొనే ఉంటుంది. ఒక కంపెనీకి చెక్కు ఎత్తి అక్కడ ధర రాకపోతే, మరో కంపెనీకి పోవాలంటే, మరలా తిరగగడితేగాని వీలులేదు. ఎక్సైజు వారి అనుమతి పొందితెనేగాని అక్కడనుంచి చెక్కు కదలదు. ఎక్సైజు వారికి ఎక్సైజు చెల్లించకపోతే వారు అందుబాటులో వుండరు. వారి కోపానికి గురి కాకుండా, బయ్యర్ల శాపానికి బలి కాకుండా, తూకాల మోసాలకు ఆహుతి కాకుండా ఇక్కడ బస్‌స్టాండ్ వద్దనో, సినిమాహాలు వద్దనో ఓచర్లు పోగొట్టుకోవడం, జేబులు ఖాళీ చేయించుకోవడం జరుగుతూనే ఉంటుంది.

ఎక్సైజు ఆఫీసులో డబ్బులు వసూలుచేసే టికెట్లు పది, రిజిష్ట్రారు ఆఫీసులో ఓ అరడజను, తాలూకా ఆఫీసులో తలా రెండు, కో-ఆపరేటివ్ బ్యాంకులో రెండోమూడో, వెటర్నరీ హాస్పిటల్‌లో ఒకటి, పోలీసు ఉద్యోగి పది, జడిపంతులు బ్రతిమాలితే ఒకటి, ఒకటో - రెండో మునసబుకు, కరణానికి, నాలుగైదు రెవిన్యూ ఇన్‌స్పెక్టరుకు టికెట్ల క్రింద దక్షిణలు చెల్లించాలి. ఎవరీ పద్ధతిని ప్రోత్సహించేవి? రాష్ట్ర ప్రభుత్వం.

సరుకు రైతుది. దానిని కంపెనీలో ఖరీదు చేసినట్లు ధర తూకం వేసి ఓచరు మాత్రం చేతికి ఇచ్చి వారంరోజుల తదుపరి రమ్మని చెప్పి సాగనంపుతుంది కంపెనీ. ఆరోజు కొన్న సరకు లెక్కతో బ్యాంకు వద్దకుపోయి ఓపెన్ లోన్ తెచ్చి ఓవరు డ్రాపు పుట్టించి, లెటర్ ఆఫ్ క్రెడిట్‌ను సంపాదించి రూపాయి కట్టలమీద యాక్టివ్‌గా తిరుగుతారు బ్రోకర్లు, వారందరూ పరిశ్రమదారుల ఆర్థర్స్‌మీద ఆధారపడవలసిన వారే. ఎగుమతి ఆర్డర్లు రాకపోతే, ఎత్తిన సరుకుకు డబ్బు అందకపోతే అడ్రసు దొరకకుండా హైదరాబాద్‌లోనైనా, మద్రాసులోనైనా కూర్చుంటే, కాళ్ళరిగేటట్లు కంపెనీల చుట్టూ తిరగవలసిన కర్మ కష్టజీవులకు కర్షకులకు నూసట్రావాతగా పరిణమించింది.

కంపెనీలో డబ్బు రాలేదు - బొగ్గయిపోయింది-కర్రయిపోయింది-పచ్చి ఆకు కూళ్ళు ఇవ్వలేదు - గ్రేడింగ్ బట్వాడా ఈయలేదు - అమ్మాయికి పెళ్ళి దగ్గరకు

వస్తున్నది - అబ్బాయి హాస్టలునుంచి ఉత్తరం రాశాడు - భార్యకు సుస్తిగా ఉంది- ఎద్దు అర్రు వాసింది - బండి పోలు విరిగింది- మబ్బులు పట్టాయి- ఈ వాన పడితే ముదురు తోటలు నాశనమే - లేదోటలు తేరుకుంటాయి. తూకం రావడంలేదు. తోట పెరగలేదు. పాడుగాలి తోలుతున్నది. ఆకు మెత్త బడటం లేదు. పెరగాలికి దమ్మెక్కు పోతున్నది. మండె తిరగేయక పెండె తొక్కటానికి వీలులేదు. ఐదు రూపాయ లిచ్చినా కూలీలు దొరకడం లేదు. కంపెనీకి ఎప్పుడు వెళ్ళినా గుంటూరునుంచి పైకం రాలేదంటున్నారు. పేటలో తిరిగే రోజులు పోయాయి. ఊళ్ళో ఉండే గతిలేదు. కూలీలు ఎగబడుకున్నారు. ఒక వందిచ్చినా పరువు దక్కు తుంది. ఇవి రైతు చెప్పుకునే మాటలు.

షిప్‌మెంట్ అయింది. చెక్కుకోసం ఎదురు చూస్తున్నాం. డైరెక్టరు మాద్రాసు వెళ్ళాడు. నిన్ననే దొరలు దిగారు. క్యాషియర్ సెలవు పెట్టాడు. చెక్కొచ్చింది, కాని అందరికీ కొంచెం కొంచెం ఇస్తాం. నువ్వుకూడా మమ్మల్ని బాధ పెడితే ఎట్లా? మీ పైకం ఎక్కడికిపోదు. కాకపోతే నాలుగు రోజులు అటోఇటో- ఎదొచ్చి మే మివ్వక తప్పదు. మీరు తీసుకోక తప్పదు. ఇప్పుడు మాటలెందుకు మాకు హైగ్రేడులే కావాలి. లో గ్రేడు తప్ప మేం కొనలేం. రష్యా ఆర్డరువస్తేనే మీకు, మాకు - ఇదీ వర్తకులనుంచి వినపడే పదజాలం.

దీనినిబట్టి మనం గ్రహించవచ్చు. ఈ పొగాకు వర్తకం ఎంత సున్నిత మైనదీ, ఎంత మందిని లాలించి పాలించి బుజ్జగిస్తుంటే, ఎన్ని రకాల మోసాలు అడుగడుగునా జరుగుతుంటాయో, ఎందరు అసమర్థులుగా అడుగడుగునా బుజు వవుతుంటారో, ఎందరు డాబుసరిగా దౌడు తీస్తుంటారో, ఎందరు బోర్డు తిప్పి ఐ. పి. లు పెడుతుంటారో, ఎందరు గుండెలు పగిలి చస్తుంటారో, ఎందరు దివాలా తీస్తారో, ఎందరు దోపిడీ డబ్బుతో దొరలుగా మారుతుంటారో, ఎందరు రోజు కూలీ కొరకు రొప్పుకుంటూ రోజుకుంటూ బారులు తీర్చి నిలబడుతుంటారో, ఎందరు నిద్రాహారాలు లేకుండా నెలల తరబడి నరాలు తెంచుకుంటారో నేనెరుగుదును.

అదొక ఆకర్షణ. అందుకు లోబడాలి. అదొక మోసం, అందుకు గురికావాలి. అదొక అంశం. అందుకు కట్టుబడాలి. అది చేదుకంటే చేదు. విషంకంటే విషం. అయినా భరిస్తాం. అది ఆకలి దప్పులను తీర్చదు. అయినా కొంటాం. అది మద్యం కామ మత్తు నివ్వదు. అయితే అయ్యింది. స్పష్టిస్తాం. కాల్చి బూడిద చేస్తాం. అది ఒక పరిశ్రమే. దానికే మన శ్రమ. పొలాలలో పచ్చ పచ్చగా పెరిగి బంగారు రంగు పండి, పొంగుగా మార్కెట్ చేరి, బాకన్ డ్రైసోయి అపురూపాలు పొందకుండా అమరత్వం పొందడానికి రీడ్రై అయి, ఎయిర్ కండి

షన్‌లో కాపురంచేసి, ఫ్యాక్టరీకి ప్రయాణం చేసి, లారీలు ఎక్కి-దిగి, గైకు పట్టుపంచాపోయి, బ్రండ్ అయి, ఫ్లేవరులో మునిగి, సిగరెట్ రూపం ధరించి విలువ పుంజుకుని గ్లామర్‌ను ప్రదర్శించి, గ్రామాలను, నగరాలను దర్శించి, దరిద్రుల్ని, ధనికుల్ని పలుకరించి-వెక్కిరించి, తన చక్కదనాలకు తానే మురిసి అనంతవాయువుల్లో సగర్వంగా మిళితమవుతున్నది—పొగాకు.

పొగాకును భారతదేశంలో, అందులోను ఆంధ్రపాంతంలో ముందుగా ప్రచారంలోనికి తెచ్చినది ఇండియన్ లీఫ్ టొబాకో కంపెనీ అనడంలో సందేహం లేదు. వారు విత్తనాలు సరఫరా చేశారు. నారుమళ్ళు పెంచడాన్ని నేర్పారు. బేరన్లు కట్టడాన్ని చూపించారు. తోటలు పేయవలసిన తీరును ప్రదర్శించారు. గొట్టాలు పొయ్యి నిర్మాణాలకు సంబంధించిన పరిశ్రమను ప్రోత్సహించారు. బాండ్లు యిచ్చి ముందుగా పెట్టుబడులు పెట్టి తప్పనిసరిగా పొగాకు కొనుగోలు చేశారు. కాలగమనంలో రైతులు నేర్పరులయ్యారు బి. ఐ. టి., నేషనల్ కంపెనీలు మార్కెట్‌లో వెలిశాయి. పొగాకు కొనుగోలు తీరులోను మార్పులు వచ్చాయి. ఇతర సహాయంతో నిమిత్తం లేకుండా రైతులు తమ కాళ్ళపై తాము నిలబడే స్థోమతను సంపాదించారు. స్థానికులు, వర్తకులు కూడా ఈ పొగాకు కొనుగోలు అమ్మకాలలో ప్రవేశించారు. క్రమంగా రైతులు ఉత్పత్తిదారులుగాను, వర్తకులుగాను, ఎగుమతిదారులుగాను రూపొందారు. గుంటూరు కృష్ణా, గోదావరి, ఒంగోలు, నెల్లూరు జిల్లాలకు ఈ పరిశ్రమ విస్తృతమైంది. గుంటూరులో వున్న కంపెనీలు అనేక కేంద్రాలలో కొనుగోలు చేయడానికి ఉపక్రమించాయి. పోటీ పెరిగింది. ఈ పెరుగుదలతోపాటే ఎక్సైజు డిపార్టుమెంటుకూడా పెరిగింది.


మొదటి రోజులలో పొగాకు ఎగుమతి అయి ఇంగ్లాండ్ మార్కెట్‌లో ప్రపంచదేశాలవారు కొనుగోలు చేసేవారు. అయితే స్వాతంత్ర్యానంతరం ప్రతి దేశం దాని అవసరాలకు సరిపడ భారతదేశానికి వచ్చి తమకు ఇష్టమొచ్చినదానిని కొనుగోలు చేయడానికి పూనుకోవడంతో పొగాకు పరిశ్రమలో ద్వితీయదశ ప్రారంభమైనది. చిన్న చిన్న వ్యాపారస్తులుకూడా విదేశీ మార్కెట్టులో పొగాకు అమ్మకోవడానికి స్వేచ్ఛగా లావాదేవీలు ఏర్పరుచుకున్నారు. బ్యాంకులు ఇటువంటి వ్యాపారస్తులకు ఓవర్ డ్రాఫ్టు సౌకర్యాలను ఇవ్వడంతో వ్యాపార స్వభావమే మారిపోయింది. వందలాదిగా పొగాకు వర్తకులు లైసెన్సులు పొంది, ఎవరికి వారే గోదాములను కార్యాలయాలను నిర్మించుకొని, పోటీ వ్యాపారం నిర్వహించ బూనుకొన్నప్పుడు ఎగుమతుల నాణ్యత క్షీణించే దశ ఏర్పడింది. ఈ దశలో అగ్మార్క్ ఉద్యోగస్తులు ఏర్పడ్డారు. అగ్మార్క్ స్థాయిని అందుకోలేని పొగాకు ఎగుమతి హక్కును కోల్పోతుంది. కనుక ప్రతి ఒక్కరు అంచనాల

మేరకు గ్రేడుచేసి ఎగుమతి చేసుకొనగలగాలి. అయితే ప్రతి ఒక్కరు ఐ. ఎల్. టి. డి. వైపుకు దృష్టిని సారించి చూస్తుంటారు. అది మార్కెట్‌లో ముందుకు పచ్చి చెక్కు ఖరీదు చేసేంతవరకు ఎవరూ ధర చేయడంలో ధైర్యం చేయను. ఐ. ఎల్. టి. డి. పోకడలను బట్టి ముగతా కంపెనీలన్నీ ధరను వేయడానికి పూనుకొంటాయి.

ఇన్నేండ్ల అనుభవం తర్వాత మార్కెట్టులో పొగాకు ఏ ధరకు కొన వచ్చో నిర్ధారణ చేయలేకపోతున్న భారత వర్తక లోకానికి ఏ నాలుగు కనీస ధరల ప్రకారంగానైనా ఖరీదు చేయవచ్చునుకదా? కనీస ధరలను దృష్టిలో పెట్టుకొనే కదా ఐ. ఎల్ టి. డి. అయినా ధరను వేయడం. ఏటా లక్షలకొలదీ లాభాలు వచ్చిన కంపెనీలు కూడా కొనుగోలులో ముందుకు దూకలేక నీళ్ళు నములుతూ ఎవరికోసమో ఎదురు చూస్తున్న కారణమేమి? లాభాలలో రైతులకు బోనస్ ఇవ్వవలసిన బాధ్యతను రైతులనుంచే వర్తకులుగా మారిన వ్యక్తులు గుర్తించక పోతే కార్మిక - పారిశ్రామిక పెట్టుబడిదారులు ఎందుకు గుర్తిస్తారు. స్వజాతి స్వప్రయోజనాలను నిర్మూలించి విదేశ విజాతీయుల భోగలాలసత్వాలకు, హద్దు మీరిన సౌకర్యాలకు అమితంగా వ్యయం చేయడం న్యాయమా?

ఒక వైపున విదేశీయులను విరుచుకుపడుతూనే వారి గుత్త యాజమాన్యాన్ని ప్రోత్సహిస్తూనే. మరో వైపున ఆ విదేశీయుల దయాదాక్షిణ్యాలను సంపాదించి ఎగుమతులను పెంచుకునే ఆర్డర్లను పొందడానికి చేస్తున్న ఖర్చు ప్రశ్నార్థకంకాదా? దేశభక్తి, దేశాభ్యుదయం గూర్చి గొంతులు చించుకునే స్వదేశీ వర్తకులు కాసులకు గొట్టి గద్దలకు వేస్తూండడం గుర్తించారా?

పచ్చిఆకు బ్యారన్‌కు చేరవేయు దృశ్యం.



భారత పొగాకు పరిశ్రమ

— డి. బాపయ్య

పొగాకు ఉత్పత్తి, క్యూరింగ్, గ్రేడింగ్, ప్రాసెసింగ్, రీడ్రయింగ్, పాకింగ్ మొదలయిన బహుముఖములయిన కృషియిక్ అవసరం వున్నది. అందువలన ఈ రచయిత దీనిని బహుళ జనాలకు ఉపాది కలిగించగల ఒక పెద్ద పరిశ్రమగా అభివర్ణించుచూ సమగ్రమైన వివరాలు అంధించారు.

— సంపాదకుడు

భారతదేశం పొగాకు పండించటంలో అమెరికా, చైనాలతో సరిసమానంగా వుంది.

400వేల హెక్టార్ల భూమిలో పుగాకు పండించటం జరుగుతుంది. 350 మిలియన్ల కిలోగ్రాముల పుగాకు పంట ప్రతిసంవత్సరం దిగుబడి జరుగుతుంది. ప్రపంచపు పుగాకుపంటలో భారతదేశం 9 శాతం కలిగివున్నవి. దేశంలో రెండే వాణిజ్యపు

రకాల పుగాకు పంట పండించుచున్నారు. పుగాకు పంట పూర్తిగా ప్రకృతి పై ఆధారపడివుంది. పుగాకు పరిశ్రమలో వివిధ రకాలుగా వాడకం జరుగుతుంది. సిగరెట్లు, చుట్ట, బీడీ, హుక్కా, సిగార్ల తయారీలో వాడుతున్నారు. ముఖ్యంగ ఎగుమతి చేస్తున్న పుగాకు 'వర్జీనియా' 125 వేల హెక్టార్లభూమిలో పండిస్తున్నారు. పంట దిగుబడి 100 మిలియన్ల కిలోగ్రాముల ఉత్పత్తి జరుగుతున్నది. వర్జీనియా పుగాకు దక్షిణభారతంలో కోస్తా జిల్లాలలో విశేషంగా పండించుచున్నారు.

శాస్త్రీయ పద్ధతిపై పుగాకు వ్యవసాయం

ఎగుమతి వ్యాపారదృష్ట్యా భారతప్రభుత్వం దేశంలో మంచి నాణ్యతకు, పుగాకు ఉత్పత్తికి కృషి చేస్తున్నారు. ముఖ్యంగా కేంద్రీయ వ్యవసాయ సంస్థ అనేక కేంద్రాలలో శాస్త్రీయ పరిశోధన కేంద్రాలను స్థాపించి వివిధ రకాల పుగాకు పంటలను శాస్త్రీయ పద్ధతులపై పండిస్తున్నారు. వివిధ రాష్ట్రాలలో వ్యవసాయ శాఖవారు శాస్త్రీయ ఆధునిక పద్ధతిని పుగాకు యిరుపు, నిల్వచేయడం, ఎరువులు, సస్యరక్షణ రైతాంగానికి సలహాలు యిస్తున్నారు. ఒక హెక్టారు భూమిలో హెచ్చు దిగుబడిని వచ్చేలాగా ప్రయోగాత్మక కృషి చేస్తున్నారు.

వివిధ పరిశ్రమలలో పుగాకు వాడకం

దేశంలో ఉత్పత్తి అగుచున్న 80 శాతం పుగాకు వివిధ రకాల వాడుక పరిశ్రమలో వినియోగిస్తున్నారు. మిగతా 20 శాతం యితర దేశాలకు ఎగుమతి చేయడం జరుగుతుంది. దేశంలో పుగాకు పంట ఉత్పత్తిలో నాలుగవశాతం బీడీల పరిశ్రమలోను, 60 మిలియన్ల కిలోగ్రాముల పుగాకును సిగరెట్లు తయారీలోను వాడుచున్నారు.

అత్యాధునిక యంత్రాలలో సంవత్సరానికి 55 మిలియన్ల సిగరెట్లు తయారుచేస్తున్నారు. 55 మిలియన్ల కిలోగ్రాముల పొగాకు తమలపాకులో కలిపి తినుటకు ఉపయోగిస్తున్నారు. 15 మిలియన్ల కిలోగ్రాముల పొగాకు "సిగార్లు లేక చుట్టల పరిశ్రమలలో వాడకం చేస్తున్నారు. 30 మిలియన్ల కిలోగ్రాములు పొగాకు హుక్కాలో వాడకం జరుగుతుంది. 5 మిలియన్ల కిలోగ్రాముల పొగాకు "నశ్యం" తయారు జేయడంలో వాడుచున్నారు. ప్రతి ఏటా ఒక మిలియను కిలోగ్రాముల నాటు పొగాకును ఇతర దేశాలనుండి సిగరెట్టు పరిశ్రమలో మిశ్రమమునకు వాడుటకు దిగుమతి చేసుకుంటున్నాము. ఏది ఏమయినప్పటికి మన పొగాకు దిగుమతి తక్కువనే చెప్పాలి.

పొగాకు నాణ్యం

రైతు పండించిన పొగాకు వ్యాపారస్తులచే వివిధ రకాలలో ప్రపంచ దేశాలకు ఎగుమతి అనుగుణంగా నాణ్యత చేయబడుతుంది. దేశంలో 35 రీ డ్రయింగు కర్మాగారాలు కలవు. గంటకు లక్షకు పైగా కిలోగ్రాముల పొగాకును రీ డ్రయింగు చేయగల శక్తి స్థోమత గలవు. దిగుమతి ఎగుమతిచేసే పొగాకు వివిధ తూకాలలో నిల్వచేస్తారు. యీ పరిశ్రమలో లక్షలాది మహిళా కార్మికులు పనిచేయడం జరుగుతుంది. భారతదేశంలో తయారయ్యే పొగాకు ఎగుమతిగా మంచి నాణ్యతకు అనుగుణంగా వ్యవసాయ ఉత్పత్తిచట్టం సముద్రయానచట్టం నియమావళి ప్రకారం వివిధ రకాల పొగాకు "అగ్‌మార్క్" చేసి భరత ప్రభుత్వం తరుపున విదేశాలకు ఎగుమతి చేయబడుతుంది.

ఎగుమతులు

భారతదేశం ప్రపంచ దేశాలలో పొగాకు ఎగుమతిలో ఒకటిగా పేరుప్రఖ్యాతి గాంచింది. వర్జీనియా పొగాకు ఎగుమతిలో ప్రపంచంలో రెండవ దేశంగా పరిగణింపబడుతుంది.

భారత దేశంలో ముఖ్యముగ పొగాకు ఎగుమతి కేంద్రం దక్షిణ భారత దేశంలో ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు పట్టణం. ఈ పట్టణం నాల్గులక్షల జనాభా కలిగియున్న ముఖ్య పారిశ్రామిక పట్టణం. పట్టణం మధ్యగ జాతీయ రహదారి నెం. 5 వెళ్ళుచున్నది. చానికి ఇరువైపుల పొగాకు ఎగుమతి వ్యాపారస్తుల, ఆఫీసులు, రిడ్రయింగు, కర్మాగారాలు చూడముచ్చటగ వుంటాయి. ప్రపంచ దేశాలనుండి వ్యాపారస్థులు పొగాకు ఖరీదు చేయుటకు గుంటూరు పట్టణంలో ఫిబ్రవరినుండి ఆగస్టువరకు గుంటూరు పట్టణంలో యుండి 'నాణ్యత గల పొగాకును ఖరీదుచేస్తారు. గత రెండు దశాబ్దాలలో భారతదేశం గణనీయమైన పొగాకు ఎగుమతి వ్యాపారం చేసింది. ముఖ్యంగ 1980లో ప్రప్రథమముగ తూర్పుయూరప్ దేశాలకు పొగాకు ఎగుమతి చేయడం జరిగింది. పొగాకు వ్యాపార చరిత్రలో ఇది ఒక పర్వదినం. ముఖ్యముగ 'ఇంగ్లండు' యెక్కువ పొగాకు కొనుగోలు చేస్తుంది. యూరప్ దేశాలలోనే కాకుండా "ఆఫ్రికా, ఏషియా, జపాన్" దేశాలకు కూడ ఎగుమతి చేస్తుంది. కొంది సంవత్సరాలుగా పై దేశాలతో యెక్కువ వ్యాపారం జరుగుతుంది.

ఎగుమతి వ్యాపార సంస్థ

భారత ప్రభుత్వం పొగాకు ఎగుమతి వ్యాపారదృష్ట్యా ఎగుమతి వ్యాపార

సంస్థను జనవరి 1956 సంవత్సరంలో నెలకొల్పింది. ఈ సంస్థలో పొగాకు పండించు రైతులు, ఎగుమతి వ్యాపారస్తులు, సిగరెట్లు తయారుచేయు పరిశ్రమదారులు సభ్యత్వం కలిగియున్నారు. ఈ సంస్థ ప్రపంచ దేశాలలో సంబంధాలను విస్తరింప చేస్తుంది.

రైతాంగము కృషి

నిరంతరముగ పరిశ్రమించి రైతాంగము అధికోత్సాహంతో హెచ్చు పొగాకు పంటను పండించుచున్నారు. రోజురోజుకు వ్యవసాయపు ఖర్చులు పెరిగిపోవు చున్నవి. ముఖ్యముగ వ్యవసాయ కూలివేతనాలు, రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక ఔషధాలు, బ్యారర్లకు కావలసిన రేకులు, బొగ్గుఖరలు, మరింతగ పెరగడంవల్ల పొగాకు పంట ఉత్పత్తి ఖర్చులు అధికమైనాయి. రైతాంగము శ్రమించి మంచి గిట్టుబాటు ధరవస్తుందని అహర్నిశము శ్రద్ధతో కృషి సల్పు చున్నారు. కాని క్వింటాలు సగటు ధర రు. 4.0 కూడా లభించలేదు. ఈ పరిశ్రమలో 70వేల వ్యవసాయ రైతాంగము, మూడులక్షల వ్యవసాయకూలీలు. రెండు లక్షల వివిధ పరిశ్రమలో కార్మికులు పనిచేయుచున్నారు.

పొగాకు రైతుకు రక్షణ

విదేశమారకద్రవ్యం ఏటా కోట్ల రూపాయలు భారత ప్రభుత్వానికి ఆదాయం చేకూర్చుతున్న పొగాకు రైతుకు రక్షణ యేమాత్రం లేదనే చెప్పాలి. పొగాకు పండించే రైతులకు యెక్కువ వరపతి సౌకర్యాలుకలిగించాలి. ఆపత్కాల తక్కువి ఋణాలు యివ్వాలి. పొగాకు పండించు రైతాంగానికి ఎరువులు, సస్యరక్షణ మందులు అప్పుగా యివ్వాలి. మంచిబొగ్గు సింగరేణి కంపెనీవారిచే డిపోలను గుంటూరులో ప్రారంభించి రైతాంగమునకు సప్లయి చేయాలి. పంటవిడుదల కాలంలో రైతాంగం అప్పులను తీర్చేవిధముగ ప్రభుత్వము చట్టం రూపొందించాలి.

గిట్టుబాటు ధరలు

వ్యవసాయోత్పత్తులను త్వరితరం చేయడానికి వీలుగా వ్యవసాయ ఉత్పత్తుల ధరలను స్థిరీకరించే విధానాన్ని ప్రభుత్వం అవలంభించాలి. ప్రతిసంవత్సరం ఉత్పత్తి వ్యయాన్నిబట్టి తగినంతముందుగ పొగాకు ధరల స్థిరీకరణ జరగాలి.

భరలను గురించి సలహాయిచ్చే నిమిత్తం ప్రభుత్వము వెంటనే వ్యవసాయశాస్త్రజ్ఞుల సాంకేతిక నిపుణుల ఉత్సాహిదారులతో కూడిన కమిటీని నియామించాలి. ఇవి యేర్పాటు అయినప్పుడే రైతాంగానికి మేలు కలుగుతుందని అశిద్దాము.

ఇతర దేశాలతో వాణిజ్య సంబంధాలు

ప్రతియేటా పొగాకు నిల్వలు పేరుకు పోకుండా పురోగామి దేశాలతో వాణిజ్య సంబంధాలను ముఖ్యంగా అమెరికా రష్యా 'బ్రిటను' తూర్పుజర్మనీలతో దీర్ఘకాలపు వాణిజ్య ఒడంబడికను చేసుకోవాలి. భారత దేశంనుండి పొగాకు ఎగుమతులను మరింత అధికం చేయాలి.

స్టేట్ ట్రేడింగు కార్పొరేషన్

పొగాకు నిల్వలు అధికంగా వున్నప్పుడు స్టేటు ట్రేడింగు కార్పొరేషను వెంటనే కొనుగోలుచేసి వ్యాపారస్తులను రైతాంగానికి మేలు చేయాలి. పొగాకు వ్యాపార కొనుగోలులో స్టేటు ట్రేడింగు కార్పొరేషను మరింత శ్రద్ధ చూపి గణనీయమైన కృషి సల్పాలి. వివిధ పురోగామి దేశాలలో వ్యాపార సంబంధ బాంధవ్యాలు నెలకొల్పాలి. గుంటూరు పట్టణంలో వారి కార్యాలయం వెంటనే ప్రారంభించాలి. ప్రభుత్వం వెంటనే పొగాకు నిల్వలకు శీతల గిడ్డంగుల నిర్మాణం చేపట్టాలి.

కోస్తా జిల్లాలలో ఓడరేవుల అభివృద్ధి

పొగాకు ఎగుమతిచ్యష్ట్యా కోస్తాప్రాంతంలోవున్న ముఖ్యమైన రేవు ప్రాంతాలయిన, కాకినాడ, బందరు, ఓడరేవుల అభివృద్ధి చేపట్టాలి. కనీసం చతుర్థ ప్రణాళికకాలంలో ఈ రేవుల అవసరాలను గుర్తించి అభివృద్ధికి పెద్దపీట్టున కృషి జరగాలి. దీనికి రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి ఒత్తిడిదెచ్చి చతుర్థ ప్రణాళిక కాలంలో కొంత ధనమును కేటాయించేలాగా ప్రయత్నం జరగాలి.

రహదారుల అభివృద్ధి


పొగాకు పండించే ప్రాంతాలలో రహదారు ఆధ్వాన్నంగా వున్నవి. వాటిని

మెంటనే అభివృద్ధిపరచి రహదార్లను రైతాంగానికి వీలుగా నిర్మించాలి. వాగులు, వంకల వంతెనల నిర్మాణం జరగాలి.

సిగరెట్లు తయారీ కార్మాగారాలు

నూటికి 90 వంతులు పొగాకు పండించే ఆంధ్రప్రదేశ్‌లో సిగరెట్లు తయారీ పరిశ్రమను భారీఎత్తున ప్రభుత్వ రంగంలో స్థాపించాలి

1971 - గుంటూరునూన్యాస సోజన్యంతో



ఇటుకలు, సిమెంటుతో నిర్మించిన పక్కా బ్యారన్

ప్రస్తుత మార్కెటు పరిస్థితులలో
పొగాకు రైతులకు సహకార సంఘములే శరణ్యం

రచన : శ్రీ కోమటినేని గోవిందరాజులు

రైతుల పొగాకు అమ్ముకొనుటకు, వాణిజ్యవర్గాల, గుత్త వ్యాపారస్తుల ఇనప సంకెళ్ళలో పడినలిగి, ఆర్థికంగా చితికిపోతున్న పొగాకు రైతాంగం సహకార ప్రాతిపదికపై సంఘాలను రిజిష్టరు చేసుకొని, గ్రేడింగు, ప్రాసెసింగ్ ఆగ్‌మార్క్‌నుండి మార్కెటింగ్‌వరకు అట్టి సహకార సంస్థల ద్వారా ఉపయోగం పొందవచ్చునంటారీ రచనలో, ఒకమారు పరిశీలించండి

సంపాదకుడు.

మన పొగాకు రైతులు గుత్త సిగరెట్టు కంపెనీల పిడికిళ్ళలోవున్నారు. మన ఎగుమతిదారులు, వర్తకులుకూడా విదేశి దిగుమతి దారుల దయాదాక్షిణ్యాలపై

ఆధారపడిఉన్నారు. పంపించేవారికి, ఎగుమతిదారులకు నోరులేకుండా పోతున్నది. దిగుమతిదారుల, సిగరెట్టు కంపెనీల కనుసన్నలలో మన పొగాకు పరిశ్రమ ఊగిసలాడుతున్నది. పరిశ్రమనుండివస్తున్న ఆదాయంతో తృప్తి చెందడంతప్ప, కేంద్ర ప్రభుత్వానికి పరిశ్రమపై ఉండవలసిన కంట్రోలు లేకపోవడం విచారకరం, "మాకు సంబంధంలేదు, అంతా కేంద్రప్రభుత్వమే, మేము చేయగలిగినది ఏమున్నది" అంటూ ఆంధ్రప్రభుత్వం పొగాకు రైతులను, పరిశ్రమను నిర్లక్ష్యం చేస్తున్నది.

రైతుల పొగాకు-ప్రస్తుత స్థితి

రైతుల స్థాయికో నిర్బంధ గ్రేడింగ్ విధానం రావాలి. రైతుల గ్రేడులకు (Farm grades) చట్టరీత్యా కనీసధరలు నిర్ణయించబడి అమలు జరగాలి. రైతులగ్రేడు క్వాలిటీ ముఠలు, లేబుళ్ళు గ్రామాలలో అందాలి. వేలముద్వారా చక్కగా గ్రేడుచేయబడిన పొగాకును రైతులు వికయించుకొనుటకు వసతు లుండాలి. ఎగుమతి గ్రేడులు రద్దుకావాలి. ద్వంద్వ గ్రేడింగ్ విధానం అవశ్యం గావాలి. ఇది అత్యంత ప్రధానమయిన మూలసంస్కరణలు. ఈ సంస్కరణలు ప్రవేశపెట్టుటకు ప్రస్తుత పొగాకుబోర్డు చట్టముచాలదు. ఈ సంస్కరణలు తీసుకొనిరావడానికి రాష్ట్ర ప్రభుత్వానికి శ్రద్ధలేదు; కేంద్రప్రభుత్వం పట్టించు కొనడంలేదు. పంట తక్కువపండినా, ఎక్కువపండినా రైతుకు నష్టము తప్పడం లేదు. రైతుకు గిట్టుబాటుధరలురావు. వేసినచేట్లకు రూపా సొమ్ముచేతికిరాదు. ఇదీపరిస్థితి.

పొగాకు బోర్డువారి శుష్కనినాదాలు

ఈ దారుణ స్థితిలో రైతు గతి ఏమిటి? "మేము యస్. టి. సి, (STC)ని రైతుల దగ్గరనుండి నేరుగా పొగాకు కొనమన్నాం. కాని యస్, టి. సి. వారు తమకు సాధ్యం కాదంటున్నారు. రైతుల దగ్గర కొనుగోలు చేయడానికి బోర్డు సిద్ధముగా ఉన్నా, కేంద్రప్రభుత్వం అంగీకరించడం లేదు. మేము నిస్సహాయులం" అని బోర్డులో కొందరు ఉపన్యాసాలు చేస్తున్నాడు. బోర్డు, యస్. టి. సి. రెండూ కేంద్ర ప్రభుత్వం ఆధీనములో ఉన్నవి. కాని బోర్డునుగాని, యస్. టి. సి. కి గాని, మరే యితర ప్రభుత్వ సంస్థకుగాని ప్రస్తుత పరిస్థితులలో రైతులనుండి వేరుగా పొగాకు కొనుగోలు చేయటం సాధ్యంకాదు. ప్రయివేటు వర్తకులవలె ప్రభుత్వ ఉద్యోగులకు స్వేచ్ఛ ఉండదు. ఒక వేళ ప్రభుత్వ ఉద్యోగికి స్వేచ్ఛ యిస్తే అది సద్వినియోగం కాగలగడం అనుమానం. ఆరుదు. ఆస్వేచ్ఛను తన


స్వార్థం కొరకు చుట్టినియోగ పరచుటకు హెచ్చు అవకాశాలుంటవి. అందుచేత ప్రభుత్వ ఉద్యోగికి సంపూర్ణసేచ్ఛ ఉండడం వాంఛనీయము కాదు. సత్ప్రవర్తన శీలము, నిజాయితీగల ప్రభుత్వ ఉద్యోగికి సేచ్ఛ నీయగును, పొగాకు కొనుగోళ్లలో ప్రయివేటు కంపెనీలే చాల తికమక పడుతుంటాయి. ప్రయివేటు కంపెనీల కొనుగోలుదారులే లంచగొండులగుమన్నారని వినబడుతుంటుంది. ఇటువంటి అవకాశం దొరికితే ప్రభుత్వ ఉద్యోగికి పట్టపగ్గాలుంటాయా?

ప్రభుత్వ ద్రవ్యము - యస్. టి. సి.

ప్రభుత్వ డబ్బు ప్రజల సొమ్ము. జాగ్రత్తగా, వృధాగాకుండా ప్రభుత్వ ధనమును వినియోగించుట ప్రతి ప్రభుత్వోద్యోగియొక్క ధర్మము. ఈ ధర్మ నిర్వహణలో ప్రలోభాలకు లొంగకుండా నిజాయితితో ఉద్యోగులు పాటుబడవలసి యున్నది. పొగాకు కొనుగోళ్లలో ఇంకా ఎక్కువ జాగ్రత్తగా ఉండాలి. పొగాకు కొనుగోళ్ళలో తప్పుడు పనులు (mal practices) జరుగకుండా, ఉద్యోగులకు అపరిమిత స్వేచ్ఛ(Un limited discrection)ఈయకుండా, ఇతరవిధములయిన లోపాలు, ప్రమాదాలు సంభవించకుండా సక్రమ విధానం (fool-proof mechanism) ప్రవేశపెట్టినప్పుడు రైతులనుండియస్.టి.సి. గాని, ఇతరప్రభుత్వ సంస్థలుగాని నేరుగా పొగాకు కొనవచ్చునని యస్.టి.సి. గుంటూరు బ్రాంచిమేనేజరు శ్రీ పాపులూరి శ్రీమన్నారాయణ, హైద్రాబాద్ నుండి వెలువడుచున్న దక్కన్ క్రానికల్ 25-4-1978 వ తేదీ సంచికలో ప్రచురిత మయిన లేఖ గమనించ దగినది. కేంద్ర ప్రభుత్వమునకు, పార్లమెంటుకు జవాబుదారీ అయిన యస్. టి. సి. ప్రభుత్వ సొమ్ము దుబారా గాకుండా, లంచగొండి తనము ప్రబలకుండా, అసమర్థత అవినీతికి తావులేకుండా ఉండాలనే సదాలోచనతో, బాధ్యతలను గమనించియే, ప్రస్తుత సంక్షోభ పరిస్థితులలో రైతులనుండి నేరుగా పొగాకు కొనుగోలు జేయడం అవాంఛనీయమని, తమ అశక్తతను వెలిబుచ్చడం సహేతుకము.

ఒంగోలు సహకారసంస్థ

పొగాకు విక్రయంలో ఒంగోలు సహకార సంఘం రైతాంగమునకు ఆదర్శ మ్కషిచేసినది. 1964 లో యస్. టి.సి. ద్వారా వేయి టన్నుల పొగాకును సోవియట్ రష్యాకు జయప్రదముగా ఎగుమతి చేసిన ఒంగోలు సహకారసంస్థ అభినందనీయము పొగాకు రైతాంగమునకు ఒంగోలు సహకారసంస్థ గర్వకారణము, మార్గదర్శక మయినది. ఈ సంస్థ యావదాంధ్ర రైతాంగమునకే మకుటాయమానమైనది. ఈ సంస్థ మూలపురుషులు స్వర్గీయ శ్రీ కాళిదాసు శంకరయ్య సారధులు శ్రీ చిరుపోతు



కర్రలతో కట్టిన పొగాకు బ్యారన్

కోటయ్య, శ్రీ తాడిపర్తి చక్రారెడ్డి ప్రభృతులు ఓంగోలు సీమ రైతాంగమునకు అమృత సేవలు జేయుచున్నారు. సహకార సంస్థల నాయకత్వము ఎట్లుండ వలసినది ఈ కార్యకర్తలు చూపించినారు. అటువంటి ప్రజాసేవకులు, రైతు పెద్దలు వెలిగించిన సహకార జ్యోతిని ఆరనీయకుండా, సహకారోద్యమమునకు నిలుమూలలా విస్తరింపజేసి. బలీయమొనర్చ వలసిన అవసర మెంతైనా ఉన్నది. చీమలు పెట్టిన పుట్టలు పాములకు ఇరువు కాకుండా, ప్రజాసేవకులు నిర్మించిన సహకార సంస్థలలో స్వార్థపర తుచ్ఛ శక్తులను జొరనీయకుండా. కాపాడుకుంటూ

జాగరూకులై ఉండి, పొగాకు రైతాంగం తమ సమస్యలను జయప్రదముగా పరిష్కరించుకొనగలను.

యస్. టి. సి - సహకార సంస్థలు

వర్తకులు సరి అయిన రేట్లు ఇవ్వనప్పుడు, రైతులస్థాయిలో పొగాకుకు చట్టరీత్యా కనీస ధరలు నిర్ణయించినప్పుడు, యస్. టి. సి. రైతులనుండి నేరుగా పొగాకు కొనలేనందున మార్గాంతరమేమిటి? రైతులు ఏమిచేయాల? ఇందుకు సమాధానము సహకార సంఘముల ద్వారా పొగాకు విక్రయించడమే. ప్రస్తుత పరిస్థితులలో సహకార సంఘములే రైతాంగమునకు శరణ్యమని యస్. టి. సి. అభిప్రాయపడి, ఒంగోలు సంస్థకు తోడు కొత్త సహకార సంఘములను ప్రోత్సహించింది. రైతులనుండి పొగాకును సహకార సంఘములు సేకరించి, గ్రేడు చేయించి, ఈనెతీయించి, పాకింగ్‌చేయించి, బేగ్‌మార్క్ చేయించిన యెడల ఆ పొగాకును విక్రయించు బాధ్యతలను స్వీకరించుటకు యస్. టి. సి. ముందుకు రావడం సంతోషదాయకం. రైతులకు ముందు అడ్వాన్సు చేయుటకు, సహకార సంఘములకు అవసరమయిన పెట్టుబడి ధనమును ఆంధ్రప్రదేశ్ స్టేట్ బ్రీడింగ్ కార్పొరేషన్ ద్వారా ఇచ్చుటకు యస్. టి. సి. ఏర్పాటు చేసినది. పొగాకు సమస్యల పట్ల ఆంధ్ర ప్రభుత్వమునకు శ్రద్ధ కల్పించి దూరదృష్టితో యస్. టి. సి, ఆంధ్రప్రదేశ్ యస్. టి సి. ని గూడా రంగంలో దించింది. ఈ క్రింది సహకార సంస్థద్వారా కేంద్ర, రాష్ట్ర యస్. టి సి. లు 2,000 టన్నులు (మూడుకోట్ల రూపాయల విలువగల) పొగాకును ఈ సీజను ప్రారంభంలోనే ఏర్పాటు చేసిన విషయం తెలిసినదే :

1. ఒంగోలు
2. పోతవరము
3. చిన్న వెంకన్నపాలెము
4. చౌదరిపాలెము
5. వింజమూరు
6. మారెళ్ళగుంటవారిపాలెం

ఇంకా కేంద్రప్రభుత్వ పద్ధులో ఈ క్రింది సహకార సంఘములనుండి కూడా యస్. టి. సి. పొగాకు కొనుగోలు చేయగలిగినది.

1. నిడమలూరు (ముసిఒడ్డు)

2: చిలకపాడు

3. కందుకూరు

4. కావలి

5. కంచికచెర్ల

6. పోలవరము

యస్. టి. సి. యిచ్చిన ప్రోత్సాహము, ఆర్థిక సహాయముద్వారా రైతు సహకార సంఘములు పొగాకు విక్రయ కార్యక్రమమును యీ సంవత్సరము జయప్రదముగా జరుపగలిగినది. రైతులలో నూతన చైతన్యము, ఐక్యత, తీసికొని వచ్చి సహకారోద్యమమును యస్. టి. సి. ఆంధ్రలో బలీయమొనర్చగలిగినది. వచ్చే సీజనులో యీ సహకార సంఘముల సంఖ్య పెరగడమేగాక, పొగాకు విక్రయములో వాటిపాత్ర యింకా ప్రాధాన్యత వహించగల సూచనలు కనబడు చున్నాయి.

రైతుల సిండికేట్లు

రైతులవద్ద నిలబడిపోయిన పొగాకుకు విక్రయ సదుపాయము కల్పించు ప్రధానోద్దేశ్యముతో గత ఏప్రియల్ మాసములో కేంద్ర ప్రభుత్వం 10,000 టన్నులు పొగాకును కొనగోలు చేయవలసినదిగా యస్. టి. సి. ని ఆదేశించింది. వర్తకులద్వారా కాకుండా, సహకార సంఘములద్వారాను, రైతు సిండికేట్లు (బృందము) ల ద్వారాను కొనుగోలు చేయాలని యస్. టి. సి. నిర్ణయించింది.

ఈ రైతుల సిండికేటులు అవకతవకగా నడచి, కొత్త రకం బ్రోకర్లను సృష్టించింది. సిండికేటులనబడు ఈ కొత్తరకం సంస్థలను పొగాకు వర్తకంలో తెచ్చిపెటి యస్. టి. సి. అయోమయ స్థితిని కల్పించింది. యస్. టి. సి యొక్క

ఈ నూతన ప్రయోగం పలన రైతులకు పెద్దగా ఫలితం దక్కలేదు. ఈ సిండికేటులలో కొందరు వర్తకులు అతి తెలివిగా దూరి, రైతుల పేరుతో కొంత ప్రయోజనమును పొందినారు. ఈ సిండికేటులు పెద్ద పొరపాటు అని ధృవపడినది. వీటి స్థానంలో చిన్నవి రకుటను యస్. టి. సి. ప్రోత్సహించిన, రైతులకు మరింతమేలు జరిగేది. పొగాకు రైతులకు, వర్తకులకు ప్రతినిధిసంస్థ, ప్రభుత్వ గుర్తింపుపొందిన సంస్థ అయిన ఇండియన్ టొబాకో అసోసియేషన్ (Indian Tobacco Association) గుంటూరు, వారితో సంపదించి, వారి సలహా ప్రకారము యస్. టి. సి. చిన్న వర్తకులద్వారా పొగాకు సేకరించిన ఎంతో ప్రయోజనకరముగా ఉండెడిది.

రైతులకు సహకార సంస్థలే శరణ్యం

రాష్ట్ర ప్రభుత్వముతో రిజిష్టరు కాబడిన రైతు సహకార సంఘములనే ప్రోత్సహించుట వాంఛనీయము. రాష్ట్ర ప్రభుత్వ సహకార సంఘాల రిజిష్ట్రీని శ్రద్ధతీసుకొని, సహకార సంఘములను పెంచి, యస్. టి. సి. అందిస్తున్న ప్రయోజనమును రైతులకు దక్కినట్లుగా చూడవలసి యున్నది. ప్రస్తుతమున్న పరిస్థితులలో పొగాకు రైతులకు సహకార సంఘములే శరణ్యము.

కేంద్రప్రభుత్వం తరపున జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (National Cooperative Development Corporation) ఆహార పదార్థములు, వ్యవసాయ పంటలు, ఇతర జీవితావసర సరుకుల ప్రాసెస్ చేయడం, నిలువచేయుటం, వినియోగ సౌకర్యాలు కల్పించడం మొదలగు కార్యక్రమములను చేపట్టి, ఉత్పత్తిదారుల ఆర్థికాభివృద్ధిని పెంపొందించుచున్నది. ఇందుకు అవసరమైన ఆర్థిక సహాయము కూడా చేయుచున్నది. అదే విధంగా పొగాకు విక్రయంలోకూడా ఈ సంస్థయొక్క సహాయమును రైతాంగం పొందుటకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృషి చేయాలి.

అమెరికాలో రైతు పోరాటేక పొగాకు మార్కెట్ విధానం

ప్రపంచంలో పొగాకు ఉత్పత్తి చేయుచున్న ప్రముఖ దేశాలలో చైనా తరువాత అమెరికా, భారతదేశాలు 2, 3 స్థానాలలో వున్నాయి. అమెరికా రైతులు తమ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు పొందడంలో విజయం సాధించగా భారత రైతాంగం విఫలమైంది. అమెరికాలో రైతుల ప్రయోజనాలను సాధించగల మార్కెట్, కాగా భారతదేశంలో వ్యాపారస్తుల ప్రయోజనాలు కాపాడే మార్కెట్ ఈ రెండు దేశాలమధ్యగల వ్యత్యాసమును ఈ రచన స్పష్టపరుస్తుంది.

(సంపాదకుడు)

వర్జీనియా పొగాకు పండించే దేశాలలో అమెరికా అతి పురాతనమైనది. పొగాకును పండించడంలో ప్రపంచం మొత్తంలోను చైనా తర్వాత అమెరికా ద్వితీయ స్థానాన్ని ఆక్రమిస్తోంది. అంతేకాదు, భారతదేశం మొత్తంలోను పండుతున్న వర్జీనియా పొగాకుకంటె అమెరికా ఏడురెట్లు అధికంగా పండిస్తోంది. అయితే అమెరికా పొగాకు రైతులు సయితం ఒకనాడు అనేక కష్టనష్టాలకు గురియినవారే. దాదాపు ఒక శతాబ్దానికిపైగా అమెరికా పొగాకు రైతులు అనేక ఇబ్బందులకు గురి అయ్యారు. పొగాకుధరలతో నిలకడలేని స్థితివల్ల పండేపంటకు, గిరాకీకి (డిమాండ్) పొంతనలేని మార్కెట్ విధానంవల్ల వారు అనేకఇబ్బందులకు గురికావలసి వచ్చింది. ఆనాటి అమెరికా పొగాకు రైతుల ఆర్థికస్థితి "వుంటే తినడం, లేకుంటే పస్తు పడుకోవడం"లా వుండేదని ఒక రచయిత వ్యాఖ్యానించారు. అయితే, అటువంటి

పైన్యస్థితి ఒక పొగాకు రైతులకే కాదు, అన్ని రకాల పంటలను పండించే రైతులకూ అనుభవైక వేద్యమే మొత్తం రైతాంగానికి ఆసాడు ఎదురైన ఇబ్బందులను తూపు మాపడానికి 1933 లో "అగ్రికల్చరల్ ఎడ్జెస్ట్‌మెంట్ యాక్ట్" అనే చట్టాన్ని అమెరికా ప్రభుత్వం రూపొందించింది. వ్యవసాయోత్పత్తుల ధరలు పడిపోకుండా చూడడం ద్వారా, రైతుల ఆర్థిక స్థితిగతులను మెరుగు పరచడం ఈ చట్టం ప్రధానోద్దేశం. రైతుల ప్రయోజనాలను మరింతగా పరిరక్షించేందుకు 1938 లో ఆ చట్టానికి తదనుగుణమైన సవరణలు చేశారు. ఆ తర్వాత 1949 లో "అగ్రికల్చరల్ యాక్టు" అనే చట్టాన్ని చేశారు. దానికి కూడా 1970లో తిరిగి సవరణలు చేశారు అలాగే 1978లో "అగ్రికల్చరల్ అండ్ కన్స్యూమర్ ప్రొటెక్షన్‌యాక్ట్"ను చేసి, దానికి కూడా సవరణలు చేశారు.

ఈపై చట్టాలతోపాటు 1933లో చేసిన "కమోడిటీ క్రెడిట్ కార్పొరేషన్ చార్టర్ యాక్ట్" కూడా చెప్పుకో దగినదే. ఈ చట్టంవల్ల అమెరికా వ్యవసాయ మంత్రిత్వ శాఖలో "కమోడిటీ క్రెడిట్ కార్పొరేషన్" అనే ఉన్నతస్థాయి సంస్థను ఏర్పాటుచేసే సదవకాశం లభించింది. ఈ చట్టాలన్నిటి ముఖ్యోద్దేశం ఏమంటే - పొగాకుతోసహా గుర్తించబడిన అన్ని రకాల పంటల ధరలలోను స్థిరత్వాన్ని సాధించడం, మద్దతు ధరల విధానాన్ని తు. చ. తప్పకుండా పాటించడం.

పొగాకుకు సంబంధించినంత వరకు ఎప్పటికప్పుడు అవసరమైన మార్పులు చట్టాలలో తీసుకురావడంద్వారా "ఉత్పత్తి-అమ్మకం" విషయాలలో హేతుబద్ధమైన సమన్వయాన్ని సాధించడం జరిగింది. ఈ సమన్వయాన్ని సాధించడానికి రూపొందించబడిన చట్టాలు ఇవి: (1) ది అగ్రికల్చరల్ ఎడ్జెస్ట్‌మెంట్ యాక్ట్ ఆఫ్ 1938 (అవసరమైనప్పుడు మార్పులు చేయబడినాయి). (2) ది టొబాకో స్టాక్స్ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్ (3) ది యునైటెడ్ స్టేట్స్ టొబాకో వేర్‌హౌసెస్ యాక్ట్ (4) ది టొబాకో ఇన్‌స్పెక్షన్ యాక్ట్.

"ది అగ్రికల్చరల్ ఎడ్జెస్ట్‌మెంట్ యాక్ట్" ప్రతిమూడేళ్ళ కొకసారి పొగాకు రైతులలో "రిఫరెండం" నిర్వహించే అధికారాన్ని ప్రభుత్వానికి దఖలు పరచింది రిఫరెండంలో మూడింటరెండు వంతులమంది రైతులు "భూవిస్తీర్ణం కేటాయింపు"కు (యాకరేజ్ ఎలాట్‌మెంట్) అనుకూలంగా ఓటు చేసినట్టయితే, ఆ విధానాన్ని అమలు చేయవలసి వుంటుంది. ఇందువల్ల మద్దతు ధరలమేరకు ఋణాలను (ప్రైస్ సపోర్ట్ లోన్స్) పొందే అవకాశం రైతులకు లభిస్తుంది. మద్దతుధరల విధానం రైతులకు ప్రోత్సాహకరంగా వుండడంతో, అమెరికా రైతులు నాణ్యతతో పాటు ఎకరా దిగుబడిని సయితం గణనీయంగా సాధించడం మొదలు పెట్టారు. తత్ఫలితంగా 1965 లో భూవిస్తీర్ణం కేటాయింపుకు ఫలసాయం పరిమితిని కూడా

కలపుతూ మార్పులు చేశారు. అందువల్ల ఇప్పుడు "భూవిస్తీర్ణ-ఫలసాయం"ల (యాక్రేజ్ అండ్ పౌండేజ్) ప్రాతిపదికపై కేటాయింపులు జరుగుతున్నాయి, అటువంటి కేటాయింపులను "మార్కెటింగ్ కోటాస్' అని పిలుస్తారు ఈ కోటాల పద్ధతి కింద ఏ రైతూ తనకు కేటాయించిన "కోటా" కంటె ఎక్కువ పొగాకును అమ్మకానికి పెట్టరాదు అయితే, కోటాలో పది శాతం కంటె మించని పరిమాణం వరకు అమ్మకానికి అనుమతిస్తారు. (పది శాతం కంటె ఎక్కువవుండే పరిమాణాన్ని నిషేధిస్తారు) అంతేకాక, కోటాను మించి ఎంత పరిమాణాన్ని ఒక రైతు అమ్మాడో, ఆ మేరకు తదుపరి సంవత్సరపు అతడి కోటాలో కోత విధిస్తారు.

తుల్యమాన సిద్ధాంతాల ప్రాతిపదికపై మద్దతు ధరల విధానాన్ని తు. చ. తప్పకుండా అమలు జరుపుతుండడంవల్ల, ప్రపంచంలోని అన్ని మార్కెట్లకంటె, అమెరికా మార్కెట్లలో పొగాకుకు మంచి ధర పలుకుతున్నది. అయితే, ఈ పరిణామం అమెరికా పొగాకును కొనుగోలు చేసే నిషేధ వాణిజ్య వర్గాలకు చాలా అసంతృప్తి కలిగించింది. తత్ఫలితంగా, మద్దతు ధర విధానంపట్ల వారు వ్యతిరేకతను ప్రదర్శించారు. నిజానికి, మద్దతు ధరను రద్దుచేయాలంటూ 1973 అమెరికన్ కాంగ్రెసులో ఒక బిలు కూడా ప్రవేశపెట్టబడింది. అయితే, అమెరికన్ కాంగ్రెసులోని "పొగాకు లాబీ' శక్తివంతమయిన పదవడంతో, చివరికి ఆ బిల్లు ఉపసంహరించుకోవలసి వచ్చింది.

గ్రేడింగ్ విధానం

నాణ్యమైన వర్జీనియా పొగాకు దిగుబడికి అనేక కారణాలు దోహదం చేస్తాయి. వాటిలో వ్యవసాయక - వాతావరణ పరిస్థితులు (ఆగ్రో - క్లైమాటిక్ కండిషన్స్), మొక్కలోని ఆకు స్థితిగతులు (లీఫ్ పొజిషన్ అన్ ది ప్లాంట్) ముఖ్యంగా చెప్పుకోదగినవి. అమెరికా అధికార గేడింగ్ విధానంలో ఈ రెండు కారణాలను ప్రధానంగా పరిగణనలోకి తీసుకుంటారు. పొగాకు ఉత్పత్తి అయ్యే ఆయా ప్రాంతాల వ్యవసాయక - వాతావరణ పరిస్థితుల ఆధారంగా వర్జీనియా పొగాకు నాల్గు రకాలుగా (టైప్‌లుగా) వర్గీకరించబడుతుంది ప్రతి రకమూ విడి విడిగా నిర్వహించబడడంతోపాటు, విడి విడిగా అమ్మకానికి పెట్టబడుతుంది. మొక్కనుంచి ఉత్పన్నమైన ఆకు పరిమాణం ప్రాతిపదికపై ఆయా రకాల ప్రమాణాలకు లోబడి గేడింగ్ చేస్తారు. (అందువల్ల దీనిని 'ప్లాంట్ పొజిషన్ గ్రేడింగ్' అని పిలవవచ్చు) మొక్క మొదలునుంచి చిగురు వరకు ఉత్పన్నమయే ఆకులను నాలుగు గ్రూపులుగా విభజిస్తారు. మొక్క మొదలు నుంచి ప్రారంభమయే

మొదటి క్వార్టర్‌లోని ఆకులను "లగ్స్" అని, రెండవ క్వార్టర్‌లోని ఆకులను "కట్టర్స్" అని, మూడవ క్వార్టరీలోని ఆకులను 'రాపర్స్" లేక 'లీఫ్" అని, నాల్గవ క్వార్టర్‌లోని ఆకులను 'టిప్స్' అని వివిధ గ్రూపులుగా విభజిస్తారు. ఆ తర్వాత ఈ నాలుగు గ్రూపులనుంచి తిరిగి వివిధ రకాలైన గ్రేడ్లను తయారు చేస్తారు. ఆకు రంగు, పరిమాణం, దెక్కచ్చు, మచ్చ, పరిపక్వతవంటి గుణగణాల ఆధారంగా గ్రేడింగ్ జరుగుతుంది. 1983లో అమెరికా వ్యవసాయ మంత్రిత్వశాఖ ఆమోదించిన గ్రేడింగ్ విధానం ప్రకారం వర్జీనియా పొగాకులో మొత్తం 45 గ్రేడ్లు వున్నాయి. అమెరికాలో జరుగుతున్న గ్రేడింగ్ విధానాన్ని శాస్త్ర బద్ధ మైనది'గా చెప్పవచ్చు. ఎందువల్లనంటే - పొగాకు పండే ఆయా ప్రాంతాల వ్యావసాయక - వాతావరణ పరిస్థితులు వివిధ క్వార్టర్లలో మొక్కనుంచి ఉత్పన్న మయే ఆకుల స్వరూప స్వభావాలలో నిశిత పరిశీలనవంటి సంక్లిష్ట పద్ధతులు అమెరికా అధికార గ్రేడింగ్ విధానంలో వుండడంవల్ల, దీనిని శాస్త్రబద్ధ మైన గ్రేడింగ్‌గా చెప్పవచ్చు.

అమెరికాలో అమలు జరుగుతున్న గ్రేడింగ్ విధానం పూర్తిగా రైతు హిత్రైక దృష్టి' కలిగినట్టిది గ్రేడింగ్ అమ్మకాల దశలోనే జరుగుతుంది. ఎగుమతి దశలో జరిగే రెండవ గ్రేడింగ్ అమెరికాలో లేదు. అవసర మైతే, ఆ తర్వాతనే ఎగుమతిదారులు తిరిగి గ్రేడింగ్ చేసుకుంటారు. నిజం చెప్పాలంటే ఈ విధానం భారతదేశం అనుసరిస్తున్న అధికార విధానానికి పూర్తిగా భిన్నమైనది. భారతదేశం అనుసరిస్తున్న విధానం ఎగుమతిదారుల ప్రయో జనాలను పరిరక్షించే దృక్పథం కలిగినట్టిది. కంపల్సరీ గ్రేడింగ్ అమెరికాలో రైతులదశలో వుండగా, భారతదేశంలో ఎగుమతి దారుల దశలో వున్నది. అలాగే కనిష్ట ఎగుమతి ధర విధానం భారత దేశంలోనే వున్నదిగాని, అమెరికాలో లేదు. అమెరికాలో ఎగుమతిదారులు, దిగుమతి దారులు పరస్పరం చర్చించుకుని ఉభయు లకు ఆమోదయోగ్యమైన "ఎగుమతి ధర'ను నిర్ణయించుకుంటారు. రైతాంగం దశలో కంపల్సరీ గ్రేడింగు విధానాన్ని అనుసరించడం, అయోగ్రేడ్లను కనిష్ఠ ధరలను అమలు జరపడం వంటి చర్యల ద్వారా అమెరికాలోని రైతు ప్రయోజ నాలు పరిరక్షింప బడుతున్నాయి.

అమెరికాలో రైతులు తమ పొలాలలోనే తమ పొగాకును గ్రేడింగ్ చేస్తారు. లేదా గ్రేడింగ్‌చేసే వాణిజ్య కేంద్రాలలో గ్రేడింగ్ చేయిస్తారు టొబాకో ఇన్‌స్పెక్షన్ యాక్ట్ ప్రకారం రైతులు తమ పొగాకును వేలానికి పెట్టబోయేముందు ఇన్‌స్పెక్షన్ చేయించుకోవలసి వుంటుంది. వేలంపాటలు జరిగే వేర్‌హౌస్‌ల వద్దకు రైతులు తీసుకువచ్చిన పొగాకును ఇన్‌స్పెక్ట్ చేయడానికి ప్రభుత్వం ఇన్‌స్పెక్టర్లను నియ

మిస్తుంది. ఆ ఇన్‌స్పెక్టర్లు రైతులు చేసిన గ్రేడింగ్‌ను పరిశీలించి, ఆమోదించిన తర్వాత దానిని వేలంపాటకు పెడతారు.

మార్కెటింగ్ విధానం

అమెరికాలో పొగాకు అమ్మకాలు, కొనుగోళ్ళు వేర్‌హౌసేలవద్ద వేలంపద్ధతిలో జరుగుతుండడం గమనించదగిన విషయం. ఈ కార్యకలాపాలు టొబాకో ఇన్‌స్పెక్షన్ యాక్ట్, టొబాకో వేర్‌హౌసెస్ యాక్ట్‌వంటి చట్టాలకు అనుగుణంగా జరుగుతూవుంటాయి. గ్రేడింగ్ చేసిన పొగాకును రైతు వేర్‌హౌసేలకు తీసుకువచ్చిన తర్వాత, దానిని బహిరంగ వేలంద్వారా నేరుగా కొనుగోలుదారుకు అమ్మడం జరుగుతుంది. అమెరికాలోని పన్నెండు రాష్ట్రాలలో 175 మార్కెట్లు వున్నాయి. ఈ 175 మార్కెట్లకింద 841 వేలం కేంద్రాలువుంటాయి. ఈ 841 కేంద్రాలలోను నాల్గులక్షల వ్యవసాయ కేంద్రాలలో పండిన పొగాకుపంట అమ్మకం జరుగుతుంది. వేలంలోపాల్గొనే వాటదారుడు స్థానికుడైనాకావచ్చు, లేదా విదేశీయుడైనాకావచ్చు.

గ్రేడింగ్‌చేసిన పొగాకును రైతు వేర్‌హౌస్‌కు చేర్చినతర్వాత, ముందు తూకంవేస్తారు. వేర్‌హౌస్‌వారు ఒక గుర్తింపు పత్రాన్నికూడా ఇస్తారు. ఆతర్వాత దానిని వేలం జరిగేస్థలంలో లాట్లుగా పేరుస్తారు. ఆ తర్వాత ప్రభుత్వ పొగాకు ఇన్‌స్పెక్టర్ ప్రతిలాటును పరిశీలించి, వేరహౌస్‌ఇచ్చిన పత్రంపై గ్రేడ్‌ల వివరాలను నమోదు చేస్తాడు. అప్పుడు ఆ సరుకును వేలానికిపెట్టి, అందరికంటె ఎక్కువపాడిన పాటదారునికి, దానిని అమ్ముతారు. ఏదైనా ఒక లాటుకు దాని గ్రేడ్ ప్రకారం మద్దతుధరకంటె ఎక్కువ రాకపోయినట్టయితే, దానిని స్టెబిలైజేషన్ కార్పొరేషన్‌కు పంపిస్తారు.

వేలంపాట పూర్తికాగానే, వేర్‌హౌస్‌వారు రైతుకురావలసిన డబ్బును (స్టెబిలైజేషన్ కార్పొరేషన్‌కు పంపిన సరుకుకుకూడా కలిపి) ఆరోజే చెల్లించేస్తారు.

స్టెబిలైజేషన్ కార్పొరేషన్ తనవద్ద పేరుకుపోయిన పొగాకు నిల్వాలను, రీడ్రైయింగ్‌కు పంపిస్తుంది. రీడ్రైయింగ్ చేసినతర్వాత, దాని తూకం వివరాల రిపోర్టును, వేర్‌హౌస్‌వారు పంపించిన బిల్లును, పరిశీలించిన తర్వాత స్టెబిలైజేషన్ కార్పొరేషన్ వేర్‌హౌస్‌వారికి చెక్‌నుఇస్తుంది. రీడ్రైచేయబడిన పొగాకును స్టోరేజ్ వేర్‌హౌసీకు పంపిస్తారు. అలా స్టోరేజ్ వేర్‌హౌసేలలో పేరుకుపోయిన పొగాకును స్టెబిలైజేషన్ కార్పొరేషన్ తాను నిర్ణయించిన ధరకు అమ్మివేస్తుంది. అయితే, ఆ ధరను కమోడిటీ క్రెడిట్ కార్పొరేషన్ ఆమోదించవలసివుంటుంది. స్టెబిలైజేషన్ కార్పొరేషన్ వద్ద ఇలా సంవత్సరాలకొద్దీ వర్జీనియా

పొగాకు పేరుకు పోవడం సహజమే. 1976 మార్చి 31వ నాటికి స్టెబిలైజేషన్ కార్పొరేషన్ వద్ద 29,88,11,000 పౌన్లు వర్జీనియా పొగాకు పేరుకుపోయింది. దాని విలువ దాదాపు 80,16,55,000 డాలర్లు (సుమారు 241 కోట్ల రూపాయలు).

వేలం పాటలను నిర్వహించే వేర్‌హౌస్‌లు ప్రైవేట్ వ్యాపారుల ఆధీనంలో వుంటాయి. పాటదారులు తమ చెల్లింపులను నేరుగా రైతులకు చెల్లించరు. పాటదారులు ముందు వేర్‌హౌసుకు చెల్లిస్తే, వారు తర్వాత రైతులకు చెల్లిస్తారు.

మద్దతు ధర విధానం

1933లో చేసినకమోడిటీ క్రెడిట్ కార్పొరేషన్ చార్టర్ యాక్ట్‌ప్రకారం కమోడిటీ క్రెడిట్ కార్పొరేషన్ ఏర్పాటు అయింది. ఇది అమెరికా వ్యవసాయ మంత్రిత్వశాఖ ప్రత్యక్ష పర్యవేక్షణ కింద వుంటుంది. ఇది ఒక్క పొగాకుకే కాదు, గుర్తించబడిన అన్నిరకాల పంటలకు మద్దతు ధరలను చెల్లించిడానికి ఆర్థిక సదుపాయం కల్పిస్తుంది. దీనికి ప్రభుత్వ ఖజానా నుంచే తిన్నగా నిధులు అందుతూ వుంటాయి. మద్దతు ధరల విధానం ప్రవేశ పెట్టబడిన గత నలభై ఏళ్ళనుంచి ఇంతవరకు, దానికి వ్యతిరేకత వ్యక్తం కాలేదు.

"పారిటీ ప్రిన్సిపుల్స్" ఆధారంగా పొగాకుకు మద్దతు ధరలను నిర్ణయిస్తారు "పారిటీ ప్రైస్" అంటే – సరఫరా – గిరాకీల తుల్యమాన పరిస్థితులను, రైతుల ఉత్పత్తి ఖర్చులను దృష్టిలో పెట్టుకొని ఈ పారిటీ ప్రైసెస్‌లను నిర్ణయిస్తారు. రైతుల ప్రయోజనాలను కాపాడటానికి "పారిటీ ప్రైసెస్"విధానం శాస్త్రీయమయినది.

"పారిటీ ఫార్ములా" ప్రాతిపదికపై ప్రతి సంవత్సరం అమెరికా వ్యవసాయ మంత్రిత్వశాఖ గ్రేడ్లవారీగా మద్దతు ధరలను నిర్ణయిస్తూ వుంటుంది. వర్జీనియా పొగాకు కొనుగోలు సీజన్‌కు ముందే ప్రతి సంవత్సరం ఆది ధరలను ప్రకటిస్తూ వుంటుంది.

ఆయా గ్రేడ్లకు ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకంటే ఎక్కువగా వేలం పాటలో రానప్పుడు మాత్రమే మద్దతుధరల విధానం అమలులోకివస్తుంది. వర్జీనియా పొగాకుకు మద్దతు ధరల విధానం మూడు అంచెలలో అమలు జరుగుతుంది. తొలి దశలో స్టెబిలైజేషన్ కార్పొరేషన్, కమోడిటీ క్రెడిట్ కార్పొరేషన్‌లకు అనుబంధంగా వుండే వుత్పత్తి దారుల అసోసియేషన్లు, ద్వితీయ దశలో వర్జీనియా పొగాకు

కోపరేటివ్ స్టెబిలైజేషన్ కార్పొరేషన్, తుదిదశలో కమోడిటీ క్రెడిట్ కార్పొరేషన్‌లు మద్దతుధరల విధానం అమలుకు అవసరమైన ఆర్థిక సదుపాయాలను కల్పిస్తాయి.

ఉత్పత్తి దశలో నిర్బంధ కంపల్సరీ గ్రేడింగ్ విధానం, మార్కెటింగ్, ధరల నిర్ణయంవంటి అనేక విషయాలను పరిశీలిస్తే అమెరికా పౌగాకు విధానం పైతు హితైక దృష్టిని కలిగినట్టిదిగా స్పష్టమవుతుంది. ఈ విధానం భారతదేశంలోలేదు. అంతేకాక, భారతదేశ పౌగాకు విధానం ఎగుమతిదారుల హితైక దృష్టిని కలిగి ఎగుమతి దశలో జరిగే కంపల్సరీ గ్రేడింగ్ విధానం, ఎగుమతి గ్రేడ్లకు కనిష్ఠ ధరలు పైతాంగం ప్రయోజనాలను పరిరక్షించేపికావు. అవి కేవలం ఎగుమతిదారుల, దిగుమతిదారుల ప్రయోజనాలను పరిరక్షించేవి మాత్రమే.

రచన: గోగినేని నాగేశ్వరరావు M B.A. MLA



నారుమళ్ళకు నీళ్ళుచల్లుతున్న దృశ్యం

అమెరికా, భారత దేశాలలోని వర్జీనియా పొగాకు రైతుల ఆర్థిక విశేషాలు

అమెరికాలోని వర్జీనియా పొగాకురైతు ఆర్థిక స్థితి	భారతదేశంలోని వర్జీనియా పొగాకురైతు ఆర్థిక స్థితి
(1) ఉత్పత్తి ధరలకు, ఆదాయానికి రక్షణ.	(1) ధరకుగాని ఆదాయానికిగాని రక్షణ లేదు.
(2) ఉత్పత్తి ధరకు ఉత్పత్తి వ్యయానికి అవినాభావసంబంధం.	(2) ధరకు, వ్యయానికి ఎటువంటి సంబంధం లేదు.
(3) ఉత్పత్తి వ్యయం పెరిగితే ఉత్పత్తి ధర పెరిగే విధానం	(3) ఉత్పత్తి ధరకు, వ్యయానికి సంబంధం వుండదు
(4) ఏ సీజనులోను ఉత్పత్తి వ్యయం కంటె తక్కువధరపొందే దుర్భరస్థితి లేదు.	(4) ఏ సీజనులో అయినాసరే కనీసం ఉత్పత్తి వ్యయాన్ని కూడా పొందలేని పరిస్థితులు అనేకం.
(5) రైతుల ఆర్థిక స్థితికి భద్రత. "పారిటీప్రైస్" విధానం అమలువల్ల ఉత్పత్తి వ్యయం ంటె ఎక్కువ ధర వస్తుందనే హామీవున్నది.	(5) రైతు ఆదాయానికి హామీ లేదు, రక్షణలేదు. వ్యాపారి దయా దాక్షిణ్యాలపై బ్రతుకు తెరువును వెళ్ళబుచ్చే దైన్యస్థితి.
(6) 1962 లో ఉత్పత్తి వ్యయంకంటె ఉత్పత్తి ధర 2.05 రెట్లు ఎక్కువగా వున్నది.	(6) ఉత్పత్తి వ్యయంకంటె ఉత్పత్తి ధర ఒక వంతు మాత్రమే ఎక్కువగావుంటుంది (అదీచాల అరుదుగా)
(7) మొత్తం రాబడికో మూడింట ఒక వంతు వరకు నికర లాభం లభించే అవకాశం.	(7) అన్ని రకాల వ్యవసాయోత్పత్తులకు నికర లాభం లభించడం అనేది "జన్మానికో శివరాత్రి" వంటిది.
(8) 1962 లో అత్యధిక ఎగుమతి ధర పౌనుకు 81 సెంట్లు (రు. 3-90) ధరకుగాని, ఆదాయానికిగాని రక్షణలేదు.	(8) 1962 లో అత్యల్ప ఎగుమతి ధర పౌనుకు 31 సెంట్లు (రు. 1-50) ఎగుమతి ధరలో అల్పత్వంవల్ల రైతు ఉత్పత్తి వ్యయాన్నే రాబట్టుకోలేడు.

★

బోర్డు ఓచర్‌వలన నష్టపడిన రైతులకు సిగరెట్టు కంపెనీలనుండి పరిహారం యిప్పించాలి

రచన : సర్దార్ గౌతు లచ్చన్న (యం. యల్. ఎ.)

రాష్ట్ర జనతా రెజిస్టేచర్ పార్టీ నాయకులు

1978 సీజనులో పొగాకు బోర్డు ప్రవేశపెట్టిన ఓచరు మూలకంగా, వర్తకులలో పోటీ సన్నగిల్లి, పొగాకును కాయ చౌకగా పారవేయవలసిన దుస్థితి పరిణమించింది. బోర్డు ఓచరు ఆసరాగా తీసుకొని సిగరెట్టు కంపెనీలు పెద్ద ఎగుమతిదారులు, పొగాకును తక్కువ ధరలకు కాజేసినారు. అయినా కంపెనీలవారి 1977-1978 కొనుగోలు లెక్కల రిజిస్టర్లను అనుభవము గలిగిన ఆడిటర్ల చేత పరిశీలింప జేసిన, కంపెనీల అక్రమ లాభాలు బయట పడగలవు. ఆ ప్రకారం కనీసము ఈ పెద్ద కంపెనీల చేతనయినా ఆయా రైతులకు ముదరా ఇప్పించవచ్చునని తెలిసినవారు అభిప్రాయ పడినారు. ఇది గమనించి, రైతు నాయకులు, రాష్ట్ర జనతా రెజిస్టేచరు పార్టీ నాయకులు అయిన సర్దార్ గౌతులచ్చన్నగారు గత జూన్ మాసములో ప్రధాని శ్రీ మొరార్జీ దేశాయికి, వాణిజ్యశాఖామంత్రి శ్రీ మోహన్ ధారియాకు, పొగాకు బోర్డు ఛెర్మనుకు పై వివరములతో కూడిన దీర్ఘ లేఖను వ్రాసూ, అన్యాయంకు గురిఅయిన రైతులకు ముదరా యిప్పించాలని కోరినారు. అట్లు చేయిడం సాధ్యంకాదని ప్రధాన మంత్రి శ్రీ లచ్చన్నకు ప్రత్యుత్తరం వ్రాశారు.

ఈ సందర్భములో సర్దార్ లచ్చన్న ప్రధాన మంత్రికి వ్రాసిన లేఖాంశముల తెలుగు అనువాదమును ప్రచురిస్తున్నాం.

— సంపాదకుడు.

పొగాకు రైతుల ఆర్థికాభివృద్ధికి దోహదపడాలని, వాటి ప్రయోజనాలను పరిరక్షించాలన్న ఉన్నతాశయాలతో, టొబాకోబోర్డు ఏర్పాటు చేయబడింది. ఆయితే, దురదృష్టవశాత్తూ, టొబాకోబోర్డు ప్రవేశపెట్టిన "ఓచర్ పద్ధతి" వల్ల మార్కెట్‌లో "పోటీతత్వం" (కాంపిటీషన్) నశించి, రైతుకు గిట్టుబాటైన ధరలు పలకకుండా పోయాయి. మార్కెట్‌లో కాంపిటీషన్‌లో లేకపోవడంవల్ల, రైతుల గ్రేడులకు చట్టబద్ధమైన కనీస ధరలు లేక పోవడంవల్ల, కనీస ధరలకు రైతునుంచి నేరుగా కొనుగోలుచేసే ప్రభుత్వసంస్థ ఏదీ లేకపోవడంవల్ల రైతులు తమ పొగాకును అయిన కాడికి అమ్ముకుని అప్పుల పాలవవలసి వచ్చింది. ఓచర్ పద్ధతిని ప్రవేశపెట్టడంవల్ల ఎటువంటి దుష్ఫలితాలు సంభవిస్తాయో ముందుగా ఊహించకుండానే టొబాకోబోర్డు దానిని ప్రవేశపెట్టింది. 1978 లో రైతుకు సరైన ధరలు రాకపోవడానికి టాప్ గ్రేడ్లకు చెందిన పొగాకులో అతి తక్కువశాతం దిగుబడి రావడమే కారణమని వ్యాపారులు చెబుతున్నారు. అయితే, వారి వాదనలో కొంతవరకు సబబున్నా, కనీస ఎగుమతి ధరలను పదినుంచి పదిహేనుశాతం మేరకు పెంచడంవల్ల వారు పెద్ద మొత్తాలలోనే అధికలాభాలు పొందారు. ఓచర్ పద్ధతి అమలువల్ల మార్కెట్‌లో ఏర్పడిన పరిస్థితులు గుత్త వ్యాపారుల ప్రయోజనాలకే ఉపకరించాయన్న విషయం త్రోసిపుచ్చలేనిది.

ఈ ఏడు అన్నిరకాల గ్రేడ్లకు కనీస ఎగుమతి ధరలు పదినుంచి పదిహేను శాతం పెరిగినప్పటికీ, గత సంవత్సరంకంటె ఈ సంవత్సరం (87 | 25 నుంచి ౨0 శాతం వరకు గల తక్కువ ధరలకు రైతులనుండి వ్యాపారస్తులు కొనుగోలు చేయగలిగారు. అలాగే క్రిందటి సంవత్సరంకంటె ఈ సంవత్సరపు వ్యవసాయ ఖర్చులు పదిహేనుశాతం అదనంగా పెరిగిన సమయంలో అతి చౌక ధరలకు పొగాకును అమ్ముకోవడంవల్ల ఈ సంవత్సరం రైతాంగం మొత్తం 30 కోట్ల రూపాయలను నష్టపోయింది. రైతుకు జరిగిన ఈ నష్టానికి పరిహారం చెల్లించే నాధుడెవరు? దీనికి పరిష్కారం ఏమిటి? అసలు ఈ దైన్య పరిస్థితులకు కారకులెవరు?

టొబాకోబోర్డే ఈ పరిస్థితులకు బాధ్యత తీసుకోవలసి వుంటుంది. చట్టబద్ధమైన కనీస ధరలను ఆయారైతు గ్రేడ్లకు ప్రకటించకుండా, కనీసధరలకు రైతునుంచి నేరుగా పొగాకు కొనుగోలుచేసే ప్రభుత్వ సంస్థను ఏర్పాటు చేయకుండా తొందరపాటుతో ఓచర్ పద్ధతిని ప్రవేశపెట్టి, గుత్త వ్యాపారులకు తోడ్పడే విధంగా మార్కెట్‌లో కాంపిటీషన్‌ను హరింపజేసిన టొబాకోబోర్డే నేటి రైతాంగం దైన్య స్థితికి బాధ్యత వహించవలసి వుంటుంది. మార్కెట్‌లో కాంపిటీషన్ లేకపోవడం

వల్ల పొగాకు కొనుగోలులో మాంద్యం ఏర్పడింది. ఈ తీవ్ర మాంద్యతను గుత్త వ్యాపారి ఆసరాగా తీసుకుని రైతును నిలువునా దోచివేశాడు.

అందువల్ల, రైతాంగానికి సంభవించిన ఈ విపరీత కష్టనష్టాలను పూడ్చ వలసిన నైతిక, ధార్మిక బాధ్యత టొబాకో బోర్డుపై ఎంతైనా వున్నది. రైతాంగం ఉద్ధరణ కోసమే తాను వున్నానని టొబాకో బోర్డు చెబుతున్నది నిజమయితే, ఆది ఈ క్రింది సూచనలను అమలు జరపాలి.

రెండు సూచనలు

1) పొగాకు ఎగుమతిదారులు, రైతులనుంచి కొనుగోలు రికార్డులను స్వాధీనం చేసుకొని, 1977లోను 1978లోను రైతులకు చెల్లించిన సగటు ధరలను లెక్క కట్టాలి సగటు ధరలను ఎలా లెక్క గట్టాలంటే— 1v, 2v మొదలైన గ్రేడ్లతో నిమిత్తం లేకుండా, ప్రతి కంపెనీ 1977, 78 సంవత్సరాలలో ఎంత మొత్తం పొగాకును కొనుగోలు చేసిందో, ఆ మొత్తానికి వారు ఎంత ధనాన్ని చెల్లించారో తెలుసుకొని, ఆయా సంవత్సరాలకు ఆయా కంపెనీలు చెల్లించిన సగటు ధరలను తయారుచేయాలి. ఒకవేళ 1978లో ఆయా కంపెనీలు చెల్లించిన సగటు ధర 1977లో చెల్లించిన సగటు ధరకంటె తక్కువ వున్నట్టయితే, ఆవ్యత్యాసాన్ని ఆయా రైతులకు (వారు అమ్మిన పొగాకు మొత్తం ప్రకారం) ఇప్పించాలి.

పై సూచనకు ఉదాహరణ ఇది :

ఒక కంపెనీ 1977లో కిలోకు సగటున ఎనిమిది రూపాయలు చొప్పున, 1978లో కిలోకు సగటున ఆరు రూపాయలుచొప్పున రైతులకు చెల్లించిందనుకోండి తేవావున్న ఆ రెండురూపాయలను ఇప్పుడు ఆయా రైతులకు కంపెనీ చెల్లించవలసి వుంటుంది.

అయితే, సగటు ధరలలో వున్న తేడా మొత్తాన్ని కంపెనీలు చెల్లించాలని కోరడం అంత సబబైనది కాదు. ఎందువల్లనంటే, 1977, 78 సంవత్సరాలలో వ్యవసాయపు ఖర్చులలో తేడాలుండటంవల్ల, అలాగే టాప్‌గ్రేడుల దిగుబడి తృప్తికరంగా లేనందున, అంతరాలుండడంవల్ల ఆ రెండు సంవత్సరాల సగటు ధరలలో గల తేడామొత్తాన్ని కంపెనీలు చెల్లించాలని కోరడం అంత సబబుకాబోదు.

1978వ సంవత్సరపు పంటలో వచ్చిన టాప్‌గ్రేడ్ల శాతంకంటె 1977వ సంవత్సరంలో వచ్చిన టాప్‌గ్రేడ్ల శాతం అధికం. 1977లో టాప్‌గ్రేడ్ల సగటు

దిగుబడి నలభై శాతం వుండగా, 1978లో అది ఇరవై శాతం మాత్రమే వున్నది. అందువల్ల 1977, 78 సంవత్సరాలలోని సగటు ధరల వ్యత్యాసాన్ని, టాప్‌గ్రేడ్ల దిగుబడి శాతాలతో గుణించాలి. రెండుసంవత్సరాల సగటు ధరలలోని వ్యత్యాసం 2 రూపాయలు. (ఉదాహరణలో చెప్పిన లెక్క ప్రకారం) $2 \times \frac{20}{40} = 1$ అంటే కిలోకి రూపాయి తేడా అన్నమాట.

ఉదాహరణలో పేర్కొన్న కంపెనీ కిలోకు రూపాయిచొప్పున్న ఇపుడు రైతులకు అదనంగాచెల్లిస్తే, అ రైతాంగానికి చాలా వెసులుబాటు కలిగిస్తుంది.

ఉదాహరణలో పేర్కొన్న 20, 40 శాతాలు గుణకారం వాణిజ్య వర్గాలకు ఆమోదయోగ్యం కాకపోతే, 1977 78 సంవత్సరాలతో ఆయాకంపెనీల గ్రేకింగ్ లెక్కల ఆధారంతో రైతులు, వ్యాపారులు ఇరువురికీ ఆమోద యోగ్యమైన పద్ధతిని ఆచరించవచ్చు.

2) 1977, 78 సంవత్సరాలలో ఆయా కంపెనీలు రైతులకు చెల్లించిన సగటు ధరలను నిర్ణయించిన తర్వాత సగటు ధరలలోని వ్యత్యాసాన్ని పరిమిత వ్యవధిలో రైతులకు చెల్లించేటట్టు టొబాకోబోర్డు ఆదేశం ఇవ్వాలి. టుబాకోబోర్డు ఆదేశాన్ని ఏదైనా కంపొనీ ధిక్కరించినట్టయితే, ఆకంపెనీ లైసన్సు రద్దుచేయాలి.

బోర్డు అధికారాలు

అసలు ఇటువంటి చర్యలు తీసుకోవడానికి బోరుకు అధికారం వున్నదా అన్నప్రశ్న ఎవరికైనా రావచ్చు. దానికి ఉన్నదనే సమాధానం చెప్పాలి. టొబాకో బోర్డుచట్టంలోని క్లాజ్ 8 (2) (బి) నిబంధన ప్రకారం-"భారతదేశంలోని, విదేశాలలోని పర్టినియా పొగాకు మార్కెట్ల కార్యకలాపాలను అది గమనిస్తూ వుండాలి. రైతులు సరసమైన, గిట్టుబాటైన ధరలను పొందేటట్టు చూస్తూవుండాలి. ధరలలో మితిమీరిన హెచ్చుతగ్గులు వుండరాదు.

క్లాజు 8 (2) (ఇ) నిబంధన ప్రకారం రైతుల, మాన్యుఫాక్చరర్ల, డీలర్ల, దేశప్రయోజనాలు సముచిత రీతిలో పరిరక్షించ బడేటట్టు చూసే అధికారం టొబాకో బోర్డుకువున్నది.


ఈ 8 (2) (బి), 8 (2) (ఇ) క్లాజుల ప్రకారమే టొబాకోబోర్డు "ఓచరు పద్ధతి"ని ప్రవేశ పెట్టిందన్న విషయం ఈ సందర్భంలో గమనార్హం. అందువల్ల

పైన చేసిన రెండు సూచనలను అమలు జరపడంలో టొబాకోబోర్డుకు ఎటువంటి ఇబ్బందులులేవు. తానుచేసిన "పాపాల" ఫలితంగా శిక్ష అనుభవిస్తున్న రైతాంగాన్ని టొబాకోబోర్డు సంరక్షించాలి. ఈ సూచనల అమలుకు టొబాకోబోర్డు ఉద్యమిస్తే, రైతులలో దానిపై పేరుకుపోయివున్న ఏహ్యభావం కొంత వరకైనా సడలిపోతుంది. అలా చేయకపోతేమాత్రం "ఓచర్ విధానం" ఎగుమతివారుల ప్రయోజనాల పరిరక్షణకే పెట్టిందన్న అపోహ రైతులలో మిగిలిపోతుంది.

అయితే, ఇటువంటి చర్యలను గైకొనడాన్ని వాణిజ్యవర్గం నిరోధించవచ్చు. ఓచర్ పద్ధతిని ఆదిలోనే వాణిజ్యవర్గం నిరోధించిందన్న విషయం యిక్కడ గమనార్హం కాని "ఓచరు పద్ధతి" రైతులకు ప్రయోజనకారి అని బోర్డు తలచి నందునే, వాణిజ్యవర్గం హైకోర్టుకు వెళ్ళేంతవరకు, అది ఏమీ ఉలకలేదు, పలకలేదు. అందువల్ల, రైతులకు ఓచర్ పద్ధతి మంచిదే అని అది తలపోస్తున్నదికాబట్టి, వాణిజ్య వర్గానికి ఇష్టమున్నా లేకపోయినా, రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని తొలగించడానికి యిపుడు నడుంకట్టాలి. రైతుల కష్టాలను అంతమొందించడానికి బోర్డు తీసుకునే చర్యలను వాణిజ్యవర్గం తిరిగి కోర్టులో సవాలు చేయవచ్చు. అయినా ఫరవాలేదు. ఓచర్ పద్ధతిని ఆదిలో వ్యతిరేకించిన వాణిజ్యవర్గం కోర్టుకెక్కి, ఆచరణలో ఓచర్‌పద్ధతి తనకు అనుకూలంగా వున్నదని తలపోసిన తర్వాతనే రిట్‌పిటిషన్‌ను ఉపసంహరించుకున్న విషయం ఇక్కడ గమనార్హం.

ధరణిధేనువుఁ బిదుకంగఁ దలచితేని
జనులఁ బోషింపు మధిప వత్సములమాడ్కి
జనులు పోషింప బడుచుండ జగతికల్ప
లత తెఱంగున సకలఫలంబు లొసగు

—భర్తృహరి సుభాషిత రత్నావళి ఆధారముగా
ఏనుగు లక్ష్మణ కవి
విరచిత సుభాషిత త్రిశతినుండి



ప్రకృతి కరుణించి ఉత్పత్తి పెరిగితే ఖరుచులు కూడా గిట్టుబాటుకాని ధరలా!

రచన : డాక్టర్ కె. సదాశివరావు.

పొగాకు ఉత్పత్తి పెరగడం, తరగడం కారణంగా ఎదురయ్యే సంక్షోభాలనుండి రైతులను రక్షించేందుకై ప్రతి సంవత్సరం సీజను ప్రారంభంతోపాటుగానే రైతుస్థాయిలొకనీసగిట్టుబాటుధరలు నిర్ణయించడం, ఆమేరకు మార్కెట్లో ప్రవేసించి, ఇతర గుత్తవ్యాపారులతోపాటు రైతుల నుండి పొగాకు కొనుగోలు జేయడంద్వారా ధర పడిపోకుండా నిలబెట్టాలని, బఫర్ స్టాక్‌సీన్‌ను పారంభించి, మార్కెట్లో సంక్షోభం తలెత్తినప్పుడల్లా 50 మిలియన్ల పొగాకును నిర్ణయించబడిన గిట్టుబాటు ధరలకు కొని నిల్వ చేయాలి. మన పొగాకును సంప్రదాయకంగా ఎగుమతి జేసుకొంటున్న దేశాలకేగాక, ఆగ్నేయాసియా, తూర్పు యూరప్, అరబ్ దేశాలలో కొత్త మార్కెట్ల అన్వేషణకు కృషి చేయడం జరగాలి. ఇది ఆంధ్ర పదేశ్ కిసాన్ సమ్మేణన్ ఆహ్వాన సంఘ అధ్యక్షులు శ్రీ కాసరనేని సదాశివరావుగారు ఈనెల 7వ తేదీన గుంటూరు వచ్చిన కేంద్ర పబ్లిక్ అండర్‌టేకింగ్ కమిటికి అంద చేసిన మెమొరాండము యొక్క సంగ్రహ రచన.

సంపాదకుడు.

పొగాకు మార్కెట్‌లో ధరలు ఒక సంవత్సరం లాభదాయకంగా ఉండడం, మరుసటి సంవత్సరం ఖర్చులుకూడా గిట్టుబాటు కానంతగా పడిపోవడం సర్వ సాధారణమైపోయింది. ఇలా అనూచానంగా గత అర్ధ శతాబ్దంగా జరుగుతూనే వున్నది. పొగాకు రైతుల జీవితాలపై చలగాట మాడడం అనేది వాణిజ్యవర్గాలకు ఒక రకంగా అలవాటయిపోయింది. 1955 నుండి పొగాకు విస్తీర్ణం పెరగడం ఉత్పత్తి పెరగడం జరుగుతూవున్నది. ఇది 100 మిలియన్ల నుండి 130 మిలియన్ల మధ్య ఉత్పత్తి పెరుగుతూ తరుగుతూ వస్తుంది. 1955 లో వాతావరణం అనుకూలంగా ఉండడం, రసాయనిక ఎరువులు, తెగుళ్ళ మందుల వాడకం పెరగడం కారణంగా ఉత్పత్తి 120 మిలియన్ల కేజీలకు దాటింది.

ఉత్పత్తి చేయుడమే రైతులు చేసిన నేరమా ?

దేశీయ అవసరాలు, ఎగుమతులు మొత్తం 100 నుండి 110 మిలియన్ల పొగాకుకు మాత్రమే కలవు. ఆమేరకంటె మించి యేకొంచం ఉత్పత్తి పెరిగినా మార్కెట్లో సంక్షోభం తలెత్తడం, రైతులవద్ద విడుదల కాకపోవడం, విడుదలయినా కారుచవకగా, అంటే ఖర్చులు కూడా గిట్టుబాటు కానంతగా పడిపోవడం అలా అమ్మిన సరుకైనా రైతు చేతికి డబ్బు రాకపోవడం తరుచుగా జరుగుతూనే వున్నది.

1955 లో 100 మిలియన్లకు మించి ఉత్పత్తి జరగడంతో మార్కెట్లో పెద్ద సంక్షోభం ఏర్పడింది. కారణమేమి ? పొగాకు ఎగుమతుల అభివృద్ధికిగాను "టుబాకో ఎక్స్‌పోర్టు ప్రమోషన్ కౌన్సిల్"ను ఏర్పాటుచేసినా. వాణిజ్య మంత్రిత్వ శాఖ ఎగుమతుల అభివృద్ధికి కృషిచేసినా, ఎస్. టి. సి. (ప్రభుత్వ వాణిజ్యసంస్థ) నిర్మాణం జరిగినా, మరెన్ని ప్రయత్నాలు చేసినా సంప్రదాయకంగా ఎగుమతి చేసుకొంటున్న యూరప్ మార్కెట్ తప్ప, ఇతర తూర్పుయూరప్, జపాన్, అరబ్బు దేశాలలో మార్కెట్లు అన్వేషించలేక పోవడమొక కారణం.

ఎన్నో ప్రయత్నాల తరువాత, రాజకీయ కారణాలవలన రష్యా మన పొగాకు దిగుమతి చేసుకొనడం ప్రారంభించింది. అయినా 100-110 మిలియన్లమధ్య మాత్రమే పరిమితమై పోయింది. 1955 లో కుప్పలు తెప్పలుగా మిగిలి పోయిన మన పొగాకుకు మార్కెట్ అన్వేషించ వలసిన ప్రత్యేక పరిస్థితు లేర్పడినాయి. ఎంతో ఆందోళన తరువాత చైనా, తూర్పుయూరప్, ఆగ్నేయాసియా దేశాలకు ఒక రాయబార వర్గమును శ్రీ కొత్తరఘురామయ్య నాయకులుగా ఒక రాయబార వర్గాన్ని పంపించడం జరిగింది. ఈ రాయబారవర్గం కృషిఫలించి చైనా పొగాకు మార్కెట్లో ప్రవేసించింది. నిలవ పొగాకు మొత్తం చెత్తా చెదారం కూడా ఊడ్చుక పోయింది.

అయితే అప్పటికే రైతులు తమ నిల్వలను కారుచవకగా అమ్ముకొనడం కారణంగా లాభించలేక పోయారు. వాణిజ్యవర్గాలు మాత్రం లాభించాయి. ఏదిఏమైనా పెరుగుతున్న పొగాకు ఉత్పత్తులకు ఒక కొత్త మార్కెట్ రంగంలో ప్రవేసించినందుకు రైతాంగం సంతోషించింది. ఇది ఎంతో కాలం నిలవలేదు. చైనా, ఇండియాలమధ్య విబేదాల కారణంగా యుద్ధం జరగడం రెండు దేశాలమధ్యగల అన్ని సంబంధాలు విచ్ఛిన్నం కావడంవలన చైనా పొగాకు మార్కెట్‌నుండి విరమించింది.

1955 తరువాత 1960 నుండి మరల ఉత్పత్తి పెరిగినప్పుడల్లా సంక్షోభం తలెత్తడం ఆనవాయితి అయింది. ప్రధానంగా ఈ సంక్షోభానికి మూలకారణం గుత్తాధిపత్యమే నన్నటలో సందేహములేదు. ఇంకొకరకంగా ఆలోచిస్తే ఇండియాది కొనుగోలుదారుల ప్రాబల్యం పెత్తనం గల మార్కెట్ కావడము. రైతుల వంతల్లా ఉత్పత్తి చేయడమే. మార్కెట్లగురించి ఆలోచించ గల బలవత్తరమైన సంఘాలు లేవు అసెంబ్లీలలో, పార్లమెంటులో రైతులకు శక్తివంతమైన లాబీలేక పోవడం.

మొత్తంమీద ఎన్నో ప్రయత్నాల తరువాత, ఆందోళనలు కారణంగా 1975 లో పొగాకుబోర్డు నిర్మాణం జరిగింది. ఈ బోర్డు నిర్మాణంతో రైతుల కష్టాలు యీడేరగలవని గంపెడంత ఆశతోవున్నవి రైతాంగం. పొగాకుబోర్డు ఆచరణ సాధ్యంగాని, ఆచరణ యోగ్యంగాని, నిరాదాలతో రైతులను ఆశలు రేకెత్తించింది. రైతుస్థాయిలో ధరలు నిర్ణయించింది. ఓచరు పద్ధతి ప్రవేశ పెట్టింది. గ్రేడుల నిర్ణయంలోకూడా మార్పు ప్రవేశపెట్టారు. ఇందులో ఏ ఒక్క చర్యకూడా బోర్డు అమలుపరచలేకపోయింది.

ఫలిత మేమిటి?

1977 నవంబరు 19వ తేదీన తెలుగుకోస్తా ప్రాంతాన్ని ముంచెత్తిన ఉప్పెన, తుపాను కారణంగా ప్రత్తి, ధనియం, పసుపు మొదలయిన వాణిజ్య పంటలన్ని సర్వనాశనమయి పోయాయి. తిరిగి అదే పైరులు వేయుటకు తరుణం మించిపోయింది. ఇక మిగిలించల్లా పొగాకుమాత్రమే కావడంతో ఎన్నో వ్యయ ప్రయాశలకు తట్టుకొని తప్పనిసరి పరిస్థితుల్లో పొగాకు వేశారు. ఉత్పత్తి కూడా పెరిగింది. ఇలాంటి విషమ విపత్కర పరిస్థితులకు బోర్డు అనుసరించిన అనాలోచిత విధానం తోడయింది. వాణిజ్య వర్గాలు పొగాకు ఉత్పత్తి అంచనా వేశాయి. ఇంచుకు వారికి కావలసినంత శక్తివంతమయిన సాధన సంపత్తి వున్నది. ఎంత ఆలశ్యం జరిగినా తమకు అవసరమైన పొగాకు ఉత్పత్తి జరిగింది. మరొక సంస్థ ఏదీ రైతులనుండి పొగాకు కొనుగోలు చేయలేదు. కాబట్టి మనం మార్కెట్లో

ఎప్పుడు ప్రవేసించినా పరవాలేదనే ధీమాతో వాణిజ్యవర్గాలు నిమ్మకు నీరెత్తినట్లు కూర్చున్నాయి. డిశంబరు మొదటివారంనుండే మార్కెట్లో పొగాకు దిగింది. కచ్చాగ్రేడ్లుచేసి అమ్మకానికి సిద్ధంచేసింది రైతాంగం. డిశంబరుదాటింది. జనవరి గడుస్తూవున్నది. ముగిసింకికూడా ఫిబ్రవరి ప్రవేసించింది. వారంగడిచింది. ఏది! ఒక్క బయ్యరుకూడా మార్కెట్లో ప్రవేసించరే. ఏదీగతి.

నిరుటి ధరలో మూడోవంతుకే

పొగాకుబోర్డు దిగివచ్చింది. కాదు లొంగిపోయింది. డబ్బు చెక్కు రూపంలో గాక రొక్కంగా యివ్వవచ్చునన్నది. రెండవ హాయిదా 90 రోజులకు బదులు 150 రోజులకు పెంచింది. అంతేనా! అసలు రంగంనుండే నిష్క్రమించి రైతులకు జరిగే అన్యాయాలను, అక్రమాలను. దోపిడీని ప్రేక్షకునివలే చూస్తూవుండిపోయింది బోర్డు రైతాంగం హతాశులై పోయారు. కట్టిన చెక్కులు చెదిరిపోతున్నాయి. రంగు. ఫ్లావరి సడలిపోతుంది. ఇక ఎంతకయినా అమ్ముకొనవలసిన నిస్సహాయ సితిలో పడిపోయారు. ఇండియాలో సిగరెట్ ఉత్పత్తిలో, ఎగుమతులలో గుత్తాధిపత్యాన్ని చలాయిస్తున్న ఇండియన్ టుబాకో (ఐ. ఎల్. టి. డి.) గోల్డెన్‌టుబాకో, నేషనల్ టుబాకో కంపెనీలు మూడు నాలుగు సంవత్సరాల వరకు తమ సిగరెట్ కంపెనీలకు కావలసిన పొగాకును కారు చవకగా అంటే యీ సంవత్సరానికి సరిపడగల పొగాకు ధరకే మూడేళ్ళ సరకును కొనుగోలుచేశారు. నిరుటి ధరలకంటె మూడోవంతుకు యింతా కొంచెం తక్కువ ధరకే కొన్నారన్నమాట.

ఇక మిగిలిన దేశీయ వ్యాపారస్తులు కూడా తమకుగల విదేశ ఎగుమతి ఆర్డర్లకుమించి రెట్టింపు కొనుగోలుచేశారు. అంతేనా! ఏ ఆర్డరూ ఒక టన్నుకుకూడా లేని తాడు బొంగరంలేని కంపెనీలుసైతం రైతులకు ఒక్క పైసా అంటే ఒక్క పైసాకూడా యివ్వకుండా ఒక్కొక్కరు కోటి రూపాయల పొగాకును కొన్నారు.

పొగాకు విడుదలయింది
డబ్బు చేతికిరాదే!

రైతులవద్దనుండి పొగాకు విడుదలయిపోయింది. కారు చవకగా - అదీ డబ్బు యివ్వకుండా. ఓచరు లేదు. తమ ఇష్టారాజ్యంగా కొనేశారు. మొదటి వాయిదాగా సగం ఖరీదు యివ్వలేదు. ఇక నూటయాభై రోజులకుయిచ్చే రెండవ వాయిదా సంగతంటారా ? ఆలోచించే పనేలేదు. డబ్బు అడిగితే అదుగో మీ పొగాకు గోడవున్నలోనే మూలుగుతోంది. నేనేమి చేయగలను అంటారు. ఇంకా మేమే

అప్పుసప్పుచేసి, గ్రేడ్లుచేసి, రీడ్రయింగు చేయించి బేళ్లుకట్టి సిద్ధంగా వుంచాము. వెళ్ళి ఆర్డర్లకొరకు ఆందోళన చేయండి అంటూ సమాధానం. ఆర్డర్లు సంపాదించే శక్తివుంటే అయినకాడికి అమ్ముకోనవలసిన దుర్గతెందుకు.

ఎస్. టి. సి. మార్కెట్లో ప్రవేసించింది

ఆలశ్యంగానే అయినా ఎస్. టి. సి మార్కెట్లో ప్రవేసించింది. రైతులవద్ద నుండి నేరుగా పొగాకు కొనుగోలు చేయడం ఇప్పట్లో సాధ్యంకాదన్నారు. రైతులే సంఘాలుగానో, సిండికేట్లుగానో ఏర్పడి, గ్రేడింగుచేసి, రీడ్రయిచేసి, బేళ్లుకట్టి, ఆగ్మార్కు సర్టిఫికెట్ తెచ్చుకుంటే మేము కొంటామన్నారు. చివరకు ఇందుకు అంగీకరించారు. మార్కెట్లో ప్రవేసించారు ఇందులోనూ రైతులపేరుమీదనే బినామి సిండికేట్లు, సొసైటీలు యేర్పడినాయి. అయినా ఇంతకంటే, నేటి పరిస్థితులలో వేరొక మార్గంలేక పోవడంవలన ఇష్టమున్నా లేకపోయినా ఆమోదించక తప్పలేదు ఎస్. టి సి.కి కేటాయించిన 10 వేల టన్నులు పూర్తయినా ఇంకా 30-35 మిలియన్ల పొగాకు చిన్న, పెద్ద వ్యాపారస్తులవద్ద మూల్గుతూనే వున్నది.

ఎగుమతుల అభివృద్ధికి కృషి జరగవద్దా?

టొబాకో ఎక్స్పోర్టు ప్రమోషన్ కౌన్సిలు వున్నది. ఎస్. టి. సి. వున్నది కొత్తగా సర్వాధికారాలతో, పొగాకు రైతుల పాలిటి కల్పతరువనుకొని సంబరపడిన పొగాకుబోర్డు వున్నది. వీరంతా పెరుగుతున్న ఉత్పత్తుల కనుగుణంగా ఎగుమతులకు కృషి చేయవలదా? మరి యేమిచేస్తున్నారు? ఇటీవల బ్రెజిల్లో జరిగిన యూరోపియన్ ఎకనమిక్ కంట్రీస్ కాన్ఫరెన్సుకు బోర్డు అధ్యక్షుడు పోయివచ్చారు. ఇరాన్, ఇరాక్ మొదలయిన ముస్లిమ్ దేశాలకు కూడా రాయబారవర్గం వెళ్ళి వచ్చింది. ఏమిసాధించారు? ఒక కిలో పొగాకుకు కూడా ఆర్డరు సంపాదించలేక పోయారు. ఇది కేవలం విలాస యాత్రగానే మిగిలి పోయింది.

బంగ్లాదేశ్ ఆఫర్ ఏమైంది?

భారతదేశపు దిగుమతులకు, పది శాతం దిగుమతి సుంకాన్ని తగ్గిస్తామని, ఆహ్వానించారు. మూడు నెలలనాడు ఈ ఆహ్వానం వచ్చినా, ఇండియా ప్రభుత్వానికి

పొగాకు బోర్డుకుగాని ఇంతవరకు ఏమీపట్టినట్లులేదు. అవసరమైతేఎగుమతి సుంకాన్ని కూడా 10 శాతం తగ్గించి, దేశంలో మూల్గుతున్న పొగాకు విక్రయానికి వీను కొనడం తమ విద్యుక్త ధర్మం కాదా:

చైనా సంగతేమైంది

చైనా మన పొగాకును దిగుమతి చేసుకొనుటకు సంసిద్ధతను ప్రకటించింది. తమ వాణిజ్యశాఖకు చెందిన వారిని మార్కెట్‌కు పంపించింది. వారు గుంటూరు వచ్చి శాంపిల్స్ చూచివెళ్ళారు. ప్రభుత్వ వాణిజ్యసంస్థలు కూడా సాంపిల్స్ చైనాకు పంపించారు. పర్యవసానం యేమిటి ? మన ప్రభుత్వం కదలవద్దా ? మన మిగుళ్ళకు మార్కెట్లను అన్వేషించడం తమ కర్తవ్యం కాదా ?

ప్రభుత్వ తక్షణ కర్తవ్యమేమిటి ?

జరుగతున్న సీజను సంగతి చేయిదాటిరుగు. కొత్త సీజను ముంచుకొస్తున్నది. చాలా భాగం నాటు పడిపోయింది. పది రోజుల్లో పూర్తవుతుంది. డిశంబరు 15 తేదీ కల్లా బ్యారన్లు దిగుతాయి. మొత్తం జనవరి మొదటి వారంలో మార్కెట్‌కు సిద్ధమవుతున్నది. ఈయేటి పొగాకు 80 నుండి 85 మిలియన్ల కిలోలు వాణిజ్య వర్గాల గోడవన్లలో మూలుగుతుంది. సిగరెట్ ఉత్పత్తిదారులయిన ఇండియన్ టుబాకోస్, గోల్డెన్ టుబాకోస్, నేషనల్ టుబాకోసు, నవభారత టుబాకోస్‌లాంటి గుత్త సంస్థలు మూడేళ్ళదాకా తమ పరిశ్రమలకవసరమయిన పొగాకు కొని నిల్వ చేశారు.

ఇలాంటి పరిస్థితులలో రైతులు ఉత్పత్తి చేయనున్న జనవరి మొదటి వారాంతానికి మార్కెట్లో తయారు కాబోతున్న పొగాకు సంగతేమిటి! ఇప్పటికయినా ప్రభుత్వం, బోర్డు, ఎస్. టి సి ప్రమోషన్ కౌన్సిలు. కలసి కూర్చొని, మన పొగాకు ఎగుమతులకుగల అన్ని అవకాశాలను గురించి చర్చించి వాణిజ్య రాయబార వర్గములద్వారా పెచ్చు మొత్తాల ఎగుమతులకు ప్రయత్నించాలి. ఇంకొక ప్రధాన విషయమేమంటే ఇప్పుడు నిల్వగల 80 మిలియన్ల పొగాకును ఎగుమతులకు ప్రయత్నించడం.

దప్పికయినప్పుడే భావి త్రవ్వడమా ?

కేంద్రంలో ప్రభుత్వం దప్పికయిందంటే భావి త్రవ్వడం ప్రారంభించడన్న సామెతలాగా వుంటుంది. బ్రిటిష్ ప్రభుత్వ అడుగుజాడల్లోనే నడుస్తున్నది. రాజులు

మారినా రాజ్యాలు మారినా ప్రభుత్వాలు మారినా పాలకులు మారినా మారని విధానాలు. వాణిజ్య వర్గాల ప్రయోజనాలు కాపాడే మార్కెటింగ్ సరళిమారాలి. పొగాకు వాణిజ్యంలో అమెరికా, రొడిషియాలలాగా వ్యవసాయదారుల ప్రయోజనాలు కాపాడేందుకు ఆనువైన విధానాన్ని ఇప్పుడయినా రూపొందించడం జనతా ప్రభుత్వ కర్తవ్యంగాదా!

కాబట్టి పొగాకు సీజను ప్రారంభంలోనే రైతు స్థాయిలో గిట్టుబాటు ధరలను నిర్ణయించి, అమలు చేయడం విధానంగా పెట్టుకోవాలి.

కొత్త మార్కెట్లోకి రావడంతోనే ప్రభుత్వ వాణిజ్య సంస్థ మార్కెట్లో ప్రవేసించి 40 మిలియన్ల పేజీల పొగాకు బఫర్ స్టాక్ స్కీము క్రింద నిల్వచేసి, గిట్టుబాటు ధరలను రైతు స్థాయిలో గ్యారంటీ చేసి రైతాంగాన్ని ఆదుకోవాలి.

పొగాకు రైతులకు ఎకరాకు రు. 1000-00 లు ఋణాలు మంజూరు చేయించి, వెంటనే రైతులకు అందచేయాలి.

పచ్చి ఆకు బండికి వేయుచున్న దృశ్యం





ప్రస్తుత విఁశమఁ గ్రేడఁలవలన కడకు నష్టపడ్తున్నది రైతులే!

రచన : శ్రీ కందిమళ్ల బుచ్చయ్య
మాజీ శాసన సభ్యులు

ఆరోగ్యంగా, బలంగా ఎదిగిన పొగ మొక్కకు బ్యారన్ కాల్పుకు (Curing) పనికిరాగల ఇరువది ఆకులు విరుపుకురావచ్చు. బ్యారను కాల్పు అయిన తరువాత, ఆకులను రంగు (Colour), మరక (Blemish)ను బట్టి ఈ క్రింది మూడు గ్రేడులుగా చేయనగును.

1 పండిన గ్రేడులు (Ripe Grades)

2 పచ్చ గ్రేడులు (Green Grades)

3 చచ్చు ఆకు (Perished Leaf)

ఈ మూడింటి నుండి పొగాకు బోర్డు నిర్వచించిన ఎనిమిది రైతుల గ్రేడులు (**Farm Grades**) గా విభజించబడును.

1 పండిన గ్రేడుల (Ripe Grades) నుండి

F-1 మేలిమి గ్రేడులు (Bright Grades) 1 నుండి 4

F-2 రంగు గ్రేడులు (Semi Bright) (LBY-LBY2)

F-3 లేత గోధుమ (Light Brown) (B)

F-4 ముదురు గోధుమ (Dark Brown) (DB, DDB)

2 పచ్చ గ్రేడుల (GREEN GRADES) నుండి

F-5 లేత పచ్చ (Light Green) LG

F-6 చిలక పచ్చ (Medium Green) LMG

F-7 మొద్దు పచ్చ (Dark Green) MG, DG

3 చచ్చు ఆకు (Perished Leaf)

F-8 చచ్చు ఆకు (Perished Leaf)-PL

ఈ విధంగా వీర్పరచిన ఎనిమిది రైతుల గ్రేడులు (F-1 నుండి F-8. నుండి, ఎగుమతి కొరకు, ఈ క్రింది గ్రేడులు రంగును, మరకను బట్టి చేయబడినవి)

మేలిమి గ్రేడులు (High Grade) 1, 2, 3, 4

మధ్యమ గ్రేడులు(Medium Grades)LBY, LG, LBY2, LMG.B

తక్కువ గ్రేడులు (Low Grades) MG, DB, DG, PL

ఈ పదమూడు గ్రేడులను కేంద్ర ప్రభుత్వం 1945 ఆగ్‌మార్క్ గ్రేడులుగా ఆమోదించి, ప్రవేశపెట్టింది. వీటినిసహజ గ్రేడులు (Straight Grades) అంటారు.

ఆగ్‌మార్క్ డిపార్టుమెంటువారు నిర్వచించిన ఈ పదమూడు గ్రేడులలో 1945 నుండి 1959 వరకు పొగాకు ఎగుమతిఅవుతూ వచ్చినది. ఇంగ్లండు కొను గోలుదారులు, పొగాకును తక్కువ ధరలకు కొను ప్రధాన ఉద్దేశ్యముతో, సిగరెట్టు పరిశ్రమకు ఈ పదమూడు గ్రేడులు పనికిరావనే నెపంతో, మిశ్రమ గ్రేడులు (Composite Grades)గా కావాలన్నారు. ప్రభుత్వము పై ఒత్తిడి తెచ్చారు. 1960 నుండి 1965 వరకు గ్రేడులు 1,2,3 మిశ్రమ గ్రేడులు అనగా AF, AS, AT గా ఎగుమతి జరిగింది. 1966 నుండి నాల్గవ గ్రేడును (Grade 4)ను కూడా కలిపి ఈ క్రింది మిశ్రమ గ్రేడులు ఆగ్‌మార్క్ వారు ఎగుమతికి అంగీకరించారు.

మిశ్రమ గ్రేడు	గ్రేడు 1 నుండి 3 వరకు శాతం	గ్రేడు 4 శాతము
C 1-4	70	30
F 1-4	55	45
S 1-4	30	70
T 1-4	15	85

సహజ గ్రేడులు (Straight grades)కు నిర్ణయించబడు కనీస ఎగుమతి ధరలను ఆధారముగా చేసుకొని, మిశ్రమ గ్రేడుల ధరలు నిర్ణయించ బడవలసి యున్నది. కాని అట్లు మిశ్రను గ్రేడులకు ధరలను యిచ్చుటకు ఇంగ్లీషు దిగుమతి దారులు ఇష్టపడక 1966 లో వలెనే నాలుగు మిశ్రమ గ్రేడులకు పొగాకు ఒకే ధర యిస్తూ వచ్చారు. ఇప్పటికీ ఈ నాలుగు మిశ్రమ గ్రేడులుగా పొగాకు పోతూనే ఉన్నది. 1974 లో ఈ మిశ్రమ గ్రేడులను రద్దుచేయాలని కేంద్ర ప్రభుత్వ అగ్రికల్చరల్ మార్కెటింగ్ సలహాదారు ప్రయత్నించగా, ఇంగ్లండుకు ఎగుమతి చేస్తున్న మన వర్తకులు అంగీకరించలేదు. ఐ. యల్. టి. డి. కూడా ఇంగ్లండుకు ఈ గ్రేడుల పొగాకు ఎగుమతి చేసినది.

ఐ. ఎల్. టి. డి. కి ప్రత్యేక గ్రేడులు:

ఆదినుండి ప్రయివేటు కంపెనీ అయిన ఐ. యల్. టి. డి. ప్రభుత్వ గ్రేడులతో నిమిత్తము లేకుండా, ఈ క్రింది ప్రత్యేక గ్రేడులు చేసుకుంటూ వచ్చింది.

వరుస	ఐ. ఎల్. టి. డి. గ్రేడులు	భిన్న దామాషాలో సహజ ఆగ్‌మార్క్ గ్రేడుల మిశ్రమము
1	1 M	1 నుండి 3 వరకు
2	1 D	3+4
3	1 X	4+LBY
4	1 S	LBY+LBY 2
5	1 S_2	LBY 2+B
6	S D	DB
7	1 BF	LG+FLG
8	1 CF	LG+LMG
9	DG	DG
10	PL రంగు	PL రంగు
11	PL మసర	PL మసర

1945 నుండి 1957 వరకు ఐ. యల్. టి. డి. గ్రేడులకు దగ్గరగానున్న ఆగ్ మార్క్ సహజ గ్రేడులను ఎగుమతికొరకు ఆగ్‌మార్క్ డిపార్టుమెంటువారు యిస్తూ వచ్చినారు అంటే ఐ. యల్. టి. డి. గ్రేడు 1 M కు, ఆగ్‌మార్క్ గ్రేడు 1 గాని. 2 గాని, పొగాకురంగు, నాణ్యతనుబట్టి యిచ్చేవారు. తరువాత కొంత కాలానికి ఈ పద్ధతిని రద్దుచేసి, ఐ. యల్. టి. డి. "X" అను ప్రత్యేక గ్రేడుగా ఎగుమతి చేస్తుండేది. ఈ 'X' గ్రేడుగా ఎగుమతి చేయుటలో వచ్చిన కొన్ని చిక్కుల వలన ఐ. యల్. టి. డి. ప్రభుత్వంపై ఒత్తిడితెచ్చి, 1960 లో కొత్తరకంమిశ్రమ గ్రేడులను అమలులోనిక తెచ్చింది.

కొత్తరకం మిశ్రమ గ్రేడులు

ఈ మిశ్రమ గ్రేడులు, మూడు వరుస గ్రేడుల సమ్మిశ్రమముగా రూపొందించబడినవి. ఈ గ్రేడుల మిశ్రమం శాతములో ఒక పద్ధతిలేదు. ఈ దిగువ గ్రేడులు ఈయబడినవి [C అనగా మిశ్రమ (Composite) అని అర్థం]:

2 (C)	2 వ గ్రేడు మిశ్రమం
3 (C)	3 ,,
4 (C)	4 వ గ్రేడు మిశ్రమం
LBY (C)	LBY ,,
LBY 2 (C)	LBY 2 ,,
B (C)	B ,,
LG (C)	LG ,,
LMG (C)	LMG ,,
MG (C)	MG ,,

ఈ అక్షరం 'C' (సి) మధ్య గ్రేడును మాత్రము తెలియ చేస్తుంది. ఈమధ్య గ్రేడు మిశ్రమంలో 70 శాతం కలిగిన, ప్రధాన గ్రేడు, దానిక్రింది గ్రేడు, మిశ్రమ తూకంలో 15 శాతంకు మించకుండా ఉండాలి. మిగతాది పై గ్రేడులో ఉండ నగును. ఉదాహరణకు మిశ్రమ గ్రేడు 4 (C) లో: 70 శాతం తగ్గకుండా మధ్య నున్న నాల్గవ గ్రేడు, 15 శాతంకు మించకుండా దానిక్రింది- అనగా LBY గ్రేడు, మిగతా పై గ్రేడు అయిన మూడు - ఉంటాయి.

మిశ్రమ గ్రేడులలో లోపం

ఈ మిశ్రమ గ్రేడులు ప్రామాణికము (standard) గాదు. కారణం వివిధ గ్రేడుల మిశ్రమ శాతం తూకం ఇదమిద్ధంగా నిర్ణయించబడక, మారుతుంటాయి. ఉదాహరణకు 4 (C) తీసుకొందాము; ఈ 4 (C) లో ఈ క్రింది విధముగా గ్రేడుల శాతం మారవచ్చు:

	3 వ గ్రేడు	4 వ గ్రేడు	LBY గ్రేడు
1	20%	70%	10%
2	5%	80%	15%
3	25%	75%	5%

ఇంకా ఇటు అనేకరకాల తూకాల తోతంతో ఈ గ్రేడులు కొనుగోలు దారులు కోరిన ప్రకారము మారుటకు వీలుగున్నది. కొనుగోలుదారు యిష్టము వచ్చినట్లు ఈ మిశ్రమ గ్రేడుల ద్వారా పొగాకు కొనేయుటకు అవకాశమున్నందున మన ఎగుమతి దారులకు, కడకు రైతులకు అనర్థకముగా ఉన్నది.

అందుచేత గ్రేడుల సంస్కరణ ఆలోచించగానే మిశ్రమ గ్రేడులను రద్దు చేయడం ప్రథమకర్తవ్యం గావాలి. దీనితో విదేశీవర్తకుల దోపిడి కొంతవరకు అరికట్టబడుతుంది. ఇందుకు తగుచర్యలు తక్షణం తీసుకోవలసిన బాధ్యత పొగాకుబోర్డు వహించాలి.

ఎగుమతి గ్రేడులు రద్దుగావాలి
రైతుల స్థాయిలో ఎనిమిది గ్రేడులు
నిర్బంధంగా అమలు జరపాలి

మిశ్రమ గ్రేడులతో పాటు, ఎగుమతి గ్రేడులను ప్రభుత్వం రద్దుచేయాలి. రైతుల స్థాయిలో పొగాకుబోర్డు నిర్వచించిన ఎనిమిది గ్రేడులు (FARM GRADES ను బహుళ ప్రచారము గావించి, ప్రకృతి దత్తమయిన సహజ గ్రేడులను అమలు పరచాలి. తికమక పడుటకు వీలులేకుండా, రైతులు తను పంటను సక్రమంగా, గ్రేడు చేయించుకొని, విక్రయించు కొనగలగాలి. విదేశీకొనుగోలుదారుల దిగుమతులకు దేశీయ సిగరెట్టు పరిశ్రమ అవసరములకు తగు గ్రేడులను వర్తకులు చేసుకొనగలరు. వర్తకులు మాత్రం రైతుల గ్రేడులనే, చట్టబద్ధమయిన కనీసధరలకు కొనుగోలు చేయునట్లు కట్టుదిట్టములను పొగాకుబోర్డువారు చేసి, పొగాకు రైతును రక్షణ కల్పించాలి.

★

పొగాకు వర్జీనియా పొగాకు - వివిధ ప్రదేశాలలో ఉత్పత్తి

(1970-77 సంవత్సరములలో సాలుసరి సగటు)

క్రమం	దేశము	టన్నులు	క్రమం	దేశము	టన్నులు
1	చైనా	587,000	23	వెనిజులా	10,900
2	అమెరికా	546,000	24	ఇండోనీషియా	9,900
3	బ్రెజిల్	140,250	25	బంగ్లాదేశ్	9,500
4	ఇండియా	104,500	26	మెక్సికో	6,600
5	జపాన్	97,000	27	జాంబియా	6,100
6	కెనడా	94,100	28	మలేషియా	5 800
7	రోడీషియా	85,000	29	హంగరి	5,300
8	దక్షిణ కొరియా	79,300	30	ఇరాన్	5,000
9	ఫిలిప్పీన్స్	40,600	31	క్యూబా	4,800
10	ఆర్జెంటీనా	38,000	32	అంగోలా	4,700
11	తాయిలాండు	33,000	33	శ్రీలంక	4,100
12	పోలండు	29,000	34	న్యూజీలాండు	3,100
13	పాకిస్తాన్	25,000	35	వియట్నామ్	3,000
14	తైవాన్	22,800	36	చిలీ	2,500
16	దక్షిణ ఆఫ్రికా	21,200	37	నైజీరియా	1,950
16	బల్గేరియా	21,000	38	కొలంబియా	1,940
17	బర్మా	17,900	39	గౌటెమాల	1.900
18	మలావి	16,400	40	ఖ్మేర్	1,880
19	ఆస్ట్రేలియా	15,300	41	పెరూ	1,750
20	టాంజానియా	14,200	42	ఉగాండా	1,660
21	యుగోస్లోవియా	13,130	43	మొజాంబిక్	1,480
22	ఇటలీ	13,000	44	ఘనా	1,400

క్రమం	దేశం	టన్నులు	క్రమం	దేశం	టన్నులు
45	లావోస్	1,370	59	మారిషస్	370
46	హోండూరస్	1,300	60	సిరియా	320
47	కెన్యా	1,060	61	సింగపూర్	300
48	జోర్డాన్	1,000	62	పనామా	290
49	ఎల్ సాల్వడార్	850	63	స్విట్జర్లాండ్	250
50	మలగాసీ	820	64	టినిడాడ్	175
51	ఉరుగ్వే	810	65	హైటి	130
52	కోస్టారికా	780	66	జైరె	110
53	నికరాగ్వా	650	67	సైప్రస్	100
54	పశ్చిమ జర్మనీ	560	68	గయానా	90
55	జమైకా	560	69	గ్రీసు	85
56	ఈక్వడార్	450	70	సియారా లియోన్	80
57	టర్కీ	430	71	స్పెయిన్	50
58	పోర్చుగల్	425			

(Tobacco International సౌజన్యంతో)

బారను వర్జీనియా పొగాకు - వివిధదేశాలలో పంటదిగుబడి

(1970 - 77 సంవత్సరములలో సాలుసరి సగటు)

క్రమం	దేశము	హెక్టారుకు కిలోలు	క్రమం	దేశము	హెక్టారుకు కిలోలు
1	బ్రెజిల్	3,000	23	కొలంబియా	1,400
2	జపాన్	2,600	24	ఈక్వడార్	1,400
3	స్విట్జర్లాండు	2,500	25	ఎల్ సాల్వడార్	1,400
4	తైవాన్	2,390	26	మలావి	1,400
5	కెనడా	2,300	27	నికరాగ్వా	1,400
6	అమెరికా	2,190	28	పాకిస్తాన్	1,400
7	దక్షణ కొరియా	2,000	29	పెరూ	1,400
8	చిలె	2,000	30	వెనిజులా	1,370
9	గ్రీసు	1,950	31	బ్రెజిల్	1,300
10	ఇటలీ	1,900	32	గౌటెమాల	1 300
11	పోర్చుగల్	1,800	33	హంగరీ	1,300
12	పోలెండ్	1,750	34	జమైకా	1 300
13	పశ్చిమ జర్మనీ	1,700	35	మెక్సికో	1,300
14	ఆస్ట్రేలియా	1,600	36	పనామా	1,300
15	కోస్టారికా	1,600	37	సింగపూర్	1,210
16	హొండూరస్	1,600	38	ఆర్జెంటీనా	1 200
17	న్యూ జీలాండ్	1,600	39	గయానా	1 200
18	రొడీషియా	1,600	40	మారిషస్	12,00
19	సిరియా	1,600	41	టర్కీ	1,176
20	ఉరుగ్వే	1,560	42	హైటీ	1,120
21	స్పెయిన్	1,500	43	మంగాసె	1,100
22	చైనా	1,450	44	మొజాంబిక్	1,090

క్రమం	దేశం	హెక్టారుకు కిలోలు	క్రమం	దేశం	హెక్టారుకు క్రమం
45	యుగోస్లావియా	1,030	58	దక్షిణ ఆఫ్రికా	800
46	ఇరాన్	1,000	59	సైప్రస్	750
47	అంగోలా	1,000	60	ఇండియా	**750**
48	బంగ్లాదేశ్	1,000	61	టాంజానియా	748
49	బల్గేరియా	1,000	62	ఉగాండా	740
50	వియట్ నామ్	990	63	మలేషియా	700
51	సియర్రా లియోన్	980	64	లావోస్	670
52	జైరె	960	65	నైగీరియా	650
53	జాంబియా	940	66	శ్రీలంక	650
54	ఖ్మేర్	900	67	క్యూబా	550
55	ట్రినిడాడ్	860	68	ఇండొనిషియా	550
56	ఘనా	800	69	కెన్యా	500
57	ఫిలిప్పీన్స్	800	70	జోర్డాన్	400
			71	తాయిలాండ్	380

(Tobacco International సౌజన్యంతో)


బారను వర్జినియా పొగాకు - వివిధ దేశాలలో ధరలు

(1977 లో సగటు ధరలు - కిలోకు అమెరికా డాలర్లు)

క్రమం	దేశము	కిలోగ్రాంకు అమెరికా డాలర్లు	క్రమం	దేశం	కిలోగ్రాంకు అమెరికా డాలర్లు
1	కామరూన్	18.16	26	బల్గేరియా	2 12
2	నికరాగ్వో	4.80	27	కెనడా	2.10
3	ఈక్వడార్	4 70	28	ఇండొనీషియా	2 10
4	గ్రీసు	3.63	29	తాయిలాండ్	2.05
5	మలేషియా	3.52	30	పనామా	2.05
6	ఆస్ట్రియా	3.50	31	తూర్పు జర్మనీ	2.00
7	లెబనాన్	3.50	32	మలగాసె	2.00
8	న్యూజీలాండ్	3.50	33	రొడీషియా	2.00
9	సైప్రస్	3 45	34	దక్షిణ ఆఫ్రికా	2.00
10	బెల్జియం	3 35	35	సిరియా	2.00
11	అమెరికా	3.30	36	కెన్యా	1.95
12	జపాన్	3.27	37	వెనిజులా	1.95
13	ఆస్ట్రేలియా	3 00	38	మెక్సికో	1 90
14	హోండూరస్	3.00	39	టాంజానియా	1.90
15	గౌటెమాల	2 90	40	దక్షిణ కొరియా	1.86
16	సోవియట్ రష్యా	2.82	41	మలావి	1.86
17	కోస్టారికా	2 79	42	ఆర్జెంటీనా	1.80
18	ఇజ్రాయిల్	2.72	43	ఇండియా	**1.80**
19	యుగోస్లావియా	2.65	44	మొజాంబిక్	1.75
20	ఫ్రాన్స్	2 45	45	కొలంబియా	1.70
21	టర్కీ	2.45	46	జాంబియా	1.65
22	జమైకా	2.38	47	చైనా	1.60
23	స్విట్జర్లాండ్	2 25	48	ఇటలీ	1.60
24	తైవాన్	2.25	49	యుగాండా	1.60
25	ఎల్ సెల్వాడార్	2.24	50	పాకిస్తాన్	1.58

క్రమం	దేశం	కిలోగ్రాంలకు అమెరికా డాలర్లు	క్రమం	దేశం	కిలోగ్రాంకు అమెరికా డాలర్లు
51	స్పెయిన్	1.50	59	అంగోలా	1.20
52	ట్రినిడాడ్-టొబాగో	1.50	60	సింగపూర్	1.20
53	బ్రెజిల్	1.40	61	పశ్చిమ జర్మనీ	1.00
54	డొమినికన్ రిపబ్లిక్	1.40	62	హంగరీ	1.00
55	పోలెండ్	1.40	63	పరాగ్వే	1.00
56.	ఫిలిప్పీన్స్	1 35	64	పెరూ	0 90
57	రొమానియా	1.30	65	టునీషియా	0 80
58	ఆస్ట్రియా	1 25	66	మొరాకో	0.60

(Tobacco International సౌజన్యంతో)



పొగాకు పొలం

వివిధ దేశాలనుండి పొగాకు ఎగుమతులు

(1970–77 సంవత్సరములలో సాలుసరి సగటు)

క్రమం (రేంక్)	దేశము		టన్నులు	క్రమం (రేంక్)	దేశము		టన్నులు
1	అమెరికా		272,720	27	పాకిస్తాన్		8,840
2	టర్కీ		91,700	28	రుమానియా		8,225
3	బ్రెజిల్		91,416	29	టాంజానియా		7,048
4	ఇండియా		**80 344**	30	అంగోలా		6,823
5	ఆల్జీరియా		68,000	31	ఐర్లాండు	×	5,516
6	గ్రీసు		59,383	32	లెబనాన్		5,500
7	ఇటలీ		51,813	33	స్విట్జర్లాండ్		5,266
8	రొడీషియా		42,250	34	జాంబియా		5,000
9	దక్షిణ కొరియా		37,455	35	గౌటీమాల		4,633
10	డొమినికన్ రిపబ్లిక్		34,206	36	తైవాన్		4,300
11	చైనా		34,000	37	బెల్జియం		4,200
12	ఫిలిప్పిన్స్		33,000	38	సిరియా		3,510
13	మలావి		29,060	39	హాంకాంగ్	×	3,436
14	కెనడా		28,557	40	ఇంగ్లండు	×	3,360
15	ఇండోనిషియా		25,090	41	హాండూరస్		3 305
16	పెరాగ్వే		22,890	42	ఫ్రాన్స్		2,850
17	మెక్సికో		19,890	43	మలగాసె		2,408
18	ఆర్జంటీనా		19,438	44	కమరూన్		2,050
19	యుగోస్లావియా		18,940	45	పశ్చిమ జర్మనీ		2,000
20	కొలంబియా		18,293	46	పెరూ		1,740
21	తాయిలాండ్		17,753	47	జెకోస్లోవేకియా		1.647
22	క్యూబా		15,246	48	వెనీజులా		1:540
23	పోలండు		10,573	49	డెన్మార్	×	1,482
24	పశ్చిమ జర్మనీ		10,493	50	హంగరీ		1,390
25	నెదర్లాండ్స్	×	10,220	51	సోవియట్ రష్యా		1,370
26	దక్షిణ ఆఫ్రికా		8.922	52	మొజాంబిక్		1,280

క్రమం (రేంక్)	దేశం	టన్నులు	క్రమం (రేంక్)	దేశం	టన్నులు
53	సికరాగ్వా	1,250	71	ఈక్వడార్	145
54	యుగాండా	1,150	72	ఘనా	145
55	దక్షిణ యమన్	830	73	మలేషియా	142
56	జపాన్	873	74	జోర్డాన్	130
57	ఆస్ట్రియా	745	75	టునీషియా	66
58	శ్రీలంక	500	76	ట్రినిడాడ్-టొబాగో	62
59	ఎల్ సెల్వడార్	458	77	నాత్వే ×	54
60	ఆస్ట్రేలియా	380	78	కోస్తారికా	46
61	కాంగో	365	79	స్పెయిన్	42
62	సింగపూర్	360	80	మాల్టా ×	37
63	జమైకా	312	81	నైజీరియా	34
64	సైప్రస్	277	82	ఇజ్రాయిల్	30
65	స్వీడన్ ×	260	83	న్యూ జిలాండ్	16
66	కానర్ ఐల్స్ ×	253	84	కెన్యా	2
67	ఆల్జీరియా	246	85	పోర్చుగల్	1
68	పనామా	230			
69	మొరాకో	186			
70	కువైట్ ×	180			

× ఈదేశాలలో పొగాకు వ్యవసాయంలేదు. కాని సిగరెట్లు మొదలగునవి తయారు చేయబడును.

(Tobacco International సౌజన్యంతో)

వివిధ దేశాలలో పొగాకు దిగుమతులు

(1970-77 సంవత్సరములలో సాలుసరి సగటు)

క్రమం (రేంకు)	దేశము	టన్నులు	క్రమం (రేంకు)	దేశము	టన్నులు
1	ఇంగ్లండు	150,000	26	హంగరీ	8,885
2	అమెరికా	136,560	27	పోర్చుగల్	8,300
3	పశ్చిమ జర్మనీ	126,927	28	తాయిలాండ్	8,174
4	ఫ్రాన్స్	85,757	29	సింగపూర్	8 043
5	సోవియట్ రష్యా	83,230	30	పోలండ్	7,983
6	జపాన్	81,130	31	బల్గేరియా	7,500
7	నెదర్‌లాండ్స్	68 390	32	ఫిలిప్పీన్స్	7 320
8	బెల్జియం	39,667	33	మొరాకో	6,100
9	అపఘిన్	38,310	34	నార్వే	6,030
10	స్విట్జర్‌లాండ్	31 412	35	హాంకాంగ్	5,900
11	ఇటలీ	30,167	36	టునీషియా	5,500
12	కానరీ ఐస్	27,540	37	దక్షిణకొరియా	4.842
13	ఈజిప్టు	24,640	38	మలావి	4.620
14	తూర్పు జర్మనీ	19,625	39	రొమానియా	4,600
15	జెకోస్లోవాకియా	17,420	40	మలేషియా	4,330
16	డెన్‌మార్క్	16,575	41	జైరె	4,100
17	ఆల్జీరియా	16,020	42	సిరియా	4,035
18	ఐర్లాండు	13,000	43	ఇజ్రాయిల్	4,000
19	ఆస్ట్రేలియా	12,438	44	కెనడా	3,837
20	ఆస్ట్రియా	12,404	45	ఉరుగ్వే	3,726
21	దక్షిణ ఆఫ్రికా	11,962	46	న్యూజీలాండ్	3,535
22	స్వీడెన్	11,720	47	దక్షిణ యయన్	3.180
23	బంగ్లాదేశ్	11,504	48	యుగోస్లావియా	3,000
24	తైవాన్	10,470	49	సియర్రా లియోన్	2,200
25	ఇండొనీషియా	9,600	50	జమైకా	1,700

క్రమం (రేంక్)	దేశం	టన్నులు	క్రమం (రేంక్)	దేశం	టన్నులు
51	డొమినికా రిపబ్లిక్	1,675	70	కొలంబియా	365
52	లావోస్	1,664	71	గ్రీసు	340
53	కామరూన్	1,400	72	గయానా	320
54	సైప్రస్	1,370	73	పాకిస్తాన్	290
55	ఈ క్వడార్	900	74	మాల్టా	270
56	ట్రినిడాడ్-టొబాగో	814	75	సూరినామ్	250
57	ఎల్ సాల్వడార్	773	76	పనామా	230
58	ఘనా	755	77	అర్జెంటీనా	195
59	పెరూ	750	78	వెనిజులా	160
60	జోర్డాన్	732	79	అంగోలా	150
61	కాంగో	680	80	హొండూరస్	120
62	బ్రెజిల్	666	81	ఇండియా	110
63	నైజీరియా	600	82	పెరాగ్వే	100
64	గౌటెమాల	600	83	నికరాగ్వా	75
65	కువైట్	530	84	టాంజానియా	70
66	లెబనాన్	520	85	కోస్టారికా	46
67	శ్రీలంక	400	86	కెన్యా	43
68	మలాగాసె	370	87	మెక్సికో	20
69	మొజాంబిక్	370	88	యుగాండా	20

(Tobacco International సౌజన్యంతో)

Blank Page

